భారతి

జూలై 1968

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒక రూపాయి

$\frac{336}{24}$

స్రవంతి

1968 జూలై to డిసెంబర్

7—12

$\frac{1126}{4}$

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

జూలై 1968

★

సంపుటము: 45 : సంచిక : 7 :

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూలై 1968

వాంఛా వాగుర

శ్రీ సోమసుందర్

కోన ఊపిరితో కుమిలే
నేటి రేయి గడువ దేమి ?
అరుణారుణ నవవిభాత
కాంతికళిక పొడమదేమి

చీకటి ముద్దలు చెట్లను
దిక్కులేని పిట్టలేమి ?
పుడమిపైన తారాడే
మిణుగురు దీపము లవేమి ?

ఎక్కడనో ఒక్క వెలుగు
ఆమడదూరాన ఎలుగు
దీనార్తుల హీనరవము
కలచునె చీకటిగుండెల ?

చిమ్మెను చిమ్మటల మ్రోత
చినుకుచినుకు గాలివాన
ఒకటే పెనురొదగా, సం
కటమయ కాంతారభరము

కంటకములు కీటకములు
సర్వత్రా పరచె ధరణి
సృగాలాలు వృకాసురులు
సుందర వసుమతి వసించె.

ఎండుటాకు ప్రోవులలో
ప్రమాదాలు బుసకొట్టును.
బాటలలో నిండిన పెను
బాములు తలలాడించును.

ఇది అగాధమ్మైన లోయ
గాడాంధము నిండె నూయి
ఎద ఎదలోపల అసూయ
సమస్తమూ మాయ మాయ !

ఇంత భయంకర తమస్సు
కేది తెల్పు నవోషస్సు ?
ఒక నిర్మల రోచిస్సుకు
సకలజనుల హృత్తపస్సు !

వాంఛా వాగురుల నడుమ
ఛిన్న విగానమ్మైన జడుడు
అరుణారుణసు ప్రభాత
తరుణకిరణ రేఖ కనునె ?

అటు ఆకలి : ఇటు చీకటి
పటుతర దారిద్ర్య జలధి
ఎప్పటి కీ అంధకార
కాళరాత్రి కడతేరును ?

సుందర సుశ్యామల కే
దార చలత్చేలాంచల -
నరహృదయోత్సవవీణా
నాద మోద హాస చపల–

ఎదలోపల పదిలమ్మైన
ఆశల నవపథ మెక్కడ ?
ఏది దారి భూమాతా !—
చూపించే దెవరు వెలుగు ?

నాల్గవ అఖిలభారత - తెలుగు రచయితల మహాసభలు - ఒక సమీక్ష

శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు

నాల్గవ అఖిలభారత తెలుగు రచయితల మహాసభలు మే 31, జూన్ 1, 2 తేదీలలో హైదరాబాదులో జరిగాయి జరగటం మామూలుగా గాదు. పెద్దయెత్తులోనే జరిగాయి. కార్యనిర్వాహకులు చెప్పినదాన్నిబట్టి కాకుండా, సభా కార్యక్రమాల్ని శ్రద్ధగా పరిశీలించినవారెవరైనా యిట్లానే యనుకొంటారు. సభలకు షుమారు ఆరువందల మంది ప్రతినిధులు వచ్చారు. వీరిలో కలకత్తా, ఖర్గపూర్, జంషెడ్‌పూర్, మద్రాసు, ఢిల్లీ, మైసూరు, కాశీ మొదలైన పట్టణాలనుండివచ్చిన రాష్ట్రేతరాంధ్ర సాంస్కృతిక సంఘ ప్రతినిధులున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నిజిల్లాలనుండి యెందరో వచ్చారు. మరొక విశేష మేమిటంటే మారిషస్ దీవులనుండి ఆంధ్ర ప్రతినిధివర్గం ఒకటి వచ్చింది. ఈ ప్రతినిధివర్గంలో ఆ దీవుల ఆంధ్రమహాసభాధ్యక్షు లున్నారు. ఒక ఆంధ్ర పండితుడున్నాడు. ఒరిస్సారాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి మాతక్కి రామశేషయ్యగారు ముఖ్య సమావేశాల్లో పాల్పంచుకొన్నారు.

వచ్చిన ప్రతినిధుల్లో ప్రసిద్ధికెక్కినవారు చాలామంది ఉన్నారు. సంప్రదాయానుసారంగా గ్రంథాలు రచించేవారు, అతినవీన పద్ధతుల్లో సాహితీ వ్యవసాయంచేసేవారున్నారు. కథారచయితలు, నవలలు వ్రాసేవారు, కావ్యాలూ, మహాకావ్యాలు రచించినవారు, నానావిధరూపకాలను సృజించినవారూ వున్నారు. పత్రికా సంపాదకులు ప్రచురణ సంస్థల యజమానులు, ఆకాశవాణి నిలయోద్యోగులు ఆంధ్ర కేంద్ర అకాడమీల ప్రతినిధులూ ఈ సభల్లో పాల్గొన్నారు. స్త్రీలు సైతం అధికసంఖ్యలోనే వచ్చారు. ఇక హాజరైన సాహితీప్రియు లెందరున్నారో చెప్పలేము. ఆయా ప్రాంతాల్లో సాంస్కృతిక సంస్థలను జయప్రదంగా నిర్వహించుతున్నామని భావించేవారు పలువురున్నారు.

ప్రతినిధుల్లో కానవచ్చిన యీ వైవిధ్యమంతా యొక యెత్తూ, భాగ్యనగరమైన హైదరాబాదు, మహాసభా ప్రతినిధులపట్ల ప్రకటించిన ఆత్మీయత మరొక యెత్తు. హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్‌వారు హిందీప్రచారసభవారు పారిశ్రామిక సంస్థలవారు ప్రతినిధులకు విందులు చేశారు. హైదారాబాదులో ఎండలు మెండుగా వున్నప్పటికీ, ఆ నగరం ప్రతినిధులపై చూపిన ఆదరాభిమానాలు చందన చర్చల్లాగా వున్నాయి. అంతేగాదు. నగరంలో ఒక ప్రక్క గృహదహనాలు జరిగినా, వర్గ ఘర్షణలు చెలరేగినా, సభాకార్యక్రమాలు నిరాటంకంగా జరిగాయి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆవరణలో సరస్వతీ పతాక జాతీయకేతనముల ఆవిష్కారంతో తెలుగు రచయితల మహాసభకు నాంది పలుకబడింది. రవీంద్రభారతిలో మహాసభా ప్రారంభోత్సవం జరిగింది. సాహిత్య గోష్ఠులు ఆంధ్రసారస్వతపరిషత్తు భవనాల్లో జరిగాయి. ఈ సభల సందర్భంలోనే పుస్తక చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. నవీనులు రచించిన గ్రంథాలే ఆ ప్రదర్శనలో ఎక్కువ. భారత భాగవత తాళపత్ర గ్రంథాలున్నాయి. ప్రసిద్ధులైన చిత్రకారులు తమ తమ చిత్రాలను వివిధ సంప్రదాయల్లో చిత్రించినవానిని పంపి యెంతో శోభ చేకూర్చారు. ప్రదర్శనలో సురవరం ప్రతాప

రెడ్డి, మాడపాటి హనుమంతరావుల విలువైన చిత్రపటాలున్నాయి. తెలుగుభాషా సమితివారు ఆంధ్ర చరిత్ర సంస్కృతులను ప్రకటించే ప్రదర్శనను ఏర్పాటు చేశారు. తెలుగు టైపురైటర్‌ను కూడా చూపటం జరిగింది. ఈ సమయంలోనే యం. శేషాచలం అండ్ కంపెనీ వారు పదిశాతం అడితితో తాము ప్రకటించిన పాకెట్ పుస్తకాలను, ఇతరులు రచించిన పుస్తకాలను అమ్మారు.

ఇంకొక విశేషమేమిటంటే ఈ సభల్లో విదేశ దౌత్య కార్యాలయ ప్రతినిధులుకూడా పాల్గొన్నారు. మాక్స్‌ముల్లర్ భవన్ డైరెక్టరు డాక్టర్ జె. వి. ఓహ్లో ముగింపు సమావేశంలో ముఖ్యమైన అతిథిగా వున్నారు. రష్యా దౌత్య కార్యాలయోద్యోగి; అమెరికా దౌత్య కార్యాలయ ప్రతినిధి టి. యస్. ఆర్. కృష్ణగారు అంతిమ సమావేశంలో ఉపన్యసించారు. పుస్తక ప్రదర్శనలోకూడా ఆయా దౌత్య కార్యాలయాలు పాల్గొన్నాయి. పశ్చిమ జర్మనీ పుస్తక ప్రదర్శనలో ప్రామాణికంగా ప్రకటింపబడిన 'శిల్పప్రకాశ' అనే గ్రంథం ప్రముఖంగా గోచరించింది. మాతృక, దాని ఆంగ్లానువాదమూ, శిల్పచిత్రములు ఈ గ్రంథంలోని భాగాలు. విదేశ పండితులు భారతీయ పండితుల సహకారంతో సంస్కృత గ్రంథాలు ప్రకటించేటప్పుడు, వాటిని ఎంత శ్రద్ధగా, ప్రామాణికంగా పరిష్కరిస్తారో, ఎంత అందంగా అచ్చొత్తిస్తారో ఈ గ్రంథం స్పష్టంగా చాటుతున్నది.

ఈ విధమైన వైభవంతో ఈ నాల్గవ అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు జరిగాయి. మరి యీ సభల లక్ష్యమేది ? ఆ లక్ష్యమును సాధించటానికి ఏ ప్రయత్నాలు జరిగాయి ? ఏమార్గ మనుసరించారు ? అని ప్రశ్నలు వేసికొని ఒకసారి సభా కార్యక్రమాలను సింహావలోకనం చేసికోవాలి. అట్లా చేస్తేగాని గుణదోష విచారణ సక్రమంగా సాగదు; భవిష్యత్కాలంలో సాధింపవలసిన దాన్ని గూర్చి యొక విస్పష్టమయిన ఆలోచన చేయటానికి, సమగ్రమైన ప్రణాళిక వేసికోటానికి అవకాశముండదు.

ఆహ్వాన ఘాధ్యక్షులైన ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు తమ స్వాగతోపన్యాసంలో ఇట్లా సెలవిచ్చారు:

'మొట్టమొదటిసారిగా 1960 వ సంవత్సరంలో హైదరాబాదులోనూ, రెండవసారి 1963 వ సంవత్సరంలో రాజమహేంద్రవరంలోనూ, మూడవ సారి 1965 వ సంవత్సరంలో తిరుపతిలోనూ జరిగిన ఈ సభలు సాధించిన సత్ఫలితాలు ఎన్నో వున్నాయి. ఈ మహాసభలు మూడింటిలోను కూడా పరస్పర విరుద్ధమయిన అభిప్రాయాలు కల రచయితల వాద ప్రతివాదాలలో ఉండే సారాంశాన్నంతటినీ గ్రహించి, వారి వారి దృక్పథాల కొక సామరస్యాన్ని కల్పించటానికి గొప్ప ప్రయత్నం జరిగింది. వ్యక్తిగతమైన అభిమానాలుగాని, దురభిమానాలుగానీ లేకుండా ఈ మహాసభల వేదికలమీద రకరకాల అభిప్రాయాలు గల రచయితలందరూ సమావేశమై సాహిత్యాన్ని సాహిత్యంగా సమీక్షించటానికి గణనీయమైన కృషి చేశారు. ఈ వేదికలమీదనే ఆధునిక సాహితీ రీతులలో వస్తున్న కొత్త పోకడల నన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, ప్రాచీన సాహిత్యంలోనూ, సంస్కృతిలోనూ గల ఉత్తమోత్తమ సంప్రదాయాలనూ, ఉన్నతోన్నత ఆశయాలనూ ఆకళింపు చేసుకున్నారు. ఆధునిక రచయితలమని కొందరూ, ప్రాచీన సాంప్రదాయానుసారులమని కొందరూ ఒక వర్గంవారి నందరినీ వేరువేసి జరుపుకునే ఏ రచయితల మహాసభలు సమగ్రమైన సాహిత్యసభలు కాలేవు. పాతక్రొత్తల మేలికలయికలోనే సర్వాంగసుందరమైన సాహిత్య వైభవం స్ఫురిస్తుంది. ఆ మేరకు అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు ఆంధ్ర సాహిత్యానికి ఎనలేనిసేవ చేస్తున్నాయనడంలో ఎవరికీ ఎట్టి సందేహం ఉండటానికి వీలులేదు.

'ఇక పోతే నేడు జరిగే నాల్గవ అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు ఒక చారిత్రాత్మకమైన వాతావరణంలో జరుగుతున్నాయి. కోట్లకొలది తెలుగువారి నాలుకలమీద నాట్యమాడే తెలుగుభాష పాలనాభాషగా (రాజభాషగా) ప్రభుత్వ కార్యాలయాలలోనూ, ముఖ్యబోధనాభాషగా పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాలలోనూ అడుగుపెడు

తున్న శుభసమయంలో భాషావేత్తలైన మీరందరూ ఆంధ్రరాజధానీ నగరంలో సమావేశం కావడం అందరికీ ఆశాజనకమైన విషయం. ఇంతవరకూ ఎక్కువగా సాహిత్యోపయోగంగానే ఉంటూవస్తున్న తెలుగు భాష ఇకనుంచీ సర్వవ్యవహారాలకూ ఉపయోగింపబడులోంది. అంటే ఒకవిధంగా తెలుగుభాష స్వరూప స్వభావాలను స్పష్టంగా నిర్ధారించి చెప్పవలసినదిగా భాషాభిజ్ఞులైన మిమ్మల్ని అందరినీ అభ్యర్థిస్తున్నాను.

'రాజకీయ ధురంధరులు కొంతమంది, కొంత కాలం కొంతప్రదేశంలోని జనుల్ని పరిపాలించినా, మానవహృదయ సామ్రాజ్యాన్ని శాశ్వతంగా పాలింపగలిగేవారు రచయితలే. 'Poets are the unacknowledged Legislators of the World' అని పెద్దల నుడి. ప్రబలశాసకులుకాని ప్రభువులు కవులు. వారి మాట జనత శిరసా వహిస్తుంది. అందువలన కర్తవ్యనిర్దేశం చేయవలసింది మీరు.'

ప్రధాన కార్యదర్శియైన పోతుకూచి సాంబశివరావుగారు తమ నివేదికలో చివరకిట్లా చెప్పారు:

'ప్రపంచంలో వివిధ దేశాలలోవున్న తెలుగు వారిని ఏకవేదికమీదికి తీసుకురావాలనే కాంక్ష నేడు తెలుగుదేశంలో ప్రబలంగా వుంది. ఈ భావనకు నాందిగా మాత్రమే యీ మహాసభలు నేడు జరుగుతున్నాయి. తెలుగు సాహిత్య స్వరూప స్వభావాలతో పాటు ప్రాచీన ఆధునిక సాహిత్య పోకడలతోపాటు, తెలుగు భాషకు సంబంధించిన అవసరాలు, సమస్యలు కూడ అర్థం చేసుకొని ప్రజాప్రభుత్వ సహకారంతో జాతికి వినూత్న మార్గాన్ని చూపవల్సిన ఆవశ్యకత నేడు స్పష్టంగా కన్పిస్తోంది. అందుకే ప్రపంచంలోని తెలుగువారంతా ఏకం కావాలి. ఈ కల వొక రూపం పొందాలి. ఇదే యీ నాటి సభల ప్రథమ నినాదం. అది వొక నిర్దిష్ట స్వరూపం త్వరలోనే సంతరించుకోగలదని మనందరం ఆశిద్దాం.'

వివిధ రచయితల దృక్పథాలకొక సామరస్యాన్ని కల్గించటానికి గొప్పప్రయత్నం జరిగిందనీ, ఆధునిక సాహితీ రీతులను సమగ్రంగా పరిశీలించి, ప్రాచీన సంస్కృతి సాహిత్యాలలోని యుత్తమోత్తమ సంప్రదాయాలను, ఉన్నతోన్నత ఆశయాలను అవగాహనం చేసికొన్నారని శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు గదా! వివిధ దృక్పథ సామరస్యం 'ఇదిగో, యీ విధంగా సాధింపబడింది. దాని స్వరూపం ఇట్లా వుంది' అని యీ సభల సందర్భంలో చెప్పిన వాడెవ్వడూ లేదు. రాజభాషగా మారబోతున్న తెలుగు స్వరూప స్వభావాలను స్పష్టంగా నిర్ధారితం చేయుటం ఈ మహాసభల లక్ష్యమని బ్రహ్మానందరెడ్డిగారు ఆకాంక్షించారు. అనగా వారు చేయవలసిన ముఖ్యమైన పనిని నిర్దేశించారన్నమాట. ఇక సాంబశివరావుగారి మాటల్లో 'నినాదం' ఉన్నది. ప్రపంచాంధ్ర మహాసభ జరపాలనీ, దానికి నాందిగా ఈ చతుర్థ మహాసభలు జరుగుతున్నాయని వారన్నారు. ప్రపంచంలోని తెలుగువారంతా ఏకం కావటానికి, ఆంధ్రజాతి సమస్యల నర్థంజేసికొని జాతికి క్రొత్తబాటలు చూపటానికి సంబంధమేమిటో సాంబశివరావుగారింకా విపులంగా చర్చించి యుండాల్సింది. కాని వారాపని చేయలేదు. అందుచేత వారి నివేదిక రాజకీయ నినాదాల కోవలో చేరిందని చాలామంది అనుకోవటం జరిగింది. ఆహ్వాన సంఘాధ్యక్షులూ, ప్రధాన కార్యదర్శి వారి వారి స్వాగతోపన్యాసంలోనూ, నివేదికలోను ప్రస్తావించినట్లుగా ఈ సభల్లో నిర్దిష్ట మార్గాలను వెదకటం సంభవించిందా? అని ఆలోచించాలి. ఆహ్వాన సంఘాధ్యక్షు లనుకొన్నట్లుగా ఈ సభల్లో కర్తవ్యపథాన్ని సుగమం జేసికొనే ప్రయత్నాలు జరగలేదు. మరి ప్రధాన కార్యదర్శిగారు ప్రస్తావించిన 'నినాదం'వంటి నినాదాలే సభల్లో ఎక్కువగా వినిపించాయి. ఈ పరిస్థితి యిట్లా యేర్పడటానికి కారణాలేమిటి? దానికిగాను కార్యక్రమాల సూక్ష్మ విచారణ చేయవలసి వుంది.

ప్రతినిధులకు ఆసక్తి లేదు

ఈ సభలకు ప్రతినిధులను చేర్చుకోవటంలోనే పెద్ద లోటు కన్పట్టుతూవుంది. ఐదు రూపాయలు కట్టగలిగినవారందరూ ప్రతినిధులుగా పరిగణింపబడుతున్నారు. ఆ ప్రతినిధులకున్న ఆసక్తి, వారుచేసే ఆలోచనలూ కార్యక్రమాలు జరిగేటప్పుడు చూస్తేగాని తెలియవు. ఆంధ్ర సాహిత్యంయొక్క వర్తమాన స్థితిగతులను ఆకళింపు చేసికొని, సభలకి వచ్చి, పెద్దలైనవారు చెప్పే యుపన్యాసాలు శ్రద్ధగా

విని, కార్యనిర్వాహకవర్గం వారికి కర్తవ్య నిర్దేశంలో తోడ్పడగల ప్రతినిధులు పదిశాతంకంటె ఎక్కువ లేరు. తిరుపతిలో సభలు జరిగినప్పుడు మొక్కులు తీర్చుకోటానికి వచ్చినట్లుగా, అందచందాలకు నిలయమయిన భాగ్యనగరాన్ని కనులార దర్శించటానికి వచ్చినవారే యెక్కువమంది యున్నారని వివేకవంతులైన పెద్దలే అనుకున్నారు. సభా కార్యక్రమాలు జరిగేటప్పుడు ప్రతినిధుల త్రోవ ప్రతినిధులది, ఉపన్యాసకుల త్రోవ యుపన్యాసకులది. సదస్యులు చిన్న చిన్న ముఠాలుగా ఏర్పడి, లోకాభిరామాయణం మాట్లాడుకోవటం ఎక్కువైంది. ముందున్న మూడు నాలుగు వరుసల వారేమి విన్నారో గాని, మిగిలినవారు మనసులు కలిసిన ముచ్చట్లలో మునిగితేలియాడారు. ఒక్కొక్క దశలో యుపన్యాసకుల మాటలవల్ల గాక సదస్యుల సరస సంభాషణలవల్ల ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనాలు మారుమ్రోగాయి. ఆరు వందల మంది ప్రతినిధులూ, ప్రతినిధులను చూడటానికి వచ్చినవారు గుంపులుకట్టి ఎవరి యిష్టంవచ్చినట్లు వారు మాట్లాడుకుంటుంటే యింకా సభ యేమిటి? గోష్ఠులేమిటి? కర్తవ్య విచారణ యేమిటి?

ఈ సభలకు స్త్రీలెందరో వచ్చారు. ఆ వచ్చినవారిలో మేము చాలా చాలా గొప్పవారము అనుకునే రచయిత్రులు కూడా వచ్చారు. రచయిత్రుల్లో ముగ్గురు నలుగురొకచోట చేరటం, కబుర్లు చెప్పుకోటం, కిలకించితాదులు ప్రదర్శించటం, వినేవారికి ఆటంకాలు కల్పించటం ఈ మూడు రోజుల్లోనూ ఆనవాయితీ అయిపోయింది. సభ జరిగినంతసేపూ సభామందిరంలో రెండుమూడుచోట్ల కూర్చోవటం, అల్లరి చేయటం వారి కలవాటైపోయింది. ఒకానొక సమయంలో, ఉపన్యాసాల సారాంశాన్ని వ్రాసికొనటానికి ప్రయత్నించుతూన్న ఒక సదస్యుడు ఈ సుప్రసిద్ధ రచయిత్రులను మందలించవలసిన శోచనీయస్థితి ఏర్పడింది. అయినప్పటికి వారేమీ తగ్గలేదు. ఇక వారి బాధ భరించలేక ఆ వ్రాతగాడు మఱొకచోటికి వెళ్లి కూర్చోవలసివచ్చింది. ఈ రచయిత్రులు సర్వజ్ఞులు గావచ్చు. ఇతరులు చెప్పే దాంట్లో వారికి విశేషమేదీ గోచరించకపోవచ్చు. కాని అల్పజ్ఞులు కొందరు సభల్లో ఇతరులు చెప్పే విశేషాలను విని సంస్కారం పెంపొందించుకోవాలనుకుంటారు. ఎందువల్లనంటే అట్లా అనుకోవటం మానవుల లక్షణం. సభ్యతను త్రోసిరాజనటం, సభా సంప్రదాయాలను పీసమంతకూడా పాటించకపోవటం సాహిత్యసభాప్రతినిధుల లక్షణం గాదనుకుంటాను. వంటవార్పులు, బిడ్డల చదువుసంధ్యలూ, పెళ్లిపేటాకులు సాహిత్య సభాప్రాంగణంలో చర్చనీయాంశాలేమో తెలియదు.

ఉపన్యాసాలపట్ల యుదాసీనవైఖరి చూపినవారు కొందరైతే, వాటికి ప్రత్యక్ష వ్యాఖ్యానం చేయటం, మిత్రులతోకూడి వికటాట్టహాసాలు చేసినవారు కొందరు. ఇటువంటివారందరూ సభల కెందుకు వస్తారో తెలియదు. ఇటువంటివారి మూలాన సాహిత్య సభలు మద్దిరామమ్మ తిరునాళ్లలాగ మారిపోయాయి. తిరుపతి సభల్లో కూడా ఇదే దుస్థితి దాపురించింది. నిజంగా చిత్తశుద్ధి ఆర్జవమూ గలవారూ, సాహిత్యప్రీతిగలవారు అయిన ప్రతినిధులు లక్ష్యాన్ని, ఆగమన ప్రయోజనాన్ని విస్మరించి ప్రవర్తించ గలుగుతారా?

నూతన రచయితలతో పొత్తు పెట్టుకోవటం, ప్రాతచెలికాండ్రను కలిసికోవటం ఇటువంటి సభలవల్ల కలిగే మేళ్లనుకోవటంలో తప్పేమీ లేదు. కాని అవి ఆనుషంగిక ప్రయోజనాలు మాత్రమే. సాహిత్య స్థితిగతులను సింహావలోకనం చేసి, ఆహ్వాన సంఘాధ్యక్షులు కోరినట్లుగా 'ఆంధ్రజాతికి భాషావిషయకంగా కర్తవ్యాన్ని ప్రబోధించటం ప్రతినిధుల ప్రధాన ధర్మం. ఈ సభలకు వచ్చిన పలువురు ప్రతినిధులుగాని, తదితర సదస్యులుగాని ఆ ధర్మాన్ని గుర్తించిన పాపాన పోలేదు. అందుచేతనే బ్రహ్మానందరెడ్డిగారు 'భాషావేత్తలు'గా వర్ణించిన యీ ప్రతినిధులలో చాలామంది తమ విధ్యుక్త ధర్మాన్ని విడనాడారు.

ఈ సభల సందర్భంలో ఎన్నో కరపత్రాలూ, పత్రికలూ పంచిపెట్టబడ్డాయి. వాటిల్లో భాషా సమస్యకు సంబంధించిన కరపత్రం ఒకటి. 'ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లీషు స్థానంలో హిందీ భాషను ప్రవేశపెట్టరాదని కోరుచున్నాము. దానికింకా సమయం రాలేదని అభిప్రాయపడుతున్నాము. కేంద్ర లిత వ్యవ

హారాలకు సంబంధించి సంతవరకే అధికార భాషగా ఇంగ్లీషుండాలి. కాని మన దేశ వివిధ రాష్ట్రాల ప్రభుత్వ వ్యవహారాలను, పరిపాలన న్యాయవిద్యాలయాలను నిర్వహించుకునేటప్పుడూ, తమ రాష్ట్రాలలోని కేంద్రసర్వీసులతో వ్యవహరించేటప్పుడూ ఆ యా ప్రాంతీయ మాతృభాషలను ప్రవేశపెట్టాలని అభిప్రాయపడుతున్నాను. కృత్రిమంగా హిందీని ఇంగ్లీషు స్థానంలో లింకుభాషగా ప్రవేశపెట్టిన, పార్లమెంటులో పాసు అయిన అధికారభాషా (సవరణ) బిల్లును సంపూర్ణంగా ఖండించుచున్నాను. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వము వెంటనే రద్దు చేసుకోవాలని ఆశించుచున్నాను. ఇది రద్దు చేసుకుంటామని ప్రకటించేంత వరకూ, రద్దు అయేంతవరకూ హిందీ వ్యతిరేక ఉద్యమంలో ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థులందరూ పాల్గొనాలనీ, తమ జీవితాల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా పరిణమించిన ఈ బిల్లును మార్పించివేయాలని అభిప్రాయపడుచున్నాను.' అని ఆ కరపత్రంలో వుంది. విమర్శనా సాహిత్యంపై మరియొక రౌక 'నివేదిక' ను పంచిపెట్టారు. దీన్ని ప్రతివారు తప్పక చదవాలి. దాన్ని రచియించిన పోలవరపు శ్రీహరిరావుగారు ఈనాటి విమర్శ సాహిత్యమందలి అవకతవకలను ఎత్తిచూపారు. పత్రికలలోని పుస్తక సమీక్షల ధోరణిని గర్హించారు. చివరకు కొన్ని యుత్తమ సూచనలిచ్చారు. కాని 'భారతి' వంటి పత్రికకూడా ప్రాచీన ఛందోకవితావ్యాసంగాల కిస్తున్న ప్రాధాన్యత ఆధునిక సాహితీ ప్రక్రియలపై విమర్శల కీయడం లేదు' అని యొక అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వారి ఈ యభిప్రాయంతో ఏకీభవించటం అందరకూ సాధ్యం గాదు. నాలుగైదు సంవత్సరాల 'భారతి' సంపుటాలను తిరుగవేస్తే దానిలో ఎంత ఆధునిక సాహితీ ప్రక్రియావిమర్శ యున్నదో రావుగారికే అవగతమవుతుంది.

తాము క్రొత్తగా పెట్టిన పత్రికలను కొందఱు పంచారు. ఒకరు 'పుష్కర దర్శిని' అనే గ్రంథాన్ని ప్రతినిధుల కిచ్చారు. రాజమహేంద్రవరం ఆ గ్రంథంలో వర్ణింపబడింది. కొందరు పుస్తకాలను విక్రయించారు. వాస్తవ విషయాల్ని వివరించటానికి ఈ విధంగా వ్రాయవలసి వచ్చింది.

రాజకీయ నాయకుల కోలాహలం

ఈ మహాసభల్లో ముఖ్యమంత్రితోపాటు ఇతరమంత్రులూ పాల్గొన్నారు. పార్లమెంటు సభ్యులూ, శాసన సభ్యులూ ఆ యా కార్యక్రమాల్లో ఉపన్యసించారు. కార్యవర్గం అధ్యక్షులు దామోదరం సంజీవయ్య గారుండక తప్పదుగదా! కేంద్ర రవాణా శాఖమంత్రి డాక్టరు వి. కె. ఆర్. వి. రావుగారు ప్రారంభోపన్యాసం జేశారు. ఆంధ్రమంత్రులు కొందరు సదస్యులుగా దయచేశారు. మాజీమంత్రి యం. ఆర్. అప్పారావుగారూ, ఒరిస్సా ఆరోగ్యశాఖామంత్రి మాతృక రామశేషయ్యగారు, శాసనమండలి ఉపాధ్యక్షులు మానిడిపూడి ఆనందంగారు ఆయా ప్రత్యేక సదస్సులకు ప్రారంభకులుగా వున్నారు.

మద్యనిషేధశాఖామాత్యులు వెనిగళ్ల సత్యనారాయణరావుగారు సరస్వతీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇక ఆ తరువాత పుస్తక చిత్రకళా ప్రదర్శన సభ జరిగింది. అధ్యక్షులు సంజీవయ్యగారు, ప్రారంభకులు జనసంబంధశాఖామాత్యులు కొండా లక్ష్మణ్ బాపూజీగారు. ఈ సభలో ఒక్క లక్ష్మీరంజనంగారు చేసిన ప్రసంగం వినా మిగిలినవారి మాటలన్నీ ఎన్నికల ఉపన్యాసాల్లాగా వున్నాయని విన్నవారనుకొన్నారు.

అధ్యక్షులైన సంజీవయ్యగారు క్రొత్తగా చెప్పిందేమీ లేదు. అయితే వారొక ఛలోక్తి విసిరారు. వెనిగళ్లవారిని 'సత్యంగారూ' అని వారు సంబోధించి మంత్రి పదవులున్నా యూడిపోయినా చివరకు మిగిలేది సత్యం గాబట్టి, 'సత్యంగారూ' అని అంటున్నాననీ, అట్లా అనటం తమ ఆత్మీయతను వెల్లడించుటందనీ సంజీవయ్యగారు సెలవిచ్చారు. నిజంగా వారు విజృంభించింది ప్రారంభోత్సవ సభలో. తేనెలతేటలు, పూలబాటలు, వలపుమూటలు మొదలైన పదగుంఫనాలతో, పద్యాల నుదాహరిస్తూ సంజీవయ్యగారు తమ యుపన్యాసం సాగించారు. సాహిత్యంలో సమరస దృష్టి చూపాలనీ, దైవభక్తి, దేశభక్తి, సంఘసేవారక్తి పెంపొందేటట్లుగా, అవినీతి మున్నగునవి

అణగారి పోయేటట్లుగా రచనలు చేయాలని సంజీవయ్యగారుపదేశించారు. శ్రీ కృష్ణదేవరాయలు ఏనుగు దిగి ఎదురైన కవికి చేయూత యిచ్చాడనీ, ఈ రోజుల్లో పదవుల్లో వున్నవారికి మహారచయిత ఎదురు పడితే కారు లాపే తీరికలేదని వివరించారు. ఈ సభల్లో సమస్యలను శ్రద్ధగా చర్చించాలని కోరారు. ప్రపంచాంధ్రమహాసభ జరుపుకోవాలని ప్రవచించారు. సంజీవయ్యగారి ఉపన్యాసం విన్న సదస్యులు, వారు తిరుపతి సాహిత్యసభల్లో కూడా ఇట్లాగే మాట్లాడరని కొత్త విషయాలేవీ లేవని భావించారు.

వెనిగళ్ల సత్యనారాయణరావుగారు భాషావేత్తలూ, కవులూ, రచయితలూ అయినవారిముందు మాట్లాడాలంటే తనకు భయం కల్గుతుందనీ, ఈ సభలు జయప్రదం గావాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నానని రెండు వాక్యాలతో ముక్తసరిగా తమ ఉపన్యాసాన్ని ముగించారు. వారు వేంకటేశ్వర స్వామిని ప్రస్తావించగానే భక్తులైన సదస్యులు కొందరు చేతులెత్తి నమస్కరించారు.

కొండ లక్ష్మణ్ బాపూజీగారు ఈ సభల్లో పాల్గొనే యోగ్యత తనకు లేదన్నారు. మరి సభల్లో ఎందుకు పాల్గొంటున్నారు? అనే ప్రశ్నను తనకు తానే వేసికొని సమాధానం చెప్పుకొన్నారు. ఆవేశభాషా రాజకీయానుభవాలతో (ఈ మాట చాలామందికి అర్థం గాలేదు) పైకి వచ్చాననీ, కేవలం మాతృభాషాభిమానంతోనే సభల్లో పాల్గొంటున్నాననీ, ఢిల్లీ వెళ్లవలసి యుండుటచేత, అన్ని సభల్లో పాల్గొనే అవకాశం లేనందుకు చింతిస్తున్నానని బాపూజీగారు పలికారు. మారిషస్ ప్రతినిధివర్గానికి స్వాగతం జెప్పారు. జనసంబంధశాఖామాత్యులు గాబట్టి తమశాఖ రాష్ట్రేతరాంధ్ర సాంస్కృతిక సంఘాలతో ఏ విధంగా సంబంధం పెట్టుకుంటున్నదో వివరించారు. ఆయా రాష్ట్రాలలోని ఆంధ్ర సాంస్కృతిక సంఘాలూ, ఆంధ్రరాష్ట్రంలోని సాంస్కృతిక సంఘాలు ఇతోధిక సంబంధం ఏర్పరచుకోని రాకపోకలు సాగించాలని ఆకాంక్షించారు. కుతుబ్‌షాహి రాజుల పాలనలో ఆంధ్రభాషాపోషణం అధికంగా సాగిందనీ, నిజాము ప్రభువుల పాలనలో తెలుగు ఉపేక్షింపబడినదనీ, ప్రజల్లో భాషాసంస్కృతుల పట్ల ఏ మాత్రమూ అభిమానంలేదనీ, రచయితలాభిమానం పెంపొందించాలనీ బాధపడారు.

ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిగారు స్వాగతోపన్యాసమిచ్చి గంభీరంగా కూచున్నారు. తెలియని విషయాలు తెలిసినట్లు నటించక పోవటం బ్రహ్మానందరెడ్డిగారిలో కానవచ్చిన సుగుణం.

ప్రారంభోత్సవ సభలో సుదీర్ఘమైన యుపన్యాసాలు చేసిన వారు ఇద్దరు. ఒకరు ప్రారంభోపన్యాసం గావించిన డాక్టరు వి. కె. ఆర్. వి. రావుగారు. రెండవవారు అధ్యక్షోపన్యాసం గావించిన తెన్నేటి విశ్వనాథంగారు.

ఇటువంటి సాహిత్యసభల్లో పాల్గొనే యోగ్యత తనకు లేదన్నారు విద్యావేత్త డాక్టరు వి. కె. ఆర్. వి. రావు. తెలుగుదేశంలో తన చుట్టాలెందఱో యున్నారని, తన నియోజకవర్గంలో తెలుగువారెందఱో యున్నారని, అందుచేతనే యీ తెలుగు మహాసభలో పాల్గొనే అధికారం తనకు కలదని రావుగారన్నారు. ఆవేశంతో మాటలాడిన రావుగారి యుపన్యాసం ఒక క్రమంలో వ్రాస్తే యీ క్రింది విధంగా ఉంటుంది.

'జాతీయ సమైక్యమును రాజకీయ నాయకులు సృష్టింపలేరు. దానిని సృష్టించేవారు రచయితలే. రాజకీయ నాయకులు, జాతీయ సమైక్యానికి కావలసిన స్థితిగతుల్ని మాత్రమే సృష్టిస్తారు. రచయితలు ప్రచార సాహిత్యాన్ని వ్రాయకూడదు. హృదయానుభూతితో వారు రచనలు సాగించాలి. ఆంధ్రదేశం రచయితలకూ, త్యాగమూర్తులకూ పేరు పొందింది. జాతీయోద్యమకాలంలో ఆంధ్ర నరనారీ జనత ఆత్మ బలిదానం చేసింది. ఆంధ్ర సంస్కృతి చాలా ప్రాచీనమైనట్టిది. ఆంధ్రభాషకు రెండవ అధికారభాషగావుండే యోగ్యత వున్నది. ఆంధ్రభాషా సంస్కృతుల వైభవం అన్యరాష్ట్రాలకూ, ప్రపంచమునకూ తెలియాలి. తెలియాలంటే సంజీవయ్యగారు చెప్పినట్లుగా ప్రపంచాంధ్ర మహాసభ జరుపుకోవాలి. ఇట్టి సభ జరుపుకునేటప్పుడు విగ్రహ

లెత్తించటం అంత ముఖ్యంగాదు. ఒక యిరవై ప్రసిద్ధ ప్రాచీన గ్రంథాలను విపులమైన యుపోద్ఘాతాలతో ప్రకటించాలి. ఆంధ్ర సంస్కృతితోపాటు భారతీయ సంస్కృతికూడా ప్రపంచానికి తెలియాలి. భారతదేశంలోని రాజకీయ నాయకులనుగూర్చి, మత ప్రవక్తలనుగూర్చి, వీరులనుగూర్చి మన ప్రజలకు తెలుసు. కాని ఆయా రాష్ట్రాలలోని మహారచయితలనుగూర్చి భారతీయులందఱకూ తెలియదు. ఈ లోటు నివారించటానికి, జాతీయ సమైక్యం అభివృద్ధి చెందటానికి భారతీయభాష లన్నిటికీ ఏకలిపి అవసరం. ఏకలిపివల్ల సర్వభారతీయుల హృదయాలకు వారధు లేర్పడుతాయి. ఈ భాషలన్నీ సమాన ప్రతిపత్తి గలవే. వీటిల్లో హెచ్చులొచ్చులు లేవు. అన్నిటిమీదా సంస్కృతభాషాప్రాబల్యం ఉన్నది. సంస్కృతభాషాప్రాబల్యమే అన్నిభాషలకు సమానత్వాన్ని సంక్రమింపజేస్తున్నది. సర్వభారతీయభాషలు ఒక తల్లిబిడ్డలే.

'తెలుగువారు, కన్నడులూ ఒకే కుటుంబంలోని వారు. విజయనగరసామ్రాజ్యచరిత్ర చూస్తే యీ విషయం అవగత మవుతుంది. కర్ణాటాంధ్ర లిపులు చాలా సన్నిహితంగా ఉంటాయి. ఈ రెండు భాషలకు ఒకే లిపిని ఏర్పరచాలి. ఆంధ్రలిపిలో కర్ణాటభాషా మహాగ్రంథాలను, కర్ణాటలిపిలో ఆంధ్రభాషామహాగ్రంథాలను ప్రకటించాలి. అట్లాచేస్తే పుస్తక వ్యాపారంగూడా అభివృద్ధి పొందుతుంది. ప్రపంచాంధ్రమహాసభ జరుపుకునేటప్పుడు కర్ణాటాంధ్రసంస్కృతభాషాకోవిదుల విగ్రహా లెత్తించటానికి పూనుకోవాలి. శుద్ధాంధ్ర సంస్కృతి శుద్ధాంధ్రభాష అనే ఉద్యమా లెప్పుడూ మేలు చేయవు. అన్యభాషాసంబంధంలేని శుద్ధభాష మృతభాషయే.

'రచయితలు నవీన సాహిత్యసమీక్ష చేయాలి. ఇప్పటి సాహిత్యంలో హింసాప్రవృత్తి, కామాచారం మొదలైనవి ఉన్నవిగదా! అవి వర్గసామరస్యాన్ని సంపాదించుతున్నాయా? వర్గకలహాన్ని ప్రేరేపించుతున్నాయా? జాతీయసమైక్యము, అహింస, దరిద్రనారాయణసేవ మొదలైన కల్యాణకారకగుణాలకు దోహదంచేస్తూ రచయితలు సాహిత్యాన్ని సృష్టించాలి.'

ఛలోక్తులు విసరుతూ, పరిహాసములాడుతూ తెన్నేటి విశ్వనాథంగా రీ క్రింది విధంగా ప్రసంగించారు. సంజీవయ్యగారి యుపన్యాసకళను విశ్వనాథంగారు ప్రశంసించారు. నదికి ఒడ్డున్నట్లే భాషకూ ప్రామాణికత ఉండాలనీ, భాష ప్రవాహసదృశమైనది కాబట్టి, దాని తీరు తెన్నులు మారుతాయనీ, ప్రయోగాలు మారుతాయనీ, ప్రయోగాలనుబట్టి వ్యాకరణమూ మారుతూ వుంటుందనీ, ఒడ్డు లేకపోతే నదీగమనం ప్రమాదకారిగా పరిణమించినట్లే, ప్రామాణికత లేని భాష కూడా అనర్థదాయకంగా అవతరిస్తున్నదనీ వారు చెప్పారు. ఈ విధంగా వ్రాయాలని రచయితలను ఎవరూ శాసింపరాదు. వందేమాతరం ఉద్యమం రోజుల్లో దేశభక్తి పూరితమైన రచనలు సహజంగానే వచ్చాయి. అందుచేత రచయితలు కాలానుగుణంగా రచనలు చేస్తారు. ఎవరూ శాసింపనక్కఱలేదు. ఎవరు వ్రాసింది అప్యాయంగా చదువుతారో, ఏ రచన నిలిచివుంటుందో అది విశేషమయినట్టిదని విశ్వనాథంగారు పేర్కొన్నారు.

'అనాదికాలంనుండీ సారస్వతగోష్ఠులు జరుగుతున్నాయి. ఇకముందు జరుగుతాయి. ఇటువంటి సభలు అట్టి గోష్ఠుల కెంతైనా దోహదం జేస్తాయి. చర్చలు జరిగేటప్పుడు అభిప్రాయభేదాలు రావచ్చు. సకలాంధ్రరాష్ట్రరచయితలు కలిసిన చోట భావసమన్వయం, వివాద పరిష్కారం ఎట్లా సాధించాలి అని తెల్సుకోవటమే మంచిది. గుణదోషవిచారం చేయటం విమర్శకుని విధి. రంధ్రాన్వేషణం అతని పని గాదు.

'ఇది నా దేశం, ఇది నా భాష అని అన్నప్పుడు ఉప్పొంగని మానవుడుండడు. అతనిలో ఆవేశం ముంచుకు వస్తుంది. ఆవేశం లేనిదే మానవుడు ముందడుగు వేయలేడు. అంతమాత్రంచేత భాషాభేదబుద్ధిని పెంచుకోరాదు. భాషల్లో ఏమయినా తారతమ్యాలుంటే సహృదయత్వంతో సమన్వయం జేసికోవాలి. అటువంటి సమన్వయాన్ని సాధించటానికే భాషా ప్రయుక్తరాష్ట్ర లేర్పఱచుకొన్నాం. దానికి త్రోవ చూపించినవా రాంధ్రులే.

'ఆంధ్రభాష చాలా విశిష్టమైంది. హిందీ తరువాత భారతదేశంలో తెలుగు ఎక్కువగా

మాట్లాడబడుతుంది. అయితే కుటుంబ నియంత్రణంవల్ల తెలుగు మాట్లాడేవారి సంఖ్య తగ్గిపోతున్నది. దీనివల్ల శాసనసభాసభ్యుల సంఖ్య తగ్గిపోతున్నది. ఒకప్పుడు మూడువందలమంది శాసనసభ్యులుంటే, ఈనాడు 287 మందే వున్నారు. ప్రభుత్వంవారు కుటుంబ నియంత్రణాన్ని ప్రోత్సహించరాదు. దానికిచ్చే డబ్బును ప్రాజెక్టుల కొరకు వుపయోగించాలి. పంటలు పండే భూమి మనకు పుష్కలంగా వుంది. జనసంఖ్య ఎంత పెరిగినా మనం బాధపడవలసినపనిలేదు. జాతి పెరగటం ప్రకృతి ధర్మం.

'దేశభాషలో పరిపాలన చేసికుంటే పరిపాలన సుగమం అవుతుంది. అందుకే ఆంధ్రరాష్ట్రంలో తెలుగుభాషను అధికారభాషగా జేసికొన్నాము. భారత దేశానికి హిందీ అధికారభాష అని ఒప్పుకొన్నాము. కేంద్రప్రభుత్వం నడుపుతున్న సెంట్రల్ స్కూల్సులో ఇంగ్లీషును నెట్టివేసి హిందీ ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఇది హిందీ భాషాభిమానుల చిత్తవృత్తికి నిదర్శనం. పరశురాముడు ఇరవైయొక్క సారులు దండయాత్ర చేసినా క్షత్రియజాతిని నాశనం జేయలేకపోయాడు. హిందీవాదులు మిగతా భాష [illegible] లేకుండా చేయాలంటే అంతే అవుతుంది' అని విశ్వనాథంగారు పేర్కొన్నారు.

'తెలుగుభాష - నేటి సమస్యలు అవసరాలు' అన్న గోష్ఠికి ప్రారంభకులు యం. ఆర్. అప్పారావు గారు. వారి ఉపన్యాసంలో విషయం చాలా తక్కువనీ, ఒక క్రమం లేకుండా కలగూరగంపగా వుందనీ శ్రోతలు అసంతృప్తిని వెలిబుచ్చారు. తెల్లవారికి బానిసలుగా ఉండటంవల్ల భాషపట్ల ఉదాసీనదృష్టి ఏర్పడిందనీ, భాషాసమతను ప్రజలింకా గుర్తించలేదని అప్పారావుగారు వివరించారు. సాంస్కృతిక శాఖకు మంత్రులుగావున్న అప్పారావుగారు ప్రజల్లో సంస్కృతి ప్రీతిని కలిగించలేదేమి? అని ఒకరు ప్రశ్నించారు. మాజీ మంత్రిగారు ఆంగ్లభాషపట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించి మాట్లాడుతుంటే, హిందీ మన భాష కాబోలు అని ఒక శ్రోత వ్యాఖ్యానించాడు.

పై గోష్ఠిలో వావిలాల గోపాలకృష్ణయ్యగారు పాల్గొన్నారు. వారు శాసనసభలో ప్రతిపక్షానికి చెందినవారు. వారి ఉపన్యాసం ఆ స్థాయిలోనే వున్నది. ఆంగ్లభాషాదురభిమానులవల్ల, హిందీ ఉన్మాదులవల్ల ఆంధ్రభాషాభిమానం పుట్టుతున్నదేతప్ప, సహజ ప్రీతిచేత అది ఆవిర్భవించటం లేదు. శాసనం జేసినప్పటికీ, ఆంధ్రభాషను అధికారభాషగా చేయటంలో ఉపేక్షాభావం కొట్టవచ్చినట్లు కన్పిస్తున్నది. ఈ లోటు నివారించాలంటే ఒక్కటే మార్గం. ఆయాశాఖల్లో ఉద్యోగులను ఎన్నిక చేసేటప్పుడు ఆంధ్రభాషా ప్రావీణ్యం గలవారికే అవకాశం కల్పించాలి. అప్పుడు గాని ఆంధ్రభాషాభిమానం ఎక్కువ కాదు. ఈనాటి రచయితలు చుట్టూ గోడలు కట్టుకున్నారు. వారికే ఒకరిభాష యొకరి కర్థంకాదు. వారికి తెలిసిందంతా తమ పరిసరపరిధిలోని భాష మాత్రమే. ఈనాడు గ్రామసీమల్లోనే అచ్చమయిన తెలుగున్నది. మాట కొక్కరూపాయ చెల్లించితే సర్వాంధ్రదేశంలోని మాండలిక పదాలను సేకరించవచ్చు. అప్పుడు గాని ఆంధ్రభాషాపరిపుష్టి అర్థంగాదు. ఈనాటి భాషలో అశ్లీల సాహిత్యం సమృద్ధిగా వస్తున్నది. దాన్నే యువకులారాధిస్తున్నారు. ఈ సాహిత్యంవల్ల భాషేగాకుండా జాతి యావత్తూ నిర్వీర్యమైపోతున్నది. కాబట్టి ముందుగా కామదహనం జరగాలని గోపాలకృష్ణయ్యగారు వక్కాణించారు. వేదుమూరి గంగాధరం ప్రచురించిన మాండలికపదాలను ప్రచురించాలని వారు సూచించారు. ఏకలిపి వాదాన్ని వావిలాల ఒప్పుకోలేదు.

ఇవి రాజకీయనాయకుల యుపన్యాసాలు. వీటి ధోరణి చూస్తే వర్తమానాంధ్రభాషాసమస్యలను గాని, రచయితల స్థితిగతులను గాని, సాహిత్య ప్రక్రియాస్వరూపస్వభావములనుగానీ వారు ఆకళింపు చేసికొన్నట్లు కన్పడదు. అట్లా ఆకళింపు జేసికోవాలంటే సాహిత్య పరిచయం పుష్కలంగా వుండాలి. రాజకీయాల్లో మునిగితేలే నాయకుల కా అవకాశం వుండదు. వారి దృష్టంతా తాత్కాలికమైన రాజకీయాలపైననే నిమగ్నమై ఉంటుంది. అటువంటివారితో సాహిత్యసభలకు పొత్తుండటం అంత శ్రేయస్కరం గాదనీ, వారిని ప్రముఖులనుజేసి ఉపన్యాసా లిప్పించటం వృథాగా కాలాన్ని వినియోగించటమే ననీ ఎవరైనా అనుకుంటారు. అందుచేతనే వారి

ఉపన్యాసాలు వింటున్నప్పుడు ప్రతినిధులకు విసుగు కలిగింది. వారివల్ల సాహిత్యసభాకార్యక్రమాలకు—వర్తమాన పరిస్థితులనుబట్టి —ఎక్కువగా ప్రచారం వస్తుందే తప్ప, సాహిత్యాని కొనగూడే దేమీ ఉండదు. ఒకప్పుడు తెలుగుదేశంలో సాహితీ సంపన్నులైన నాయకు లుండేవారు. అది యంతా గత చరిత్ర. ఇప్పటి నాయకుల యుపన్యాసాలు విన్నతరువాత, వారి సాహిత్య పరిచయాన్ని చూచి తెలుగువారేమీ పొంగిపోవాల్సిన అక్కఱలేదు. ఈ విధంగా రాజకీయ నాయకులు సాహిత్యసభల్లో పాల్గొనటం, కార్యనిర్వాహకుల రాజకీయ కౌశల్యాన్ని మాత్రమే చాటుతున్నదని విజ్ఞు లనుకుంటున్నారు.

తెలుగుభాష—నేటి సమస్యలు— అవసరాలు

ఈ సదస్సులో భిన్నాభిప్రాయాలు స్పష్టంగా ప్రకటింపబడ్డాయి. చర్చ అంతా కూడా రెండు సమస్యల చుట్టూ తిరిగింది. ఆంధ్రభాషాబోధన శిష్ట వ్యావహారికభాషలో జరగాలా? గ్రాంథికభాషలో జరగాలా? అన్న సమస్య యొకటి శాస్త్రీయ సాంకేతిక పదజాలాన్ని ఎట్లా తయారుచేసికోవాలి? అన్నది రెండవ సమస్య. శిష్టవ్యావహారికభాషావాదులు గ్రాంథికభాషలోని క్లిష్టతను (ఉన్నదని తా మూహించినదానిని) నిరూపిస్తే, గ్రాంథికభాషావాదులు వ్యావహారిక భాషలోని అవ్యవస్థను బయటపెట్టారు. వెంటనే తెలుగును విశ్వవిద్యాలయాల్లో బోధనాభాషగా ప్రవేశపెట్టి, అనుభవంమీద అవసరమని తోచిన అన్యభాషాపదాలను ఆంధ్రభాషలో మిళితం జేసికొని, భాషావికాసానికి దోహదం జేయాలని కొందఱు సూచించారు. మఱికొందఱేమో బోధనాభాషగా తెలుగును ప్రవేశపెట్టేముందు, పటిష్ఠమైన భాషను రూపొందించుకొని, శాస్త్రీయ సాంకేతిక పదజాలాన్ని ఆంగ్లభాషనుండి అనువదించుకోవాలని అన్నారు. చర్చ చెట్టు ముందా? విత్తు ముందా? అన్నట్లుగా తయారయింది. సాంకేతిక పదాలను ఆంగ్లంనుండి గ్రహించటం దోషానికి చిహ్నంగాదని, సరళమైన తెలుగులో పాఠ్యభాగాలను బోధించాలని యొక మహిళా ప్రతినిధి చెప్పారు.

అయితే బోధనాభాషగా తెలుగును విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టడం అనేది సామాన్యమయిన విషయం గాదనీ, ఉపన్యాసాలవల్ల తీర్మానాలవల్ల ఈ కార్యం నెఱవేఱదనీ, ఈ విషయంలో ఏమఱుపాటు పనికిరాదనీ పాటిబండ మాధవశర్మగారు హెచ్చరించారు. చాళుక్య చక్రవర్తులు ఆంధ్రభాషను సాహిత్య భాషగా, అధికారభాషగా చేశారనీ, ఇప్పుడా చక్రవర్తుల మార్గాన్నే పోవటం శ్రేయస్కరమనీ, ఈనా డాంధ్రదేశంలో ఎన్నో సాహిత్య సంఘా లున్నప్పటికీ, భాషా విషయంలో గానీ, తదితర విషయాల్లోగానీ వాటి మధ్య సయోధ్య లేదనీ, బోధనాభాష విషయాన్ని కూలంకషంగా చర్చించి నిర్ణయాలు చేయటానికి ప్రభుత్వం ఒక పండితసంఘాన్ని స్థాపించాలనీ శర్మగారన్నారు.

ఈ సదస్సున కధ్యక్షులు భద్రిరాజు కృష్ణమూర్తిగారు. వారు శిష్టవ్యావహారిక భాషావాది. అందుచేత సహజంగా వారి యుపన్యాసంలో గ్రాంథిక భాష మీది యీసడింపు స్పష్టంగా గోచరించింది. ఆంధ్ర భాషాభివృద్ధికి గ్విన్ కమిటీ చేసిన సిఫార్సులను ఆంధ్రప్రభుత్వం ఎంతవఱకమలుపరిచిందో తెలియుటం లేదని వారన్నారు. ఆధునిక ప్రయోజనాలకు వాడటంవల్ల భాష ఆధునికమవుతుందనీ, నిత్యజీవితవ్యవహారాలకు కావలసిన పదజాలం తెలుగులో పరిపోవునంతగా వుందనీ, ఆధునిక విజ్ఞానాన్ని అందించే పదజాలాన్ని ఏర్పరచుకోటానికి అనేక మార్గాలున్నాయనీ కృష్ణమూర్తిగారన్నారు.

బోధనాభాషను గూర్చి వారీ క్రింది విధంగా వక్కాణించారు. తెలుగును బోధనాభాషగా ప్రవేశపెట్టిన తర్వాత పదిపదేనేండ్లపాటు ప్రామాణికాంగ్ల గ్రంథాలను ఉపయోగించుతూ ఆంధ్రభాషలో పాఠ్యభాగాలను బోధించాలి; అయిదేళ్లయిపోయిన తర్వాత పాఠ్యభాగాలను బోధించే ఉపాధ్యాయులచేత గ్రంథాలు వ్రాయిస్తే, ఇప్పుడనువాదం జేయించే గ్రంథాల్లోకంటె, ఉపాధ్యాయుల గ్రంథాల్లో తెలుగుదనం అధికంగా వుంటుంది. మఱొక అయిదేళ్లు గడిచిన తర్వాత ప్రామాణిక సాంకేతిక పదజాలాన్ని సుష్ఠుగా ఏర్పరచుకోవచ్చు.

వయోనుగుణంగా సాహిత్య పఠనం ప్రవేశ పెట్టాలనీ, ఆధునిక రచయితల్లో వ్యుత్పత్తి లేదనీ, అందుచేత శిల్పం కొఱవడుతున్నదనీ, ఉపాధ్యాయుడు బోధించేటప్పు డుపయోగించే భాషనే విద్యార్థు లుపయోగించాలనీ, పదాల నేర్పరచుకొనేటప్పుడు, అవి సంస్కృతభాషలోనే యుండాలనే పట్టుదల పనికిరాదని కృష్ణమూర్తిగారు చెప్పారు.

వసంతరావు వేంకటరావుగారు పారిభాషిక పదాల దృష్టితో మాట్లాడారు. ప్రామాణికశాస్త్రాలను ప్రామాణిక పదాలతోనే బోధించాలి. ఆ పదాలు ప్రజాభాషనుండి పుట్టవు. అందుచేత ముమ్మందు ప్రామాణిక పదజాలాన్ని ఏర్పరచుకోవాలి. ఆ పద జాలం లేకుండా అన్యభాషాపదజాలంతో శాస్త్ర విషయాలను బోధించితే ఎటువంటి కృత్రిమభాష యేర్పడుతుందో చెప్పలేమని వారన్నారు. అయితే సాంకేతిక పదపట్టిక లేర్పడినదాక తెలుగు బోధనా భాష కాగూడదా? అను ప్రశ్నకు వారు సమాధానం జెప్పారు. తెనుగును బోధనాభాషగా చేయవలసిందే దానికై తాత్కాలిక ప్రణాళిక సిద్ధంజేయాలి. ఒక వంక ఆ ప్రణాళిక ప్రకారం పనిజేసుకుంటూనే దీర్ఘ కాలిక ప్రణాళిక నొకదాన్ని వేసికొని దాని ప్రకారం శాస్త్రసాంకేతికపదాల పట్టికలు తయారుచేసికొని, ఆధునికశాస్త్రవిజ్ఞానవిషయాలను తెలుగులో బోధించాలని వారు చెప్పారు.

దివాకర్ల వేంకటావధానిగారు దూరదృష్టితో మాట్లాడారు. వారి ప్రకారం భాషకు నాలుగు ప్రయోజనాలున్నాయి. ఏ భాషయైనమా, కావ్య భాషగా, వ్యావహారికభాషగా, శాస్త్రభాషగా, అధికార భాషగా వుంటుంది. కావ్యభాష కావాలంటే ప్రాచీన కావ్యాలను విధిగా చదవాలి. వ్యుత్పన్నత పెంచుకోవాలి. వ్యావహారికభాషలో అనవసరంగా సంస్కృత పదాలనుగాని, ఆంగ్లపదాలనుగాని వాడరాదు. ముద్దు ముద్దుగావుండే తెలుగు మాటలు వాడాలి. 'వచ్చాను' అని అనటానికి బదులు 'ఆగమించాను' అని వాడితే బాగుంటుందా? అధికారభాష వాడేవారు శక్తిమంత మయిన సంక్షిప్తభాషను వాడాలి. శాస్త్రవిజ్ఞానభాషకు సంబంధించినంతవరకూ, ముమ్మందు ప్రాచీనశాస్త్ర గ్రంథాల పారిభాషిక పదాలను తెలిసికోవాలి, తెలిసి కొని వానిని సందర్భానుగుణంగా ఉపయోగించాలి. పదాలను సృష్టించేటప్పుడు ధాతుజన్యమైన సంస్కృతభాషాసహాయం స్వీకరించాలి. ఇవి యేవీ సాయపడకపోతే అన్యభాషాపదాలను తీసికోవాలి. భాష యొక్క ఆధునికీకరణమంటే, శక్తిమంతమైన భాషలో ఆధునిక విజ్ఞానాన్ని వ్యక్తీకరించటమేగాని, అపభ్రంశీకరణంగాదు. సరళగ్రాంథికాన్ని యుపయోగించాలి. వ్యావహారికభాషవల్ల ప్రాచీన సాహిత్యపఠనం లోపించి, ప్రాచీనకావ్యాలు పరభాషాకావ్యాలై పోతాయి.

మాండలిక పదాలను వాడాలనీ, సరళమధుర గ్రాంథికభాష యుపయోగార్హమనీ బి. వి. సూర్య నారాయణగారు సెలవిచ్చారు. భాషా వివాదం వదలి దేశ్యపద ప్రయోగం అధికం జేయాలనీ, భిన్న భాషల్లో భిన్నార్థాలుగల సంస్కృత పదాలను వాడే టప్పుడు జాగ్రత్త వహించాలనీ, జానపదసాహిత్య మందలి తెనుగు నుడికారాన్ని అర్థం జేసికోవాలనీ, మద్రాసు రికార్డు ఆఫీసులోనున్న తెలుగు గ్రంథాల పట్టిక సిద్ధం జేయాలనీ చల్లా రాధాకృష్ణశర్మ గారు చెప్పారు. ఆంగ్లభాష మాదిరిగా అన్యభాషాపద సహాయంతో ఆంధ్రభాష అభివృద్ధి చెందాలనీ, భాషా విషయంలో మడులూ దడులూ కట్టుకోరాదనీ, ఆంగ్ల భాషా పదాలను వాడటం దాసబుద్ధిగాదనీ శ్రీమతి పరిమళ సోమేశ్వర్ వక్కాణించారు.

సమావేశాన్ని ముగిస్తూ డాక్టరు బి. రామ రాజుగారు వ్యావహారికభాషలో ఎవరైనా 'ఆగమించు' అను క్రియను వాడుతున్నారా? అని ప్రశ్నించారు. ఎందుకు వాడటం లేదు? 'లోకమంతా జల్లులాడే ఆ మహార్తాలాగమిస్తాయి.' అని అభ్యుదయ కవితా పితామహుడు శ్రీ శ్రీ గారే వాడారుగదా! రామరాజు గారేమంటారు? ఈ సదస్సు జరిగేటప్పుడు సభలోని వారు ఉపన్యాసాలు వినకుండా చేసిన అల్లరి ఇంతా అంతా కాదు. మధ్యలో మహిళా ప్రతినిధులు లేచి పోవటం, కొందఱిమో రాకపోకలు సాగించటం చాలా అసభ్యంగా వుంది.

నేటి రచనల్లో క్రొత్త పోకడలు — నా దృక్పథం

ఈ సదస్సులో ఆయా నవీన ప్రక్రియల్లో కానవచ్చే గుణదోషాలు లెస్సగా పరిశీలింపబడ్డాయి. రచయితలయిన వారిందులో పాల్గొనటంచేత వారి యుపన్యాసాల్లో చిత్తశుద్ధి గోచరించింది.

సభాధ్యక్షులైన ముద్దుకృష్ణగారు 'చిగురాకు రాకతో ముదురాకు రాలిపోతుంది. కొత్తదానికి పాతది చోటిచ్చి తీరుతుంది' అని యుపన్యసించటాని కుపక్రమించారు. దేశకాలపరిస్థితుల్లో మార్పు వచ్చినప్పుడల్లా వ్యక్తుల్లోనూ, వారి అభిరుచుల్లోనూ మార్పులూ, క్రొత్తపోకడలు రావడం సహజమనీ, ఐశ్వర్యప్రశాంతులలో తులతూగిన కృష్ణదేవరాయలకాలంలో ప్రబంధ రచన ప్రారంభమై, చేమకూర వేంకటకవి కాలం వరకూ సాగిందనీ, ఇంగ్లీషు భాష ద్వారా ఆ సాహిత్యంతోనే గాక, ఇతరములైన ఐరోపా భాషల సాహిత్యంతో పరిచయమేర్పడి, తెలుగువారి దృక్పథంలోనే పెద్ద మార్పు వచ్చిందనీ, వ్యావహారిక భాష సాహిత్యోపయోగి యైందనీ, రచనల సంఖ్యా, రచయితల సంఖ్యా ఎక్కువైనదనీ, రచయిత్రు లెక్కువమంది యుండటం సంతోషింపదగ్గ విషయమనీ, రష్యా విప్లవం వల్ల ఉన్నవారు లేనివారిని గూర్చి ఆలోచించుతూ మరోప్రపంచాన్ని గూర్చి కలలు గంటున్నారనీ, ఏరోప్లేన్—రేడియో—టెలివిజన్ మున్నగు వానివల్ల కాలదూరములు జయింపబడి, ప్రపంచ దేశాలు దగ్గరయిపోయాయనీ, తదనుగుణంగా మనం విశాల దృష్టిని అలవరచుకోవాలనీ ముద్దుకృష్ణగారు చెప్పారు.

కుందుర్తి ఆంజనేయులుగారు ఈ క్రింది విధముగా మోమోటము లేకుండా ఉపన్యసించారు. గురుజాడ, రాయప్రోలు నవ్య కవిత్వమనే పేరితో బహుముఖ రచనలు చేశారు. రాయప్రోలు ప్రేమకవిత — ప్రకృతి కవిత ఎక్కువగా వ్రాశారు. భావకవిత్వం సమాజానికి దూరమై ప్రబంధకవితాధోరణికి దిగిపోయింది. ఆ దశలో అభ్యుదయకవిత్వం తలెత్తింది. సామాజికదృష్టి దాని ముఖ్యలక్షణం. మానవకారుణ్యవాదం దాని ప్రధానసూత్రం. అభ్యుదయ కవిత్వం వ్యావహారికభాషను తనలో బాగుగా ఇముడ్చుకున్నది. ఈనాడు వచనకవిత్వం ఆంధ్రదేశంలో రాజ్యంచేస్తున్నది. దీనిలోకూడా అభ్యుదయతత్త్వమే అంతర్లీనంగా వుంది. తీవ్రవాదులైన కొందరు కవులు పాఠకులను ఆకర్షించాలనే దృష్టితో చిత్రవికృతమైన భాషలో జుగుప్సాకరమైన రచనలు చేస్తున్నారు. వాటిలో సాంఘికప్రయోజనమేమీ గోచరించటంలేదు. వచనకవిత్వంలో కూడా ప్రేమరూపంలో అనుభూతివాదం ఎక్కువైంది. అనుచితమైన ఆంగ్లపదాడంబరం ఎక్కువైంది.

సింగరాజు లింగమూర్తిగారు రచయిత రచయితగా, కళాకారుడు కళాకారుడుగా జీవించే సమాజం ఈనాడు లేదనీ, అటువంటి సమాజం అవతరించే దాకా ఉత్తమసాహిత్యం రావడం జరగదనీ, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొనిపోయి రచయిత సృజనాత్మక కృషి చేయలేకపోతున్నాడనీ పేర్కొన్నారు. చంద్రవోళి గారి ప్రకారం భావంలో, భాషలో, శిల్పంలో క్రొత్తపోకడ లుండాలి. ఈనాడు భాషలో కొత్తదనం గోచరిస్తున్నది. రచనల్లో వస్తువైవిధ్యంలేదు. కె. మల్లికార్జునరావుగారు నూతన రచనా పద్ధతు లున్నంతగా, ఇతివృత్తభేదం రచనల్లో కన్పట్టటం లేదన్నారు. ప్రఖ్య శ్రీరామమూర్తిగారు నాటక రచనలోని వివిధ రీతులను వివరించారు.

భారతీయభాషల సదస్సు

ఈ సదస్సులో ఆయాభారతీయభాషల లక్షణాలను స్థూలంగా పేర్కొనటం జరిగింది. అధ్యక్షురాలు శ్రీమతి రాజకుమారి ధనరాజ్ గిర్జీ. ఒకరి నొకరు నర్శం చేసికోటానికి ఈ సభలు తోడ్పడతాయనీ, భారతదేశంలోనే ఆయాభాషలవారు పరాయివారుగా వుంటున్నారనీ, మతమూ భాషా రచయితల సౌహార్దానికి ఆటంకం కల్పించరాదనీ, పస్తులు కట్ట నక్కరలేకుండా ఇళ్లు కట్టుకోటానికి రచయితలకు ప్రభుత్వం స్థలాలు ఇవ్వాలనీ ఆమె చెప్పారు.

హైకోర్టు న్యాయమూర్తి గోపాలరావు ఎక్బోటే ఏకలిపివాదంగానీ, ఏకభాషావాదంగానీ వాంఛ

నీయం గాదన్నారు. ఆయాభాషలలోని ఉత్తమ గుణాలను అందరూ గ్రహించాలనీ, దేశభాషలను అనుసంధానభాషను అభివృద్ధిచేయాలనీ, జాతీయాంగ్ల భాషలనుగూర్చి రాజకీయవేత్తలు ఘర్షణ పడరాదనీ, విషయాలు విద్యావేత్తలకు శబ్దశాస్త్రప్రవీణులకూ వదలివేయాలనీ, రాజ్యాంగంలో చెప్పబడినట్లుగా భాషా విషయాలు పరిష్కరించుకోవాలనీ వారు వచించారు.

ఆర్. ఎస్. సుదర్శనం కృష్ణదేవరాయల కాలంలో దక్షిణభారత భాషలు అభివృద్ధిచెందా యన్నారు. అష్టావధాన శతావధానాలు ఆంధ్రభాషా ప్రత్యేక లక్షణాలనీ, ఈ భాషలో కూడ ప్రత్యేకతగల నవల లున్నాయనీ, వంగసాహిత్యంవల్ల ఆంధ్ర సాహిత్యానికి లాభం చేకూరిందనీ వారు పేర్కొన్నారు. వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి చేసిన భాషాసేవలను కొనియాడారు.

యం. యస్. కమలగారు తమిళాంధ్రభాషలలోని సమానార్థకపదాలను సోదాహరణంగా చూపించి, ఆంధ్రభాష సంస్కృతభాషవల్ల సుసంపన్నమైన దన్నారు.

కె. సుబ్బరామప్పగారు కర్ణాటాంధ్రభాషల సన్నిహితత్వమును, పరస్పరాశ్రయత్వమును వివరించారు. నన్నయ పంపభారతమునుబట్టి ఆంధ్రమహాభారతమును రచించాడనీ, పండితారాధ్యచరిత్రను రచించిన పాల్కురికి సోమనాథుడు తుంకూరిజిల్లావాడైన కర్ణాటదేశస్థుడనీ, అతని తల్లిదండ్రుల భాషలు ఆంధ్రకర్ణాటములనీ, కన్యాశుల్కం, నారాయణరావు కన్నడభాషలోని కనువదింపబడ్డాయనీ, కర్ణాటాంధ్ర భాషలకు ఏకలిపి ఉండాలనీ సుబ్బరామప్పగారు చెప్పారు.

మసూద్ హుస్సేన్‌ఖాన్ 1309 లో ఉర్దూ దక్షిణాపథానికి వచ్చిందనీ, దౌలతాబాద్ రాజధాని కాగా అభివృద్ధిచెందిందనీ, నైజాము ప్రభువులు దానిని ఆదరించి పోషించారనీ, ఐదారువందలయేండ్ల నుండి ఉర్దూపదాలు తెలుగులో చాలా చేరాయనీ యుపన్యసించారు.

ఆర్. బి. జోషీగారు భారతీయ సంస్కృతి మహత్తును, దేశభాషల్లోని విశాలభావములను ప్రజలకు తెలియజేసేవారు రచయితలని పేర్కొన్నారు.

మంత్రి పి. వి. నరసింహారావు తెలిగించిన మరాటీ నవలను (దానిపేరు అబలాజీవితం) గూర్చి చెప్పారు. అంతా ఒకే మూసలో పోసినట్లుండరాదనీ, భిన్నత్వంలో ఏకత్వం దర్శించాలని అన్నారు.

పరీక్షిత్ శర్మగారు సంస్కృత భాషా వైభవమును, వేదోపనిషద్వ్యాపసంపదనూ వివరించారు.

'తెలుగు సాహిత్య విమర్శ—స్వభావ స్వరూపాలు'

శీర్షిక యిదైనప్పటికీ, వక్తలు విమర్శ యంటే యేమిటో తాత్త్వికంగా పరిశీలించారేగాని, ఆంధ్ర సాహిత్య విమర్శ పరిణామాన్ని వివరింపలేదు. ఈనాడు సరైన విమర్శ రావటంలేదనీ, విమర్శకునకు సంఘంలో స్థానం వుండటంలేదనీ అందరూ అంగీకరించారు. విమర్శ అనగానే అలంకార శాస్త్రం ప్రస్తావన రాకతప్పదుగదా! దాని మంచి సెబ్బరలను గూర్చి కొందరు చర్చించారు. మొత్తంమీద ఈ సదస్సు చాలా పకడ్‌బందీగా జరిగింది. ఇందు పాల్గొన్నవారంతా ప్రసంగాలను ముందుగానే వ్రాసి కొనివచ్చి చదివారు. ఉపన్యాసకులు చాలామంది వుండటంచేత అధ్యక్షులు, వారితోపాటు ఒకరిద్దరు మాత్రమే తమ ప్రసంగాలను పూర్తిగా చదివారు. మిగిలిన ప్రసంగాల సారాంశాన్ని చెప్పారు. ఈ సదస్సుకు అధ్యక్షులు ఆర్. ఎస్. సుదర్శనంగారు. ప్రారంభకులు మామిడిపూడి ఆనందంగారు.

సుదర్శనంగారు విమర్శ అంటే ఒకానొక ప్రక్రియనుగూర్చి లెస్సగా విచారణ చేయటమన్నారు. ఈ విచారణ ఎట్లా చేయాలి? లక్షణ గ్రంథాల్ని ప్రమాణంగా తీసికొని చేయాలా? లేక రచనను ప్రమాణంగా తీసికొని చేయాలా? సుదర్శనంగారు రెండో పద్ధతి విమర్శ మంచిదన్నారు. ఔచిత్యము ధ్వని రసము ఇటువంటి విమర్శ అంతా జీవితానుభవంమీద ఆధారపడి వుంటుందని వారి యభిప్రాయం. రసం అంటే Unity of Mood అని నిర్వచించారు. శృంగార రసమంటే లైంగిక సంబంధం గాదనీ, నాయికా నాయకుల మనస్తత్వమునకు ఆ రసానికీ సంబంధం వుందనీ, మనుచరిత్రలో శాంత రసం ప్రధాన రసమనీ, శృంగార రసం గౌణమనీ, ఆ

కావ్యంలో చతుర్విధపురుషార్థాలకు సమన్వయం సాధించ బడిందనీ, అలంకారశాస్త్రం విమర్శకునకు ప్రతిబంధకమూ, దోహదకారి అవుతుందనీ, అలంకారశాస్త్రంగానీ, తాత్త్విక సిద్ధాంతాలుగానీ విమర్శకు ప్రమాణాలు కావనీ సుదర్శనంగారు వక్కాణించారు. కావ్యం భవన నిర్మాణంలాంటిది. విమర్శకు నిర్మాణరహస్యం చేపట్టాలి. రచనయందలి కవి దృక్పథాన్ని వివరించటం, రచనకూ జీవితానికీగల సంబంధాన్ని వివరించటం ఇవి కూడా విమర్శలే యవుతాయి. ఇట్లా వివరించటం విమర్శకుల వ్యక్తిత్వభేదాన్నిబట్టి పలు విధాలుగా వుంటుంది. శంకరాచార్యుల ప్రస్థానత్రయ వ్యాఖ్య గొప్పవిమర్శ గ్రంథం. విమర్శ కావ్యాత్మ స్వరూప నిరూపణం. దాని లక్ష్యం సత్యాన్వేషణ మని అధ్యక్షులన్నారు.

మామిడిపూడి ఆనందంగారు కవిగా గాకుండా, రచయితగా గాకుండా చదువరిగా మాత్రమే ఈ సదస్సులో పాల్గొంటున్నానన్నారు. విమర్శ నాలుగు విధాలుగా వుంటుంది. 1. మతతాత్త్విక సిద్ధాంతాభిమానాలతో విమర్శించటం 2. నిష్పాక్షికంగా గుణదోషవివారం చేయటం. 3. కవితోటి మైత్రితోనో, వైరముతోనో కేవలము గుణాలు చూపటం, దోషాలు వెదకటం. 4. అలంకార ఛందోవ్యాకరణ శాస్త్రాలను ప్రమాణంగా తీసికొని విమర్శించటం. ఈ నాలుగిటిలో రెండో పద్ధతి ఉత్తమంఅని ఆనందంగారి అభిప్రాయం. లక్షణగ్రంథాలు ప్రమాణాలు గావనీ Relative Standards తో విమర్శ చేయాలనీ వారన్నారు. విమర్శలో కాలనిర్ణయం ప్రధానం గాదు. కవి శిల్పపరామర్శ ముఖ్యం. కవి పాత్రౌచిత్యంతో భాష నుపయోగించాలి. విమర్శకుడు భాష చర్చ చేసేటప్పు డవిధంగానే విమర్శించాలి. ప్రజల్లో ఉత్తమాభిరుచి పెంపొందించటానికి విమర్శ చాలా అవసరం. 2, 3 సంవత్సరాల్లో వచ్చిన గ్రంథాలను సమీక్షించవేసి, వ్యాసాలు వ్రాయించి సంపుటాలుగా ప్రకటించటం అకాడమీ కర్తవ్యం. అంతకూ ఎవడు విమర్శకుడై యుండాలి? కవి మరొక కవి రచనను విమర్శించరాదు. కారణం వారిరువురి జీవిత దృక్పథాలలోగల తారతమ్యం. సహృదయుడైన చదువరి సాధికార విమర్శకుడై యుండాలి.

ఆరుద్రగారు భరతుని నాట్యశాస్త్రగత విషయాల నన్నిటినీ ఏకరువు పెట్టారు. భరతుని సూత్రాల నెవరికూ అన్వయించవచ్చునని యన్నారు. నన్నయ మొదలైన కవులు తమ కవితాలక్షణాలను తామే చెప్పుకున్నారని అనేకోదాహరణ లిచ్చారు. ప్రాచ్యులూ, పాశ్చాత్యులూ కళ లోకవృత్తానుకరణమని యంటూ సాహిత్యనిర్వచనాలు చేశారన్నారు. అప్పారావుగారిని 'అకవి' అని యనటాన్ని నిరసించారు. దేశకాలాలు మారినా సత్యం-శివం-సుందరం శాశ్వతంగా వుంటాయనీ, వాటి వ్యాఖ్యానాలు మారతాయనీ ప్రసంగం ముగించారు.

నండూరి విఠల్‌గారు కవికీ, శ్రోతలకూ, ద్రష్టలకూ, పాఠకులకూ నడుమ విమర్శకు డెందుకూ? అని ప్రశ్నవేసి, రచయితలూ పాఠకులు మున్నగువారిని సరైన త్రోవలో పెట్టాలంటే విమర్శకుని యవసరం ఎంతైనా వుందన్నారు. సాహిత్యం చదివినపుడు జుగుప్స కలిగితే ప్రయోజనం ఏమిటి? తన రచన పాఠకునిపై ఎటువంటి ప్రభావం చూపుతుంది అని కవి ఆలోచించుకోవాలి. ఇప్పటి సాహిత్యంలో పశుత్వము, కామాచారమూ, వ్యసనములూ నాగరికతాచిహ్నాలుగా చిత్రించబడుతున్నాయి. రచయితల్లో పాశ్చాత్యవ్యామోహం ఎక్కువైంది. మన దేశంలో రచయితకు రచనలు చేయటం జీవనోపాధి కాదు. రచయిత పరిస్థితి యిట్లా వుంటే విమర్శకు డెట్లా బ్రతుకుతాడు? రచన, విమర్శ యీ రెండూ ఆనుషంగిక వృత్తులయ్యాయి. సినిమా పాటలతో రేడియో నాటికలు ప్రసారంచేస్తే శ్రోతలు కుప్పతెప్పలుగా లేఖలు వ్రాస్తారు. ఉత్తమ సాహిత్యలక్షణాలుగల నాటకాలు ప్రసారంచేస్తే ఒక్కలేఖకూడా రాదు.

యస్. వి. యస్. రావుగారు ఐదు దృక్పథాలనుండి విమర్శ చేయవచ్చన్నారు. 1. నైతికదృష్ట్యా 2, సాంఘిక దృష్ట్యా 3. మనస్తత్త్వ దృష్ట్యా 4. కళాశిల్పదృష్ట్యా 5. అప్రస్తుత విషయాలను త్యజించి, కేవలం గ్రంథాన్ని ప్రమాణంగా తీసుకొని విమర్శించటం. సాహిత్యం కళ అనీ, ఆనందం దాని పరమావధి అనీ, సౌందర్యం, రసానుభూతి, ఆనందం అనే మూటినీ రావుగారు నిర్వచించారు. సాహిత్యం అంటే సోమరసంగాదనీ, సిసలైన అసలైన కాఫీ

కషీయమనీ అన్నారు. సాహిత్యపు విలువలు మారాలనీ, చౌకబారు సాహిత్యం ఎక్కువగా వస్తున్నదనీ, విజ్ఞాన శాస్త్రాభివృద్ధి, మనస్తత్వశాస్త్రాభివృద్ధీ సాహిత్య గతిలో ఎన్నో మార్పులు కలిగించాయనీ, ఆధునిక విమర్శ ప్రమాణాలు రాలేదనీ, ప్రాచ్యపాశ్చాత్య విమర్శ సూత్రాలను సమన్వయించటం అవసరమా? అది సాధ్యమా? అని తేల్చుకోవాలనీ రావుగారు పలికారు.

రావుగారి మాదిరిగా యం. వీరభద్రశాస్త్రి గారు కూడా సాహిత్యాన్నిగూర్చి, విమర్శను గూర్చి యుపన్యసించారు. ఈనాడు విమర్శ పత్రికల్లో, పుస్తక సమీక్షల్లో, పిహెచ్. డి. కొఱకు వ్రాసే గ్రంథాల్లో కన్పట్టుతుందనీ, అలంకార శాస్త్రంలో చైతన్యం నశించిందనీ, నవీన కాలానుగుణంగా శాస్త్ర ప్రవచనం జేసికోవాలనీ, విమర్శ అంటే స్వోత్కర్ష పరవిందాగాదనీ, రాగద్వేషాలతో విమర్శ వ్రాయ రాదనీ, విమర్శకునకు అధికారం గావాలనీ శాస్త్రి గారు పేర్కొన్నారు. ప్రభుత్వమూ సాహిత్యసంస్థలూ విమర్శకుల కవకాశం కల్పించాలి. విమర్శ గ్రంథాలను స్వల్పమూల్యంలో ప్రకటించాలి. ఇవి శాస్త్రి గారి సూచనలు. కట్టుబొట్టు మారినంత మాత్రాన మనిషి మారడనీ, కవితా స్వరూపం మారినప్పటికీ కవి హృదయం మారదనీ వారన్నారు. ఇప్పటి సిద్ధాంతాలను ప్రాచీన కావ్యాల్లో చూడ రాదని హెచ్చరించారు.

కె. రామకోటిశాస్త్రిగారు కుండబద్దలు కొట్టినట్లుగా మాట్లాడారు. వారి యభిప్రాయాలీ తీరుగా వున్నాయి. కవిగాయకనటులువున్నంతగా విమర్శకులు లేరు. విశ్వవిద్యాలయాలవల్ల, ఆంధ్రపాఠ్య భాగాలు బోధించే వారంతా విమర్శకులయ్యారు. సాహిత్య విమర్శలో ఒక స్వరూప స్వభావాలంటూ లేవు. విమర్శలో వైవిధ్యం లేదు. ఒక పుస్తకాన్ని గూర్చి ఒకే రీతిగా పలువురు విమర్శించటం జరుగుతున్నది. ఇటువంటి విమర్శలు చేయుటం కాలక్షేపం తప్ప మఱేమీ గాదు. సాహిత్య ప్రక్రియలన్నీ యొక రీతిగా వుండవని భావించేవారు తక్కువమంది యున్నారు. వార్తాపత్రికల వార్తా ప్రచురణలో సాహిత్యపరుల కవకాశం లేదు. ఏమీ తెలియని వాడు మాట్లాడితే అది వార్త అవుతున్నది. ఆ తెలియని వానిని పొగడటం సాహిత్యపరుల కలవాటైపోయింది. సాహిత్య లోకంలో వంచన యెక్కువయినది. సాహిత్య సృష్టి యెక్కువైపోయింది. కవియైన వాడే విమర్శకుడైపోవటంచేత ఉత్తమ విమర్శ రావటం లేదు. అటువంటివారికే సన్మానాలు జరుగుతున్నాయి. తమ పుస్తకములపై సమీక్షలు వ్రాస్తే రచయిత లేమాత్రమూ పట్టించుకోరు. విమర్శకులకు ఆర్థికంగా కలిగే మేలేమీ లేదు. విమర్శ గ్రంథాలకు గిరాకీ లేదు. నూతన దర్శనంతో, నూతనానుభవపూర్వకమైన విమర్శ రావాలి. కట్టమంచి రామలింగారెడ్డి తర్వాత మరలా అంతటి విమర్శకుడు రాలేదు.

పోణంగి శ్రీరామఅప్పారావుగారు సత్కావ్యం అనుభవైకవేద్యమనీ, కవి సహృదయుడూ సరస్వతీ తత్త్వాన్ని దోహదంజేసే జంటలనీ, కావ్యసౌందర్యం వివరించేవాడు విమర్శకుడనీ, అలంకారం అంటే సౌందర్యమని జ్ఞప్తియందుంచుకుంటే అలంకార శాస్త్రంపైగల దురభిప్రాయాలు సమసిపోతాయనీ, ఈ విషయం కట్టమంచి రామలింగారెడ్డి మఱచి పోయారనీ, పాతకొత్తల మేలు కలయిక కావాలనీ, కావ్యలక్ష్యం మఱచిన విమర్శకునివల్ల లోకాపకారం జరుగుతుందనీ, స్వోత్కర్ష పరనింద విమర్శ కాదనీ చెప్పారు. అయితే వారన్నట్లుగా రామలింగారెడ్డి అలంకారాలను గూర్చి చెప్పేటప్పుడు అలంకారమంటే సౌందర్యమన్న విషయం మఱచిపోయాడని నేననుకోవటంలేదు. భావకళను క్రుంగదీసే అలంకార నిర్మాణ మనుచితమనీ, కవిత్వానికి రసం ఆత్మ అనీ, రసదోహదం జేయలేని అలంకారాల కూర్పు అనవసరమనీ రామలింగారెడ్డి అభిప్రాయం. ఆనందవర్ధనుడు అలంకారాలను గూర్చి అన్నమాటల సారంకూడా యిదే గదా!

ప్రాచీన సాహిత్యంలో శాశ్వత-విలువలుకల గ్రంథా లున్నట్లుగా ఆధునిక సాహిత్యంలో ఉన్నాయా?

ఈ సదస్సు చాలా పేలవంగా జరిగింది. అట్లా జరగటానికి రెండు మూడు కారణా లున్నాయి. శాశ్వత-విలువలు అంటే యేమిటి? నిర్వచించిన వారెవరూ లేరు. ఈ నిర్వచనం లేకపోవటం చేత చర్చంతా కూడా వేలవిడిచినసామైపోయింది.

ఈనాడు రచనలు చేసేవారు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఒకవంక రచనలుచేస్తూ, తమ రచనల్లోనూ, పాటివారి రచనల్లోనూ శాశ్వత-విలువ లున్నాయనో, లేవో సాహసించి చెప్పటానికి ఏ రచయితా ముందుకు రాడు. అట్లా చెప్పగలిగినవా డెవడైనా వున్నాడంటే, వాడు తెలుగురచయిత కాడనే మనం అనుకోవాలి. ఇక పోతే మూడవ కారణం ఈ సభలో పాల్గొన్న ఉపన్యాసకుల నిర్లక్ష్యం. చిత్తశుద్ధితో విషయాన్ని గూర్చి చక్కగా ఆలోచించి, హేతుహేతుమద్భావంతో నాలుగుముక్కలు చెప్పినవారు లేరు. ఈ సదస్సులో పాల్గొనవలసిన తనకు 31 వ తేదీనాడు మాత్రమే తెలియటంచేత, శ్రద్ధగా ఆలోచించటానికి ఎక్కువ అవకాశం లేకపోయిందనీ, అయినా మాట్లాడక తప్పటంలేదనీ ఒకానొక రచయిత్రి సవినయంగా చెప్పింది. మరొక యుపన్యాసకుడు ఈ సదస్సు 'ఆరుద్ర'గారి సన్మాన సభయని యనుకున్నాడేమో, అసలు ప్రమేయాన్ని దాటవేసి ఆరుద్రగారి పద్యాలను అనర్గళంగా పాడటం ప్రారంభించాడు. కాలాతీత మవుతున్నదని అధ్యక్షులు గంట మ్రోగించారు. ఆ యుపన్యాసకునికి అవకాశం కల్పించండని సభలో వారు కేక వేశారు. వీరికి కావలసింది పద్యాలు పాడటంగాని చర్చలు గావు. కొంతమంది యుపన్యాసకులు తమకంటె ముందు మాట్లాడిన యుపన్యాసకుల సూక్తులను తార్కాణించి వారిని ప్రశంసించారు.

అధ్యక్షులైన దేవులపల్లి రామానుజరావుగారు, ప్రారంభకులైన నూతక్కి రామశేషయ్యగారు చర్చనీయాంశాన్ని గూర్చి చక్కగా మాట్లాడి, చర్చను ఒక క్రమంలో నడపటానికి ప్రయత్నించినా, అటు ఉపన్యాసకులుగానీ, ఇటు ప్రేక్షకులుగాని పట్టించుకోలేదు. రామశేషయ్యగారు తమ ఉపన్యాసాన్ని చదివారు.

దేవులపల్లి రామానుజరావుగారు, 'వేయి సంవత్సరాల ప్రాచీనాంధ్ర సాహిత్యంలో పట్టుమని రెండు వందల గ్రంథాలైనా వుత్తమమైనవి లభించటంలేదు. ఆ సాహిత్యం గతే అట్లావుంటే ఆధునిక సాహిత్యంలో ఎంత విలువుంటుందో ఏమీ చెప్పలేం. కాలాన్నే ప్రమాణంగా తీసికొంటారా? గ్రంథగత వస్తువును ప్రమాణంగా తీసికొంటారా? ఎప్పుడైనా సరే వస్తువు, రచనారీతి శాశ్వతపు విలువలతో కూడియుంటే ఆ గ్రంథం నిలుస్తుంది. అట్టిగ్రంథాల సమూహమే సాహిత్యం. సరియైన సాహిత్యమైతే శాశ్వత-విలువలుంటాయి. కాకపోతే వుండవు'' అని తన తీరి మరి పలుకుల్లో చెప్పారు. ఉపన్యాసకులు ఏ యొక్క ప్రక్రియను గాకుండా, సమస్త నవీన సాహిత్యాన్ని లక్ష్యంగా చేసికొని చర్చలు చేయాలని కోరారు. అయినప్పటికి ఒక్కొక్క యుపన్యాసకు డొక్కొక్క ప్రక్రియను గూర్చే మాట్లాడటం తటస్థించింది.

రామశేషయ్యగారి ఉపన్యాసం ఆలోచనలు ప్రేరేపించుతుంది. 'ఈ రోజు చర్చింపవలసిన అంశం లోనే ప్రాచీన గ్రంథాల్లో శాశ్వత-విలువలున్నట్లు అంగీకరించినట్లుంది. ఇక పోతే నవీన గ్రంథాల్లో ఆ విలువలున్నవా, లేవా? అని చర్చించాలి. ఏది ఏమైనా Survival of the fittest అని సర్వాంగీకారం పొందిన ధర్మమున్నది. ఉదాత్తములైన పాత్రలూ, పాత్రలకు తగిన భావగంభీరతా, భావానుగుణమైన భాషాపటుత్వమూ, సందర్భశుద్ధితో కూడిన రసపోషణ ప్రాచీన సాహిత్యంలో ప్రధానంగా గోచరిస్తాయి. రచయిత ధనంకొఱకుగానీ, ధర్మప్రచారంకొఱకుగానీ రచనలు చేయడు. ఉత్తమ కవిత్వం కవిని స్వయంగా వరిస్తుంది జీవితంలో ఎదురయ్యే ధర్మాధర్మ సంఘర్షణలవల్ల కవి కోమల హృదయంలో కలిగే తీవ్రవేదన కవిత్వ రూపంలో అప్రయత్నంగా వెలువడుతుంది. దానికి తార్కాణం వాల్మీకి రామాయణమే. కాబట్టి కవిత్వము స్వయంభువు. మానవుని ఆనందసుఖదుఃఖానుభూతులు కావ్య వస్తువులు. ఈ ధర్మం ప్రాచీన నవీన సాహిత్యాలకు సమానమే. ఆర్థిక సాంఘిక విప్లవాలు విజ్ఞానమానసికశాస్త్రవికాసం వర్గసంఘర్షణలు నేటి రచయితలను ఎక్కువగా ఆకర్షించాయి. ఎన్నో రకాల సాహిత్య ప్రక్రియలు పుట్టాయి. వీటిలో కరుణరసము తక్కువ యేమీలేదు అనగా కావ్యమునకు ఏది ప్రాణమో ఆ కావ్యాత్మ ఏమీ లోపించలేదు. చిత్రసీమకూడా రచయితలను ఆకర్షిస్తుంది. జీవితంలోని సుఖదుఃఖాలు మానవప్రకృతిని తత్త్వదృష్టికి విచారమునకు మరల్చిన ఘట్టములు తెలిపే మధురగీతాలు చిత్రరంగంలో ప్రేక్షకులను ముగుల్చి

చేస్తున్నాయి. వీనిలో ఉన్న విలువలు శాశ్వతముగా ప్రజలకు అందించే మార్గము ఏమిటి?' అని వారు పేర్కొన్నారు. ఇప్పటి గ్రంథాల్లో త్రికాలాబాధితము లైన విలువ లున్నవని రామశేషయ్యగారి విశ్వాసం.

ఖండవల్లి లక్ష్మీరంజనంగారి గోష్ఠిని మొదలుపెట్టారు. 'భారత స్వాతంత్ర్య సంగ్రామం' అనే కావ్యాన్ని తీసికొని ఇతివృత్తము, నాయకుడు, రసము అను మూడు కోణాలనుండి ఆ కావ్యాన్ని పరిశీలించారు. వారి అభిప్రాయం ప్రకారం ఈ దృక్పథంతో చూస్తేగాని ఆ కావ్యంలోని శాశ్వత–విలువలు తెలియవు. వారు మాట్లాడుతుండగా, ఒక ప్రతినిధి లేచి, మీరు 'భారత స్వాతంత్ర్య సంగ్రామ కావ్య పరీక్ష' చేస్తున్నారా? నవీన సాహిత్యంలోని విలువలను గూర్చి మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించాడు. నవీన సాహిత్యంలోని ఒక కావ్యాన్ని తీసికొని దానిలో శాశ్వత–విలువ లెట్లా వున్నాయో చూపుతున్నాననీ, ఏమి మాట్లాడాలో నాకు తెలుసనీ లక్ష్మీరంజనంగా రన్నారు. ఏమి మాట్లాడాలో మీకు తెలిసినట్లే, ఏది వినాలో మాకు తెలుసని మరొక ప్రతినిధి యన్నాడు.

డాక్టరు పి. నారాయణరెడ్డిగారు 'శాశ్వత విలువలు అనే సమాసం వ్యాకరణ దోషదుష్టమైనప్పటికీ దానిమీద సమకాలిక సాధుతాముద్ర వున్నది. అదేవిధంగా సమకాలికుల ప్రశంసాముద్ర వున్నది శాశ్వత-విలువలుగల సాహిత్యమే అవుతుంది. ఆధునిక సాహిత్యంలో ఆ విలువలుగల గ్రంథా లున్నాయా? అని చర్చించటంలో అర్థంలేదు. గురజాడ, కృష్ణశాస్త్రి మున్నగువారి రచనలు తెలుగు మాగాణంలో పాతుకొనిపోయాయి. ఇంకా ఆ రచనల్లోని విలువలను గూర్చి చర్చించట మెందుకు? కృష్ణపక్షం తర్వాత శుక్లపక్షం అనే క్షుద్రగ్రంథం పుట్టింది. దాన్నిగూర్చి ఎవరైనా ఆలోచించుతున్నారా? గురజాడను ఆకవి అని యంటే చెల్లుతుందా? సంప్రదాయమూ, ప్రయోగమూ చెట్టపట్టాలు పట్టుకొనిపోవటం ఈ యుగలక్షణం. శాశ్వత—విలువ లున్న వస్తువు తీసికొనటం ప్రాచీన సాహిత్యలక్షణం. వస్తుగతమయిన గౌరవం తగ్గించి కన్పించినదానిమీద కవిత్వం వ్రాయటం ఈనాటి సాహిత్య లక్షణం. వివాదాలతోగాక అందంగా వ్రాసిన రచన నాలుగు కాలాల పాటు నిలుస్తుంది' అని అన్నారు.

వేలూరి సహజానందంగారు చర్చనీయాంశాన్ని గూర్చే ప్రశ్నించారు. ఈనాటి సాహిత్యంలో శాశ్వత–విలువలు ఏవి? సమకాలికపు విలువలు శాశ్వతపు విలువల వెంతవరకు దోహదం చేస్తాయి? అని చర్చించటం బాగా వుంటుందన్నారు. 'ప్రాచీనత్వంమీద గణ్యత ఆధారపడియుండదు. మనుష్యజాతి ప్రకృతి వైవిధ్యమంతా రామాదిపాత్రల్లో గోచరిస్తున్నది. రామాయణాదులు వ్రాయనంతమాత్రాన ఒక కవి శాశ్వత–విలువలులేని గ్రంథాలు వ్రాయటంలేదని మనం అర్థం జేసికోరాదు. శాశ్వతసత్యస్పర్శయుంటే విశ్వత వుంటుంది. (శాశ్వతసత్యాన్ని వారు నిర్వచించలేదు). రచనావేళలో అతీతమైన సత్యం రచయితను ఆవేశిస్తుంది' అని సహజానందంగారు పేర్కొన్నారు.

శశాంకగారి ఉపన్యాసం గాడి తప్పిందని సభలో వారనుకున్నారు. 'మానవవిజ్ఞానం నిత్యంగా పురోగమిస్తుంది. ప్రాచీనులకంటె నవీనులు పురోగాము' లను అర్థంవచ్చే ఆంగ్ల వాక్యాల నుదాహరించి, శాశ్వత – విలువలు వ్యక్తికి వ్యక్తికి మారుతాయన్నారు. నవీన సాహిత్య ప్రపంచంలో ఉదాత్తవస్తుస్వీకారం వల్ల, కావ్యనిర్మాణకౌశలంవల్ల, పద్యరచనా మర్మజ్ఞతవల్ల కవులు ప్రసిద్ధికెక్కారనీ, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీ శ్రీ, ఆరుద్ర ప్రత్యేక శైలిగల వారనీ చెప్పారు. ఇక అక్కడనుండి వారీ సభను ఆరుద్ర సన్మానసభగా మార్చారు.

కుమారి వాసిరెడ్డి సీతాదేవిగారు అసలు ప్రమేయమే తన కర్థం గాలేదన్నారు. భగవత్సృష్టి శాశ్వతంగానియున్నపుడు మానవసృష్టి శాశ్వతమా? అని అన్నారు. శాశ్వత–విలువలు అనేదానికంటె సార్వజనీనికత అని అంటే బాగుంటుందన్నారు. శాశ్వతత్వం వస్తుగతమయ్యేటట్లయితే అది కాలాన్ని బట్టి మారుతుందన్నారు. 'ఈ రోజుల్లో రాజులూ లేరు. రాజ్యాలూ లేవు. శాస్త్రవిజ్ఞానం అనంతంగా పెరిగిపోయింది. మానవుడు మారాడు. విలువలు మారాయి. భారత రామాయణాలు కావ్యాలుగా

గౌరవింపబడుతున్నాయితప్ప వస్తువులన ఆదరింపబడటంలేదు. ఈ నాటి పిల్లలు సూర్యుని వల్ల కుంతీదేవికి పిల్లవాడు పుట్టాడంటే నవ్వుతారు. నారాయణరెడ్డి గారన్నట్లుగా ఆకలి యనేది ఏ కాలంలోనైనా వుంటుంది. దాన్ని గురించి వ్రాసే గ్రంథం శాశ్వతంగా నిలుస్తుంది. అది ఏ వ్యక్తి యుగానైనా రూపొందవచ్చు. నవీన సాహిత్యంలో శాశ్వత విలువలున్నాయా? అని చర్చించటంలో అర్థం లేదు. ఆ చర్చలు చేయవలసింది మనంగాదు. మఱి ముందు తరాలవారు. వారుచేసే చర్చలు మనం వినటానికి వీలే లేదు. కాలాతీతమైన మనుష్య భావాలతో గ్రంథాలు రచింపబడాలి. అవి ప్రత్యేక వర్గ దృష్టితో గాకుండా, సార్వజనీనికతతో రూపొందాలి. మానవుని దగ్గఱకు వచ్చిన సాహిత్యం నిలుస్తుంది.' అని కుమారిగారు నొక్కి వక్కాణించారు.

శ్రీమతి ఆనందారామంగారు కుమారి సీతాదేవిని సవినయంగా ఖండించుతూ భారత రామాయణాల వస్తుగౌరవం ఈ నాడుకూడ తగ్గలేదని, వాటిని సూక్ష్మదృష్టితో పఠించాలనీ, ఏ విధంగా ధర్మము అధర్మముగా, అధర్మము ధర్మముగా కన్పట్టుతాయో ఆ గ్రంథాల్లో రమ్యంగా చిత్రింపబడిందనీ సోదాహరణంగా చెప్పారు. శాశ్వత–విలువలేవి? అని ప్రశ్నించారు. ఏ కాలపు విలువ ఆ కాలానివే అని అన్నారు. ఉత్తమ రచనను నిర్వచించటం దుస్సాధ్యమనీ, సత్యాన్ని సుందరంగా చెప్పటం శిల్పమనీ, మానవ చైతన్యాన్ని స్పృశించిన రచన ఉత్తమమనీ, అయితే పాఠకుల దృష్టి రకరకాలుగా వుంటుందని మనం మఱచిపోరాదని వారన్నారు. 'పాత్రలు రెండు రకాలు. ఒక రకం రచయిత చెప్పుచేతల్లో వుంటాయి. మఱొక రకం సజీవంగా పెరుగుతాయి.' అని అంటూ వారినాటి కొన్ని మంచి నవలలు పేర్కొన్నారు.

వేదికమీద కూర్చోబెట్టిన రచయిత్రులకు మాట్లాడే అవకాశం లభింపలేదు. అందుచేత ఒకామెకు కోపం వచ్చింది. సభాంతంలో ఆమె మైకు దగ్గఱకుపోయి, 'మాట్లాడనానికి అవకాశమిస్తామన్నారు. వేదికమీద కూర్చోబెట్టారు. కాని మా కాలంగూడా వారే యుపయోగించుకున్నారు. వారికి కృతజ్ఞులం' అంటూ ప్రకటించారు.

క వి స మ్మే ళ న ం

కవిసమ్మేళనమున కధ్యక్షులు దాశరథి. నోరి నరసింహశాస్త్రిగారు ప్రారంభకులు. ఈ సమ్మేళనం చాలా అసంతృప్తినీ, ఆగ్రహాన్ని కల్గించింది. మొదట యాభైమంది కవులు పేర్కొన్నారు. అందఱకూ అవకాశం కల్గిందా? కల్గలేదు. పేర్లు పిలవటంలో మోమోటం చూపించారనీ, పట్టికలోనివారి కవకాశం కల్గింపలేదనీ, పేర్లివ్వనివారిని పిలిచారనీ, పరిచయానికీ ప్రాంతీయాభిమానానికీ ప్రాధాన్య మిచ్చారనీ ప్రతినిధులు తమలో తామనుకున్నారు. 'ఈ హైదరాబాదులో కాబట్టి యిట్లా వీళ్ల యిష్టానిష్టాల ప్రకారం జరిగింది. మా వూళ్లోనైతే ఏమిచేసేవాడినో......' అని యొక ప్రతినిధి ఉత్తరకుమార ప్రజ్ఞలు చూపటం స్వయంగా చూశాను. అంతేగాదు. ఒక కవి పద్యాలు చదువుతుండగా, శ్రోతల్లో ఒకరు ఈ పద్యాలు మఱొకరు వ్రాసినట్లున్నాయని వ్యాఖ్యానించాడు. ఇక అక్కడినుండి ఆ కవి శ్రోతల నడుమ రగడ మొదలైంది. ఈ పద్యాలు మఱొకరివి అని నిరూపిస్తే లక్ష రూపాయ లిస్తానని కవిగారు పందెం వేశారు. ఇరువురూ సభనుండి నిష్క్రమించిన తర్వాత గాని గలాటా తగ్గలేదు. ఒక యిరవైమంది కవులు కవితాగానం చేసినతర్వాత హఠాత్తుగా సభ ముగిసినట్లు ప్రకటింపబడింది. ఇది కోపతాపాలకు దారి తీసింది.

ప్రతినిధుల సమావేశంలో కవిసమ్మేళనసభను ఎందుకు హఠాత్తుగా ముగించారు? అని ఒకరు సాంబశివరావుగారిని ప్రశ్నించారు. ఇరవైమంది చదివేటప్పటికి అర్ధరాత్రము దాటిందనీ, నగరంలో మత కలహాలు జరగటంమూలాన ఏదైనా ప్రమాదం ఏ ప్రతినిధికయినా సంభవించవచ్చునని యూహించి (మీలో ఎవరైనా మరణానికి లోనైతే ఆ బాధ్యత నాది గాదా? అని వారన్న మాటలు) సభ ముగించామనీ సాంబశివరావుగారు సమాధానం జెప్పారు. (ఓహో! ఏమి జాగ్రత్త! ఆహా! ఏమి ఔదార్యం! అని ప్రతినిధులు కేకలు పెట్టారు). ఉన్నపేర్లు పిలువకుండా

పట్టికలో లేని పేర్లను పిలవటానికీ, మతకలహాలకూ సంబంధ మేమిటని ఒక ప్రతినిధి ప్రశ్నించాడు.

ప్రతినిధుల సమావేశం

బోయి భీమన్నగా రధ్యక్షులుగా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సభలో పదహారు తీర్మానాలు చర్చలు లేకుండా ఆమోదింపబడ్డాయి. ఈ తీర్మానాలు చాలా వాటిల్లో ప్రభుత్వ సహాయం కోరడం జరిగింది. ఇట్లా కోరడం సమంజసం కాదనీ, కోరితే రచయిత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం వస్తుందని కొందఱు ప్రతినిధులు అభ్యంతరం చెప్పారు. రచయితల సంక్షేమానికై ఆర్థిక సదుపాయాల నన్వేషించి, ప్రభుత్వం వారితో సంప్రతించటానికి కార్యనిర్వాహక వర్గానికి అధికారమివ్వాలనే తీర్మానం చదివినపుడు ప్రతినిధులు తీవ్రంగా ఆక్షేపణలు జరిపారు. ఆ పని కార్యనిర్వాహకవర్గమే మీదవేసికొంటే రచయితలీ కార్యనిర్వాహకవర్గానికి దాసులైపోతారనీ, అది రాగద్వేషాలతో ప్రవర్తిస్తుందని ప్రతినిధులన్నారు.

పదమూడవ తీర్మానం రాష్ట్రపరిపాలనా భాషకు సంబంధించినట్టిది. ఇది పెద్దదుమారం లేపింది. ఈ సందర్భంలో ఒకరు లేచి 'నేను పదేను రోజుల నాడొక తీర్మానాన్ని పంపించాను. నా తీర్మానం పరిపాలనాభాషకు సంబంధించింది. నా తీర్మానం గతియేమిటి? కార్య నిర్వాహకవర్గం వారు తమ తీర్మానాలను ఎందుకు ప్రతినిధుల నెత్తిమీద రుద్దాలి? తీర్మానాల చర్చలెందుకు చేయరు? ఈ సభలు డిన్నర్లకొఱకు, టీ పార్టీల కొఱకు జరుగుతున్నాయా?' అని సహేతుకంగా ప్రశ్నించారు. ఆ ప్రతినిధి వాడిన భాష యెట్లావున్నా, అడిగటం సమంజసంగా వుందని సభలో వారనుకొన్నారు. ఈ సందర్భంలోనే కవి సమ్మేళనంలో జరిగిన అవకతవకలు ప్రస్తావింపబడ్డాయి. కార్యనిర్వాహకవర్గం వారేమిచెప్ప సర్దటానికి ప్రయత్నించినప్పటికి ప్రయోజనం లేకపోయింది. కార్యనిర్వాహకవర్గం వారి తీర్మానం నెగ్గిందని ప్రకటించటంతో సభలో ఆవేశకావేషాలు పెరిగిపోయాయి.

తన తీర్మానం ఏమైపోయిందని ప్రశ్నించిన ప్రతినిధి తాలూకు వారొక చిన్నసభ జరిపి మూడు తీర్మానాలు చేశారు. ఈ సభలు జరిపిన జనరల్ కౌన్సిల్ తెలుగుభాషకు ప్రాతినిధ్యం వహించటం లేదు. ఇంగ్లీషును తొలగించి దాని స్థానంలో 'విధిగా' సర్వశాఖల్లో క్రిందినుండి పైదాకా తెలుగును ప్రవేశపెట్టాలి. త్రిభాషాసూత్రం అభివృద్ధి నిరోధకమైనది కాబట్టి దానిని తిరస్కరించి, విదేశ భాషల గుప్పిట్లోనుంచి విముక్తిచెంది తెలుగు భాషాదోహదం చేయాలి. ఇవే ఆ మూడు తీర్మానాలు.

ఈ తీర్మానాల చర్చ సందర్భంలో ఆంగ్ల భాషాద్వేషంతో కొందఱు ప్రతినిధులు ప్రసంగించారు. పార్లమెంటులోనూ, బయటా సంయుక్త సోషలిస్టుపార్టీవారు చేసే ప్రసంగాలనూ, చేష్టలను జ్ఞప్తికి తెచ్చారు ఈ ప్రతినిధులు. వీరు హిందీ ప్రస్తావన తేలేదు. మాతృభాషాభిమానంతో ఆంగ్ల భాష అక్కఱలేదని అంటున్నారా? హిందీ భాషను గూర్చి వీరి అభిప్రాయాలెట్లాంటివి? ఈ ప్రశ్నలకు ప్రత్యుత్తరాలు తెలిసికోటానికి అవకాశం లేకపోయింది. ఇది సాహిత్యసభ గదా!

ప్రతినిధుల సమావేశం అస్తవ్యస్తంగా జరిగింది. సాహిత్యసభలకు అరువందలమంది ప్రతినిధులు వచ్చినప్పటికీ, ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్నవారు పట్టుమని ఒక వందమంది యుంటారేమో! తీర్మానాలపై చర్చలు సమగ్రంగా జరగలేదు. చర్చల కవకాశం లేదనీ, ఈ సభ తొందరగా ముగించాలనీ, హిందీప్రచారసభవారుచేసే తేనీటివిందులో ప్రతినిధులు పాల్గొనవలసియుందనీ, ప్రతినిధులు స్థూలంగా వ్యక్తీకరించే అభిప్రాయాలను కార్యనిర్వాహకవర్గం పరిశీలిస్తుందనీ సాంబశివరావుగారు మొదటనే సెలవిచ్చారు.

అనేక విషయాలపై తీర్మానాలు చేయబడ్డాయి. హైదరాబాదు వచ్చే రచయితలకూ, కళాకారులకూ వసతిగృహం నిర్మించటం, రచయితలకు ఆర్థిక సహాయం జేయటానికి మార్గాలు వెదకటం, దేశాంతరాల్లోని ఆంధ్రుల్లో మాతృభాషాభిమానం పెంపొందించటం, L. L. A. వారు డిస్కౌంట్ లేకుండా పుస్తకాలు కొనటం, రాష్ట్రేతరాంధ్రుల స్థితిగతులు బాగుచేయటం, హైదరాబాదులో జాతీయ

గ్రంథాలయాన్ని స్థాపించటం, తాళపత్రగ్రంథాలను సేకరించి ఒకచోట చేర్చటం, జానపద సాహిత్యాన్ని రికార్డుల రూపంలో భద్రపరచటం, ప్రపంచాంధ్రమహాసభ జరిపటం, ఉత్తమాంధ్ర సాహిత్యాన్ని భారతీయ భాషల్లోనికి, ఆంగ్లభాషాది అంతర్జాతీయ భాషల్లోనికి అనువాదం చేయటం, ఏడాది కొకసారి ఆంధ్రపుస్తకాల సూచిక ప్రకటించటం, పరిపాలనా భాషగా తెలుగును సర్వశాఖల్లో ప్రవేశపెట్టడం, ప్రభుత్వం సిద్ధంజేసిన శాసనానువాదాలు, పారిభాషికపదాలు సరిగాలేవుగాబట్టి ఒక పండిత రచయితల సంఘాన్ని ప్రభుత్వం స్థాపించటం, జాతీయరంగా లన్నిటిలో హిందీ తర్వాత తెలుగు భాషకు ద్వితీయ స్థానం వచ్చేటట్లు చూడటం, కేంద్ర ఎకాడమీవారు తెలుగు పుస్తకాలకు బహుమానా లివ్వాలనటం తీర్మానాలలోని అంశాలు.

సభలు జరపుదామనుకొన్నప్పుడు, కార్యనిర్వాహకవర్గంవారు తీర్మానాలు పంపవలసిందని సాహిత్యపరులను కోరారు. ఎన్నో తీర్మానాలు వచ్చాయి. వాటి నన్నిటినీ పరిశీలించి, ఆ తీర్మానాల కొక నిర్దిష్ట స్వరూపం కల్పించింది కార్యనిర్వాహకవర్గం. ఇట్లా చేయటంచేతనే ప్రతినిధుల తీర్మానా లేమైపోయాయో తెలియని స్థితి యేర్పడి రగడ బయలుదేరింది. కార్యనిర్వాహకవర్గం తన యిష్టానుసారంగా, తనకు ప్రాధాన్యం ప్రాతినిధ్యం కలిగేటట్లు తీర్మానాలను నిరంకుశంగా రూపొందించుతుందనే విమర్శ వచ్చింది. ఈ విమర్శలోని సత్యాసత్యాలు కార్యనిర్వాహకవర్గం వారికే తెలియాలి.

ప్రసిద్ధ రచయితలకు సన్మానాలు

ప్రారంభోత్సవ సభలో మునిమాణిక్యం నరసింహారావుగారికీ, కాళోజీ నారాయణరావుగారికీ, వానమామలై వరదాచార్యులుగారికీ, కనుపర్తి వరలక్ష్మమ్మగారికీ సన్మానాలు జరిగాయి. వీరు అంతిమ సమావేశంలో కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు జరిగిన సన్మానం ఆంధ్ర రచయిత్రు లందరికీ సన్మానమని వరలక్ష్మమ్మగారన్నారు. పోతన మహాకవికీ, తాను రచించిన పోతన చరిత్రకూ సన్మానం జరిగినట్లు భావిస్తున్నానని వరదాచార్యులుగారన్నారు. మునిమాణిక్యం నరసింహారావుగారు విశ్వనాథ సత్యనారాయణగారు ఏనుగెక్కిన తర్వాత తనకూ ఎక్కాలనే కోర్కె పెరిగిందనీ, ఇప్పుడు విశ్వనాథగారేమి యెక్కుతున్నారో తెలియదనీ, పద్యకవులకు సన్మానాలు జరిగినట్లుగా గద్యరచయితలకు జరగవనీ, తన సన్మానంవల్ల గద్య రచయితలు కూడా సన్మానార్హులే అని తెలిసిందనీ తన సహజధోరణిలో ప్రసంగించారు. కాళోజీ తన వ్యక్తిగత జీవితాన్నిగూర్చీ, తనకు జరిగిన సన్మానాలనుగూర్చీ మాట్లాడారు. తెలుగువారేదేశంలోవుంటే ఆ దేశాన్ని మాతృభూమిగా భావించాలని మారిషస్ ప్రతినిధివర్గాన్ని యుద్దేశించి మాట్లాడారు.

రాష్ట్రాంతరాంధ్రులు

రాష్ట్రాంతరాల్లోని ఆంధ్ర సాంస్కృతిక సంఘాలవారు అంతిమ సమావేశంలో ఉపన్యసించారు. వారిలో ఒకరు ప్రవాసాంధ్రులు అనే మాట బాగా లేదనీ, రాష్ట్రేతరాంధ్రులంటే సమంజసంగా ఉంటుందన్నారు. ఈ సాహిత్యసభలు జరుపుతున్న సాంబశివరావుగారెన్ని ఆటంకాలు వచ్చినా ముందుకు పోవాల్సిందేయని అన్నారొకరు. ఈ సభా కార్యక్రమాన్ని పరిశీలించిన యింకొకరు రచయితలకు ప్రత్యేక విషయాలిచ్చి వ్యాసాలు వ్రాయించాలనీ, వానిని ప్రకటించాలనీ, సదస్సుల కధ్యక్షులైనవా రెక్కువసేపు మాట్లాడరాదనీ సూచించారు. రాష్ట్రాంతరాంధ్రులు ప్రత్యేక సంచికలు ప్రకటించేటప్పుడు స్వార్థంతో ఎట్లా ప్రవర్తిస్తారో, ఎటా డబ్బు దిగమింగుతారో మరొకరు వివరించారు. ఆంధ్రదేశంలోని పత్రికల్లో రాష్ట్రాంతరాంధ్రులను గూర్చి వ్రాయటం తక్కువనీ, ముఖ్యంగా వార పత్రికల్లో ముగ్గుల కిచ్చిన ప్రాధాన్యం రాష్ట్రాంతరాంధ్రుల కష్టసుఖాల కివ్వటంలేదని యింకొకరన్నారు. సభల్లో పాల్గొనటాని కవకాశం లేకపోయినందుకు ఢిల్లీనుండివచ్చిన వారొకరు చాలా బాధపడ్డారు. అంతదూరంనుండి వచ్చినది గోళ్లు గిల్లుకుంటూ కూర్చొనటానికా? అని యాయన ప్రశ్నించారు. ఆంధ్రదేశంలోని రచయితలు రాష్ట్రాంతరాంధ్ర సాంస్కృతిక సంఘాలతో సహకరించటం లేదని మరొకరు సోదాహరణంగా వివరించారు.

ఉత్తర హిందూస్థానంనుండివచ్చిన ప్రతినిధు

లతో మాట్లాడితే వారి యుత్సాహమూ, ఆవేదనా తెలుస్తాయి. ఆంధ్రభాషాసౌందర్యాన్నిగూర్చి యితర భాషలవారికీ, ప్రపంచానికీ తెలియజేయాలనే ఆరాటం వారిలో ఎక్కువ. హిందీప్రాంతాలవారి కృషిని ప్రత్యక్షంగా చూస్తున్నవారికి ఆరాటం వుండటంలో ఆశ్చర్య మేమీలేదు. అందుకనే ఆంధ్రభాషలోని యుత్తమగ్రంథాలను తదితర భారతీయ భాషల్లోకి తర్జుమా చేయించాలని మాటిమాటికీ వారు వొక్కి చెప్పారు. ఇంక పోతే కేంద్రప్రభుత్వం పద్మశ్రీ మొదలైన బిరుదు లివ్వటంలో తెలుగువారి కన్యాయం జేస్తున్నరని వారంటున్నారు. దీనికి హేతువు ఆంధ్ర ప్రభుత్వమా? అని వారనుమానిస్తున్నారు. ఆంగ్ల భాషా వ్యతిరేకోద్యమం ఆర్యావర్తంలో ప్రబలినప్పుడు 'పద్మశ్రీ' మున్నగు బిరుదులను పరిత్యజించిన వారి పేర్లు పత్రికల్లో ప్రకటింపబడితే, అక్కడి తెలుగు వారి కెంతో ఆశ్చర్యం కల్గిందని ఒక ప్రతినిధి నాతో చెప్పాడు. చాలమంది ఔత్తరాహులకు ఆ బిరుదులు వచ్చాయన్నమాట.

మారిషస్ ఆంధ్ర ప్రతినిధివర్గం

మారిషస్ ఆంధ్ర ప్రతినిధివర్గం ఒకటి వచ్చిందని మొదటే చెప్పాను. వారు ప్రతిసదస్సులోనూ శ్రద్ధగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సభలో, అంతిమ సమావేశంలో వారుపన్యసించారు. వారి తెలుగు పట్టిపట్టి మాట్లాడినట్లుంది. ఆంధ్రదేశాన్ని దర్శింపగలిగామనే పారవశ్యం వారి మాటల్లో ద్యోతకమయ్యింది. చర్చనీయాంశాలు వారి కెంతవరకు అర్థమయ్యాయో తెలియదు. ప్రతినిధి వర్గంలోని ఆంధ్ర పండితులు గున్నయ్యసెట్టిగారు వేమన పద్యాల నుదాహరిస్తూ మాట్లాడుతుంటే సదస్యు లుప్పొంగిపోయారు. చిత్తశుద్ధితో పని చేయాలని వారన్నారు ఉగాది, ఆంధ్రప్రదేశావతరణ దినమును సెలవుగా మారిషస్ ప్రభుత్వం ప్రకటించిందట! ఏకాదశీవ్రతము, శివరాత్రి, శ్రీరామ నవమి మున్నగువాటిని తెలుగువారెంతో వేడుకగా జరుపుకుంటారట! ఈ ప్రతినిధివర్గానికి మెమెంటోలు సమర్పింపబడ్డాయి. వారికి తెలుగూ, ఉర్దూ, ఎకాడమీ ఆఫ్ హిస్టరీ అండ్ సైన్సు పక్షాన ఖండవల్లి బాలేందుశేఖరంగారు పుస్తకా లిచ్చారు.

దౌత్యకార్యాలయ ప్రతినిధులు

ఈ ప్రతినిధులు అంతిమ సమావేశంలో పాల్గొన్నారు.

మాక్సుముల్లర్ భవన్ డైరెక్టరు ఓహ్లో ఒక దేశ సంస్కృతి తెలిస్తేగాని ఆ దేశ ప్రజల ఆవేదన ఉత్సాహము అర్థంగావనీ, రచయితలు సమస్యలకు పరిష్కారం సూచించాలనీ అన్నారు. రచయితలు పరస్పరాభిప్రాయాలు తెలిపికోటాని కిట్టి సభ లుపయోగపడతాయన్నారు. గ్రూప్ 47 అనే సాహిత్య సంస్థ ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో ఎట్లా పనిచేసిందో వివరించారు. జర్మనీ విశ్వవిద్యాలయాల్లో భారతీయభాషల—ముఖ్యంగా సంస్కృతం—అధ్యయనం ఎట్లా సాగుతున్నదో వివరించారు.

రష్యా వాణిజ్యసంఘప్రతినిధి తమ దేశభాషల్లోకి అనువదింపబడిన భారతీయభాషా గ్రంథాలు ఎన్ని కోట్లు అమ్ముడుపోతున్నాయో చెప్పారు. తమ దేశం ప్రకటించే ఆంధ్రగ్రంథాలనుగూర్చి చెప్పి, రష్యాలో ఆంధ్రభాషాపఠనం ఎట్లా సాగుతుందో వివరించి, శాస్త్రసాంకేతిక గ్రంథాలను విరివిగా తెలుగులోని కనువదించుకుంటే చాలా మంచిదని సూచించారు.

అమెరికా దౌత్యకార్యాలయ ప్రతినిధి బి. ఎస్. ఆర్. కృష్ణగారు అమెరికాలో జరిగే రచయితల శిక్షణా శిబిరాలనుగూర్చి విపులంగా ఉపన్యసించారు.

ఇదంతా నాల్గవ అఖిల భారత తెలుగు రచయితల మహాసభల సమీక్ష. ఈ సభలవల్ల ఒనగూడిన మేలేమైనా వున్నదా? అనే ప్రశ్నకు ప్రతినిధుల్లో చాలామంది 'ఏమీ లేదు' అనే సమాధానం జెప్పుకొన్నారు. ఉపన్యాసకు లెక్కువమంది కావటం, వారు నిర్లక్ష్యంగా మాట్లాడటం, అధ్యక్షులైన వారొకరో యిద్దరో చిత్తశుద్ధితో మాటలాడటం, ప్రతినిధులకు దేనిమీదా ఆసక్తి లేకపోవటం, ఈనాటి ముఖ్య సమస్యలు చర్చకు రాకపోవటం ఈ సభల లక్షణాలైపోయాయి. రాజకీయ నాయకు లింతమంది యీ సాహిత్యసభల్లో పాల్గొనాలా? అని సాహిత్యపరులు కొందరు ముక్కుమీద వేలేసుకున్నారు. అత్యధికమైన ఆంధ్ర సాహిత్యాభిమానంతో మొదటిసారిగా ఈ సభలకు వచ్చిన యువకు లిద్దరు 'ఈ విధంగా

ఈ సాహిత్యసభలు జాతర్లలాగా జరుగుతాయని మాకు తెలియక వచ్చా'మని అన్నారు. బ్రహ్మానందరెడ్డిగారు పరిపాలనాభాష యగుచున్న యీ సమయంలో 'తెలుగు భాష స్వరూప స్వభావాలను స్పష్టంగా నిర్ధరించి' చెప్పవలసిందని తమ స్వాగతోపన్యాసంలో కోరారు. ఆ నిర్ధారణ జరిగిందా? అని ప్రతినిధులు కొందరు ప్రశ్నించారు. పదిమందినీ పోగుచేసి పది రకాల ఉపన్యాసాలు ఇప్పించటం లక్ష్యశుద్ధిగలవారుచేసేపని అవుతుందా? సత్ఫలితాలు సమకూడుతాయా? అని ఆలోచించాలి.

అసలు బావలేనిదానికంటె గుడ్డిబావవుండటం మేలు గాదా? అనే ధోరణిలో కొందరు తృప్తిపడ్డారు. నిజమే ఒప్పుకుందాము. ఇంత వ్యయప్రయాసలతో ఈ సభలు జరుపుకుంటున్నాముగదా! దీనివల్ల మనం సాధించుతున్నదేమి? అని నిర్ణయించుకోవాలి. కార్యనిర్వాహకవర్గంవారి శక్తియుక్తులు ఘనమైనవనటంలో సందేహంలేదు. ఎంతో నేర్పూ ఓర్పూ వుంటేనేగాని ఇటువంటి సభలు జరపటం సాధ్యంగాదు. మరి వారి శక్తియుక్తులు బూడిదలో పోసిన పన్నీరు కావటంలేదా? అని ప్రతినిధుల్లో విజ్ఞులయినవారనేమాట కేవలమూ ఒడ్డునుండి గడ్డలువేయుటం వంటిదా? ప్రచారంకొఱకూ, ప్రాపకముకొఱకు సభలు జరుపుతున్నారనే నింద యొకటి యుంది. అది కేవలము నిందయని బుజువు చేయాలంటే ఈ సభా కార్యక్రమాలను నిర్మాణాత్మకంగా జరిపి తెలుగు జాతికి వెలుగుబాటలు వేయాల్సిన బాధ్యత కార్యనిర్వాహకవర్గంవారిది.

దాని కొక్కటే మార్గం వుంది. అయిన వారినీ, కానివారినీ, అందరినీ ప్రతినిధులను పేరిటో ఒకచోట గుంపుగా చేర్చే పద్ధతికి స్వస్తి చెప్పాలి. అఖిల భారత ప్రాచ్యపరిషత్తువారు చేయించినట్లుగా ఉపన్యాసాలు రూపొందాలి. ఆయాచర్చనీయాంశాలను ఆయావర్గాలుగా విభజించి ఒక్కొక్క వర్గానికి ఒక్కొక్క అధ్యక్షుణ్ణి వేయాలి. రచయితలయినవారే వర్గసదస్సులో మాట్లాడతారో ముందుగా తెలిసికొని, వారిచేత వ్యాసాలు వ్రాయించాలి. వారే వచ్చి వర్గసదస్సుల్లో వ్యాసాలు చదవాలి. ఈ వర్గ సదస్సులన్నీ ఏకకాలంలో జరుగుతాయి. ప్రతినిధులు ఏ వర్గసదస్సు అంటే ఇష్టముంటుందో దానికే వెడతారు. అట్లా జరిగనంతకాలమూ ఈ సాహిత్యసభలు గంగానమ్మ జాతరలో గ్రంథాలయ వార్షికోత్సవము లాగానే రూపొందుతాయి. సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారిలాగా ఈ సభలు విజయవంతమయ్యాయని అనటం సాహసమే అవుతుంది. 'ఆధునిక రచయితలమని కొందరూ, ప్రాచీన సంప్రదాయానుసారులమని కొందరూ, ఒక వర్గంవారి నందరినీ వేరుచేసి జరుపుకునే ఏ రచయితల మహాసభలూ సమగ్రమైన సాహిత్యసభలు కాలేవు' అని బ్రహ్మానందరెడ్డిగారన్నారు. నిజమే కావచ్చు. అఖిల భారత తెలుగు రచయితల మహాసభ లింతవరకు నాలుగు జరిగాయి. నాలుగో సభ సంగతి అట్లా వుంచండి. మిగిలిన మూడు సభలూ సాధించిందేమి? 'అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు' అన్న పెద్దపేరు ఇంటిపేరు కస్తూరివారన్న సామెతను జ్ఞప్తికి తెస్తుందని ఒక ప్రతినిధి చమత్కరించటంలో అర్థంవుందో లేదో కార్యనిర్వాహకవర్గంవారు తమలో తాము చర్చించుకోవాలని కోరుతున్నాను.

ఈనాడు సాహితీ ప్రపంచంలో చిత్తశుద్ధి కొఱవడింది. వంచన యెక్కువైంది. రామకోటిశాస్త్రివంటి ఉపన్యాసకు లిది గుర్తించారు. ఈ సభల కార్యనిర్వాహకవర్గం ఇంకా ఎంతో చిత్తశుద్ధితో నిర్మాణాత్మకంగా కృషిచేయవలసివుంది. ఆ కృషి జరగనంతకాలం ప్రతినిధులు గుడిపూడి జంగాలమాదిరిగా ఒకచోట చేరి ఏవేవో మాట్లాడుకొంటారు; వెళ్లిపోతారు.

తృష్ణాతంతువు

శ్రీ శనగన నరసింహ స్వామి

మానవుడు :

నా తరుణ సుందరార్ద్ర మనస్సుమంబు
దళదళపరీత వేదనాదగ్ధమయ్యె
అశ్రు శ్రవణలోచనాబ్జాంతరాంతరముల
మిగులతే దొక్క తుహినకిర్మీరకణము.

వినివిని వసంతకోకిలోద్వేల మధుర
ముగ్ధగానము వీనులు మోడువారె
కాకగృధ్రదివాంధ సృగాలరవము
లస్మదీయతమోఽంధ జీవాన్నమయ్యె.

శాంతికొఱకు దివాకరజ్వాలలందు
విశ్వమెల్ల గవేషించి విసిగి తుదకు
అమృతహృద్వేదియని నిశీథార్ధమందు
కాలుమోపితి ఈ వల్లకాటినేల.

రంధ్రదాంధ్రీతమస్వినీ రుద్రమైన
ఈ శ్మశానమహావాటి యురుల యురులకు
కారుమబ్బరి మున్గి శాఘ్యత గడించు
నా యెదకు దీనికిని సమానత ఘటిల్ల.

అంగముల అంచులనుగూడ అనకుండ
వ్రేలుచున్నవి వటజటాజూటలలందు
కొఱనయ్యము లవ్యాఖ్యనగుణము మాఱచి
నిద్రలో మున్గె నిర్మల రుద్రభూమి.

రండు! రండు! భూతములార! రండు! రండు!
శాకినీ ఢాకినీ పిశాచ ప్రచయము!
నీరవ విభావరీ తమోనిర్ఝరజలో
రంబు రంధ్రము పడకుండ రండు! రండు!

అంఘ్రితలములు ధారుణి నంటకుండ
కొలువుదీరుడు పర్కటీకుజము క్రింద
భవదమేయ తమిస్రా సబంధుకేశ
వేశముల గప్పుడిక నన్ను పితృవనమును!

పవనడింభక చతురశ్రవప్రహస్ర
చిత్రచిత్రసుషిరముల జేరకుండ
నన్ను వలగొని మృదుసాంత్వన ప్రహర్ష
ణ ప్రభాషణ ప్రణయ మనస్వు లగుడు!

ప్రాణియుని భయపడునని బహుశరాత్ర
మని కరుణజూపి తొలగకు డహరహముహు
రాత్త దుర్దాంత కష్టనష్టసువునయి
నేను శిలనయి, దయ్యమై నిల్చినాడ!

పిశాచవృత్తము :

"కారుమొయిళ్ల క్రమ్మిన యొకానొక వార్షుక సాంధ్యవేళ
ర్జారవ తర్జనంబుల రుజావశమైన మదీయజీవ సం
భారము లీనమయ్యెను సుమా! భయకారి తదీయ సంస్మృతి
స్ఫారత నేడునున్ శితకృపాణికయై హృదయంబు చీల్చెడిన్."

"నేనొక పేదయింట జననీజనకుల్ నిధియంచు పెంచు స
న్మానము నొంది దీపశిఖవా వెలుగొంద నకాలమృత్యువా
సానిల మర్ధరాత్రమున నార్పెను నేడును మన్మృతి ప్రబా
ధానతులైన కూర్మి తలిదండ్రుల రూపు మొగాన ప్రేలెడిన్."

"నా యనువారులేని కఠినంబగు లోకమునందు నిత్యయా
చ్ఞాయుత నీచజీవనము సల్పి కృశించి భరింపరాక దీ
ర్ఘాయువు త్రుంచుకొంటినీ స్వహస్తములన్ నరలోక తుల్పిపా
సాయుత దుస్సహవ్యధ లనంతముఖంబుల నేడు నేచెడిన్."


"కోమలహావభావముల కోర్కులు పెంచు మెఱుంగుబోఁడికిన్
ప్రేమతపస్వినై పరితపించి గళంబున ప్రాణపుష్పముల్

దావము. గట్టివైన గళితంబయి కూలెను వాటి మాధురీ
సీమలు జ్ఞప్తివాటి వివశింతును నేడు వివేకహీనతన్."

"మాసిన వల్వగట్టి రుచిమాలిన భోజన మారగించి క్రొ
వ్వేసవియెండ ప్రాణములు వీడితి వధ్యము మధ్య దీన న
న్యాసి విధాన మత్కృతధనంబుల బంధువులందు భోగ వి
న్యాసము గాంచు నాదుహృదయుంబున నేడు దురాశ లూగెడిన్.'

బృందగానము :

బ్రదికి కృశించి ప్రాణములు బాసిన మా యెదలందు మోదనం
పద కొఱయయ్యె కల్మషతమస్సులు చాయలవోలె సాగి మా
పదముల నంటివచ్చెను దివంగతులైనను మన్నుగాని దు
ర్మద మమతానదాంధులగు మానవు లాత్మలు శాంతిదూరముల్.



కులభ్రష్టుడు

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

(గత సంచిక తరువాయి)

సాపిట్లో కాలు విరిగిన ముక్కాలిపీటమీద, గెడ్డం చేతిలో పెట్టుకుని, వీధిలో దొర్లిపోతున్న సైకిళ్లనీ, రిక్షాలనీ అలవోకగా చూస్తున్న కిష్టయికి, ఆ పక్క గోరింటవారి సందులో గోళీకాయ లాడుతున్న విష్ణాయి కనిపించాడు. ఒక చెంపవింపీ వాణ్ణి పిలుస్తే, 'వీడు స్కూలుకి వెళ్లలేదేమిటా?' అని వాకిలి ఊడుస్తున్న జానకమ్మ పెడిగాడు కిష్టుడు.

'వాడు స్కూలికి వెళ్లటంలేదు నాయనా' అంది జానకమ్మ తల ఎత్తకుండానే.

'ఏం?'

'పేరు కొట్టేశారు.'

'అదేమిటి?'

'జీతం మూడునెలలు బకాయిపడింది. ఎన్నింటి కని చావను?'

కిష్టాయి మనస్సు చివుక్కుమంది.

నిజానికి తనూ గోళ్లు గిల్లుకుంటో, మెప్పుగా భోంచేసి, మత్తుగా నిద్రపోతున్నా డింత వరకూ.

'నన్నడగలేదేమీ?' అని ముదలకిస్తే బైటకి పడివాడేగాని...అడగ్గానే డబ్బెక్కణ్ణించి ఊడిపడు తుందో ఆమెకి తెలియదు గనకనా.

జానకమ్మ అయోమయంలో పడిపోయింది.

కొట్టూ నడవడం లేదు; ఇంటోనా బియ్యం సమేతా అన్నీ నిండుకున్నాయి; ఈ దినకార్యం పేరు మీద బదులుతెచ్చిన ఎనిమిదివందలూ తుడిచి పెట్టుకుపోగా, అక్కడక్కడ వలచవలచగా అప్పులు మినహా మిగిలిందేమీ లేదు; కిష్టయ్య తెలిసినచోటల్లా చేబదుళ్లడిగి లేదనిపించుకుంటున్నాడు. ఎట్లాచ్చీ చిల్లరబాకీలు రెండురూపాయలూ, మూడురూపాయలూ చెదురుమదురుగా చేతికివస్తుంటే నాలుగు రోజులవింపీ నాలుగువేళ్లూ నోట్లోకి పోతున్నాయి. కాలు విరగదొక్కుకుందుకు సావకాశం చిక్కకనే పోయెను...కూచుని తింటుంటే గుళ్లూ గోపు రాలూ ఆగేనా?

ఇప్పుడిహ నేమిదారి?

కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ కూచుంది జానకమ్మ; అయ్యో ఈ పిల్లలు అన్నంలేక మలమల మాడి, ఆకలికి విలవిల్లాడిపోతారు గావును.

పరలోకంలో ఉన్న భర్త కళ్లెఱ్ఱజేసి చూస్తున్నట్టు వణికిపోయింది జానకమ్మ.

ఏదో, తన మానాన తను సంప్రదాయమో చట్టుబండలో, గౌరవమో, అగౌరవమో, నామోషీ అనుకోకుండా, అన్నయ్యకి బరువు తగ్గిద్దామని, ఇక్కడయితే మొహంచెల్లక, పరాయిచోట, కాఫీహోటల్లో సర్వరుగా అయితేనేమిగాక, ఏదో ఒక అయ్యవందని పొట్టబోసుకొంటూ కడుపులో చల్ల కదలకుండా కాలక్షేపం చేస్తున్నాడు మరిది. తనెక్కడున్నదీ చెప్పకుండా ఇదీవరకా అడపాతడపా పంపించే వాడుకూడా. అతన్ని తీసుకొచ్చి, ఈ గంప శ్రాద్ధమంతా తలకెత్తి, తన పిల్లల సంరక్షణకని ఇక్కడ కట్టిపడేసింది తను. తను చెడిందిగాక వనమెల్లా చెరిచిందన్న సామెతగా తను దరిద్రంలో మునిగిపోతూ, అతన్నీ ఈ ఊబిలోకి దించినట్టయింది. క్రియకి, దరిద్రుడికి తల కడగబోతే వడగళ్లవాన వచ్చిపడింది.

తన ఖర్మకాకపోతే మొదటి సంతానం

ముగ్గురూ ఆడపిల్లలే కావాలి తనకి...అక్కడికీ... 'ఒకళ్లేమన్నా ఖాతరు చెయ్యకండి ... ఆపరేషను చేయించుకోండి' అని శతపోరింది తను. 'ఒక్క మగ నలుసయినా లేకపోయెను. వంశవృక్షానికి గొడ్డలి పెట్టు పెడతావుటయ్యా?' అని పాచిపనిచేసే లచ్చుమమ్మ లగాయితూ పండితశాస్త్రిదాకా హెచ్చరిక లిచ్చినవారే!

సిద్ధాంతి చిదంబరం, సరేసరి, "పుత్" అనే నరకాన్నించి తప్పించుకోవాలంటే పుత్రసంతానం అవశ్యమూ పొందాలెనయ్యా' అని సోమయ్యకి నూరి పోసి, ఆ నరకం ఒక పెద్ద పులివతుగా తన కోర మెట్ల నోరు తెరుచుకుని కూచున్నదీ, దాని కోరలూ, కోరలసందులతోసహా వర్ణించి చెప్పాడు.

పోనీ ఒక్క మగ నలుసుని ప్రసాదించాడు కదా భగవంతుడు, ఇకనైనా బుద్ధివచ్చిందాఅంటే... అబ్బే...అదీలేదు.

ఒక కన్ను కన్నుగాదు—ఒక కొడుకు కొడుకు కాదన్నారు. ఆడపిల్లలు బేసిసంఖ్యలో ఉండకూడదన్నారు.

ఈ అన్నవాళ్లెవరూ ఒక గిద్దెడుబియ్యం బదులివ్వరివాళ.

అంతేనా—ఈ తలుపుల వెనకాల మగ్గుతున్న దరిద్రానికి ఝడిసి అసింటాపోతున్నారు.

పెళ్లి కెదిగున్న ఆడపిల్లల గోడే పట్టలేదామెకి. మింగమెతుకులేదు మీసాలకి సంపెంగ నూనె ఎక్కడిది? మొదలు పొట్టగడిచేమార్గం మూసుకుపోతున్నది, పెళ్లి పెడాకులూను!

* * *

కిష్టయ్య ఆ పొకపోక రాత్రి పదింటికి తిరిగి వచ్చాడు. వస్తూనే రెండుశేర్లబియ్యమూ, కసిన్ని పప్పులూగట్టా పట్టుగొచ్చాడు. చిల్లరబాకీలు వసూలుకాలేదు. పుస్తకం ఇంట్లోనేవుంది. ఎక్కడిదీ డబ్బు అని అడుగుదామనుకుంది జానకమ్మ. కాని రాత్రి రెండు ఝాములు కావస్తోంది.

వస్తూనే, "నరసింహంగారు మన నరసుకి సమంధం తీసుకొస్తున్నారు పదినా" అన్నాడు స్నానానికి తుండుగుడ్డ వెతుక్కొంటూ.

తండ్రిపోయిన మూడునెలలలోపుగా కన్నెచెర వదలిస్తే పుణ్యంకూడానట. కాని మురిగిపోతున్న ఈ దరిద్రపు కొంపలోనించి సమంధం అందుకొనే తల మాసినవాడెవడా అని జానకమ్మ విస్తుపోయింది.

కిష్టయ్య విడమరిచి చెప్పాడు.

మద్దూరి మాణిక్యంగారని... రాజాపేటలో... ఫ్యాన్సీ వ్యాపారంట...అయినా సోమయ్యా జాయింటుగా ఏదో వ్యాపారం వెలిగిద్దామని...భుజాలు రాసుకున్నారట కొన్నాళ్ల ... ఏనాటిమాటో ... ఇప్పుడు లక్షాధికారట.

"ఇంతకీ వాళ్లబ్బాయి ఉన్నాడా పెళ్లికి?" అంది జానకమ్మ యథాలాపంగా—వాళ్లు లక్షాధికారులన్నమాట మరిచిపోయి.

పీటమీదవున్న విభూతిపండు తీసి క్రింద పెట్టాడు కిష్టయ్య. విభూతి అంటే అతనికి తగని మంట.

"అబ్బె—ఆయన కొడుక్కికాదు. ఆయనకే.'

"సరిపోయింది—రెండోపెళ్లా?''

"మరేమనుకొన్నావు? ఇద్దరేట ఆడపిల్లలు... పాపం...మగసంతానంలేదుగా...అందుకని మళ్లీ నడుం బిగిస్తున్నాడు."

అయినా పున్నామ నరకం బెదిరిస్తోనేవుంది గావును పీడ.

నరసింహంగారు సమంధాలు చూస్తున్నారు అనగానే అనుకుంది జానకమ్మ, 'ఇంతకన్న సౌలభ్యంగా అహోరిస్తుందీ' అని.

అయినా ఆమెకి దిగులే.

ఇంతకన్నా—కట్నం లేకుండా—చవకబారుగా—తన కొమార్తెని కట్టుకోడానికి సిద్ధంగావున్న వరుళ్లు—బజార్లో క్యూలో నిల్చొనివచ్చారా? తక్కువ నోములు నోచి ఎక్కువ ఫలాలు కావాల్నంటే ఎక్కణ్ణించి వస్తాయి?

అదీ అయింది.

అదిగో—ఆ సవారీ కొట్లో గుమాస్తాగా పని చేస్తున్నాడు కురిచేటివారి కూర్మయ్యని...అతగాడికి

నెత్తిమీద జుట్టు మినహా వెనకాల ఆస్తి లేదు; తల్లి లేదు; తండ్రి లేదు. పోతే ఆ దేవయ్యకి నెలకి యాభై జీతం!...అవునా—రెండువేల కట్నం కావాలిట!! మళ్ళీ నెత్తిమీద ఏగాని పెడితే దమ్మిడీకి మారదు. దరిద్రం తల్లివెళ్ళి దరిద్రాన్ని కౌగిలించుకునేకన్నా...కాళ్ళదగ్గర కొస్తున్న సమంధం...రెండో పెళ్ళిఅయితేనేంగాక...ఇంత తిని, ఇన్ని నగలు పెట్టుకొని...గరగరలాడే చీరలు కట్టుకొని... గుమ్మటంలా నాలుగుకాలాలపాటు మసిలితే చాలదా యేం? ఆడకూతురు కంతకన్న ఏం కావాలి?

'మూన్నాళ్ళ ముచ్చట' అని అమ్మలక్కలు మూతి విరిస్తే అయిందా?...ఈసురోమంటో, వరాలకింద దేవుడిచ్చిన బిడ్డల్ని శాపాలనుకొని మోస్తూ—బండమీద బ్రతుకు ఈడ్చుకొంటో—వందేళ్ళు బ్రతకాల్నా యేం?

'పడుచుపెళ్ళాం ముసలిమొగుడూ', అని బుగ్గలు నొక్కుకొనీ పలుగుర్నీ...నెలకి యాభై తెచ్చుకొంటూ తెగనీలిగే ఈ దేభ్యం ఏమాత్రం తినమా, ఎంత బట్ట కట్టమా, పెళ్ళాన్ని ఎంత హుందాగా పోషించమా, ఎంత మొగసిరి వొలకబొయ్యమా!

మదుర్ల మాణిక్యం...రెండో పెళ్ళి అన్నమాటేగాని ముప్ఫయిరెండు మించదు వయస్సు...కాయపారు శరీరం...జానకమ్మ ఎరుగును...హాయైన రాత......మొగుడూ మొద్దులూను......ఈ అందచందాలూ...ముద్దుముచ్చట్లూ...పెళ్ళయిన నాలుగేళ్ళు...కాదంటే అయిదు...ఈలోగా ఒకళ్ళిద్దరు పిల్లలు పుట్టుకొచ్చారా...ఇక మగవాని అందం మొగుడికెందుకు కావాలా? పెనిమిటి శృంగారం పెళ్ళానికెందుకు కావాలా?...ఆ తరవాత...ఏదో......గంతలు కట్టిన గానుగెద్దుల్లా......శనగలు తిని చేతులు కడుక్కున్నట్లు...

అంతవరకూ సంసారపు సుడిగుండంలో జానకమ్మ రుచి చూచిన విలువల అంతర్యాలు అంతంతమాత్రం!

కిష్టయ్యకి ఈ రకమైన ఆలోచనా సరణి పరమ అసహ్యం.

అసలు పెళ్ళిచేసుకున్నాడా మనిషి సగం స్వార్థపరుడూ, సంకుచిత మనస్కుడాయి చక్కా పూరుకుంటాడు. తప్పదు. ఇక సంతానం లుకలుకలాడుతో బయల్దేరిందా, కక్కుర్తీ, కుళ్ళూ, నీచమూ ఒకదానివెంట ఒకటి చోటు చేసుకుంటాయతనిలో...ఉన్నతంగా ఆలోచించడమే చప్పగా మాను కుంటాడు. ఇది డబ్బులేనివాళ్ళ తీరేకాదు: కలవాళ్ళూ ఇదే తంతు. ఏదో డిగ్రీ లేదా అంతే...అంచాతనే...ఛస్...ఈ విషవలయంలో అసలు ఇరుక్కోనే గూడదూ అని పెళ్ళికే విరామం పెట్టేశాడు కిష్టయ్య. అయితే.. ఇది.. ...తనకి పిల్ల నెవరూ ఇవ్వకపోగా తీసుకున్న నిర్ణయంమాత్రం కాదు...కావాల్నంటే గంతకుతగిన బొంత, ఏ జీడిపిక్కో, ఈ బొద్దింకో, ఏ బొంతకాకో తనకి అమరకపొయ్యేది కాదు తాను అవునని తలవూపినవాడు...కాని, జీవితాన్ని అంత తక్కువ వెలకి అమ్మేసుకుని, పరువూ ప్రతిష్ట కొనుక్కొనేందుకు మనస్కరించలేదు కిష్టయ్యకి. దాన్నుంచతెగా...ఆ రెండుభ్రాంతులూ వొదులుకున్నట్టయినా, నీతి నిజాయితీలు గీచిన గిరి దాటనే అక్కర్లేదు...బోలెడంత సుఖశాంతులు నోల్లుకోవచ్చును. 'ఎద్దయి కాడికింద ఏడేళ్ళు బ్రతికేకన్నా, ఆంబోతయి ఆరుఘడియలు బ్రతికితే చాలదూ?' అంటాడు కిష్టయ్య.

కాని కిష్టయ్యకి గాలిలో మేడలు కట్టుకొని దానికి రంగువేసుకొంటో కూచునే అలవాటులేదు. నేల విడిచిన సాముంటె అతనికి సుతరామూ గిట్టదు. వాళ్ళేమనుకుంటారో వీళ్ళేమనుకుంటారో ... నలుగురూ నవ్విపోతారు... 'నలుగురితో నారాయణా—కులంతోపాటు గోవిందా'—ఇలాంటి సూక్తులు ఉరితాళ్ళక్రింద లెక్క అతనికి.

కిష్టయ్య ఆ రోజు లగాయతూ ఇంట్లో కావలసిన సామగ్రీ, కూరా నారా, ఏరోజు కారోజు పట్టుకొచ్చి పడేస్తూనే వున్నాడు.

వసూలవుతున్న చిల్లరబాకీలు కావు.

ఎక్కడిదీ డబ్బు?

జానకమ్మ కంతుబట్టలేదు.

విస్తళ్ళు కుట్టి, అప్పడాలొత్తి, ఊరగాయ లమ్మి పేస్నీళ్ళకి పేస్నీళ్ళుగా యథాశక్తి గడుపు కొస్తున్నది జానకమ్మ.

* * *

మానవజీవితం తమాషాగా వుంటుంది. ఎవ్వడూ తిండిలేక చచ్చిపోడు—చచ్చిపోతున్నట్టు అవుపించడు... అలా లెక్కకి రావేరాడు మన సామాజిక వ్యవస్థ సృష్టించిన ఇంద్రజాల మట్లాంటిది... ఈ నాగరి కతలో దరిద్రుడు ఆకీమని చావడు. మెల్లిమెల్లిగా చస్తాడు...ఘడీఘడీకీ, రోజురోజుకీ, కాస్త కాస్త చచ్చిపోతో, ముఖ్యంగా...జమాబందీ వాళ్ళకి...నిజంగా బ్రతికున్న శాల్తీల క్రిందనే లెక్కకొస్తారు.

* * *

'విన్నావా అమ్మాయీ?'

ఎప్పుడొచ్చాడో ఏమో, సావిట్లో బెంచీమీద తాపీగా కూచున్న నరసింహంగారి మాటలకి అదిరి పడింది జానకమ్మ. విస్తళ్ళు చిటుకూ చిటుకూ కుడుతున్నదల్లాలేచి, ఈనపుల్ల వొదిలేసి, పైట కొంగు మెడమీదనించీ ముందుకి విరుచుకుని, తలుపుచాటుకివెళ్ళి 'ఏమిటన్నయ్యా?' అంది.

నరసింహంగారు బకాసురుడల్లే కూచున్నాడు— యథాప్రకారం...చెవిలో తులసీదళమూ...నొసట విభూతిరేకలూ—తిథి వార నక్షత్రాలన్నీ కలిసివస్తేనే గాని క్షురకర్మ విషేధం నరసింహంగారికి...అంచాత గెడ్డం కాస్త మాసింది.

'మన కిష్టయ్య వ్యవహారం విన్నావా?' అని రెట్టించారు నరసింహంగారు.

'ఏదో కొంప మునిగింది,' అనుకొన్నది జాన కమ్మ...ఈ మరిది మళ్ళీ ఏమి జట్టీ తీసుకొచ్చాడో!

'ఏమి చేశాడన్నాయ్?'

'మూటలు మోస్తున్నాడు! ఈ వాటికి మన వంశంలో!...భేషుగ్గా వుంది కదూ?'

'మూటలా? ఎక్కడ?'

'బస్సు స్టాండులో.'

జానకమ్మ కర్థమయింది.

ఇంటో కావలసిన వెచ్చాలు ఎప్పటికప్పుడు కొని పడేస్తున్నాడు...కొట్లు తెరుస్తున్నాడేమో అనుకొంది తనూ.

ఇదన్నమాట చేస్తున్న నిర్వాహకం.

'అయితే నీకు తెలియదా అమ్మాయి?'

'హయ్యోరాత...తెలిస్తే ఆ పని చెయ్యనిస్తానా అన్నాయ్?' అని కంట తడిపెట్టింది జానకమ్మ.

అమట్న విజృంభించాడు నరసింహంగారు.

'వీడున్నాడు మాశావూ...వీడు—ఈ కిష్టాయి... అసలు వీణ్ణి గడప తొక్కనియ్యడమే తద్దినం కొని తెచ్చుకోవడమనుకో...విహా కొంపకి వీడొక శని... నా మాట నమ్మ...అసలే మిలిట్రీకి వెళ్ళివచ్చాడా? అది చాలక కాఫీహోటేలులో కప్పులు కడిగాడు... ఇప్పుడిహ బస్సుస్టాండులో ట్రంకులు మోస్తు న్నాడు...ఇక విహాకుగాని, మిమ్మల్నిబట్టి నాకు గాని...పరువేముంటుంది చెప్పు?...రేపు అమ్మాయి పెళ్ళికున్నదా? ఎవరేనా ఏమయినా అన్నారూ అంటే అనెరూ?—ఆ మాణిక్యం...మన పెద్దమ్మాయి సమం ధానికి దిగివస్తున్నాడూ అంటే...'మా వాళ్ళు' అని నేను నచ్చజెప్పబట్టే కదా? ఈ త్రాష్టుడు పిల్లకి పిన తండ్రి అవుతాడు అని తెలిస్తే...మూటలు మోసు కునే చట్కారీ సంప్రదాయమని తెలుసుకుంటే... మరింక ఈ ఛాయలకి వస్తాడా? ఈ సమంధం మాట అలా వుంచు...ముందుముందు ఏ సమంధ మయినా ఎక్కేనా ఆలోచించు? నీకు...మనలో మన మాట...డబ్బా దస్కమా...పాలమావుట్రా...వేడలా మిద్దెలా...ఉన్నదల్లా పరువూ ప్రతిష్ట!...చచ్చి ఏ లోకాన వున్నాడోగాని సోమయ్య ఏనాడయినా ఇలాంటి నికృష్టానికి వొడిగట్టాడా?'

ఆ ధాటికి జానకమ్మ నిశ్చేష్టురాలయింది.

ఒక చెంపని తనకోసం మరిది ఎంతటి అఘా యిత్యానికి ఒడిగడుతున్నాడా అని మనస్సు వ్యాకుల పడుతుంటే, సందు దొరికిందిగదా అని ఈయనగారు వొంటికాలిమీద లేస్తున్నారు అతగాడిమీద.

ఈయన ధోరణి చూస్తే, ఆ మాణిక్యంగారి సమంధం—రెండో పెళ్ళి అయితే అయింది పీడా

బాయిరి అని తను ఒడంబడినా...అదీ పడనిచ్చేలా లేక్షియన. మాణిక్యంగారి సమంధమన్న మాటేమిటి? ఉత్తరోత్తరా...ఏ సమంధం వచ్చినా...పని గట్టుకుని...సందర్భం రానీ రాకపోనీ...కిష్టయ్య సంగతి...ఐస్సుప్లాండులో మాటలు సంగతీ...చెప్పి మరీ తిప్పగొట్టేలా వున్నాడీయన.

ఈ నరసింహంగారిని 'ఉపకారి' అని మన్నించేందుకులేదు...'అపకారి' అని దూరంగా ఉంచేందుకు లేదు.. ఆయన పెద్దరిక మట్లాంటిది.

కిష్టయ్యని సమర్థించనూలేక, నరసింహంగారి సమక్షంలో అతణ్ణి ఆడిపొయ్యనూలేక, మెదలకుండా ఊరుకుంది జానకమ్మ.

నరసింహంగారు కారాలూ మిరియాలూ నూరుతున్నాడు కిష్టుడిమీద.

'ఏడీ వాడు?' అంటున్నాడు—ఎక్కడున్నాడో తెలిసీ కూడా.

అసలు నరసింహంగా రెప్పుడు వస్తారా అని ఎదురుచూస్తోంది జానకమ్మ. వెతకబోయిన తీగ కాళ్లకి తగిలినట్టయింది.

చూడబోతే ఇంటా బయటా సంసారం నీళ్లగారి పోతుండెను.

'ఆ కొట్టు కాస్త నడిచే సాధనం చూపించన్నయ్యా' అని నోరు విడిచి అడగనే అడిగింది.

నరసింహంగారు ఆ దెబ్బతో సీరియసయిపోయారు.

'ఆ కొట్టుమీదనే మరొక నాలుగు వందలు నరుద్ద అన్నయ్యా. కొట్టు నడిచిందా బ్రతికిపోతాము. ఈ ఇల్లు నిలబెట్టి పుణ్యం దక్కించుకో అన్నాయ్' అని ప్రాధేయపడింది జానకమ్మ.

ఆకుకి అందకుండా పోకకి పొందకుండా చెప్పుకు పోతున్నారు నరసింహంగారు.

'అమ్మాయీ...నీ తప్పులేదు...లోకులను కుంటున్నట్టే నువ్వూ అనుకుంటున్నావు...ఏమనీ? నా దగ్గర డబ్బు మూలుగులోందనీ.. సరే...అదలా వుంచి...ఆ కొట్టుమీద ఈ సరికే తణఖామీద రెండువేలపైన రుణమున్నదాయెను......కిష్టయ్య వ్రాసిన ప్రోనోటు ఒకటుండెను. ఇప్పుడు మళ్లీ తెమ్మంటుంటివి...ఇవన్నీ ఎప్పుడు తీరేను? ఎలా తీరేను? ఏమయినా ఆలోచించావా అమ్మాయి?' అని ఇబ్బందిగా మొహం పెట్టాడు నరసింహంగారు.

ఏదో సహాయం అందించేలానే వున్నాడీయన, అని పేరాశ గుడగుడలాడింది జానకమ్మకి.

తనా ఆడది! ఆయనా తక్కా మొక్కాలులిన్న వ్యవహర్త! ఎంతకీ అంతర్య మివ్వడు. అసలు తనో లెఖ్ఖాపత్రమా? కిష్టయ్యకే అంతుబట్టడీయన. అయితే అతగాడు ఏ గరిగమ్మ నాటంగానో మెలి తిప్పి కుండబద్దలు గొట్టించి లవుక్యాం మడతంతో నించీ అసలు రంగు బైటపెట్టించగలడు.

ఇక నరసింహంగారు...పోతో పోతో సోమయ్య చేసిన రుణాల్ని గురించీ, కొట్టుమీద తణఖాబాకీ పేర్చిపెడుతున్న వడ్డీని గురించీ, ఇతరత్రా చిల్లర మల్లరగా పేరుకుపోతున్న చేబదుళ్లని గురించీ, కావాలిసిన పెద్దమ్మాయి పెళ్లిని గురించీ, ఆ తరవాత ఎంతకీ తెమలని సంసార లంపటాలని గురించీ ఆమెకి తెలిసిన వివరాల్నే అతిగా వర్ణించి చెబుతో... ఉన్నపరిస్థితిని అన్నివేపులనించీ భయంకరంగా చిత్రించి చూపుతో...నాలుగువేపులా ఇల్లంటుకొన్నది చూశావా అని వార్నింగులు నొదులుతో...ఇలా కమ్ముకొస్తున్న ఆపత్తునించీ బైటపడాలంటే తను కాస్తా కూస్తా బదుళ్ల రూపేణా విదుపుతోపోతే చక్కబడే వ్యవహారంకాదనీ...చదువుకు పోతున్నాడు.

'దానికన్న—' చప్పున ఆగాడు.

'మరేమి చెయ్యమంటానన్నాయి? ఎటుగూడి ఆదిగో ఆ చిన్నకొట్టూ. స్తలమూ ఉన్నాయి. దాని మీదనేదా ఇన్నాళ్లూ ఇంత కామాటమూ ఈడ్చుకొచ్చిందీ ... ఒక్క యేడు కళ్లుమూసుకుంటేమా రుణమూ తీరవచ్చును'...

'అదే నీకు పట్టుకున్న పిచ్చి.' ఎగిరిపడ్డాడు నరసింహంగారు.

'కొట్టూ—కొట్టూ-కొట్టూ! దాన్ని కాగలించుకుని కూచుంటే తేలే వ్యవహారమేనా ఇది! అవ్వా

కావాలి బువ్వా కావాలంటే ఎలా? పోసే చమురు తక్కువాను, వేసే వత్తి పెద్దదీను—దాన్ని ఎగసన దోస్తూ కూచుంటే ఏమయినట్టు? ఆకాశమంటే ఆకలీ, సూదిబెజ్జమంత నోరూను వీరాకు! తోచదు! చెబితే అర్థంకాదు - ఆ కొట్టు అమ్మరాదా అంటాను—రుణాలుపోను రెండు మూడు వేలు చేతికొస్తాయిగదా—ఎక్కడేనా ఒక చిన్నగది అద్దెకు తీసుకుని కిరాణా దుకాణం నడుపుకోవచ్చునుకదా—మరి అమ్మాయి పెళ్ళకున్నదా? కట్నం లేకుండా కిఫాయితీగా అమిరిందే అనుకుందాము. వచ్చిన వాళ్ళకి అరుగుల మీద చింకి చాపలన్నా వెయ్యాల్నా? శాస్త్రానికి అల్లుడికి అంగవస్త్రమయినా చదివించాల్నా? ఇవన్నీ ఎక్కణ్ణించి పుట్టించగలవు? చెప్పు—దారీ డొంకా లేని ఆలోచనలు చేస్తుంటే ఎలా గట్టెక్కేనూ వ్యవహారం?' అని విసుక్కున్నాడు నరసింహంగారు చివరికి.

జానకమ్మ గుండె గుభిల్లుమంది.

ఆ కొట్టూ స్థలమూ మింగుదామనుకుంటున్నా డీయన...దానిమీద ఉండుకున్న తణఖా బాకీ తన పేర ఎందుకు బదలాయించుకున్నాడో ఇప్పుడు బాగానే అర్థమయిందామెకి...ఒక రవ్వ కాల్చమంటే వొళ్ళంతా వాతలుపెట్టేలా వున్నాడు దుర్మార్గుడు.

తన కున్నది చాలదు గావును—మళ్ళీ కట్టుకు పోయినంతవుంది—మూడు తరాలకి సరిపడా...ఎక్కి దొక్కినా...అదంతా ఇతగాడి ఏనుగు దాహానికి చూరు నీళ్ళు!

డబ్బుదాహం తామరలాంటిది; గోకినకొద్దీ దురద పెడుతుంది.

జానకమ్మ కాస్సేపు నసిగింది.

'ఆ కాస్త ఆధారమూ వొదులుకుని ఏ గంగలో కలవనూ?' అంది. 'అదేకదా ఇన్నాళ్ళా శ్రీరామరక్షగా వున్నదీ' అని వాపోయింది.

కాని రాతి ప్రతిమకి చక్కలిగింతలా? నెమిలి కంట నీరుపెడితే వేటగాడికి జాలా?

నరసింహంగారు విసుగ్గా మొహం పెట్టారు.

'నీ కష్టమమ్మాయీ—పెద్దవాణ్ణి కాబట్టి ఉండబట్టలేక నీ క్షేమం కోరి చెప్పినమాట!... నువ్వు నీ ఇష్టం అమ్మకుంటే నాకేమి పోయేను?... కిష్టయితో ఆలోచించు...వాడి ఆలోచనే నీకు నచ్చుతుందిలే.. నీ యంతట నువ్వు ఒక నిర్ణయానికి రాలేవని నాకూ తెలుసు.'

వానుస్తూ ఎద్దేవాగా చీడీలు దిగాడు నరసింహంగారు.

వేల విడిచి సాము చెయ్యమంటాడేమిటీ ఈయన? ఆమట్న కాళ్ళ విరిగితే చోద్యం చూడామనా? పొదుగు కోసుకొని పాలు త్రాగనా!

తణఖా బాకీకని దావా వేస్తాడా కొంపతీసి?

వేస్తే అతగాడి సంకల్పం సిద్ధిస్తుందికూడాను. నింపాదిగా, లబ్జుగా చెబుతున్నాడుగదా, హితోక్తులు పలుకుతున్నాడుగదాఅని దౌర్జన్యంగా రాజెట్టుకోడని లేదు.

జానకమ్మ బుర్ర తీవ్రంగా పనిచేస్తోంది.

కోర్టు వ్యవహారాలలో నరసింహంగారు సవ్యసాచి.

కోర్టెక్కాడా, కొమ్ములు తిరిగిన ఆసామీని సయితం పాదాక్రాంతం చేసుకోగలడు. అలాటి ఆయనకి పెద్దపేరు కూడాను.

ఆ పేరు తెచ్చుకుందుకని ఎంతమందిని ఎన్ని చిత్రహింసలు పెట్టాడని!

అంచాతనే ఆయనకి రావలసిన బాకీలు ముప్పాతిక మువ్వీసం అంతవరకూ పోకుండనే, ఫైసలయిపోతాయి అణాపైసల దేఖీలా.

లేకపోతే ఎటువంటి ఆసామీని ముప్పాతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించి, చిన్నప్పుడు పట్టించిన దొండాకుపసరు గూడా కక్కించి, జన్మజన్మకీ కోర్టు వాసనంటే హడలిచచ్చేలా బెదురుపెట్టేస్తాడు.

అసలాయనకి పారుబద్దులంటూ ఉండడానికి వీలులేదు. యాభయ్యా, అరవయ్యా చిల్లరబాకీల సమేతూ కరెక్టుగా వసూలైపోవాలిసిందే.

ఏ పద్దయినా సజావుగా వసూలయిందా సరే సరి...లేదా శాస్త్రప్రకారం దావా పడిందన్నమాటే.

ఆ కార్యక్రమానికని...కేటాయింపుగా...ఇద్దరు

ముగ్గురు గుమాస్తాలున్నా రాయనకి......వాళ్ల ఓ పట్టాన వ్యవహార మొక కొలిక్కిరానీరు. అబ్జెక్షన్లతో, స్టే ఆర్డర్లతో, ఇంజక్షన్లతో, అప్పీళ్లతో రాబందులల్లే కొరుక్కుతినేస్తారు. వాళ్లకి చేతినిండా పని ఎప్పటికప్పుడు సమకూడాలి...లేకపోతే వాళ్ల ఉద్యోగాలకే ముప్పు.

మళ్లీ అరువిచ్చేటప్పుడూ, బదులిచ్చేటప్పుడూ ఎంత ఇష్టంగా, ఎంత అభిమానంగా ఇస్తాడనీ! ఏదో ఉద్ధరిస్తున్నట్టూ, ఆపత్తు గడుపుతున్నట్టూ మొహం పెట్టి ఎంత పరోపకారపారీణత వొలకబోస్తాడని!

ఇనపకొట్టుమీదా, బట్టలకొట్టుమీదా వాడకం బాపతు నెల నెలా పదిహేను రోజులకి పైబడి నిలిచిపోయిందా - మాటికి రూపాయి పావలా చొప్పున అలా అలా గుడ్లు పెట్టుకొంటూ పోవాలిసిందే!

ఆసామీకి నోటీసు అందిందా, ఇహనా తరవాత చెప్పేదేముంది – తట్టా బుట్టా, చెంబూ తప్పేలా బైట పారేయించేదాకా......నీళ్లు పల్లానికి జలజలా పారి...సమతల ప్రదేశంలో చల్లగా నిలిచిపోయినట్టు ...బాకీ వసూలు పర్యంతమూ – హియరింగులూ, డిక్రీలూ, జప్తులూ వారంట్లతో సహా...వ్యవహార కాండ యావత్తూ యాంత్రికంగా జరిగిపోవలసిందే...

అప్పు పెట్టాడా...అక్కడ సర్వమంగళమయిందన్నమాటే.

మొట్టమొదట ... రుణమిచ్చేటప్పుడు నరసింహంగారు దేవుడు – దాన్ని పెంచి పక్వానికి తెచ్చేదశలో చుట్టం – ఆఖర్ని కోర్టెక్కించి ఆస్తులు గుంజతాడా – అప్పుడు దెయ్యం.

ఆయనమాత్రం ఎన్నడూ కటువుగా మాట్లాడడు. మాట్లాడాలిసిన అవసరమూ లేదు. బాకీలకని ఆసాముల్ని యాగీచెయ్యనూ...గోలపెట్టనూ... మొహం చెండుకోనూ ... ఇవన్నీ చాతగాని దేవయ్యల కోతి చేష్టలు. చాతనైన పెద్దమనిషి ఎంతో నమ్రతగా, ఎంతో నాగరికంగా వ్యవహారం నడుపుతాడు.

కోసేవి గొంతుకలయినా...అవి మెత్తని ఉల్లిపార నైలాన్ గుడ్డలతో...

ఆమె ఆలోచనాస్రవంతి ఇలా ధారావాహికంగా నడిచింది.

* * *

'నాయనా కిష్టయ్యా, ఏం పనిదీ?'

రాత్రి పదకొండుకి ఆఖరి బస్సు చూచుకుని ఇంట్లో అడుగుపెట్టిన కిష్టయ్యని చూచి, రాగనే నిగ్గదీసింది జానకమ్మ.

పనిగట్టుకుని మేలుకూచుంది ఆవాళ.

'ఏం ? సంపాయిస్తున్నాను......ఎవరికొంపా తియ్యడం లేదుగా ?'

నరసింహంగారొచ్చి వెళ్లినట్టు కిష్టయ్య పసిగట్టాడు.

క్రితంరోజు బస్సు స్టాండులో...గుంటూరు బస్సు దిగుతుండగా...నరసింహంగారు అని తెలియక ఎగబడి...ఆయన సూట్‌కేస్ లాక్కోబోయి...ఫలానా అని చటుక్కున గుర్తించి...నాలిక కొరుక్కున్నాడు కిష్టయ్య. అప్పుడే అనుకున్నాడు, ఇంటికొచ్చి లెక్చరు దంచుతాడని.

కిష్టుడయినా ఆ పని రహస్యంగా ఏమీ చెయ్యడం లేదు. తెలిస్తే తెలియనీ అని తెగించే మాటలు మోస్తున్నాడు. తెలియకుండా ఎన్నాళ్లని దాగుతుంది?

ముందు పొట్ట గడవాలిగదా.

'ఇంక మనకి ప్రతిష్ట ఏముంటుంది చెప్పు' అంటున్నది జానకమ్మ.

పద్దుల పుస్తకం ముందేసుకుని లిస్టు రాసుకొంటూ వినిపించుకోనట్టు నటిస్తున్నాడు కిష్టయ్య.

'పద్దులు తరవాత చూచుకుందువుగాని – స్నానానికిలే–అయ్యయ్యో, వొళ్లంతా ఎలా మన్ను గొట్టుకు పోయావోనూ' అనివచ్చి, బలవంతాన పుస్తకం మూసిపెట్టింది జానకమ్మ.

పిల్లలంతా నిద్రపోతున్నారు.

తుండు బుజాన వేసుకుని–

'నాకేమయింది వదినా? రంగడు కుచ్చులా వున్నాను. ప్రతిష్టంటావూ? అది నాకప్పుడుంది

గనకనా నాకు? ఇవ్వడు పోతుందని బెంగ? మొండి వాడికి చెప్పేమిటి? వచ్చి పూడాడూ? దుర్మార్గుడు! పిల్లలు సుభిక్షంగా ఉండటమిష్టంలేదు వాడికి' అని తిట్టుకొంటూనే లైఫ్‌బాయ్‌సబ్బు పట్టించాడువంటికి.

స్నానంచేసి, లుంగీవేసుకుని, పీటమీదవున్న విభూతి పండు కింద పెట్టాడు.

విభూతి పండంటే అతనికి రోత.

విభూతి రేకలు పెట్టుకున్న పెద్దలు చేస్తున్న అకటా వికటపు పన్లుచూచి, వాళ్లనేమీ చెయ్యలేక, అతనికా వేడి యావత్తూ విభూతి పండుమీదకి తిరిగింది.

పక్కనే కూచుని వడ్డిస్తూ జానకమ్మ నరసింహంగారి దాష్టీకమంతా వివరించి చెప్పింది.

'అయినా...చూడు కిష్టయ్యా...రేపు అమ్మాయి పెళ్లికున్నదా?......'

కిష్టయ్య కర్థమయింది.

ఇష్టమయిన గోంగూరపళ్ల పచ్చడి కలుపుకుంటున్నవాడల్లా, చటుక్కన ఆగి, సీరియస్‌గా—

'...వదినా నేను అన్నయ్యనిగాని, నిన్నుగాని అప్రతిష్ట పాలు చెయ్యాలని ఈ పనికి దిగలేదు.

'ఇంటో గడవడం లేదే అన్న తపనకొద్దీ నాకు చాతనయిన పని నేను చేస్తున్నాను. నువ్వు విస్తళ్లు కుట్టడం లేదూ— ఆ మాటకొస్తే?

'నాకూ కాలుమీద కాలువేసుకుని, ఏ చిన్న దుకాణమయినా పెట్టుకుని బుద్ధిమంతుడల్లే అర్జించుకోవాలనే వుంది. కాని పెట్టుబడేదీ? ఆ నరసింహం విదపడాయెను. విదిపితే మన కొట్టే తెరిచే వాణ్ణికదా.

'నేను చేస్తున్నదీ వ్యాపారమే—నీకు తెలీదుగాని వొదినా — రెక్కలమ్ముకుంటున్నా — పెట్టుబడిలేని వ్యాపారం.

'ఎవరేనా యాగీచేస్తే, నీ ముందు నన్నుగురించి తేలిగ్గా మాట్లాడితే...నన్నేమీ సమర్థించకు... నా మరిదికి ఉచ్చమూ నీచమూ లేదను...అతగాడికీ మాకూ సంబంధం లేదను... అవసరమయితే, వాళ్ల తిట్టే తిట్లకీ, పెట్టే శాపనార్థాలకీ నువ్వూ నాలుగు కలిపి నాలుగు దులుపు తెలిసిందా?—తిడితే చచ్చీ, దీవిస్తే బతికిన వాణ్ణింతవరకూ చూడ లేదు నేను—మెల్లిగా ఆ కొట్టు తెరిపించి—విస్సణ్ణి కూచోపెట్టి...నా దారిన నేను పోతా...కావాలంటే.'

జానకమ్మ దిగాలుపడిపోయింది.

'కోపం తెచ్చుకోకు నాయనా...నిన్ను ఈ నీచానికి వొదిలి నేనూ నా పిల్లలూ పట్టంగట్టుకోమా? నువ్వుమాత్రం నా బిడ్డలాంటి వాడవుకావూ? వాళ్లూ వీళ్లూ నిన్ను ఆడిపోసుకుంటుంటే నేను ప్రీతిగా వినినా?'

బెంచీమీద బొంతపరుచుకున్నాడు కిష్టుడు. జానకమ్మ పిల్లల తలగడలకి గలేబులు మారుస్తున్నది.

(సశేషం)

ఋణం కృత్వా ఘృతం పిబేత్

శ్రీ వి. సి. బాలకృష్ణ శర్మ

అప్పుచేసి పప్పూ, కూడూ—అని ఎగతాళి చెయ్యడం అందరికీ అలవాటే. ఈ అపహాస్యానికీ గురియైన సూత్రాన్ని మొదట ప్రవేశపెట్టినవారు బహుశా చార్వాకులవారై ఉంటారు. చార్వాకమతాన్ని సంగ్రహంగా సూచించే సూత్రం సుపరిచితమైన ఒక శ్లోకంలో కనబడుతుంది.

'యావజ్జీవేత్ సుఖం జీవేత్
ఋణం కృత్వా ఘృతం పిబేత్
భస్మీ భూతస్య దేహస్య
పునరాగమనం కుతః?

బ్రతికినన్నాళ్లూ సుఖంగా బతకాలి. అప్పు చేసినాసరే హాయిగా నెయ్యి పోసుకుని తినాలి. ఈ శరీరాన్ని తగులబెట్టాక అది మళ్లీ తిరిగివస్తుందా? అని చార్వాకమతం మనిషినిసుఖజీవితంవైపుకి ఉసిగొలుపుతుంది. అప్పు చెయ్యడమనేది అనాదినుంచీ వస్తూన్న ఆచారం. మొట్టమొదటి అప్పు ఎవడు చేశాడో చెప్పడం కష్టంగాని చిన్నపిల్లలకి రెండో క్లాసులోనే ఉపాధ్యాయుడు అప్పుచెయ్యవలసిన అవసరాన్ని గురించి నిర్ధారణగా చెప్పడం కద్దు. 42 ఒక సంఖ్య దాన్నుంచి 28 ని తీసెయ్యాలి. ఒకట్ల స్థానంలో ఉన్న 2 లో 8 పోదు. ఏం చెయ్యాలి? ప్రక్కనున్న 4 నుంచి ఒకటి 'అప్పు' తెచ్చుకోవాలి. ఈ అప్పు మళ్లీ తీర్చేదికాదు. ఇట్లా మొదలవుతుంది అప్పు తెచ్చుకునే ఆశయం మెత్తని పిల్ల తలకాయలో. 'అప్పిచ్చువాడు వైద్యుడు...అని ఉండనే ఉంది.

అప్పు తెచ్చుకోవడంలో ఒక్కోవ్యక్తి అపురూపమైన నైపుణ్యాన్ని సంపాదిస్తాడు. ఆనందాన్ని కూడా పొందుతాడు. వ్యక్తులుచేసే అప్పులకు వాళ్ల వారసులు బాధ్యులు. కాని ప్రభుత్వంచేసే అప్పులకు ప్రజలంతా బాధ్యులు. ఈ నాడు ప్రజలే ప్రభుత్వంగా ప్రజాస్వామ్యాలు ఏర్పాటు కావడంవల్ల ప్రభుత్వ ఋణాలు ప్రజాఋణాలే. ఎవడికి వాడు వ్యక్తిగతంగా అప్పులేనివాడు కావచ్చుగాని ఈ నాటి ప్రభుత్వ వ్యవస్థలో వాడు అప్పుల్లో మునిగి తేలుతూ ఉంటాడు. ప్రజాస్వామ్యంలో ఉన్న మంచి చెడ్డల్లో ఈ ఋణసంపత్తి కూడా ఒక భాగమే. ప్రభుత్వం ఋణం చెయ్యడమనేది భారతదేశంలో రూపొందిన విధానంకాదనే చెప్పాలి. ప్రాత కథల్లో ఉన్న ప్రఖ్యాత చక్రవర్తులంతా దానధర్మాల్లో వళ్లు తెలియకుండా ప్రవర్తించి, ఆఖరికి దగాపడిన స్వర్ణపుల్లై, అంగవస్త్రం చుట్టుకుని మట్టిపాత్రల స్థితికి దిగిపోయినవారు పన్నులక్రింద వచ్చినది చాలక, ఇంకా ధనం కావలసివస్తే దండయాత్రలుచేసి సంపాదించుకునేవారు. దానాలు చెయ్యాలన్నా, వేదవిహితమైన యజ్ఞయాగాదులు నిర్వర్తించాలన్నా, మరే సత్కార్యంకోసమైనా, అధిక ధనం సేకరించాలంటే, కత్తిమీద ఆధారపడేవారు.

ప్రజల దగ్గర ప్రభువు ఋణం తీసుకునే పద్ధతికి మఱపురాని మూర్తిత్వం కల్పించినవాడు ఆంగ్లరాజు-మేరీ భర్త-విలియమ్. 1694 లో ఆయన ఫ్రెంచి ప్రభువు 14 వ లూయీతో యుద్ధంలో చిక్కుకుని డబ్బుకోసం చాలా కటకట పడవలసి వచ్చింది. ఆయన ఆస్థానంలో విలియం పాటర్సన్ అనే బుద్ధిమంతుడు పార్లమెంటుకు ఒక ఆలోచన సూచించాడు. ప్రజల దగ్గరనుంచి ఋణం సేకరించడం, దానికి ప్రతిఫలంగా ఆ ఋణదాతలకు కొన్ని సదుపాయాలు కల్పించడం ఆయన పథకంలో ముఖ్యాంశాలు. ఆ సదుపాయాలు బ్యాంక్ ఆఫ్

ఇంగ్లాండు రూపంలో స్థిరపడ్డాయి. అది మొదలు బ్రిటిషు రాజా ప్రతియుద్ధానికి, అప్పుచెయ్యడం, తరువాతి యుద్ధం వచ్చేలోగా అది తీర్చలేక పోవడం సరికదా క్రొత్తది చెయ్యడం, పరిపాటైంది. నెపోలియనుతో యుద్ధం, క్రిమియన్ యుద్ధం, బోయర్ యుద్ధం, ఇట్లా ఏదో ఒకటి వస్తూనే ఉంది. స్వదేశ ఋణాలు క్రమంగా విదేశ ఋణాలకు దారి తీశాయి. అప్పులు చేసిన వారు ఒక్క ఆంగ్లేయులే అవికాదు; ప్రభుత్వ ఋణాలు ఈ విధంగానే రూపొందినట్లు కనబడుతుంది. దండయాత్ర చెయ్యడానికో, యుద్ధం నుంచి తప్పించుకునే ఖర్చుకో అప్పులు చెయ్యడం అవసరమయ్యేది.

ఇట్లా యుద్ధాలకోసం అప్పులుచేసి రాజులు వందల కొద్దీ సంవత్సరాలు ఎగవేస్తారు. రాజు తరువాత రాజు తీర్చాలి. చివరకి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఒక ప్రభుత్వం తరువాత మరో ప్రభుత్వం వస్తుంది. అసలు యుద్ధానికి కారకులైన వాళ్లంతా చనిపోతారు. మిగిలిన ప్రజలు తమ తాతలూ ముత్తాతలూ చేసిన అప్పులు తీర్చాలి. వీళ్లయితే అల్లాంటి యుద్ధాలు చేసి ఉండేవారు కారేమో! ఇప్పుడు బహుశా ఆ ప్రాత శత్రువులు మిత్రులుకూడా అయి ఉంటారు. ఐనా వాళ్లతో గతంలో జరిగిన యుద్ధంకోసం చేసిన అప్పులు ఇప్పుడు మిగిలి, తీర్చవలసిన బాధ్యత నెత్తి మీద పడడం చాలా వింతగా ఉంటుంది. ఈ అప్పుల వల్ల ఆర్థిక ప్రయోజనం ఉండదు. కాని ఆ చేసిన యుద్ధం దేశరక్షణకోసమే అయితే, అది జాతి మనుగడకే ప్రాణప్రదమని గుర్తించక తప్పదు. అల్లాంటి యుద్ధాన్నిగాని, దానిక్కావలసి చేసిన అప్పునుగాని మనం విమర్శించడానికి వీల్లేదు. ఉదాహరణకి భారత దేశానికి చైనా, పాకిస్తాన్‌లతో వచ్చిన యుద్ధం అట్లాంటిది.

ఋణ గ్రహణం యుద్ధహేతుకంగా ప్రారంభమైనా ఈ నాటి ప్రభుత్వ ఋణాలు కేవలం యుద్ధ ఋణాలు మాత్రమే కావు. అనేక ఆర్థికాభివృద్ధి పథకాల మూలంగా ఈ అప్పులు పెరిగిపోయి ఉన్నాయి. ఈ దృష్టితో చూస్తే అప్పులు రెండు విధాలు – యుద్ధ ఋణాలు, అభివృద్ధి ఋణాలు. ఇంకో విధంగా చూస్తే ఋణాలు ఆంతరంగిక ఋణాలు, విదేశ ఋణాలు అని రెండు రకాలు. మరో దృష్ట్యా, నిరర్థక ఋణాలు, సార్థక ఋణాలు— అని రెండు భాగాలు చెయ్యవచ్చు. నిరర్థకమైన ఋణాలంటే ఆర్థికంగా ఏ లాభమూ లేనివి. వీటిని 'చావు బరువు బాకీలు' అని చెప్పుకోవచ్చు. అసలు చావు బాకీ అనే మాటను ఋణదాత దృష్ట్యా ఉపయోగిస్తారు. ఆ అప్పులు మళ్ళీ తిరిగి రాని అప్పులన్నమాట. ఆ విధంగానే అప్పు పుచ్చుకున్న వారికి చావు బరువుతో భుజాన్నపడి ఏ ఆర్థిక ప్రయోజనాన్నీ కలిగించలేని బాకీలను చావు బరువు బాకీలు (Dead Weight Debts) అని వర్ణించడం సమర్థనీయం. ఇలాంటి అప్పులు సామాన్యంగా యుద్ధ ఋణాలు. ముఖ్యంగా దండయాత్రలకోసం చేసినవి. ఎట్లాంటి యుద్ధానికని అప్పు చేసినా అది నిరర్థక ఋణమే అనడం పరిపాటి. ఉత్పత్తిని వృద్ధిచెయ్యడానికి ఉపయోగించే ఋణాలు ఔత్పత్తిక ఋణాలు. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి భాషలో సారక ఋణాలు (Productive). ఇట్లాంటి అప్పులు ఎన్ని చేసినా ఇబ్బందిలేదని ఒక నమ్మకం. ఆ ఋణ ద్రవ్యం పెట్టుబడితో ఏదో ఒక ఆర్థిక స్తోమత కలిగింపబడుతుంది. కొన్ని మూలార్థాలు (Economic resources) ఉపయుక్తికి రావడం సంభవిస్తుంది. ప్రతియేటా తీర్చవలసిన వడ్డీకీ, చివరకు తీర్చవలసిన అసలుకూ సరిపడే ధనాన్ని ఆ పథకాలవల్ల సమకూర్చుకోవచ్చు. ఉదాహరణకు రైల్వేల నిర్మాణం, విద్యుదుత్పాదక పథకాలు వగైరాలెన్నో చెప్పవచ్చు. ఇంకా ఈ అప్పుల్లో తరహాలను విచారించి చూడాలంటే స్వల్పకాల ఋణాలు, దీర్ఘకాల ఋణాలు అని రెండు. స్వేచ్ఛా ఋణాలు, బలాత్కార ఋణాలు అని మరో రెండు. ఏ ఉద్దేశంతో అప్పులు తీసుకున్నారో, ఏ పరిస్థితుల్లో అప్పులు వసూలు చేశారో, వాటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఋణాలను తరహాల క్రింద విభజించవచ్చును.

అప్పు లెన్ని రకాలైనా ఉంటాయి. కాని అసలు ప్రభుత్వం అప్పు లెందుకు చెయ్యాలి? ప్రజల మీద మొయ్యలేనంత పన్నుల భారంవేసి పీడిస్తూ, వేరే అప్పులుకూడాచేసి ఆ భారంకూడ ప్రజలమీదకు నెట్టడం ఏమైనా సమంజసంగా ఉందా? పన్నులవల్ల

వచ్చే ధనంతో సరిపెట్టుకోకూడదా? రాబడినిమించి ఖర్చులు పెంచుకోవడం, దానికోసం అప్పులుచెయ్యడం, ఆ భారం వడ్డీతోసహా ప్రజల నెత్తిన రుద్దడం అన్యాయం కాదా! అని కొన్ని ప్రశ్నలున్నాయి. బాధ్యతగల వ్యక్తి ఎవడైనా తన ప్రభుత్వాన్ని గురించి ఇట్లాంటి ప్రశ్నలు అడగవచ్చు జాగ్రత్తగా గమనిస్తే, కొన్నితరుణాల్లో ఋణంచేసి ప్రభుత్వ వ్యయం చెయ్యడమే కర్తవ్యంగా కనబడుతుంది. అందులో దేశరక్షణకోసంచేసే యుద్ధం, దానికయ్యే ఖర్చు ఒకటి. 'శరీరమాద్యంఖలు ధర్మసాధనం' అన్నట్టు 'స్వాతంత్ర్య మాద్యంఖల్వర్థసాధనం' అని చెప్పవచ్చును. ఐతే యుద్ధానికిమాత్రం పన్నులువేసిన ధనాన్ని ఉపయోగించకూడదా? అంటే—ఇదివరకు వేసిన పన్నులు ఇదివరకు అంగీకరించిన ఖర్చులకు సరిపోతాయి. క్రొత్త పన్నులు వెయ్యడానికి పార్లమెంటు ఆమోదం కావాలి. కాలవ్యయం యుద్ధానికి ప్రతికూలం. శత్రువు తుపాకీ గురిపెట్టి పొలిమేర మీద కూర్చుంటే, తీరిగ్గా పార్లమెంటులో చర్చలు సాగించడం అవివేకం. ఇంతకీ కావలసినంత ద్రవ్యం పన్నులద్వారా ఎట్లాగూ రాదు. భారీఖర్చులుపెట్టి దేశాన్ని రక్షిస్తే రాబోయేతరంవారినికూడా రక్షించినట్లేగదా! అంచాత వాళ్లుకూడా ఈ భారంలో పాలు పంచుకోవాలిగదా! అప్పులుచేసి వాటిని తీర్చే బాధ్యత భవిష్యత్తరంవారికి అప్పగించడం, ఈ తరంలో ఉన్నవారి ప్రాణాలొడ్డి శత్రువుని అరికట్టడం చాలా న్యాయంగా ఉంటుంది. అంచాత దేశరక్షణ యుద్ధఋణాలు క్షంతవ్యం. అవి నిరర్థక ఋణాలే కావచ్చు. వాటివల్ల సాక్షాత్తూ కలిగే ఆర్థిక ప్రయోజనం శూన్యమే. ఐనా పరోక్షంగా ఆర్థిక ప్రగతిని సుసాధ్యంచేసే ప్రయోజనం కనబడుతుంది.

సార్థక (Productive) ఋణాలు వేరే ఉన్నాయి. రహదారులు నిర్మించాలి. రైల్వేలు వెయ్యాలి. నీటివసరులు కావాలి. విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చెయ్యాలి. ఇంకా బహుకాలప్రయోజనకరములైన పథకాలు చాలా కావాలి. ఇవి ఏనాటికానాడు చెయ్యవలసినవికావు. నిర్మాణానికే 10, 15 సంవత్సరాలు పడుతుంది. వాటి ప్రయోజనాలు పొంది తదాధారంగా ఉత్పత్తిని అధికం చెయ్యగలిగిన సమయానికి మరో తరంవారు వస్తారు. న్యాయంగా ఆ తరంవారు ఈ ఖర్చులన్నింటినీ భరించాలి. అంచాత ఈ తరంవారు ఋణంచేసి ఆ భారాన్ని పైతరం వారికి అప్పగించడం సమంజసం. తాము ఎలాగూ ఆలోచనచేసి, శ్రమపడి ఆ పథకాలను అమలుపరచాలి. అంచాత అప్పు మిగల్చడం న్యాయమే. ఇవికాక, ఇంకా ఏవైనా అనుకోని ప్రమాదాలు వచ్చినప్పుడుకూడా ఋణగ్రహణం తప్పనిసరికావచ్చు కాని ఈ తరంవారు తమకోసం, తాత్కాలికమైన ప్రయోజనాలకోసం, రోజువారీ ఖర్చులకోసం, అప్పుచేస్తే అది విషఫలితాలకు దారి తీస్తుంది.

ఇవికాక ఋణాలకి ఇంకో ముఖ్య ప్రయోజనం ఉంది. ద్రవ్యోల్బణం (Inflation) జరిగినప్పుడు ఋణసేకరణ చాలా అవసరం. ఆ సమయంలో ప్రజల దగ్గర కొనుగోలుశక్తి విపరీతంగా ఉంటుంది. దానివల్ల ధరలు పెరుగుతాయి. అంచాత ఏదో ఒక విధానం ప్రవేశపెట్టి ప్రజలలోఉన్న అధిక క్రయశక్తిని వారి చేతులలో లేకుండా చెయ్యాలి దీనికి ఋణసేకరణ ఒక మంచి పద్ధతి. అప్పులు చెయ్యడం ప్రభుత్వ ఆర్థిక విధానంలో ఒక ముఖ్య ఉపకరణం. వెర్నర్ అనే ఆర్థిక శాస్త్రవేత్త ఆరు ఉపకరణాలు వివరించాడు. కరగ్రహణ, వ్యయాలు; ఋణసేకరణ, ఋణదానాలు; క్రయ, విక్రయాలు—అవి. ఈ ఆరు కార్యక్రమాలూ నిర్వహించడంలోనే ఉంది ప్రభుత్వ ఆర్థిక విధాన ఉత్కృష్టత.

ఋణభారమనేది ఒక చిత్రమైన మాట. వ్యక్తి విషయంలో ఇది సుగమంగానే ఉంటుంది కాని ప్రభుత్వ విషయంలో అర్థం కావడం తేలిక కాదు. స్వదేశంలో సేకరించిన అప్పుల విషయంలో ఋణభారమేమిటి? దేశంలో ధనం దేశంలోనే ఉంటుంది. ప్రజల ధనం ప్రజాప్రభుత్వం ఖర్చు పెడుతుంది. ఇట్లా వాదించవచ్చు. ఇంతకీ ప్రభుత్వం తీసుకున్న అప్పులు సార్థక ఋణాలైతే (Productive) అవి అంతరంగిక ఋణాలైనా, విదేశ ఋణాలైనా ఫరవా లేదు. వాటినుండి విముక్తి పొందడం చాలా తేలిక. వాటితో రూపొందించిన పథకాలవల్ల రాబడి వస్తుంది. కనుక ఆ అప్పుల గురించి ఆలోచించే పనేలేదు. కాని నిరర్థకఋణాలు చచ్చే బరు

వుతో, పన్నులు చెల్లించవలసిన ప్రజలమీద పడతాయి. ఆ ఋణభారాన్ని పరామర్శించాలంటే అంతరంగిక, వైదేశిక ఋణాలను వేఱువేఱుగా దర్శించాలి.

ఋణభారంలో ద్రవ్యభారం (Money Burden) అని ఒకటి. యథార్థభారం (Real Burden) అని మరొకటి. రెండు రకాలు. మళ్ళీ ఈ రెండు విధాలనూ, రెండేసి రకాలుగా చెయ్యవచ్చు. ఒకటి ప్రత్యక్షభారం (Direct Burden), మరొకటి పరోక్షభారం (Indirect Burden). అన్నింటినీ ఒక జాబితాక్రిందవేస్తే ఋణభారం నాలుగు రకాలు.

1. ప్రత్యక్ష ద్రవ్యభారం.
2. ప్రత్యక్ష యథార్థభారం.
3. పరోక్ష ద్రవ్యభారం.
4 పరోక్ష యథార్థభారం.

ప్రజలకు ఈ నాలుగు రకాలూ అంతరంగిక ఋణాలపట్ల ఒక విధంగా ఉంటాయి. విదేశఋణాల విషయంలో మరో విధంగా ఉంటాయి. ప్రత్యక్ష ద్రవ్యభారమంటే అసలు వడ్డీల మొత్తం. ఇది ద్రవ్యరూపంలో చెల్లించవలసిన సొమ్ము. విదేశాలైతే మనం చెల్లించే ద్రవ్యాన్ని అదే రూపంలో తీసుకుని వెళ్లరు. ఇక్కడే ఆ సొమ్ముతో వస్తువులను కొనుక్కుంటారు. వాటిని తీసుకుపోతారు. మనం అప్పు తీర్చనక్కరలేకపోతే, ఆ వస్తువులు మన దేశంలోనే ఉండును గదా! అందువల్ల దేశంలో ఆర్థిక సంక్షేమం (Economic Welfare) ఇతోధికంగా ఉండేదిగదా! ఇప్పుడది లోపించిందిగదా! అదే ప్రత్యక్ష యాధార్థ్య భారం. దానివల్ల జాతీయాదాయంలో (National Income) కొంతభాగం పరహస్తాల్లో పడిపోతుంది.

ఇంకా వివరంగా చెప్పాలంటే అప్పులు తీర్చడానికి దేశంలో ప్రభుత్వం పన్నులు కొంచెం ఎక్కువగా వసూలు చెయ్యాలి. ఎంత మొత్తం తీర్చాలో అంత పన్నుల రూపేణా ప్రజలమీదపడే భారం. అది ప్రత్యక్ష ద్రవ్యభారం. ఈ పన్నులు ఎవరిమీద పడితే, వాళ్ళు ఆ భారాన్ని భరిస్తారన్నమాట. రాబడి పన్ను వగైరాలయితే ధనికులమీద పడతాయి. అమ్మకం పన్ను, పారిశ్రామిక సుంకాలు వంటివైతే అందరిమీదాపడి బీదవాళ్ళమీద ఎక్కువగా దెబ్బ తీస్తాయి. ఆదనంగా వసూలుచేసిన పన్నులద్వారా ఈ అప్పుల భారం అందరికీ పంచబడుతుంది. ఈ మొత్తాన్ని ఋణదాతలు ఖర్చుచేసి దేశంలో ఉన్న సామగ్రిని కొని తీసుకుపోతే, మిగిలిన సామగ్రి దేశప్రజలకు చాలక, ధరలు పెరిగి, ఎటు తిరిగినా మధ్య తరగతి వారికీ, బీదవారికీ బరువు బాగా తెలుస్తుంది. అది ప్రత్యక్ష యథార్థభారం.

పరోక్ష భారం దేశంలో ఉత్పత్తిమీద వచ్చే ఫలితాలనుబట్టి ఉంటుంది. అప్పులు చెల్లించడం కోసం పన్నులు వెయ్యాలి—పన్ను చెల్లించడంవల్ల ప్రతి వ్యక్తికి ఏదో ఒక శక్తి కొంతయినా లోపిస్తుంది. ధనవంతుడికి తక్కువగా, బీదవాడికి ఎక్కువగా, తన సామర్థ్యంలో కొంత లోటు కావడం అనుభవంలోకి వస్తుంది. కొందరికి ఆదాయం తగ్గిపోవడంవల్ల నిలవచేసే శక్తి తగ్గుతుంది. మరికొందరికి అసలు పని చెయ్యడానికి సామర్థ్యం ఉత్సాహం తగ్గుతాయి. ఎక్కువ పనిచేసి సంపాదించి ఎక్కువపన్ను కట్టడంకంటె, ఆ ఎక్కువ పని జోలికి వెళ్ళకుండా ఉండడమే మేలనిపిస్తుంది. ఈ ప్రభావాలవల్ల దేశం మొత్తంమీద ఉత్పత్తిపై కొంత ఫలితం ఉంటుంది. వేయబడిన పన్నులనబట్టి ఈ ఫలితం రూపొందుతుంది. ఇది పరోక్షభారం. ఇది యథార్థంగా కూడా అనుభవంలోకి వచ్చేదే. అప్పులు తీర్చడంకోసం ప్రభుత్వం దేశంలో చేసే ఖర్చులు కూడా కొంత తగ్గించవలసివస్తుంది. అందువల్ల చుట్టూ తిరిగి బీదవాళ్ళకి ఉపయోగపడే ఆర్థిక సంక్షేమ కార్యక్రమాలు మొట్టమొదట దెబ్బతింటాయి. ఇది పరోక్ష యథార్థభారం. అప్పులే లేకపోతే ఆదనపు పన్నులూ ఉండవు. అందుచేత పరోక్ష ద్రవ్యభారమూ ఉండదు. ఆర్థికంగా ఉత్పత్తిమీద చెడుప్రభావమూ ఉండదు. ప్రభుత్వ వ్యయ లోపంవల్ల సంక్షేమ లోపమూ ఉండదు. పరోక్ష యథార్థభారంకూడా ఉండదు. ఇది విదేశ ఋణాలవల్ల కలిగే భారం.

ఇక అంతరంగిక ఋణాలు. ఇవి స్వదేశంలో వసూలుచేసిన అప్పులు. వీటివల్ల ప్రత్యక్ష ద్రవ్యభారం ఉండనేఉండదని చెప్పవచ్చు. ఈ ఋణాలు ఇచ్చినవారూ ప్రజలే పుచ్చుకున్నవారూ ప్రజలే. ద్రవ్యం

ఏ రూపాన్నయినా దేశాన్ని విడిచి వెళ్ళదు. సొమ్మగి పోదు. అప్పులు సేకరించినప్పుడు ప్రభుత్వం కొందరి దగ్గఱనుండి కొనుగోలుశక్తిని తీసుకుంటుంది. ఆ శక్తిని దేశంలో వినియోగిస్తుంది. అట్లా చేసిన ఖర్చులవల్ల కొందరు ప్రజలే తిరిగి ఆ కొనుగోలు శక్తిని పొందుతారు. ఈ అప్పులు తీర్చడానికి క్రొత్త పన్నులు వేస్తారనుకుందాం. ఆ పన్నులు ప్రజలే చెల్లిస్తారు. మరికొందరి క్రయశక్తి మళ్ళీ ప్రభుత్వ వశమౌతుంది. ఆ ద్రవ్యంతో అప్పులు తీర్చడం జరుగుతుంది. ఆ కొనుగోలు శక్తి మళ్ళీ మొదటి చోటికి చేరుతుంది కాని ఈ క్రయశక్తి మార్పిడివల్ల వ్యక్తులకు కొన్ని ఇబ్బందులు కలుగుతాయి. ఆ ఇబ్బందులు యథార్థ భారంక్రింద చెప్పుకోవాలి. ద్రవ్యభారం కాదు.

వాటివల్ల వచ్చే యథార్థ భారం ఎట్లా ఉంటుంది? ఉదాహరణకి ధనికవర్గం ప్రభుత్వానికి ఋణాలిస్తారనుకుందాం. వడ్డీతోసహా అప్పు తీర్చడానికి ఏర్పాటు చేసినప్పుడు వారికి ఇతోధికమైన కొనుగోలు శక్తి ఇవ్వబడుతుంది. ఈ ద్రవ్యం పన్నులద్వారానే వస్తుంది. ధనికులే ఆ పన్నులు చెల్లించే వారయితే, ధనికుల డబ్బు ధనికులకే పంచడం జరుగుతుంది. ఇంకెవరిమీదా ఈ భారం పడదు. అట్లా కాకుండా ఏ నిత్యావసరాలమీదనో పన్నులువేసి ఆ సొమ్ము సేకరిస్తే, బీదవారూ, మధ్యతరగతివారూ ఆ భారాన్ని భరిస్తారు. ఫలితం పొందేవారు ధనికులు. వడ్డీ రూపేణా అదనపు శక్తి వారికి లభిస్తుంది. ఇట్లా ఉంటుంది ప్రజాబాహుళ్యం మీద యథార్థభారం. దీనివల్ల గొప్పవాళ్ళు ఇంకా గొప్పవాళ్ళయే అవకాశం ఉంది. అందువల్ల చిన్న మొత్తాలలో ప్రభుత్వం ఋణసేకరణ చెయ్యడానికి ప్రయత్నిస్తుంది. చాలమంది మధ్య తరగతి వాళ్ళు ఆ అప్పులు ఇస్తారు. వారికా ఫలితం వస్తుంది. ధనికులుకూడా ఆ అప్పులు చెల్లించవచ్చుగాని ఒక పరిమితి నిర్ణయించి అంతకంటె ఏ ఒక్కవ్యక్తీ ఎక్కువ అప్పు చెల్లించకూడదని ఆంక్ష ఏర్పాటు చేస్తారు. ఎన్ని చేసినా సామాన్యంగా దేశంలోని అంతరంగిక ఋణపత్రాలు ధనికవర్గం చేతుల్లో ఎక్కువగా ఉంటాయి. కనుక యథార్థభారం ఎంతో కొంత దేశంమీద ఉంటుంది.

ఇంతేకాకుండా మరో విచిత్రమైన ఫలితం కనబడుతుంది. అప్పులు తీర్చడంకోసంవేసే పన్నులు దేశంలో యువకులమీద ఎక్కువగా పడతాయి. ఆ అప్పుపత్రాలు వృద్ధులదగ్గఱ నిలువగా ఉంటాయి. అప్పు తీర్చినప్పుడు వాళ్ళకు అదనపు కొనుగోలు శక్తి మళ్ళుతుంది. అంచాత ఈ కార్యక్రమంలో, అంటే అంతరంగిక ఋణాలు పుచ్చుకుని తీర్చడంలో కొనుగోలుశక్తి రెండు విధాల మార్పులు పొందే అవకాశముంది. మధ్యతరగతినుంచి ధనికవర్గానికి ఒక మార్పు. యువజనులనుంచి వయోవృద్ధులకు ఇంకో మార్పు. ఈ రెండో మార్పులో కొనుగోలుశక్తి చురుకైనవాళ్ళదగ్గఱనుంచి స్తబ్దులవైపు మళ్ళుతుంది.

ఇక పరోక్షభారంకూడా నిశితంగానే ఉంటుంది. పన్నులు పెరిగినంతమేరకు ఉత్పత్తిమీద దుష్ప్రభావం రావచ్చు. బీదవాడికి ఈ అదనపుపన్నులు ధనలోపమేకాకుండా ధరలు పెరగడం రూపంలోకూడా హానిచేసి, పనిచేసే సామర్థ్యాన్నీ, ఇచ్ఛనూ కూడా తగ్గించే అవకాశముంది. అవతల ధనికవర్గానికి హాయిగా కూర్చుంటే ఋణపత్రాలమీద అదనంగా ధనం వస్తుంది. అంచాత పనిచెయ్యడంమీద శ్రద్ధ తగ్గుతుంది. ప్రభుత్వవ్యయంమీద కూడా అప్పులు తీర్చేపని కొంతబరువు మోపుతుందిగనుక ఖర్చులు తగ్గిస్తారు. ముఖ్యంగా సంక్షేమ కార్యక్రమాలమీద ఖర్చు తగ్గుతుంది. సామాన్యప్రజలకు అది కూడా ఒక రకం పరోక్షభారమే.

అప్పులవల్ల ఇన్ని దుష్ఫలితాలున్నప్పుడు అప్పు చెయ్యకుండానే ఉండడం శ్లాఘనీయమే. అప్పుచేసేవాడు అష్టకష్టాలూ పడతాడు, వ్యక్తిగానీ, దేశంకానీ. అంతమాత్రాన ప్రభుత్వం అప్పు చెయ్యకుండా ప్రస్తుత ప్రజానీకంకోసమే ఖర్చులు పరిమితంచేసి, భవిష్యత్తుమగూర్చి పట్టించుకోకుండా ఉంటే అది ప్రభుత్వమే కాదు. మనిషికి సంతానంమీద మమకారం, ఆస్తికట్టబెట్టాలన్న ఆశా ఎట్లాంటివో, నిజమైన ప్రజాప్రభుత్వానికి జాతీయమైన ఆస్తిని పెంపుచేసి, రాబోయే తరాల వాళ్ళు ఆర్థిక దార్ఢ్యం కలిగి ఉండాలని వాంఛించడం కూడా అట్లాంటిదే. ప్రభుత్వం జాతిపురోగతికీ,

ఆర్థిక స్తోమతకూ సరియైన పునాది వెయ్యాలి. కావలసే అప్పులు చెయ్యాలి. 'ఋణంకృత్వా ఘృతం పిబేత్'.

వ్యక్తికీ ప్రభుత్వానికీ తేడాలూ చాలా ఉన్నాయి. కేవలం రాబడీ, ఖర్చూ సరిపెట్టుకుంటూ ఆర్థిక విధానం రూపొందిస్తే అది అంత బాధ్యతాయుతమైన విధానం కాదు. అట్లాగని ఈ నాడు కొన్ని అవకతవక విధానాలు అవలంబించి, ఇది భవిష్యత్తుకు చాలా మంచిదని నిర్ణయించి ముందు తరంవారిమీద భారం మోపడంకూడా అన్యాయమే. ప్రభుత్వంలోని వ్యక్తులు పోయినా వాళ్ళు చేసిన అకార్యాలు తరువాత తరాలవాళ్ళను కూడా పట్టిపీడిస్తాయి. ఆర్థిక వ్యవస్థ స్వరూపమే మారిపోయి గగ్గోలు పుడుతుంది. ఇంతకీ ముందు తరం వాళ్ళమీదకు ఋణ భారం పెట్టడం సాధ్యమా? అని ఒక ప్రశ్న. దీనిమీద పెద్దచర్చ ఉండనే ఉంది. ఆ ముందు తరం వారంతా అప్పు తీర్చేది ఈ తరం వాళ్ళకే అని ఒక అపోహ. కాని ముందుతరం వచ్చినతరువాత ఈ తర మెక్కడుంటుంది? అంతా ఒక్కతరంలో వారే అవుతారు. ఒక యింట్లోనే, ఒక్కతరంలోనే, ఒకేకాలంలో అన్నితరాలవాళ్ళూ ఉంటారు. దేశం కోసం ఒక సిపాయి యుద్ధం చేస్తాడు. సంపాదించిన ద్రవ్యంలో కొంత పెట్టి ప్రభుత్వ ఋణపత్రాలు కొంటాడు. ఉద్యోగం చాలించి ఇంటికి వచ్చి వృద్ధాప్యంలో ఋణపత్రాలమీదవచ్చిన వడ్డీ అందుకుంటాడు. ఆ ద్రవ్యాన్ని తన సమకాలికులే చెల్లిస్తూ ఉంటారు. ఇక్కడ రెండు తరాలకూ చెందిన వ్యక్తి ఒక్కడే. కష్టించి దేశాన్ని కాపాడినవాడూ, ఊరికే కూర్చుని ధనం తీసుకుంటున్నవాడూ రెండూ ఒక్కడే. అంచేత ప్రభుత్వంనుంచి వడ్డీ తీసుకుంటున్న వాళ్ళని గర్హించడం తగనిపని.

ప్రభుత్వ ఋణాలు ఎంతవరకూ పెరిగిపోయి ఉన్నాయి? అనేది శోచనీయమే. అది వేరే చర్చించ వలసిన విషయం. కాని ఇక్కడ అది అంత ముఖ్యం కాదు. ఆ ఋణాలు చెల్లించినవారూ, అవి తీర్చ డానికి పన్నులు చెల్లించేవారూ ఒకరిప్రక్క ఒకరు బ్రతుకుతూ ఉంటారు. ఆంతరంగిక ఋణంలో ఆ ధనంగాని తత్తుల్యమైన సామగ్రికాని దేశం విడిచి పోదు. అదనపుపన్నులూ, వడ్డీలు మూలంగా కొనుగోలుశక్తిపొందే మార్పులే ముఖ్యంగా గమనించవలసినవి. ఆంతరంగిక ఋణాలద్వారా దేశం దివాలాతీసే అవకాశంలేదుకాని విదేశఋణాలు దేశ దారిద్ర్యానికి చాలవఱకూ కారణం కావచ్చు. అవి సార్థకఋణాలైతే ఆ ప్రమాదం చాలా స్వల్పం. నిజంగా 'సార్థకం' కావాలి. పేరుకు సార్థకాలై నిజానికి ఏఅర్థ ప్రయోజనాన్నీ సాధించలేకపోతే ముప్పు తప్పదు. ఉదాహరణకి వంతెనలూ, డాములూ కడుతూఉండగానే అవి కూలిపోతాయి. ఫ్యాక్టరీలు అనుకున్నట్టు పనిచెయ్యవు. ఉత్పత్తి చేసినా, ఎక్కడా గిరాకీలేని వస్తువులు! ఇలాంటి స్థితిలో సార్థక ఋణాలుకూడా ప్రమాదకరంగానే ఉంటాయి. ఉద్యోగ కల్పనద్వారా ఏదో కొంత ప్రయోజనం కలిగినా, ఆర్థికదార్ఢ్యం దృష్ట్యా నిరర్థకాలే అవుతాయి. అప్పుడు ఋణం చెయ్యడమూ తప్పదు. ఘృతం తాగడంమాత్రం తక్కువ. అంచేత ప్రభుత్వ విధానాలు సవ్యంగా రూపొంది, అనుకున్న ప్రకారం అన్నీ జరుగుతూ ఉంటే 'ఋణం కృత్వా ఘృతం పిబేత్' అనే సూత్రం త్యాజ్యం కాదు. దానికి చెప్పిన చార్వాక కారణాలుమాత్రం మనకు సరిపడవు.

గుజరాత్‌లోని మొఢేరా సూర్యదేవాలయం


శ్రీ టి. వి. జి. శాస్త్రి

యావద్భారత దేశంలో ఒక వెయ్యి సూర్యదేవాలయాలు వున్నయ్యని చెప్పగలిగినట్లయితే, ఎంతో అతిశయోక్తిగా కనిపిస్తుంది. కాని పరిశోధన వలన పశ్చిమ హిందూదేశంలో దక్షిణహిందూ దేశంలోకన్నా ఎక్కువగా వున్నాయని చెప్పగలిగినట్లయితే అంత విడ్డూరంగా కనుపించదు. 7, 8 సంవత్సరాల క్రితం తయారు చేసిన పట్టికలో పశ్చిమ హిందూ దేశంలో మాత్రమే 40 పురాతన సూర్యదేవాలయములు పేర్కొనబడ్డాయి.[1]

పశ్చిమ హిందూదేశంలో ఎందుచేత ఎక్కువగా వున్నవి అన్న ప్రశ్నకు దేవాలయములను గురించి వున్న లోకోక్తి 'పుక్కిటి పురాణాలు', వంశ పరంపరగా వచ్చే కథలు, స్థల పురాణం, చరిత్ర ఎంతో ఆధారమవుతుంది.

సూర్యుని మొట్టమొదటి దేవాలయం సత్య

1. శాస్త్రి టి. వి. జి. 'Sun Temples in Westrn India' Oriental Art; Summer 1962. Vol. VII. పట్టిక చూడుడు.



'గూఢమండపం' : మండోవరంలోని దేవకోష్ఠంలోని దిక్పాలకుడు (ఇంద్రుడు).

యుగంలో బ్రహ్మమానసపుత్రుడైన మాంధాతచే కట్టించబడ్డట్లుగా గుజరాత్‌లో ఒక లోకోక్తి వుంది.[2] తర్వాత వేదకాలంనాటి వారెక్కువగా 'ఆర్యావర్తం' లేక 'బ్రహ్మవర్తం' అనబడే దేశంలో వుండే వారనీ, వారు యింద్రుడు, అగ్నితోబాటు సూర్యుని గూడా పూజించుచుండేవారనీ మనకందరకూ తెలిసినదే.[3] అది పశ్చిమదేశంలోని సింధునదీప్రాంతమని వేదంలోని కొన్ని ఆధారములవలన తెలుస్తోంది. ఇదిగాక చరిత్ర నాధారంగా చేసుకొనిచూస్తే పరిష్యన్ రాజగు 'డెరియున్' కాలంలో 'మాగస్' అను మిత్ర లేక సూర్య నారాధించు ఒక తెగ హిందూదేశంలో వాయువ్యప్రాంతము నాక్రమించుకొని, వారి మతాన్ని ఆ ప్రదేశంలో ఎక్కువగా విస్తరింపజేశారని తెలుస్తోంది.[4] ఇక ఆయా ప్రాంతములోవున్న తామ్ర, శిలా శాసనములవల్ల ఎంతోమంది రాజులు, సూర్య దేవాలయముల నెన్నింటినో కట్టించినట్లుగా ఆధారము లున్నవి. ఒక శాసనాన్నిబట్టి క్రీ. శ. 9 వ శతాబ్దంలో దక్షిణ గుజరాత్‌లోని 'కావి' అనే వూళ్ళో ప్రప్రథమంగా 'జయాదిత్య' దేవాలయం కట్టించబడ్డట్లుగా వున్నది.[5] మిగతా శాసనములవలన 11–13 శతాబ్దంలలో గుజరాత్‌ను పరిపాలించిన సోలంకిరాజుల కాలములో ఎక్కువ సూర్యాలయములు కట్టబడ్డట్లు తెలుస్తోంది.[6]

ఈ సోలంకిరాజులు దక్షిణ హిందూదేశంలో రాజ్యంచేసిన 'బాదామి' చాళుక్యుల సంతతివారు.[7] 10–11 శతాబ్దంలలో వీరు పశ్చిమప్రాంతము నాక్రమించుకొని ఆదర్శప్రాయంగా రాజ్యంచేసి గుజరాత్ చరిత్రలో స్వర్ణయుగకారకులని పేరు తెచ్చుకున్నారు.

హిందూదేశంలో అతిముఖ్యమైన సూర్య దేవాలయాలు ఐదు కనిపిస్తున్నవి. ఇవి వరుసక్రమంగా ఒరిస్సాలోని 'కోణార్క', ఉత్తర గుజరాత్‌లోని 'మొఢేరా', కాశ్మీరులోని 'మార్తాండ దేవాలయం', పాకిస్థాన్‌లోని 'మూలాన్' సూర్యాలయం, కచ్ఛిలో నున్న 'కంథకోట' సూర్యదేవాలయం. కంథకోటలోని దేవాలయం పూర్వం స్వతంత్ర పరిపాలకులైన 'జడేజా' మహారాజుల పరిపాలనలో ఉండేది. ప్రస్తుతం సౌరాష్ట్ర, కచ్ఛి, ఉత్తర గుజరాత్‌లోనున్న స్వతంత్రరాజ్యములన్నీ గుజరాత్‌లో చేర్చబడ్డాయి. మొత్తం సూర్యదేవాలయములైదింట రెండు గుజరాత్‌లోనుండుటవలన గుజరాత్‌లోని సూర్యదేవాలయములు ఎక్కువ ప్రధానములైనవని చెప్పకతప్పదు.

మొఢేరా ఒక చిన్న పల్లెటూరు. ఈ పల్లె కనతి దూరంలో 'పుష్పవతి' నది ప్రవహించి, ఉత్తర గుజరాత్‌లోగల సారస్వతమండలంలోవున్న సరస్వతి నదిలో కలిసి[8] పడమరగావున్న 'రణ్ ఆఫ్ కచ్' లో ఇంకిపోయి కలుస్తూవుంది. ఇది 'మెహసానా' జిల్లాలోనిది. 'మెహసానా'కు 18 మైళ్ళు పడమరగా వున్నది. పాటన్ శివారుకు చెందినది. పాటన్ అసలు పేరు 'అన్హిలవాడ' పాటన్. ఇది సోలంకిరాజుల ముఖ్య పట్టణం. వారి కాలంలో బంగారం, ముత్యాలు, రత్నాలు మొదలగునవి రోడ్డుమీద గుట్టలుగాపోసి అమ్మేది

2. శాస్త్రి : చూడుడు. పే. 79.

3. ఋగ్వేదం : 1.115.1; నిరుక్తం : VII.5; యజుర్వేదం. VII.42. XIII.46 అథర్వ వేదం : XX.107.14.

4. Will Durant–Our Oriental Heritage. P. 381.


5. Indian Antiquary : Vol. V. 113.

6, సంకాలియా. The Archaeology of Gujarat. P. 212.

7. The History and culture of Indian People–Age of Imperial Kanauj (Bharatiya Vidyabhavan) P. 103.

8. Burgess and Cousins–Archaeological Survey of North Gujarat P. 70–73.

ఈ సరస్వతీనది ఆర్యావర్తమున కిరువైపులా ప్రవహించు దృషద్వతీ, సరస్వతీ నదులలోనిదికావచ్చు. లేక యిప్పుడు 'కచ్'లోవున్న 'సఖ్రతాణ' ప్రాంతమై వుండవచ్చు ఈ ప్రాంతమిప్పటికికూడా 'బన్నీ' అని పిలువబడుతూవున్నది. 'వాణీ' (సరస్వతీ) 'బన్నీగా' మారియుండవచ్చు. ఇది వేదంలో నుదహరింపబడిన 'సప్తసింధు'కు కూడ దగ్గరగా నున్నది. (Sind). ఇచట సింధు నాగరికతకు సంబంధించిన పురావస్తు అవశేషములెన్నో వున్నవి.



'రంగమండపం'। క్రిందువరుసలో 'సూర్యకుండ్'.

వారట. పాటన్ ప్రస్తుతం గుజరాత్‌లోవున్న అతి ముఖ్యమైన పట్టణాల్లో ఒకటి కానప్పటికీ, ఆ పేరునుబట్టే ఆది ఒక మహాపట్టణమని గ్రహించవచ్చు. తదనుగుణంగా 'సహస్రలింగ తలావ్' 'ఖాన్ సరోవర్', 'రాణికివావ్' అని కొన్ని పురావస్తు అవశేషాలు కనుపిస్తాయి.[9]

ఈ పట్టణమునకు 8 మైళ్ళ దక్షిణంగా ఒక మహారణ్యం ఉండేదట. దాని పేరు ధర్మారణ్యం. సోలంకిరాజాల కాలములో పాటన్‌లో రాజాదరణలోవున్న కొంతమంది బ్రాహ్మణులకు, ధర్మారణ్యంలో కొంత భాగం బాగు, సాగుచేయించి, వసతులు కల్పించి దానమిచ్చిరట. పాటన్‌నుంచివచ్చిన బ్రాహ్మణులు 'యొడ్' బ్రాహ్మణులట. వారి కిచట వసతులు కల్పించబడ్డవి గాన దీనికి 'యొఢేరా' అని పేరు వచ్చినదని యిచ్చటనున్న బ్రాహ్మణులు చెబుతూ వుంటారు.

పుష్పవతి ప్రక్కనున్న సూర్యదేవాలయం సోలంకి రాజైన రెండవ భీమదేవ్‌చే క్రీ. శ. 11 వ శతాబ్దంలో కట్టబడ్డది.[10] ఎక్కడజూసినా కనుచూపుమేరలో కొండగానీ, రాయిగానీ లేనిచోట, కొన్ని మైళ్లనుంచి రాయిని తొలిచి నదికి 10 అడుగులకు పైగా ఘటుకలతో గట్టిపునాదులు వేయించి[11] రాయిని దూలములు, స్తంభములు మూర్తులుగా చిత్రించి అనేకరకములుగా తయారుజేసి, ఎక్కడా సున్నంతో టాకీ వెయ్యకుండా రాయిలోరాయి అమర్చి ఒక అద్భుతమైన రాతిదేవాలయం కట్టారంటే 'అన్హిలవడ్' రాజులయొక్క దైవభక్తి, కార్యదీక్ష, రాతికట్టడంలోని నైపుణ్యాన్ని తెలియజేస్తుంది.

రాతిమీద చెక్కబడ్డ జంతువులు, నరులూ, వానరులు, దేవగణం, నవగ్రహములు, దిక్పాలకులు

9. బర్జస్ చూడుడు. P. 70.

10. భారత ప్రభుత్వపు తరువుల త్రవ్వకములవలన బయటపడ్డ సత్యం.

11. దేవాలయమునకు సంబంధించిన పునాదులెన్నియో త్రవ్వకములవలన బయటబడ్డాయి.

అన్నియు వృత్తులయొక్క కల్పన, ఆలోచనాశక్తి, చిత్రించడంలో విశిష్టత, ఆధ్యాత్మిక లౌకికజ్ఞానం అనాటి సాంప్రదాయములు తెలుపుతూవున్నాయి. మరియు రామాయణము మహాభారతములలోని కథలు, గాథలు మానవజాతికి అనుభవంలోవున్న పుట్టుకలూ, చావులు, మైథునం, రాజుల కొలువుకూటములు, సామాన్యుల గృహములు, కలహములు, కుస్తీలు అనేకరకములైన జంతువులు యింకా ఎన్నెన్నో విశేషాలు దేవాలయం గోడలమీద చెక్కబడినాయి.

మొఢేరా సూర్యదేవాలయమునకు సంబంధించిన కట్టడములు, ప్రస్తుత స్థితిలో మూడు రకాలుగా కనిపిస్తున్నాయి.[12] 1. గర్భాలయంతో గూడిన 'గూఢమండపం' 2. సభా లేక రంగమండపం. ఇది ప్రత్యేకంగా పది అడుగుల దూరంలో విడిగా నిర్మించబడ్డది. 3. 'సూర్యకుండ్'. ఇది స్నానములకు వినియోగింపబడ్డ ఒక కొలను. ఈ మూడు కట్టడములూ ఒకే వరుసలో తూర్పు పడమరలుగా నిర్మించబడ్డాయి.

గూఢమండపం[13]

ఈ మండప ప్రవేశ ద్వారమునకుముందు ఒక మకరతోరణం చక్కగా చెక్కబడిన రెండు స్తంభములమీద నిలబెట్టబడియున్నది. ఇవి దేవాలయ నిర్మాణమప్పుడు రాతిబండలకప్పుతో ప్రవేశద్వారమున కట్టబడి ఒక పందిరివలె (porch) అమర్చబడినదని యూహించవచ్చును. ద్వారమునుండి లోపలకు ప్రవేశింపగానే గర్భాలయమునకు ప్రాంగణ స్తంభములమీద నిర్మాణము చేయబడ్డది. ప్రాంగణ మధ్యములోని స్తంభములపై భాగము గుండ్రముగా నుండి చెక్కబడిన పద్మాకృతిగల వితానమును (ceiling) భరిస్తున్నట్లుగావుంది. ఇది యిప్పుడు పడిపోయినది. స్తంభములను కలుపు రాతి దూలముల మీద దేవగణములు, గణపతి, ముందుకు సాగిపోతున్న సేనలు చిత్రింపబడి యున్నవి. ముఖ ద్వారముమీదనున్న గోడకు లోపలి పైకప్పును కలుపు రాతిదూలముమీద మిధునములు, మేళతాళములతో తీర్థమునకు వెడుతూవున్న ప్రజలు ముందుకు సాగిపోతున్నట్లు చిత్రింపబడి కన్పించుచున్నవి. గూఢ మండపములోపలి గోడలమీద ఏమి దృశ్యములును కన్పించవు. కాని నాలుగువైపులా గోడలలో 12 చిన్నకోష్టములలో సూర్యవిగ్రహములు అమర్చబడి వున్నవి. వీరే ద్వాదశాదిత్యులు.

ప్రాంగణమునకు వెనుక గర్భాలయము చుట్టునూ ప్రదక్షిణము చేయుటకు గూఢమండపము లోనే యిరుకుగానున్న దారి వున్నది. గర్భాలయము సమచతురస్రముగా వున్నది. లోపల సూర్యవిగ్రహము మచ్చుకు లేదు. ప్రస్తుతం దాని అడుగుభాగంలో వున్న రాతిపీట ఒకటే కనిపిస్తున్నది. దానిమీద ఏడు గుఱ్ఱాలు, మధ్య సారథి, అనూరుని చిత్రములు వున్నాయి. గర్భాలయంలోని గోడ లేవీ చిత్రింపబడలేదు. కాని ఒక రాయిమీద దేవాలయనిర్మాణం సూచిస్తూ 'శక' అని వ్రాసి కొన్ని అంకె లున్నాయి. దీనిని బట్టి యిది క్రీ. శ. 11 వ శతాబ్దపు కట్టడమని చెప్పవచ్చు.

గర్భాలయద్వారంబయట ఇటు అటు అంగుళం చోటైనా లేకుండా క్రిందనుంచి కప్పు పైవరకూ గూడా దేవతలూ, మనుష్యులతో చిత్రింపబడ్డది. ద్వార లలాటమున కిరువైపులా చిన్నచిన్న కోష్ఠములలో సూర్యుని బొమ్మ లున్నాయి. వీరికి కొంచెం క్రిందుగా యిరుప్రక్కల దండ, పింగళ, ఉష, ప్రత్యూష చిత్రములు చెక్కబడియున్నవి. ద్వారబంధమునకు క్రిందిభాగములో యిరువైపులా నిక్షుభ, రాజ్ఞి, సువర్ణ, ఛాయలను భార్యలు చెక్కబడియున్నారు. గూఢ మండప ప్రవేశద్వారముకూడా యిటులనే చెక్కబడి యున్నది. ఈ ద్వారముల శిల్పములు చిత్రించడములో స్థపతులు ఎంతో నిపుణత చూపించారని చెప్పవచ్చు.

బయటకువచ్చి గూఢమండపం చుట్టూ పరిశీలించి చూస్తే దేవాలయం పునాదులకట్టడం మూడు రకాలుగా కనిపిస్తుంది. 1. జగతి 2. మండోవరం 3. శిఖరం.

1. జగతి: దీనిని ఆరు భాగములుగా విభజించవచ్చు. 1. అధిష్టానం 2. కుముద 3 ఛజ్జ

---

12. ఫోటోలు రచయిత తీసినవి.

13. మొదటి ఫోటో చూడుడు.


4. సింహపట్టిక 5. గజధర 6. నరధర. 'నరధర' దేవాలయం చుట్టూనూ క్రిందిభాగంలో అనేకరకము లైన మనుష్యులతోనూ, భారత భాగవతాది గాథల తోనూ చిత్రింపబడియున్నది. 2. మండోవరం: ఇది జగతిపైన దేవాలయమధ్యభాగము. దీనిలో పెద్దపెద్ద కోష్ఠము లున్నవి. వీటిలో ఎక్కువగా ద్వాదశాదిత్యులు, దిక్పాలకులు, అష్టగౌరి మొదలగునవి చెక్కబడియున్నవి. ఇవిగాక సురసుందరులు, పిల్లల తల్లులూ, స్త్రీలూ, వెనుకకు తిరిగి కాలువెత్తి ముల్లు తీసికొనుచున్నట్లుగా, అద్దములో చూచు కొనుచూ అలంకరించుకొనుచున్నట్లుగా, పిల్లలను పైకెత్తి ఆడిస్తున్నట్లుగనూ ఎంతో రమణీయంగా చిత్రింపబడినవి. బయటనుండి యీ దేవాలయం ఎన్నాళ్ళు చూచినా తనివి తీరని శిల్పంతో చెక్క బడినది.

3. శిఖరం: ఇది మహమ్మదీయుల ఫిరంగి గుండ్లకు గురి అవడం వల్ల పడిపోయినది. ప్రస్తుతం శిఖరమే లేదు. కాని యిది ఉత్తర సాంప్రదాయము ననుసరించి యుండెడిదని చెప్పవచ్చును.

రంగమండపము

ఇది రాతి స్తంభములతో గుండ్రముగా కనిపిస్తుంది.[14] నాలుగు వైపులనుంచీ మండపం వేదిక మీదికి వెళ్ళుటకు సోపానపంక్తి (bralustrade) వున్నది. తూర్పు వైపునవున్న సోపానం క్రిందనున్న కోనేరువకు రెండు స్తంభములమీద నిలబడియున్న ఒక తోరణముచే కలుపబడియున్నది. ఈ మండపము లోని జగతి గూడా బయట గూఢమండప 'జగతిని' బోలియున్నది. దీనిపైన కక్షాసన మున్నది. ఇది నాలుగు వైపులా ప్రేక్షకులు కూర్చొని చూచుటకు వీలుగా వీపులఆన్పుటకు కక్ష్యయున్నది.[15] స్తంభములు ఎక్కడా సందు లేకుండా శిల్పముతో చెక్కబడి యున్నవి. దీనిలో మేళవాద్యములు ముందుకు

14. రెండవ ఫొటో చూడుడు.
15. మూడవ ఫొటో చూడుడు.



రంగమండపంలోని 'కక్ష'.

సాగిపోతున్నట్లుగానూ, మనుష్యులు, ఏనుగులు, కోతులు, అనేక రకములైన పోట్లాటలు, కుస్తీలు మొదలకు దృశ్యములతో చెక్కబడి యున్నవి. ఏను గులను పైకెత్తి భుజమున వేసికొనుట 4, 5 స్తంభములమీద ఎంతో చక్కగా చెక్కబడి యున్నది.

సూర్య కుండ్

ఇది రమణీయముగానుండు మెట్లవరుసలుగల ఒక పెద్దకొలను దీనికి నాలుగు మూలలా పంచాండక శిఖరములుగల దేవాలయపు నమూనాలు గలవు. వీనిలో 'శీతలా దేవి', అనంతశాయి విష్ణువు మొదలగు విగ్రహము లున్నవి. ఇవిగాక నాలుగువైపులా అక్కడక్కడ చిన్న చిన్న దేవాలయములున్నవి. వీనిలోని విగ్రహము లేమియో చెప్పుటకు వీలులేకుండా నున్నవి. దీనికి 'రామకుండ్' అని పేరుగూడ గలదు.

మొఢేరా దేవాలయం, శిల్పవిశిష్టత గలిగిన ఖజూరాహూ, కోణార్క, భువనేశ్వర్ మొదలగువాటిలో చేరినది. ఈ దేవాలయశిల్పంలో ఎక్కడ చూచినా శృంగార దృశ్యములు, నగ్నస్త్రీలు, వాత్స్యాయను డుదహ రించిన మైథునసాంప్రదాయములు, మానుషా మానుషమైన విశేషములు, మిథునములు, దంపతి, జంపతి, జాయాపతి, మొదలగు స్త్రీ పురుషుల జంటలు ఎన్నెన్నో చిత్రింపబడినవి. ఇవి మామూ లుగా విజయనగర శిల్పములో సాంప్రదాయసిద్ధంగా వుండే ఒకటో రెండో దృశ్యములు గావు. అనేక రకములుగా నున్నవి.

గుజరాత్‌లో మామూలుగా మార్చి 21 వ తారీఖున సూర్యుడు మకరములో ప్రవేశించునపుడు ప్రప్రథమములో కిరణములు విగ్రహముమీదపడి, వెనుకగోడమీద అంత ఎత్తుగల నీడ పడునట్లుగా దేవాలయము కట్టవలెననీ, ఇది విగ్రహలక్షణమునకు ముఖ్యమని ఒక వాడుక వున్నది. మొఢేరా దీన్ని అనుసరించి కట్టబడినట్లుగా కనిపిస్తుంది. ఏది ఎలా వున్నా యీ కట్టడం శిల్పవిశిష్టతలో ప్రపంచ అద్భుతములలో ఒకటిగా చేర్చుటకు అర్హనీయమని చెప్పవచ్చు.



కాలాంచలానికి....

శ్రీ వి. సంపత్కుమారాచార్య

కాలాన్ని కౌగిలించుకోవాలనుంది
కానీ
కాలం చేతి కందకుండా
తన ఆకర్షణలో నన్ను లాక్కుంటోంది...
యీ క్షణంలో
కాలం ఆగిపోతే
యీ భూగమన మాగిపోతే
సూర్యు డుదయించకపోతే
యీ మానవనిర్మితకాల సూచికలు
కదలకపోతే
ఆ చీకట్లో
కాలధ్వాంతంలో
జీవితాన్ని నిర్వచించాలనుంది...
గొంతెత్తి
కాలాని కవతల
ఎక్కడో ఏమూలో కూర్చున్న
ఎవర్నో పిలవాలనుంది...
అందుకే
కాలాన్ని కౌగిలించుకుని
వెనక్కి నెట్టి
ఆ మహత్తరశక్తిని నిలవేసి
ఏదో చెప్పాలనుంది
ఏమేమో అడగాలనుంది...
యీ జీవితానికి నిర్వచనం అడగాలనుంది..
కళ్లుమూసి ఊహించాలనుంది...

*   *


గుప్పిట్లో నిలిచిన వెన్నెలలాంటిది
జీవితం...

చుట్టూ ఆవరించినా
హృదయంలోకి తన
శీతలకిరణాలను
ప్రసరింపజేయడానికి
భౌతిక పరిధులు అడ్డుకుంటున్నాయి...
జీవితం...
కళ్లు తెరిస్తే కనిపించే జీవితాన్ని
అంతరంగవీథిలో పయనించి
చూడ్డానికి వీల్లేక
ఆ ఓపికలేక
చివరికి
కళ్లు మూయకుండానే
కుటిలత్వాన్నీ కలుషత్వాన్నీ
కుక్షిలో నింపుకుని
మానవతా నవతాశక్తికి
జనతలో అన్నం నీళ్లు లేకుండా చేసేను...
ఎన్నాళ్ళు
నన్ను నేనే
ఆత్మవంచన చేసుకోను?
ఎన్నాళ్ళు
యీ కుళ్ళమీద
కపటత్వపు టనుబోధాన్ని చిలకను ?
మానవతకి
మనుగడలేదు...
ఏ నవతకీ
ఆస్కారంలేదు...
విప్లవభావాలు శక్తి పుంజుకుందామనకున్నా
వాటి వెన్నుపూసలమీద
సంస్కారపు సమ్మెటపోట్లు పడూతేనే ఉన్నాయి
ఏమూలో...ఎక్కడో
ఏదో జరిగిందని]
ఏడ్చినవాడికి
తన వెనక దుర్గంధం
తెలియడంలేదు...

తన ముందు చీకటి
కనపడడంలేదు...
విభేదాలతో వైషమ్యాలతో
వికలిత మనస్కులై
మనస్సులో
కల్మషం నింపుకోడం
నాగరకత కాదు...
అదే సంఘ జీవనమైతే
అది సంఘంకాదు...

* * *

జీవితాన్ని నిర్వచించాలని
ఎందరో ప్రయత్నించారు
ఇంకా ప్రయత్నిస్తున్నారు
మున్ముందూ
ప్రయత్నిస్తూనే ఉంటారు
కళ్లనీ చెవుల్నీ
నమ్మలేనివాడికీ...
అంతరాంతరాల్లోని
చతురింద్రియాల జోలి
పట్టించుకోనివాడికీ...
మూడక్షరాల జీవితాన్ని
మురిపెంగా భావించేవాడికీ...
ప్రయత్నించినా సాధ్యంకాదు.
అందుకే



ఎక్కడో మాటువేసి
"ఓ కాలమా!...
మా కందకుండా పరుగెత్తే నువ్వు
మాముందెందుకుండడం?...
మాలో
నీ ప్రభావాన్ని నింపి
ఏ లోకానికో పోయి పరీక్షించడం

ఎన్నాళ్లని చెప్పూ...
ఒక్కక్షణం ఆగిపో
మా ఎదలోని మానవత్వాన్ని సోదాచేసి
మలినాన్ని క్షాళించి
నింపితే
శాంతి క్షమా మధురిమ నింపు
నీ దీధితితో
మాకు దారి చూపు"
అని అడగాలనుంది
కాలాన్ని కౌగిలించుకోవాలనుంది
యీ హాలాహలాన్నిక్కడే వదిలేసి
కాలం అవతల
ఏదో అలౌకిక మహాశక్తి కింద
తల దాచుకోవాలనుంది...
కానీ...



సందేహార్థక నామ్నీకరణాలు

[నామ్నీకరణములకు సంబంధించిన మొదటి వ్యాసము 'మే'నెల భారతిలో పడినది.]

శ్రీ చేకూరి రామారావు

అని, అది, అటం శబ్దాలు వాక్యాలకు చేర్చటం వల్ల అవి విషయార్థకనామాలుగా వేరే వాక్యాల్లో ప్రవర్తిస్తాయని పూర్వ వ్యాసంలో ప్రతిపాదించబడింది. ఈ వ్యాసంలో వాక్యాలకు సందేహార్థబోధ కల్పించే పద్ధతులూ, అవి వేరే వాక్యాల్లో సందేహార్థక నామాలుగా ప్రవర్తించే తీరుతెన్నులూ చర్చించబడతై. తెలుగులో 'ఓ' శబ్దాన్ని సందేహార్థకంగా పూర్వవ్యాకరణాలు గుర్తించినై. అది పదాంతంలోగాని, పదబంధాంతంలోగాని, వాక్యాంతంలోగాని చేరుతుంది. ఓ శబ్దం సర్వస్వతంత్రం కాదు, యత్కిమర్థక శబ్దాపేక్షకం. యత్కిమర్థక శబ్దాభావంలో ఇంకొక 'ఓ' శబ్దయుక్త దళం కావాలి. ఈ రెండూ లేనప్పుడు కిమర్థక శబ్దరూపమైన 'ఏం' తెచ్చుకోవాలి. ఉదాహరణకు :

(25) అంగారకగ్రహంలో జీవరాశులున్నయ్యా?

అన్న ప్రశ్నకు మనకు సమాధానం తెలియనప్పుడు, ఏమో! అంటాం. నిజానికిక్కడ 'ఓ' శబ్దమే సందేహ సూచకం. కిమర్థక శబ్దరూపమైన 'ఏం' స్వతంత్ర ప్రయోగార్హతలేని 'ఓ' శబ్దంకోసం వచ్చింది. యత్కిమర్థక శబ్దరహిత వాక్యాలకు సందేహార్థబోధ చేయాలంటే ఈ 'ఏమో'! శబ్దాన్ని వాక్యాంతంలో అనుబంధిస్తాం. ఉదాహరణకు :

(26) మాంసాహారం మనిషికి మంచిది కాదు+ఏమో!

ఈ 'ఏమో' శబ్దయుక్త వాక్యాల్ని మరో వాక్యంలో నిబంధించవచ్చు. ఈ నామ్నీకరణానికి విషయార్థక నామాల్లోలాగా వేరే అవయవ సూచకాలక్కర్లేదు. వాక్యాంతంలోని ఓ లేక ఏమో శబ్దమే ఆ పనిని నిర్వహిస్తుంది. లేకపోతే ఓ శబ్దాన్నే నామ్నీకారకంగా చెప్పి, సందేహార్థక నామాన్ని స్వతంత్ర ప్రయోగార్హతగల నామంగా గుర్తించవచ్చు. ఈ సందేహార్థక నామాలు వేరే వాక్యంలో నిబంధించటానికి కొన్ని నియమాలున్నై. ఏమో శబ్దయుక్తవాక్యం నామంగా ప్రవర్తించే వాక్యంలో క్రియ—కనుక్కొను, చూచు, తెలియు వంటి విషయ సేకరణ సంబంధితయిన ధాతు నిష్పన్నం కావాలి. ఆ సంక్లిష్టవాక్యంలో క్రియ విధ్యర్థకంగాని, ప్రశ్నార్థకంగాని, వ్యతిరేకార్థకంగాని అయివుండాలి. ఈ మూడూకాని పక్షంలో క్రియాపదం భూతేతర కాలబోధకమై ఉండాలి. ఉదాహరణకు :

(27) ఊర్మిళ ఊరినుంచి వచ్చిందేమో
కనుక్కో
కనుక్కున్నావా?
కనుక్కోలేదు
కనుక్కుంటాను

(27) లో సమాపకక్రియలు క్రమంగా విధి, ప్రశ్న, వ్యతిరేక, భావ్యర్థకాలు.

* (28) ఊర్మిళ ఊరినుంచి వచ్చిందేమో కనుక్కున్నాను.

అనే వాక్యం ప్రశ్న, వ్యతిరేకార్థకాలు లేని భూతకాల బోధక సమాపక క్రియాపదయుక్తం కావటం వల్ల [1]వ్యాకరణ సమ్మతమైన ఏకవాక్యం కాదు.

---

* ఈ గుర్తుగల వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

1. వ్యాకరణం అనే పదం ఈ వ్యాసావళిలో 'భాషా వ్యవహారంలో వ్యవహర్త పాటించే నియతి' అనే అర్థంలో ఉపయోగించబడింది.

[2]కిమర్థక శబ్దయుక్త వాక్యాలకు అంతంలో 'ఓ' శబ్ద సంయోజనం వల్ల సందేహార్థబోధ చేయవచ్చు. ఎక్కడ, ఎందుకు, ఎప్పుడు, ఎటు, ఎట్లా వంటి శబ్దాలు క్రమంగా స్థల, హేతు, కాల, దిక్, రీతులను గురించి ప్రశ్నించే శబ్దాలు. ఇవి క్రియా విశేషణాలుగా ప్రవర్తిస్తై. ఏం, ఎవరు-మొదలైన శబ్దాలు కర్తగాగాని, కర్మగాగాని ప్రవర్తించే నామాల్ని గురించి ప్రశ్నించేవి. వీటి సంయోజనంతో కూడిన పదబంధాలకు అంతంలో 'ఓ' శబ్దానుబంధం వల్ల సందేహార్థబోధ కలుగుతుంది.

(29) ఉదాహరణకు

ఎక్కడ ఉన్నాడో	ఎట్లా చెయ్యాలో
ఎందుకు వచ్చాడో	ఏం చెప్పాడో
ఎప్పుడు వెళ్ళాడో	ఎవరు తెచ్చారో
ఎటు పోవాలో	

ఈ పై 'ఏ' శబ్దయుక్తపదరూపాల్లో కొన్నిటికి విభక్తి ప్రత్యయాలు చేర్చవచ్చు. ఉదాహరణకు:

(30) ఎప్పటికి అవుతుందో?
ఎక్కడికి వెళ్ళాడో!

స్థల, కాలబోధక ప్రశ్నార్థక శబ్దాలకి 'నుంచి' 'కు' అనే విభక్తులు క్రియాపదాపేక్షితాలు. 'ఎందుకు' శబ్దం విభక్తి సహితం. 'ఎందు' అనే శబ్దానికి— కు, లో, వల్ల, కోసం వంటి విభక్తులు చేరతై. క్రియావిశేషణాలకి నామాలకు మాదిరిగా విభక్తి ప్రత్యయాలు చేరటం విశేషమేకాని ఒక రకంగా క్రియావిశేషణాలు కూడా నామపదాలుగానే గ్రహించాలి. అంటే కొన్నినామాలు క్రియావిశేషణాలుగా కూడా ప్రవర్తించగలవన్నమాట. ఉదాహరణకు పై క్రియా విశేషణాలను విశ్లేషించి చూస్తే గర్భితంగాఉన్న నామ పదార్థబోధకతను గుర్తించవచ్చు.

ఏ + <స్థలం> = ఎక్కడ
ఏ + <హేతువు> = ఎందుకు
ఏ + <కాలం> = ఎప్పుడు
ఏ + <దిక్కు> = ఎటు
ఏ + <రీతి> = ఎట్లా

నామాల్ని ప్రశ్నించే మిగతా ప్రశ్నార్థక శబ్దాలతో వీటిని పోల్చిచూస్తే అంతర్లీనంగాఉన్న సామ్యం తెలుస్తుంది.

ఏ + <మానవ> = ఎవరు
ఏ + <మహతి> = ఎవతె
ఏ + <మహత్> = ఎవడు

ఈ పై ఎక్కడాది శబ్దాలకు సరాసరి 'ఓ' శబ్దం చేరిస్తే అజ్ఞాతార్థక శబ్దాలుత్పన్నమవుతై. ఉదాహరణకు:

ఎక్కడ+ఓ=ఎక్కడో 'అజ్ఞాత స్థలం'
ఎప్పుడు+ఓ=ఎప్పుడో 'అజ్ఞాత కాలం'
ఎందుకు+ఓ=ఎందుకో 'అజ్ఞాత హేతువు'

కిమర్థకశబ్దయుక్తపదాలకు, వాక్యాలకు వేరు వేరుగా 'ఓ' శబ్దాన్ని చేర్చటంవల్ల అర్థభేదం కలుగుతుంది. ఉదాహరణకు ఈ కింది వాక్యాలను పరిశీలించండి.

(31) అక్కడ ఎవరున్నారో!

(32) అక్కడ ఎవరో ఉన్నారు.

ఈ పై (31) (32) వాక్యాల్లో 'ఓ' శబ్దస్థానభేదంవల్ల అర్థభేదం కలిగిందనేది స్పష్టం. అర్థభేదమేకాక నామ్నీకరణవిధానంలోనూ భేదముంది. వాక్యం (31) ని వేరే నామ్నీకారకం అవసరం లేకుండా

(33) అక్కడ ఎవరున్నారో నాకు తెలీదు.

---

2. యత్కిమర్థకాలు రెంటికీ తెలుగులో ఒకే రూపం ఉంది. సౌలభ్యంకోసం ఈ వ్యాసంలో కొన్ని చోట్ల కిమర్థకమనే వాడబడింది.

<> ఈ గుర్తుల మధ్యఉన్న శబ్దంకన్నా దాని అర్థం ప్రధానం. అర్థబోధకతకు రూపకల్పన కోసం వ్యాకర్త కల్పించుకున్న శబ్దాలే ఇవి. భాషా వ్యవహారంలో ఇవి రూపపరివర్తన చెందుతై. This is an abstract characterization of underlying features.

అని మరో వాక్యంలో నామపదస్థానంలో ప్రయోగించవచ్చు. వాక్యం (32) ని ఆ స్థానంలో ప్రయోగించాలంటే 'అని' శబ్దాన్ని ప్రయుక్తం చేయాలి.

(34) అక్కడ ఎవరో ఉన్నారని నాకు తెలియదు.

వాక్యం (31) కి కూడా అని శబ్దం చేర్చవచ్చుగాని, 'ఓ' శబ్దాంతవాక్యాల్ని 'అని' నామ్నీకరించ లేదు. 'ఓ' శబ్దాంతవాక్యాల్ని 'అని' హేత్వర్థంలో క్రియావిశేషణాలుగా మార్చి కొన్నిరకాల ధాతువులతో ప్రయోగయోగ్యం చేస్తుంది. [3]ఆఖ్యాత (Predicate) పదాంతాగమ 'ఓ' శబ్దం వాక్యబోధిత విషయ సర్వస్వానికి సందేహబోధ చేస్తుంది ఆఖ్యాతేతర పదాంతాగమ 'ఓ' శబ్దం ఆ పదార్థానికే సందేహబోధ చేస్తుంది. (32) (31) సంఖ్యగల వాక్యాలకున్న భేదం ఇదే.

వ్యతిరేకావ్యతిరేకనిర్దేశక వాక్యాలకి 'ఏమో' శబ్దం; కిమర్థకశబ్దయుక్త వాక్యాలకి 'ఓ' శబ్దం సందేహార్థంలో అంతాగమంగా వస్తుందనీ, ఈ వాక్యాలని ఇంకో వాక్యంలో నామపదస్థానంలో ప్రయోగించవచ్చుననీ, పై చర్చ సారాంశం. 'ఏమో' శబ్దయుక్తనామాల ప్రయోగానికి విషయసేకరణార్థక ధాతుసంబంధి క్రియాపదం కావాలనీ, అది విధ్యర్థకంలోనూ, వ్యతిరేకార్థకంలోనూ, ప్రశ్నార్థకంలోనూ ఇవి లేకుండా కాలబోధ ఉన్నప్పుడు అభూతకాలంలోనూ ఉండాలని ఇంతకుపూర్వమే చెప్పబడింది. ఈ రెండు రకాల సందేహబోధకీ కొంత భేదం ఉంది. 'ఏమో' శబ్దయుక్తవాక్యం 'ఆ' అంతంగాగల ప్రశ్నార్థక వాక్యానికీ, 'ఓ' శబ్దయుక్తవాక్యం కిమర్థకశబ్దయుక్త ప్రశ్నార్థక వాక్యానికీ, సందేహార్థంలో సమాధానాలుగా క్రమంగా వ్యవహరిస్తాయి. ఇంగ్లీషు వ్యాకరణాల్లో మొదటి రకపు ప్రశ్నల్ని Yes or no questions అనీ, రెండో రకపు ప్రశ్నల్ని Question word questions అనీ అంటారు. పైన పేర్కొన్న రెండు రకాల సందేహార్థక వాక్యాల్ని ప్రశ్నార్థక వాక్యాల్లో నిబంధించి చూసి పై వాక్యంలో చెప్పిన రెండు రకాల ప్రశ్నార్థక వాక్యాలతో పోల్చిచూస్తే ఈ భేదం విశదమవుతుంది. ఉదాహరణకు ఈ క్రింది వాక్యాలను పరిశీలించండి.

(35) i ఊర్మిళ ఊరినుంచి వచ్చిందా?

ii ఊర్మిళ ఊరినుంచి ఎప్పుడు వచ్చింది?

(36) i ఊర్మిళ ఊరినుంచి వచ్చిందేమో నీకు తెలుసా?

ii ఊర్మిళ ఊరినుంచి ఎప్పుడు వచ్చిందో నీకు తెలుసా?

(36) సంఖ్యగల వాక్యాలు, (35) సంఖ్యగల వాక్యాలకి వాటి క్రమంలో వివరణాత్మకాలుగా గ్రహించవచ్చు. (36) సంఖ్యగల వాక్యాలనుంచి 'నీకు తెలుసా?' అన్నభాగం తొలగిస్తే (35) సంఖ్యగల ప్రశ్నలకి సందేహద్యోతక సమాధానాలవుతాయి. అయితే వ్యవహారంలో ఇంత దీర్ఘసమాధానాలు సాధారణంగా ఉండవు. బహుశా 'ఏమో' శబ్దమొక్కటే చాలు, (35) సంఖ్యగల ప్రశ్నలు రెంటికీ. కాకపోతే 'ఏమో! నాకు తెలియదు' అని అనవచ్చు. కాని వాటిని (36) లో నీకు తెలుసా అన్న భాగం తీసెయ్యగా మిగిలిన వాక్యభాగాలుగానే వక్త ఉద్దేశిస్తాడు; శ్రోత గ్రహిస్తాడు. సందేహార్థబోధక ప్రత్యయస్వరూపాన్ని గురించి ఈ చర్చ ఇంకో మార్గం సూచిస్తున్నది. 'ఏమో' శబ్దాన్నే సందేహార్థక ప్రత్యయంగా గ్రహించి, దాన్ని కిమర్థ

---

3. ఆఖ్యాత శబ్దాన్ని క్రియాపదం అనే అర్థంలో పూర్వవ్యాకర్తలు ఉపయోగించారని ఈ వ్యాసకర్త అభిప్రాయపడుతున్నాడు. కాని దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు 'రమణీయము' అనే పేరుతో బాలవ్యాకరణానికి రాసిన సమీక్షాగ్రంథంలో 'ఆఖ్యాతము-క్రియావిభక్తి. ఒండురెండు టీకలలో ఆఖ్యాత శబ్దమునకు 'క్రియాపదము' అను నర్థము నిర్దేశింపబడినది. అది ప్రామాదికము. ఉపేక్షణీయము' (పేజీ 333) అని రాశారు. ఈ వ్యాసంలో ఆఖ్యాత శబ్దం Predicate (Verbal or non Verbal) అనే అర్థంలో ప్రయుక్తం.

శబ్దయుక్త వాక్యాల కనుబంధించినప్పుడు 'ఏమో' లోని కిమర్థకశబ్దంతో సమరూపతఉన్న భాగానికి లోపం చెప్పకోవచ్చు. ఈ రెంటిలో ఏ పద్ధతి మేలో ఇంకా ఆలోచించాల్సిఉంది.

సందేహార్థబోధలో మూడో పద్ధతి 'ఓ' శబ్దయుక్త వాక్యాల్నిగాని వాక్యాంశాలనుగాని కొన్నిటిని ఏకవాక్యంగా ప్రయోగించటం. దీన్ని ఉతార్థక మనవచ్చు. ఇట్లాంటి సందర్భాల్లో ఇంగ్లీషులో or అనే పదం ప్రయోగిస్తారు. భిన్నవ్యాపారాలకు వికల్పబోధ చేయాలంటే అవి[4] ఏకాశ్రయాలై ఉండాలి. అంటే ఏకకర్తృకాలై ఉండాలి.

ఉదాహరణకు :

(37) వెంకట్రావు చదువుకుంటున్నాడో, నిద్రపోతున్నాడో చూసిరా! అనే వాక్యంలో వికల్పాన్ని చెప్పిన చదువుకోటం, నిద్రపోవటం అనే భిన్నవ్యాపారాలకు వెంకట్రావు ఆశ్రయుడు.

*(38) వెంకట్రావు చదువుకుంటున్నాడో, సుబ్బారావు గుంటూరు వెళ్తున్నాడో చూసిరా!

చదువుకోటం, గుంటూరు వెళ్లటం అనే భిన్నవ్యాపారాలు భిన్నాశ్రయాలు గనుక వాక్యం (38) వ్యాకరణ సమ్మతమైన ఏకవాక్యం కాదు.

ఏకకర్తృకమైన వ్యాపార వ్యతిరేకావ్యతిరేకతలకు మధ్య కూడా వికల్పాన్ని చెప్పవచ్చు.

(39) వెంకట్రావు వస్తాడో, రాడో

వ్యతిరేకావ్యతిరేక క్రియలకు వికల్పాన్ని చెప్పినప్పుడు వ్యతిరేకక్రియకు సర్వకాలాదిబోధలో 'లేదు' అనే రూపం క్రియారహిత వాక్యాలకు 'కాదు' అనే రూపం, ఆదేశాగమాలుగా క్రమంగా, వికల్పంగా వస్తై. ఉదాహరణకు :

(40) వెంకట్రావు వస్తాడో, లేదో
(రాడుకు లేదు ఆదేశం)

(41) వెంకట్రావు మంచివాడో? కాదో?
(ఇక్కడ కాదు ఆగమం)

క్రియారహిత వాక్యాలకు ఉతార్థబోధలో కాదు అనే రూపం చేర్చినప్పుడు పూర్వవాక్యానికి 'అవును' శబ్దం వికల్పంగా చేరుతుంది. అయినప్పుడు 'ఓ' శబ్దం 'అవును' శబ్దానికే చేరుతుంది.

(42) వెంకట్రావు మంచివాడు అవునో, కాదో
(ఎవరికి తెలుసు?)

ఇట్లా 'అగు' ధాతునిష్పన్నరూపాలు క్రియారహిత వాక్యాలకు అపిచేదాది వివిధార్థకాల్లో చేరటం పూర్వవ్యాసంలోనే ప్రోక్తం. ఈ కారణాలవల్లనే క్రియారహిత వాక్యాలు నిజంగా క్రియారహితవాక్యాలు కావేమో అనిపిస్తున్నది. ఈ రకపు వాక్యాల లోపలి నిర్మాణం (Deep Structure) లో 'అగు' ధాతువు వంటిది ఉన్నదని ఊహించి, వెలుపలి నిర్మాణం (Surface Structure) లో అది ఆకార రహితమని వ్యాకరించటం ఒక పద్ధతి. అయితే ఆ పద్ధతిలో కొన్ని చిక్కులున్నై. వాటిని ప్రస్తావించటానికిది సమయంకాదు. క్రియారహిత వాక్యాలను ప్రత్యేకంగా చర్చించినప్పుడు వాటి విషయం విపులంగా మాట్లాడుకోవచ్చు. ప్రస్తుతానికి ఇట్లాంటి సమస్య ఉన్నదని తెలుసుకుంటే చాలు. ఏదెట్లా ఉన్నా స్థలకాల విషయ ప్రధానంకాని అస్తిత్వబోధార్థకమైన 'అగు' ధాతువు వ్యాపారబోధకం కాదనేది నిర్వివాదం. సర్వధాతువులూ వ్యాపార బోధకాలు కావని ఇక్కడ సూచన.

భిన్నవాక్యాల్లో వాక్యాంశాలకి ఉతార్థబోధ చేయాలంటే ఆ అంశాలు భిన్నార్థకాలయి, వ్యాకరణరూపైకత కలిగిఉండాలి. వ్యాకరణరూపైకత అంటే కారకబోధైకత అని స్థూలంగా చెప్పకోవచ్చు. అంటే ఉతార్థ వివక్షితాంశాలు భిన్నార్థకాలయి భిన్నవాక్యాల్లో ఒకేరకపు వ్యాకరణ ప్రవర్తన (Grammatical Function) కలిగిఉండాలి. భిన్నవాక్యాల్లో ఉతార్థోద్దిష్టేతర సర్వశబ్దాలూ సరూపా

4. 'ధాత్వర్థ వ్యాపారాశ్రయంబు కర్త నాబడు.' బాలవ్యా. కారక. సూ. 3.

(Identical) అయిఉండాలి. ఉదాహరణకు (43), (44) సంఖ్యగల వాక్యాల్ని పరిశీలించండి.

(43) కమల పొద్దున 10 గంటలకు బస్సులో కాలేజికి వెళ్తుంది.

(44) కమల పొద్దున 10 గంటలకు కారులో కాలేజికి వెళ్తుంది.

(43), (44) సంఖ్యగల వాక్యాల్లో బస్సులో, కారులో అనే పదాలకు ఉత్తరాన్ని వివక్షించాలి. ఈ రెండూ ఏకకారకబోధకాలే. మిగతా పదాలన్నీ సరూపాలు.

అప్పుడు (43), 44) కలిసి (45) గా ఏర్పడతై.

(45) కమల పొద్దున 10 గంటలకు బస్సులోనో, కారులోనో కాలేజికి వెళ్తుంది.

(43), (44) సంఖ్యగల వాక్యాలలో ఒకదాంట్లో కమల బదులు విమల ప్రయోగించి మిగతా వాక్యాంశాల్ని సరూపంచేస్తే కమల, విమలలకు ఉత్తరాన్ని వివక్షించవచ్చు. అట్లాగే మిగతా శబ్దాలకూ ఊహించుకోవచ్చు

'ఓ' శబ్దయుక్త భిన్నవాక్యాలకు ఉత్తరాన్ని వివక్షించినప్పుడు సరూపసార్థకశబ్దాల పునరుక్తి అనవసరం. వాటిని లోపింపచెయ్యవచ్చు. (43), (44), (45) సంఖ్యగల వాక్యాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఒక్క ఉత్తరార్థంలోనే కాదు. క్వార్థాదుల్లోనూ ఇంతే.

ఈ 'ఓ' శబ్దం సర్వత్రా సందేహార్థకంగా ప్రయుక్తమైనప్పటికి, తద్భిన్నమైన ప్రయోజనం ఒకటి కనిపిస్తున్నది. అది యత్తదర్థబోధకత. అప్పుడు 'ఏ' శబ్దయుక్త ప్రశ్నార్థకరూపాలు కిమర్థక రూపాలుగాకాక యదర్థకరూపాలుగా ప్రవర్తిస్తై. అప్పుడు యదర్థకవాక్యం తదర్థక వాక్యానికి విశేషణంగా ప్రవర్తిస్తుంది. యత్తదర్థక శబ్దయుక్త పదాలకుగాని, పదబంధాలకుగాని కారకైకత అక్కర్లేదు. కాని అవి ఆ వాక్యంలో ఏకవస్తుసూచక పదాశ్రయాలై ఉండాలి. తదర్థక శబ్దయుక్తపదం యదర్థకశబ్దయుక్తపదంతో సంపూర్ణసామ్యం లేకపోయినా ఆ శబ్దార్థాన్నే సూచించాలి. ఉదాహరణకు యదర్థక శబ్దయుక్తపదం ఔపశ్లేషికాధికరణకారకసమన్వితమైతే తదర్థకశబ్దం స్థలసామాన్యవాచియైన 'అక్కడ' కావచ్చు. అట్లాగే యదర్థక శబ్దయుక్తపదం మహన్మహతీతరబోధక నామమైతే తదర్థకశబ్దం ఏతదర్థబోధకమైన సర్వనామం కావచ్చు. ఈ రెంటికీ (46) (47) సంఖ్యగల వాక్యాలు క్రమంగా ఉదాహరణలు.

(46) నీ కలం ఏ పెట్టెలో పెట్టుకున్నావో అక్కడే ఉంటుంది.

(అక్కడే=ఆ పెట్టెలోనే)

(47) నీకు క్లాసులో ఇవ్వాళ ఏ పాఠం చెప్పారో, అది చదువు !

(అది=ఆ పాఠం)

తక్కినవి ఇట్లాగే ఊహ్యాలు.

ఈ యత్తదర్థక వాక్యాల్లో తదర్థక పదబంధం కొన్నిచోట్ల లోపించవచ్చు. లోపించినా యత్తదర్థక శబ్దయుక్తపదాలు ఒకే విషయాన్ని సూచిస్తైగనక అర్థావగాహన కాఠిన్యం ఉండదు. ఉదాహరణకు.

(48) ఈ చీరల్లో నీకేది కావాలో తీసుకో!

(49) ఈ ప్రశ్నకి సమాధానం ఎవరు చెప్పగలరో చేతులెత్తండి!

(48) (49) సంఖ్య గల వాక్యాల్లో అది, వారు అనే తచ్ఛబ్దాలు క్రమంగా లోపించినై అయినా వాక్య నిర్మాణాన్నిబట్టి ఉద్దిష్టార్థాన్ని శ్రోత గ్రహిస్తాడు. ఈ తచ్ఛబ్దలోపం ఒక్క విధ్యర్థకంలోనే సాధ్యమయ్యేట్టు కన్పిస్తున్నది.

*(50) ఆ చీరల్లో నా కేది కావాలో తీసుకున్నాను.

*(51) ఆ ప్రశ్నకు సమాధానాలు ఎవరు చెప్పగలరో చేతు లెత్తారు.

(50), (51) సంఖ్య గల వాక్యాల్ని (48) (49) సంఖ్య గల వాక్యాలతో పోల్చిచూస్తే అవి వ్యాకరణ సమ్మతమైనవిగా కనిపించవు.

ఈ యత్తదర్థక వాక్యాలు విషయబోధలో క్రియాజన్య విశేషణ వాక్యాలకు సమానం. ఉదాహరణకు (48) (49) సంఖ్య గల వాక్యాల్లో క్రియాజన్య

విశేషణా లుపయోగిస్తే ఈ కింది విధంగా చెప్పవచ్చు.

(52) ఈ చీరల్లో నీకు కావాల్సింది తీసుకో!

(53) ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగల వాళ్ళు చేతు లెత్తండి!

విషయబోధకతౌల్యం ఉన్న ఈ రెండు రకాల వాక్యాలు వ్యవహర్త ఏ భిన్న ప్రయోజనాన్ని ఆశించి ప్రయోగిస్తాడో ప్రస్తుతం చెప్పటం కష్టం. బహుశా విషయైకదేశప్రాధాన్యవివక్ష కావచ్చు. యత్తదర్థక వాక్యనిర్మాణం ఆర్యభాషల్లో ఉన్నంత ప్రచురంగా ద్రావిడభాషల్లో ఉన్నట్టు కనిపించదు.

తెలుగులో సాధారణంగా 'ఏ' 'ఆ' అనే రెండు ప్రశ్నార్థకాలూ ఏకవాక్యంలో ప్రయోగించటానికి వీల్లేదు. కాని 'ఆ' ప్రశ్నార్థకంగా అంతంలో వచ్చే వాక్యాలమీద విషయగౌరవబోధనార్థం 'ఏం' శబ్ద ప్రయోగం కనిపిస్తున్నది.

(54) వాళ్ళు ఇల్లు ఖాళీ చేశారా? ఏం?

ఈ 'ఏం' శబ్దం నిర్దేశకవాక్యాలమీద ఎందుకు అనే అర్థంలో ప్రయోగించబడుతుంది.

(55) ఇంత తొందరగా వచ్చేశావేం?

కొన్ని అసమాపక క్రియల తర్వాత 'ఏం' శబ్దమూ, మరికొన్ని కిమర్థక శబ్దాలూ వస్తై. వస్తే ఏం? రాకపోతే ఎట్లా? వంటి వాక్యాలు ఇట్లాంటివే.

సందేహార్థక గురుత్వంలో 'ఏమో' శబ్దం కూడా 'ఓ' శబ్దాంత వాక్యాలకు అనుప్రయుక్తం అవుతుంది. 'ఏమో' శబ్దంతో సందేహార్థ వివక్ష చేసిన వాక్యాల మీద మళ్లీ గురుత్వ బోధన కోసం 'ఏమో' శబ్దాన్ని అనుప్రయుక్తం చేసినప్పుడు మొదటి 'ఏమో' శబ్దంలోని కిమర్థక భాగానికి లోప మవుతుంది. (56), (57) సంఖ్యగల వాక్యాలు అందుకు క్రమంగా ఉదాహరణలు.

(56) వాళ్ళు ఎప్పుడు వస్తారో! ఏమో!

(57) వాడు పరీక్ష తప్పాడో! ఏమో!

విషయగురుత్వబోధకు కొన్నిశబ్దాల్ని పునరావృత్తి చేసే పద్ధతి చాలా భాషల్లో ఉంది. ఇంగ్లీషులో వ్యతిరేకార్థకరూపం అట్లాగే ఆవృత్తి అవుతుంది. I don't know nothing అనే వాక్యం అమెరికన్ గ్రామీణ వ్యవహారంలో సర్వసాధారణం.

'ఏమో' శబ్దాన్ని గురించి ఇంకో చిన్నవిశేషంతో ప్రస్తుత వ్యాసం ముగుస్తుంది. కళింగాంధ్ర (గోదావరి దిగువప్రాంతపు తెలుగుదేశం) వ్యవహారంలో 'ఏమో' శబ్దానికి ఒక విచిత్రమైన ప్రయోగ విశేషం ఉంది. కొన్ని వాక్యాంశాలకు సందేహార్థబోధ లేకుండానే 'ఏమో' శబ్దాన్ని అనుప్రయుక్తంచేసి వారు వ్యవహరిస్తారు. అప్పుడు 'ఏమో' శబ్దానికి ప్రత్యేకమైన అర్థబోధ ఉన్నట్టు కనిపించదు. వాక్యంలోని ఒక అంశంనుంచి ఇంకో అంశానికి పోవటానికి సంధిప్రాయం (Transition) గా గాని, లేక ఒక అంశాన్ని చెప్పి తరవాత అంశాన్ని చెప్పేలోగా మధ్యలో ఆలోచించుకోవటంవల్ల ఏర్పడే నిశ్శబ్దాన్ని పూరించటం (Gap Filling) కోసంగాని ఈ ఏమోశబ్దాన్ని ప్రయోగిస్తారు. ఒక్కొసారి ఇవేవీ లేకుండా కేవలం అలవాటుగాకూడా ప్రయోగించవచ్చు. వీరి భాషలో నైనా 'ఏమో' శబ్దం వాక్యాంతంలో అర్థరహితంగా ప్రయుక్తంకాదు. ఈ ఆధారంవల్ల 'ఏమో' శబ్ద ప్రయోగం కళింగాంధ్రంలో ఆసత్తిరక్షణకోసమని ఈ వ్యాసకర్త అభిప్రాయపడుతున్నాడు.

ఉదాహరణకు:

(58) అప్పుడేమో నేనేమో ఆయనతో ఇలా అన్నాను.

(58) లో 'ఏమో' శబ్దాన్ని వాక్యాంతంలో తప్ప మిగతా ఏ పదబంధవిరామంలోనైనా ఆసత్తిరక్షకంగా ఉపయోగించవచ్చు. వాక్యాంతంలో ఆ అవసరంలేదు గనక అక్కడ ప్రయోగించిన 'ఏమో' శబ్దం తప్పనిసరిగా అర్థవంతమవుతుంది. ఇట్లాంటి సంధిప్రాయమైన నిశ్శబ్దపూరక ఆసత్తిరక్షక శబ్ద ప్రయోగంలో వ్యవహర్తలు ఎంతో వైవిధ్యం చూపిస్తారు. వీటినే Mannerisms అంటారు. ఆంధ్రదేశంలో కొన్నిప్రాంతాల పిల్లలు వాక్యాదిన 'మరే' శబ్దంతో ప్రారంభించి ప్రతిపదాంతంలోనూ (వాక్యాంత పదంతప్ప) 'ఏ' శబ్దాన్ని దీర్ఘంతీసి ప్రయోగిస్తారు. ఇంగ్లీషులో I mean, You know, You see వంటి పదాలు ఇటువంటివే. పూర్వకవుల కావ్యాల్లో పాదపూరణకోసం (ఉమాకాంత పండితులు వీటిని 'దండగ్గణం' అన్నారు.) ప్రయోగించే శబ్దాలతో వీటి సామ్యం గమనించవచ్చు. ఉమాకాంత పండితుల విమర్శ కావ్యశిల్పానికి సంబంధించింది. ఏ యే రకాల శబ్దాలు ఈ విధంగా ప్రయోగించటానికి ఉపయోగపడతాయో అనేది పరిశోధనార్హమైన విషయం. ఇక్కడ ఇవి దిఙ్మాత్రంగా ప్రదర్శితాలు.

కర్త - కర్మ - క్రియ

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

ఆమె నడుస్తూ ఉంది!

ఆమే గాదు—సకల చరాచర ప్రపంచము నడుస్తూ ఉంది, అది దాని కర్తవ్యం కాబట్టి!!

నడక! ఓహ్!...ఎన్ని రీతులు?...

సువాసనపుటలలో చిక్కి, చిందిపోతున్న చిరునవ్వును పెదవులమధ్య నొక్కి, ఎత్తు మడమల జోళ్లపైకెక్కి నడుము నాజూకును నడకలో చూపిస్తూ ఉంది—ఓ నైలానుచీర వారి!

బిగజోళ్ళకు బదులు బిగపావుకోళ్ళు... జోళ్ళమీద కాళ్ళకు బదులు పావుకోళ్ళమీద చేతులు చారడేసి మాసికలలో మూరెడంత తుండుగుడ్డ మొలకు...ఎదుగు బొదుగు లేకుండ పెరిగిన వెంట్రుకలను నిగ్గతీసికట్టిన జానెడుగుడ్డ తలకు... ఒక్కముంపులో మూరెడు ముందుకు పడుతూ ఉంది—కదల్లేని పిండము—కాళ్లులేని మొండెము!!

అన్వేషిస్తున్న కళ్ళు...ఆక్రోశిస్తున్న హృదయము...ఆధారభూతంగా కనబడుతూఉన్న మాసిన గడ్డము, అంతకంటే మాసిన గుడ్డలు...సంతంవేసుకొని ప్రశ్నలు పలుకుతూఉన్న కాళ్ళుచేతులు—పడిశెల రాయిలా దూసుకపోతున్నాడొక భావోద్రేకి!

స్వార్థము...కుళ్ళు...కుత్సితము ... దురాశాది భావాలకు తెల్లటి ఖద్దరు బురఖా తొడిగి, దేశసౌభాగ్యము...ప్రజాసేవ...ధార్మిక చింతన—అదిగాగల ఆశయాలను మడతబెట్టి పరిగించు పూతలో సింగారించి పైపంచగా భుజమలంకరించి, యింత జాగ్రత్త పడినా లవలేశం బయటపడునేమోయన్న సందేహాన్ని నల్లటి కళ్ళజోడు నివృత్తిజేయ, 'ఇఁగో! యిలాగే! ... అచ్చంగా యిలాగే!!—అసహాయులు, అన్యాయద్వేషులు, బీదలు, అభ్యుదయవాదులు నా చేతికి చిక్కితే, యిలాగే మొట్టుతా'నంటూ కుడిచేతి కర్రను వేంకు తాకిస్తూ, ముందుకు పొందాగా సాగిపోతున్నాడొక రాజకీయవాది!

ఏమిటీ నడక?—ఎక్కడ దీని గమ్యం?—

సామాన్య మానవునికి అర్థంకాని ప్రశ్న! అనాదిగ అందరి బుర్రలను వేడెక్కించిన ప్రశ్న!!—అయితే దీనికి సమాధానమే లేదా?—అంటే,

'ఈ ప్రపంచమంతా మిథ్య. అందులో మనం నిమిత్తమాత్రులం.'—అని వాదించే వేదాంతి,' ప్రకృతి అంతా శాస్త్రమయం. ప్రతి అణువులోను మానవాభ్యుదయమున కుపకరించే ఏదో మహత్తరశక్తి యిమిడి ఉంది.'—అని భావించే ప్రగతి కాముకుడైన శాస్త్రజ్ఞుడు 'జుట్లు' పట్టుకొంటారు. సాధారణంగా సామాన్య మానవుడే శాంతి కాముకుడు. 'జుట్లు' పట్టించి వేడుక చూడడం అతని ధ్యేయంకాదు. అతని చేతనుకాదు. ఉన్నదానితో సరిపెట్టుకోవడమతని జీవిత లక్ష్యం. అందుకే ఎవరు ఎలా నడిచినా, ఎటు నడిచినా—కేవలం కూటికోసమేనంటాడు.

అందుకే ఆమెగూడ నడుస్తూ ఉంది!—అదే జానెడు పొట్టకు పిడికెడు కూటికోసం!

జానెడు పొట్ట!...పిడికెడు కూడు!!

ఎన్నివేషాలు?...మరెన్ని మోసాలు?...

తలలుమార్చే వాడొకడైతే, తలగుడ్డలు మార్చే వాడొకడు. కడప కడప తిరిగే దొకరైతే, కడప కడపను చెమటతో కడిగే వాడొకరు. అభిమానంలో అవస్థపడే దొకరైతే, మానాన్ని అమ్ముకొని బ్రతికే వాడొకరు. అయితే, అందరూ సంఘజీవులే

ఒకడు హంతకుడు! మరొకడు వంచకుడు!!

ఒకడు యాచకుడు! వేరొకడు సేవకుడు!!

ఒకడు అభిమానపరుడు! మరొకడు మాన హీనుడు!!–

సాంఘిక పరిభాషలో వీరికి సంక్రమించిన బిరుదులివి!

'ఏమిటీ తారతమ్యం?' అంటే—'కర్మ' అంటాడు వేదాంతి. చేతగానితనమంటాడు శాస్త్రవేత్త. ఒక జన్మలో చేసింది మరొక జన్మలో అనుభవించడం ఒక యుగధర్మమైతే, ఆ చేత్తోచేసి ఈ చేత్తో అనుభవించడం కలియుగ ధర్మమంటాడు సామాన్య మానవుడు చాల తేలికగా!

లేకపోతే, ఎవరిజోలి అక్కరలేకుండా, ఏమూలనో ఒక మూల, జపమాల త్రిప్పుకొంటూ దర్భాసనంమీద దర్జాగా కూర్చుంటే, కనుసన్నల రాజ్య మేలవలసిన వయస్సులో, కాళ్ళీడ్చుకొంటూ... ఎందుకు ఆమె నడుస్తూ ఉంది?–ఇదే ప్రశ్న మీ మనస్సునుకూడ కెలుకుతూ ఉందికదూ! అయితే చదవండి.

*   *   *

"బాబూ! నేను చాలా మెతకవాణి. 'అందరు మనుష్యులే! అనందం అందరి సొమ్ము?' అని నా అమృత హస్తమెత్తి ఆశీర్వదించబోతే, తిన్నయింటికి వాసాలెంచే మానవులు, నన్నే తూట్లు పొడుస్తున్నారీ రాకెట్లతో! వాగతి నీకు పట్టకుండా చూసుకో!" అని హెచ్చరించినట్లుంది చంద్రుడు మార్యభేగ వానుణ్ణి. కోపాగ్ని జ్వాలలు కక్కుతున్నాడా మహానుభావుడు. ఆ ధాటికి తట్టుకోలేక వడిలిపోతూ ఉంది వృక్షసంతతి. హడలిపోతున్న ప్రాణికోటి, కాసంత చెట్టునీడకై తాపత్రయపడుతూ ఉంది. అయితే ఆమె మాత్రం...

అందీ అందని చీరకొనకొంగు చాలీచాలని చుట్టు...ఆ చుట్టపై పెద్దబుట్ట...ఆ బరువు ఉచ్చి పీకుతూ ఉంటే, మనను వచ్చిరాక గోదారి కుట్టిన జలజోళ్ళలో ఒకదాని పట్టెడస్థానాన్ని ఒక త్రాట తీగ ఆక్రమించుకొని వక్రగతులుపట్టిస్తూ ఉండే ఆ కాలిబాటలో గులకరాళ్ళు వేమనగారి పద్యాన్ని మననం చేసుకోమని హెచ్చరిస్తూఉండే,ఎప్పుడో వేకువఝామున మూడు మెతుకులు విదల్చి, ముంత మూడు చుట్లు త్రిప్పి, పొట్లో పోసుకొన్న దోసెడు కూటినీళ్ళు చెమటరూపాన్ని సంతరించుకోగా, కాలే కడుపులో ఆవిర్భవించిన వేడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో నాలుక పిడచగట్టుకపోగా, కాలుదీసి కాలుపెడుతూ ఉంది! అంటే, ఆమె నడుస్తూ ఉంది.!!

ఇక అల్లంతదూరంలో ఈ కాలిబాట ఒక బండిబాటలో కలుస్తూంది, పిల్లకాలువలు పెద్దనదిలో చేరినట్లుగ. అక్కడ ఏ మహానుభావుడో, ఈలాంటి అభాగ్యులపాలిట దేవుడు—రెండు నిలువురాళ్ళపాతి వానిపై అడ్డంగా ఒక బండను అమర్చినాడు. నెత్తి బరువు దించడానికి, కొస్త ఊపిరి పీల్చుకొని, అపై నెత్తి కెత్తుకోవడానికి, జనసంచారములేని ఆ మారు మూలల్లో ఎంతేని ఉపకరిస్తూంది బండ. సువర్ణాక్షరాలతో లిఖించి పేరు సార్థకపరచుకోవడానికి ఈ ఉపకరణం, ఈనా యుగధర్మంకాదు. కాగా ఆ పుణ్యభాగుని పుట్టుపూర్వోత్తరాలు గుప్తంగానే ఉండిపోయాయి. అంతేగాదు–ఆ ప్రక్కన ఒక రావిచెట్టును నాటినాడు అదే చేతులతో. అది మహావృక్షమై ఆశ్రితజనరక్షగా ఉంది. వడిలిపోయిన ఆకుల సందు నుండి, పొడలుపొడలుగా పడుతున్న వడధాటికి తట్టుకోలేక ఆ చెట్టునీడనుండి బయలుదేరిన కాషాయ వస్త్రధారి, 'ఎవరుచేసిన కర్మతో వారనుభవింపక తీరదన్నా!' అని పాడుకొంటూ ఎండనుపడ్డాడు ఈ నీడకంటే, అదే నయమని!

పారిజాత పరిమళము...మల్లెల సౌరభముతో మత్తెక్కి సౌందర్యోపాసకుడైన భావుకునికంట యిలాంటి సంఘటనలు పడడం అరుదు. అథవా తటస్థించినా చీదరించుకొంటాడేమోగానీ, ప్రగతి కాముకుని ఎదుటబడితే, "ఓ వృద్ధనారీ! నమస్కారం. 'బట్ట మడతపడకుండ పొట్ట గడవాలి' అని వాజీ మొజీవేషాలువేసే ఈ కాలపు సోమరిమూకకు నీవు ఆదర్శప్రాయురాలివి. ఈ భారతావని శోభాయమానంగా వెలుగొందాలంటే, నీలాంటి కర్మయోగులే

అవసరం! రా తల్లీ! రా!! ఈ బండమీద ఆ బుట్టను దించి, ఆ చెట్టునీడను కాసేపు సేద దీర్చుకో!" అనక మానడు.

ఆమె వీలుపురాళ్ళను పలిగాపించింది, ఆ ప్రగతికాముకుని ఆహ్వానంమీద కాదు—అది ఆమె దినచర్య కాబట్టి. బుట్టను బండమీద దించింది. ఉస్సూరుమంటూ ఆ చెట్టునీడను చతికిలబడింది.

కనుచూపు మేరలో చెట్టుగానీ, గుట్టగానీ లేని ఆ పాడిపాడిచెట్లబయల్లో వడగాలి ధాటికి గూబలు 'గుయ్' మంటున్నాయి కుక్షింభరత్వాన్ని గూడ విడనాడి పక్షిసంతతి ఆ రావిచెట్టు ఆకుల మాటున తలదాచుకొంటున్నది. ఏటేటా వేసవిలో, రైతులు కాస్త ఊపిరి పీల్చుకొనే సమయములో అక్కడికి రెండుమైళ్ల దూరంలోనున్న పల్లె వెంగపల్లెలో వెంగమనాయుడి ధర్మమంటూ భారతోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి. ఆ ఉత్సవాల్లో పగటికథ ఓ తంతు!—అంటే, ఓ పండితోత్తముడు భారతమంతటి ఉద్గ్రంథాన్ని పదునెనిమిది రోజుల్లో పారాయణం చేస్తాడు దిన మునకొక్క పర్వంచొప్పున, పసిపిల్లవాడు విముషావి కొక్క చెలకు గిణపు తినినట్లు. ఆ కథను విన గోరిన చుట్టుప్రక్కపల్లెవాసులు కదేదారి. కాగా ఒకటే అర ఆ రోడ్డుమీదపడ్డారు. ఆమె!... మాడా లచ్చుమక్క! ఒకప్పుడు మహాలక్ష్మి లక్ష్మమ్మ! ఆ మారుమూల పల్లెల్లో తొలిసారిగా మహాక్షి కట్టుకొనే భాగ్యము ఆ యింటికే లభించింది. గనుక, అలాంటి కట్టడాన్నికూడ చూడనోచని పల్లెప్రజలు, అదివరకు తరతరాలుగ వస్తున్న యింటి పేరును కాస్త అవతలికిలేపి, ఆ స్థానే మహాక్షిని తగిలించారు. క్రొత్త ఒక వింత!-అంటే, ఆ నాటినుండి ఆ యింటికి మహాక్షి వాళ్ళన్న పేరు సార్థకమై పోయింది. కాలపురుషుని మహిమ!—'మహాక్షి' మంది నోళ్లలో 'మాక్షి'కాగా, 'లక్ష్మమ్మతల్లి' లచ్చుమక్కగా మారింది. లేకపోతే, 'లచ్చుమమ్మ తల్లీ! రాతిరి మా యింట్లో ది వంట్లో నలతగా ఉందని మాకలు నీళ్ళల్లో పొయ్యలేదు. పొద్దున కూటినీళ్ళుకూడ లేవమ్మా!! కడుపు మంటలో కండ్లు బైర్లు కమ్ముతున్నాయి!' అని ఆవుల వేళప్పుడు గొడారి రాముడు మొరపెట్టుకొంటే, 'ఉండరా! రాముడూ! వస్తున్నా'నంటూ వంటగదిలోనికివెళ్ళి, చింతగింజవేస్తే మునగని చిక్కని మజ్జిగలో అరముద్ద సంకటి కలిపి, వాడి దోసిట్లో పోసి, ఒక దబ్బ మామిడికాయ ఊరుగాయ చేతి కందిస్తే, తుమ్మితే ముక్కుల్లో పడేవరకు మెక్కి, 'నూరేండ్లు చల్లంగా బతుకు తల్లీ!' అని గొణుక్కుంటూ, చేతికి మిగిలిన పద్దుబువ్వ నాక్కుంటూ 'చేతులు కడుక్కోరా!' అంటూ ఉంటే గూడ విని పించుకోకుండా వెళ్ళిపోయే రాముడు, 'రామయ్యా! చెప్పువ బొటన తెగిపోయింది. కాస్త కుట్టి పెట్టరాదూ!' అని అడిగితే, 'తొలికోడికూసేయాళకాడ కూలేపినాడు కామసాని పెద్దబ్బ. మోటబాన చివిగిపోయిందట. తొందరగా పోతుండా! రేపెప్పుడైనా రా. చూద్దాంలే లచ్చుమక్కా!' అని తప్పుకుపోతున్నాడీవాడు.

అయినా ఆమె బ్రతుకుతూనే ఉంది!

అల్పస్వల్పమైన గుండెలైతే, పువ్వులమ్మిన చోట కట్టెలమ్మవలసి వచ్చినందుకు, ఆమె ఏమయ్యేదో గాయెవ్వా చూసుకోవలసి వచ్చేది. కాని ఆమె ఆ కోవకు చెందిన మనిషిగాదు. అందుకే ప్రతిదినము ఆమె కోడికూత వింటుంది. అంటే—అదివరకే నిద్రలేచి, కాగిన మంచినీళ్ళు నోట్లో పోసుకొని పుక్కిలించి ఉమ్మి, గుడిసెముందు కసవు చిమ్మి, ముంతెడు నీళ్ళు చల్లి, మూడు అడ్డగీతలలో ముగ్గు పూర్తిచేసి, ఆ పై ఉట్టిమీద బుడ్డిలోని ఆముద మంత అరచేతిలో వేసుకొని ఉచ్చికిరాచి, గంప నెత్తికెత్తుతుంది. ఇంతకూ ఆమె నిద్రపోయిం దెప్పుడని?—ఉదయాన నీళ్ళలోపోసిన పప్పు రుబ్బి, వడలు గాల్చి, ఆ వేడిమీదనే గుగ్గిళ్లు ఉడకబెట్టి, తమలపాకులు పేర్చి కట్టలుకట్టి, పొగాకుకు వాసనపడుమ చేసి గోనెపట్టలో చుట్టిపెట్టి, అన్నిటినీ గంపలో పొందుగా అమర్చి, ఆపై నాలుగు మెతుకులు ఉడకబెట్టి నోట్లో వేసుకొని, యే రెండవజాము అంత్యములోనో అలా నడుము వాల్చుతుంది.

కోడికూతతో బయలుదేరిన 'లచ్చుమక్క'

పొద్దు పడిమిట్టకెక్కేసరికి నాలుగైదు మైళ్లలో నున్న ఓ అయిదారు పల్లెలు తిరుగుతుంది. అత్త చాటు కోడళ్లు అరపడిరాగులలో 'ఆకువక్క' కొంటే, తల్లిచాటు పిల్లలు తవ్వెడు రాగులతో గుగ్గిళ్లు కొంటారు. పొలంగట్లమీదపడి నడుస్తూంటే, చద్దిబువ్వ తింటున్న రైతులు మిరపతోటలో వంకాయలో, లేదు కాపిని పచ్చిమిరపకాయలో కోసియిచ్చి వడలు కొంటారు. గొఱ్ఱెలు కాచుకొంటున్న బుల్లోళ్లు సోలెడు పాలిచ్చి పొగాకు కాడ కొంటారు. ఈ వూరినుండి ఆ వూరి కెంత దూరమో, ఆ వూరినుండి ఈ వూరి కంతే దూరమన్నట్లు, వస్తువులు మారినా దాదాపు బరువు మాత్రం అలానే ఉంటుంది. అదే బరువుతో ఆమె యింటిముఖం పట్టుతుంది పొద్దు నెత్తి కెక్కినపుడు!...

ఆ రావిచెట్టునీడలో ఆమె అలా చతికిలబడిందో, లేదో ఎప్పుడో మూతలుపడ్డాయి కండ్లు. అలసిసొలసిన శరీరానికి ఆ రావిచెట్టుబోదె హంసతూలికాతల్పమైనట్లుంది పాపం!

ఎంతోసేపు గడువలేదు ఆ విధంగా. అంతలోనే 'అంబా'అన్న అంకె వినిపడడంతో అదరిపడి లేచింది ఆమె! ఆ బాటమీద వెడుతున్న సవారి బండికిగట్టిన దాపటిగిత్త, కాలుగీరి, ఖణిల్లని 'అంకె'వేసి మోర ముందుకు చాచడంతో, అమాంతంగా బండి ఆమెవైపు మళ్లింది. అంతలోనే చేతికోల 'ఛళ్లు'మని, ఎడమచేతి పగ్గాలు బిగుసుకపోతే దారితప్పిన బండి యథాలాపంగా దారిన పడింది రెట్టించిన వేగంతో! ఆ యెద్దును అలానే చూస్తూ ఉండిపోయింది 'లచ్చుమక్క'!

ఆ ఎద్దు!—దాపటగట్టిన ఎఱ్ఱటి ఎద్దు. ముఖాన మూడు నామాలు తీర్చి దిద్దినట్లు ముచ్చట గొలుపుతున్న ఎద్దు!—తాను లక్ష్మమ్మగానున్న రోజుల్లో తోటిగంగులు పలమనేరు పరసలో పట్టుకొచ్చాడు పది రూకలు సరసమని! అది యే విధంగా యిల్లుచేరిందో దేవుని కెఱుకగానీ, వచ్చింది మొదలు మనిషిని దరిదాపులకు రానీయదు. అథవా ఎవరైనా యత్నిస్తే, ముంగాళ్లు రెండు పైకెత్తి పైబడ ఉంకిస్తుంది పొగరుమోతుగుఱ్ఱం లాగ! అందుకే తోటిగంగులుగాడు రెండు పగ్గాలతో దానిని గాటగట్టి, ఒక వెదురుబొంగు కొన చీల్చి, అందులో ఒక చట్టినిగట్టి దూరంగా నిలబడి నీరు త్రాగించడం, అంతకంటె దూరంగా నిలబడి పిడికెడు కసవు విదిలించడం చేస్తున్నాడు. ఒకనాడు లక్ష్మమ్మ కూలీల కోసమని వాడలో అడుగుబెట్టి, అడుగు కదల్పకుండా నిలబడి, ఆ పై ముక్కుమీద వేలేసి, గంగులయ్యను 'ఏమిటి సంగతి?' అని అడిగింది. గంగులయ్య ఓ కథంత ఉదంతంచెప్పి తల బాదుకొన్నాడు. ఏమనుకొనిందో యేమో లక్ష్మమ్మ—ఎద్దును సమీపించి మూపు తట్టింది. ఆ చల్లని చేతి చలువతో పొగరుబోతు తనానికి చలువలు కమ్మిందేమో?—అరమోడ్చు కన్నులతో ఆ యెద్దు మోర ముందుకుచాస్తే, పగ్గాలువిప్పి చేతపట్టుకొని, 'గంగులూ! సాయంకాలము వచ్చి లెక్క తీసుకోరా!' అన్నది, ఆ ఎద్దు తన్ను పిల్లలాగ అనుసరిస్తూ ఉంటే! ఓ బాధ తప్పిన గంగులయ్య. 'నా ఆయుస్సు బోసుకొని నూరేండ్లు బతుకు తల్లీ!' అని రెండు చేతులెత్తి దండం పెడితే వాడలోని ఆబాల గోపాలం దవడలు నొక్కుకున్నారు, ఆ యిల్లాలి దర్పంజూచి. ఆ నాటినుండి బిడ్డలాగ మేపింది ఆ యెద్దును. పరిస్థితులు మారినా, పదంతులు మారినా ఆ నోరులేని గొడ్డుమాత్రం తనని మరచి పోలేదు. కానీ ఆ బండిలో పోతున్న వారుమాత్రం!...

అదే బండిలో, అదే బాట మీదుగ తాను ఆ యింటికి కోడలై ఆ వూళ్ళో అడుగుబెట్టిన నాటి నుండి భారతోత్సవాలకు యేటేటా ఎన్నోసార్లు వెళ్ళింది. ద్రౌపదీమానసంరక్షణం కథ విని, ఆ రాత్రి నాటకం చూడవలెననుకోవడమే తడవు; అంగిట మాట అంగిట ఉండగానే యింటి ముంగిట బండి నిలబడేది. రంగడు బండి కడిగి, ఆకులకు రంగు పూసి, వెదురు చాపలతో సవారించుతూ ఉంటే, ఆయన వరి కసవు పఱచి దానిపై గోనెపట్ట వేసి, దానిపై ఒంతాత ఆకు చాప పరచి మెత్తని పరుపులాగ తయారుచేసేవారు. అంతటితో వదలకుండ ఎద్దులనుకూడ కడిగించి, కొమ్ములకు రంగుపూసి,

కుచ్చెలు తొడిగి, మెడపట్టెలుగట్టి, పరిగంచు నుంగు తలపాగ రాజీవిని ఒలకబోస్తూంటే, తానే స్వయంగా బండి తోలేవాడు. సేద్యగాడు రంగడు బండి ముందు ఒక్క అగువులో వెడుతూంటే, వాడి పెళ్ళాం మంగి, చంకబిడ్డ జారుతూంటే, 'ఆ బిడ్డనైనా యిలా కూర్చోబెట్టవే!' అంటేగూడ వినిపించుకోకుండా, 'నాకిదేం లెక్కలేదమ్మా!' అంటూ బండి వెంబడిబడేది! వాళ్ళ! రంగడు, వాడి పెళ్ళాం మంగి, ఆ నాటి తన స్థానాన్ని ఆక్రమించుకొంటే, వక్రగతులు పట్టింది తన బ్రదుకీనాడు.'!

ఎవరో గుండెలపై గునపాలతో బాదినట్లయి' ఆపై ఆలోచించలేక పోయింది. బండి ఒక్కవూపులో బొట్లవారిపల్లెమిట్ట ఎక్కుతూంటే, ఎద్దుల మెడ పట్టెల్లోని చిరుగంటలనాదం లీలగా వినిపిస్తూ ఉంది. ఇక అక్కడ ఉండలేక ఉండి ఆ దృశ్యాన్ని భరించలేక, ఆమె గంపనెత్తి కెత్తుకొనింది!

ఆమె నడుస్తూ ఉంది!...ఆలోచనలు వెనక్కు నడుస్తున్నాయి!

ఆ రోజు—

తనకు బాగా జ్ఞాపకం, ఆ రోజు కూడ తూర్పు ప్రక్కన్నే అదే చింతచెట్లమాటున పుట్టింది పొద్దు. పడమట ప్రక్క బోదిగుట్టల వెనుకనే క్రుంకింది. తన పిచ్చిగానీ, ఆ రోజు మాత్రమే యేమిటి?—తనకు బుద్ధి తెలిసిననాటి నుండి ఆ విధంగానే జరుగుతూ ఉంది. ఆ గమనంలో ఏమాత్రమైనా కుంటుపడినట్లు తనకు తెలియదు. చెప్పగా వినలేదు; ఒక్కపగటికథలో పండితోత్తముడు తప్ప. ఆయనకూడ చూడలేదట! ఎవరో ఒక మహాసాధ్వి తన భర్తకు జరుగబోయే ముప్పును పురస్కరించుకొని సూర్యుడి గమనాన్ని ఆపివేసిన సంగతి ఒకరు పద్యరూపంలో పారాయణంచేస్తే తాను కథలాగా చెప్పాడు. అంతే!—అయితే ఆ గతితప్పని లయలో ఎన్ని అపశ్రుతులు దొర్లిపోతున్నాయో! తన ఆలోచనలు తనకే విపరీతంగా తోచి ఒక్కసారి నవ్వుకొనింది అప్పమక్క. తన రూపం, తన బ్రదుకు, తన ఆలోచనాపరిధి—ఎవరైన చదువుకొన్న మహాత్ముడు వింటే తనకంటే ఎక్కువే నవ్వుతాడు. ఎందుకంటే, అనుభవం సంగతి అతనికి తెలియదు కాబట్టి. లేకపోతే తన కత్తికి యెదురులేకుండా, ఆ గ్రామాన్నంతా గడగడ లాడించిన గంగిరెడ్డి, ఆ వూరికి మూడామడల దూరాన—అదిగూడ ముప్పిట చెట్లమాటున, నీళ్ళేటట్లు తన్నులుతిని మూడు రోజుల తరువాత ముట్టుకోలేని స్థితిలో ముక్కలు పట్టుకొని దహన సంస్కారాలు అయిందనిపించుకొంటే, ఎవరో దారినపోతూండిన దాసయ్య ప్రొద్దు గ్రుంకేసరికి ఆ వూళ్ళో అడుగుబెట్టి, ఆకలిబాధకు తట్టుకోలేక, అభిమానంతో అడుక్కోలేక భజనమందిరంలో కూర్చుని ఆత్మారాముని తృప్తికోసం రామనామ స్మరణచేస్తే విందుభోజనం జరిగిపోయింది! ఆ పై ఆ గుళ్ళో కాసేపు కన్నుమూసి ఉదయాన వెడదామనుకొన్న ఆ పుణ్యాత్ముడు ఆ గుళ్ళోనే శాశ్వతంగా కన్ను మూస్తాడని ఎవరికి తెలుసు? మహావైభవోపేతంగా దహన సంస్కారాలు జరిపించుకొంటాడని ఎవరికి తెలుసు? కాలపురుషుని మహిమలు! ఒకచోట వెలుగు—ఒకచోట చీకటి, ఒకచోట పెండ్లి—ఒకచోట చావు, ఒకచోట నవ్వు—ఒకచోట యేడుపు...అంతా విడ్డూరమే! అయితే ఈ విడ్డూరాలన్నీ కర్మసాక్షి కంటబడినట్లులేదు. లేకపోతే ఏమాత్రమైనా పట్టించుకోకుండా అంత నింపాదిగా నడుస్తాడా ఆ రోజు కూడా!

ఆ రోజు ఆయన మంచంమీద నిర్జీవంగా పడిఉన్నాడు. ఊరువూరంతా ఒకటై యిల్లు నిండిపోయింది. మాంత్రికుల చేతుల్లో వేపమండలు గిరికీలు కొడుతున్నాయి కసక్కమని వాటితోనే కోడిపుంజు గొంతుకోసికి ఆ రక్తంతో తాను తీర్చిన బొమ్మకు మూడుసార్లు దిగలిపి, ఆ పై కోడిని చంకనబెట్టి ముసుగువేసి, చల్లగా జారుకొంటున్నాడొక భూతవైద్యుడు సుమారు యేడాదిక్రిందట పాత గుంటలో మకాంపెట్టి, వైద్యంసంగతి అటుంచి, హస్తవాసిలో అఖండ పేరుప్రఖ్యాతులు గడించిన ఇంగ్లీషు వైద్యుడు సూదిమందు తయారు చేసుకొంటున్నాడు. ఎక్కడినుండి ఊడిపడ్డాడో నాటువైద్యుడు శీపాటి వెంకటరెడ్డి ఒక్కవూపులో జనాన్ని చీల్చుకొని లోపల ప్రవేశించాడు. ఆయన చేతిని తన చేతిలోనికి

తీసుకొని వాడి పరీక్షలో మునిగిపోయాడు. తప్ప తాగి తూలుతున్నా తప్పుపలుకని నోరు వెంకటరెడ్డిది అక్కడి 'హంగామా' అంతా ఒక్కసారి తేరి పారజూచాడు. ఒక్క వెఱ్ఱి నవ్వు నవ్వి, 'మీకేం పిచ్చి పట్టిందర్రా! ఎఱ్ఱివాయారి గుంపా!.. ఇంకొక్క గంటేరా అబ్బకు! ఆ మీదట...అంతే!!' అంటూ వచ్చినవాడు వచ్చినట్లుగ వెళ్ళిపోయాడు—లేదంటే ఆ పిచ్చి నవ్వును కాస్త పొడిగిస్తూ.

'అయ్యో! యిదేం మాయదారి రోగమమ్మా! ఎంతమంది వైద్యులు?...ఎంత మందు?...ఎన్నిరూపాయలు? ఏం కత? దీని అంతే తెల్లదు! ఏ కలికాలమో? ఏం రోగాలో?' అని వాపోయింది అక్కడ గుమిగూడిన అమ్మలక్కలతో రామలక్ష్మమ్మ.

రంగడు తలదగ్గఱ కూర్చుని తంటాదు కొంటున్నాడు. తాను ఓ మూల కూర్చుని తపించి పోతూ ఉంది. ఆ యింట్లో అడ్డదిడ్డపు పనంతో అటు యిటూ తిరుగుతూ ఉంది రంగడి పెళ్ళాం. రామలక్ష్మమ్మ మాటలు తన చెవుల్లో పడ్డాయి. నిజమే! ఎంతోమంది వైద్యులను పిలిపించింది. ఎన్నో మందులు యిప్పించింది. చెప్పిన దేవుడుకంతా ముడుపుగట్టింది తన భర్తను రక్షించమని. రూపాయను పైసలాగ చూచింది. ఫలితంగా అంతుచిక్కని రోగం వైద్యులకు, అంతు తెలియని ఆయన ప్రవర్తన తనకు మిగిలాయి!

ప్రవర్తన అంటే జ్ఞాపకం వస్తూ ఉంది. వెనుకాముందు ఎవ్వరులేని ఆ యింట్లో కొత్తకోడలుగా 'భిక్కుభిక్కు'మంటూ అడుగుబెట్టింది. లంకంత ఆ కొంప...ఒంటరిగా ఆయన...ఆ యింటి ఆవరణలోని గుడిసెలో రంగడు, వాడి సంసారం... యే విధంగా కాలం గడుస్తుందో అని భీతి భీతిగా ఉంటే, ఆ భీతిని ఆయన పరిష్కరించారు చాల చిత్రంగా! 'చూడులక్ష్మీ! పొలములో మడక కట్టుతాము. ఎడమచేత పగ్గాలుబట్టి, కుడిచేత ములుకోలపట్టితే, మడక చెప్పినట్లు తిరిగి పొలాన్ని సారవంతం చేస్తుంది. ఆ పొలంలో పంట, పగ్గాలు చేతబట్టినవాడి ప్రతిభమీదనే ఆధారపడి ఉంటుంది. ఈ సంసారానికి నీవూ అంతే!' అంటూ యినప్పెట్టె తాళాలు చేతికిచ్చాడు. గుండెకోసి అరచేతిలో పెట్టడం,పువ్వుల్లో పెట్టి పూజించడంలాంటివి యథాతథంగా జరుగకపోయిన, అంతకంటే మిన్నగానే భావించింది తన కాపురాన్ని. ఆ రోజునుండి వరి నాట నాటడానికి కూలీలు...కలుపు తీయడానికి మనుష్యులు... అంతా తన చేతిమీదుగా సాగింది. మెట్టినింట వరించిన కీర్తి పుట్టినింటి వర కెగ్రబాకి కన్న పేర్లు కమ్మని ఊహల్లో తేలిపోయాయి. కాని విధివైపరీత్యం...

అప్పటికి సరిగ్గా అయిదు సంవత్సరాలక్రితం 'ఇదో! రెండు రోజుల్లో తిరిగి రామా!' అంటూ ఏదో పనిమీద గ్రామాంతరం వెళ్ళినతడు సుమారు పదిహేను రోజుల వరకు తిరిగి రాలేదు. తనకు పెండ్లి అయిన నాటినుండి చూస్తూనే ఉంది, ఆ విధంగా యెన్నడు జరుగలేదు. నూరు ఆరయినా, ఆరు నూరయినా ఆయన నోరుజారని మాటకారి. అందుకే ఆలస్యాన్ని ఆలోచించలేక, ఆయనలేని యింటిని భరించలేక మనసు పరిపరివిధాల పోతూ ఉంటే, ఆ నాడు రాత్రి యెనిమిది గంటలై ఉంటుంది. తాను పుట్టింటినుండి పట్టుకవచ్చిన భాగవతాన్ని దీపం ముందుంచుకొని కూర్చొనింది నాలుగు పద్యాలైన చదువు కొందామని. అలా కూర్చొనిందో లేదో, 'ఖణేల్లని' ఊంకె చెవిని పడింది.

ఎప్పుడైనా యేదైనా విడ్డూరం జరిగితేగాని, ఎద్దెద్దు ఆ విధంగా 'ఊంకె' వేయదు. ఏం జరిగిందో యేమో అన్న సంశయంతోనే పుస్తకాన్ని మడిచిపెట్టి తాను కొట్టంవైపు వెళ్ళింది. అక్కడి పరిస్థితిచూచి అలానే మ్రాన్పడి పోయింది!

సాధారణంగా ఆయన ఆకృతికంటే ముందు ఆయన పిలుపు చెవుల్లో పడేది. ఉన్నపళంగావచ్చి యెదుటబడితే ఎంతో పొంగి పోయేవారాయన. అలాంటి వారు యెప్పుడు వచ్చారో యేమో, సద్దుసడిలేకుండా వచ్చి కట్టుబట్టలతోనైనా విప్పకుండ కొట్టములో మంచము వాల్చుకొని పడుకొన్నారు. అదిగూడ రంగడు పడుకొనే మంచంమీద!

తలగిఱ్ఱున తిరిగి పోయింది!

అంతకంటే వేగంగా ఆలోచనలు!!

'ఒక వేళ తన పొరపాటు అతనికంట పడిందేమో! అందుకేనేమో! యీ మానసికమైన బాధ— అటువంటి అవకాశమే లేదు. అసలు వారు ఊళ్ళోనే లేరుగా! తాననుకొన్నట్లు అతని కంటబడి ఉండే కత్తికి కండజేసి పారిపోవల్లె అభిమానధనులే! తన గిలిగాపీ, అలాంటివేమీ కాదు. ప్రయాణంలో యేదో అవాంతరం జరిగి ఉండవచ్చు.' అని తన్ను తాను సమాధానపరచుకొనింది. అతనిని సమీపించింది. 'ఏమండీ!...ఏమిటీ అన్యాయం?...ఇంతకూ యెప్పుడు రావడం? ఎందుకిక్కడ పడుకొన్నారు? లేవండి!' అని బ్రతిమలాడుతూ ప్రశ్న పరంపరలలో ముంచెత్తింది. కానీ ఆయన కదిలీ మెదల్లేదు. తీక్ష్ణమైన ఆ చూపుల్లో మార్పు కనబడలేదు. అంతే! 'అబో దిబో' అని మొత్తుకుంటూ కుప్పగ కూలిపోయింది తాను!

కొంపలకు నిప్పంటుకొన్నా, మేడమీద నిలబడి వేడుక చూడడానికది పట్టణంకాదు. చీమ చిటుక్కుమంటే, గుండెలు కలుక్కుమనే మనస్తత్వం పల్లెవాసులది. కాగా యిరుగు పొరుగు గుంపు గూడారు. ఎక్కడున్నాడో యేమో రంగడు ఒక్క అంగలోవచ్చి అక్కడ వాలాడు. దిష్టితగిలిందని, గాలిసోకిందని తలకొక్క తీరుగ మాట్లాడుతుంటే, భూతవైద్యుడు అక్కి మునెప్పను పిలువమన్నారెవరో! ఆ మాటతో అతనికోసం పరుగెత్తాడు రంగడు. ఒకరు దృష్టి తీయమంటుంటే, ఒకరు ఎఱునీళ్ళు దిగదీసిపోయమంటున్నారు. వేపమండకోసం ఎవరో పరుగుదీశారు.

అంతలోనే అనుకోనివిధంగా ఆయన పైకి లేచారు!

'నాకేం భూతం, గాలి, దెయ్యం సోకలేదు. మీరు వెళ్ళండయ్యా!' అని విసుక్కున్నాడు. సాధారణంగా ఎంతో నెమ్మదిగా, వేర్పరితనంగా మాట్లాడే మనిషి, ఆ విధంగా చీదరించుకొనేసరికి, 'నిజంగా యిది భూతలక్షణమే' నన్నాడు ఒక నడికారాయన.

'నీకేనయ్యా చెప్పేది. నాకేమీ జబ్బులేదు. మీరు తప్పించి, నన్నేమీ భూతాలు, దెయ్యాలు పట్టలేదు. కాసేపు ప్రశాంతంగా ఉండనీయండి. మీరు వెళ్ళండి బాబూ!' అని చేయెత్తి దండం పెట్టాడు ఆ చేయెత్తు మనిషి! 'ఇది మరీ బాగుందే వరుస' అని గొణుక్కుంటూ ఒక్కొక్కరుగ వీధిని బడ్డారు.

ఆయన విసుగ్గా యింట్లో అడుగుపెట్టారు. విసుగ్గానే నాలుగు ముంతలు నీళ్ళు పైన జల్లుకొన్నారు. అంతకంటే విసుగ్గానే నాలుగు మెతుకులు ఎంగిలిపడ్డారు. అంతే! ఆ రోజునుండి అదే వరుస. తింటే తింటారు లేదా లేదు. ఇష్టముంటే పొలమువైపు పోతారు. లేదా లేదు. ఎవరేమి అడిగినా, మరేమి మాట్లాడినా, మౌనమే సమాధానం. లోపం యెంచలేని తన ప్రయత్నంలో కూడ గంటలు, దినములు, నెలలు గడచిపోయాయి. వచ్చిన భూతవైద్యులు, యిచ్చిన మందులు ఫలితాన్ని ప్రకటింపలేక తన బ్రదుకునకే పరీక్షపెట్టాయి. ఆ పరీక్షకు తట్టుకొని నిలబడడమే దుర్భరమైపోయింది.

రోజులు దొర్లిపోతున్నాయి. పండినకూడులాగ ఆయన ఆరోగ్యంకూడ క్షీణదశ పట్టింది. రాత్రి పూట ప్రశాంతంగా ఆయన పడుకొనివున్న సమయాన అతనిదగ్గర జేరడానికి ఒకటిరెండుసార్లు ప్రయత్నించింది. దాంతో ఆ రాత్రి ఆయన మళ్ళీ యెప్పుడు వస్తారో యేమో? స్నానానికి నీరు, అన్నపానాదులు సిద్ధంగా అమర్చి తాను యెదురుచూస్తూ కూర్చోవలసిందే! ఆయన యెప్పుడైనా రావచ్చు. వచ్చి అంత యెంగిలిపడితే పడవచ్చు; లేదా, అలాగే పడి నిద్రపోవచ్చు. అయినా తానేమీ పలుకడానికి లేదు. జీవిత భాగస్వామినిగా తన హక్కు రద్దయిపోయింది. ఆలోచిస్తే ఆడదానికి యింతకుమించిన శిక్ష ఉండదేమో! ఇది తలచుకొన్నప్పుడంతా తన గుండె చెఱువయేది. ఆ గుండెభారంలో నిద్ర దూరమయ్యేది. అలా యెన్నోరాత్రులు గడచిపోయాయి, తాను మేడమీద నిలబడి లోకాన్ని చూస్తూ ఉండగానే!—లోకం!—అనుకొంటూ ఉంటుంది తన ఆస్తిపాస్తులకు అంతస్తు గట్టి, తనది అందాలకాపురమని. కానీ వారికేమీ తెలియదు. దూరంనుండి చూస్తే నునుపుదేరినకొండలు, ఆకాశం ఒక్కటై

పోయి, ఓ అర్ధవృత్తాకారాన్ని గీచినట్లు తోస్తుంది. కానీ ఎక్కడి కొండలు?...ఎక్కడి ఆకాశం?...తన బ్రదుకు కూడ అలాగే తయారయింది. అయినా ఆ బ్రదుకును అలాగే నెట్టుకొస్తూ ఉంది, 'ఏనాడైనా గట్టుచేరలేకపోతామా!' అన్న విశ్వాసంతో. కానీ ఆ విశ్వాసం ఆ నాటితో.........

'అదుగో! ఆయన కన్నులు తెఱచారు' అన్నా రెవరో!

అందరు మంచం చుట్టు గుమిగూడితే అందరి కంటే ముందు తాను ఆయన తలదగ్గర నిలబడింది. ఎన్నడులేనిది ఆయన కండ్లు రెండు నిండుగా ఉన్నాయి. ప్రయత్న పూర్వకంగ తలదిండువైపు చూపులుంచి, చేతిని ఆ వైపు త్రిప్పబోయారు. అది గమనించిన తాను దిండుక్రింద వెదకింది. అక్కడ ఓ పొడుగాటి కవరు చేతికి దొరికితే, తాను తీసుకొనింది. ఆయన మెల్లగా ఆ కవరును అందుకొన్నారు. ఒకసారి తన వైపు...ఒకసారి మంచం కాలికి తల ఆనించి యేడుస్తున్న రంగనివైపు ఎంతో ప్రయాసతో చూపులు త్రిప్పారు. ఆయన భావము, బాధ యెవ్వరికీ అర్థం కాకుండా బొమ్మల్లాగ నిలబడి ఉంటే, ఆయన ఆ కవరును రంగడి చేతిలో పెట్టారు.

'లక్ష్మమ్మ అదృష్టం! గండం గడచి పోయిందని' కొందరంటే, 'అది గాదయ్యా, యిది చావు తెలివని' కొందరన్నారు. ఏది యేమైనా భగాత వైద్యుని చేతిలోని వేపమండ మరింత వేగాన్ని పుంజుకొంటే, ఆ గాలి ధాటికి తట్టుకోలేక అక్కడి దీపం 'గుటుక్కు' మనింది.

అందరూ ఒక్కసారి గొల్లుమన్నారు!......

'చూడమ్మా! పోయిన వాళ్ళతో కలిసి మనం పోలేం. అంతా ఋణం. ఆ ఋణం తీరిపోతే యెవరి కెవరు? ఎవరిదోవ వాళ్ళదే తల్లీ! దిగులుపడి కూర్చుని సాధించగలిగిందిమాత్రం యేముంది?'

కర్మ క్రియలన్నీ జరిగిపోయిన తరువాత వూరు వెడుతున్న తండ్రి నోటినుండి వెలువడిన అనునయ వాక్యాలు. తనమండి సమాధానం లేకపోయే సరికి మళ్ళీ ఆయన ఆరంభించారు.

'అమ్మడూ, అల్లుడి చేసిన పని నాకేమీ అర్థం కాలేదు. అసలు ఆ విధంగా చేయవలసిన అవసరం యేమి గలిగిందో యెంత ఆలోచించినా బుర్రకందడం లేదు.'

'నీకేగాదు నాన్నా, నాకు కూడ అర్థం కావడం లేదు ఆయన యెందుకీ విధంగా చేసి పోయారో!' ఏదో మంచి సమాధానం చూపగలిగింది కానీ, కన్న కడుపుకే కడుపుచించి చూపలేకపోయింది తాను.

'అదేనమ్మా నేనూ అనేది! లోకంలో లేని తీరుగా చేసిపోయాడు. బ్రతికినంత బ్రదుకు బ్రతికి కడకు సేద్యగాని చేతుల్లో నీ బ్రదుకు పెడతాడని కలలో గూడ తలంచలేదు. నా మాట వినుతల్లీ! రంగడు మంచివాడే కావచ్చు. కానీ డబ్బు!—దాని గాలి సోకకుండనే ఉండాలి. ఆరంభమైతే యిక దానికి అంతం లేదు. దయ, ధర్మము, నీతి, నియమము అన్నీ ఆ డబ్బుముందు తల వొగ్గవలసిందే!'

'అయితే నన్నేం చేయమంటారు నాన్నా!'

'నువ్వేమీ చేయవలసిన పనిలేదమ్మా! 'ఊ.!' అను. మూడు కోర్టుల కెక్కించి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను. నాకు తెలియని చట్టమేముంది? వీడి పేరుతో వీలునామా వుంటే సరిపోతుందా?'

డబ్బు మహిమ...రంగడి ప్రవర్తనలో మార్పు... కోర్టులు కచ్చేరీలు...యీ మాటలు మెదడును స్పృశించకముందే అంతరాత్మ మేలుకొనింది.

'నువ్వనుకొన్నావు చేసినతప్పు యెవరికంట పడలేదని, కానీ ఆయన కంటబడింది!'

'నిజమా ?'

'అవును అందుకే ఆ మనోవేదనతోనే ఆయన కుళ్ళికుళ్ళి కన్ను మూశారు.'

'నేనేమీ కంటికావరంతో తప్పుచేయలేదు. కడుపుతీపి నన్ను ప్రోత్సహించింది. ఆయన దృష్టిలో అది తప్పుగా తోస్తే నన్ను దండించవచ్చుగా!'

'ఆయన దృష్టికేగాదు - హైందవ సంప్రదాయానికి, సాంఘిక నియమానికి నీ ప్రవర్తన

గొడ్డలిపెట్టు. ఆయన మహోత్తముడు. దూరదృష్టి కలవాడు. ఇంతకాలము అతనితో కాపురంచేసి ఆమాత్రం గ్రహించలేకపోయావా నీవు? నిన్ను కించపరచి తాను కించపడదలచుకోలేదు కాబట్టే కిక్కురు మనకుండా ఆ బాధను భరించారు. అయినా, ఆయన నిన్ను దండించలేదని భావిస్తున్నావా?'

'అవును మరి!'

'హ్హహ్హహ్హ! పిచ్చిదానా! ఈ ఆస్తిపాస్తులను రంగడిచేతుల్లో పెట్టడములోని ఆంతర్యమేమను కొన్నావ్? ఈ సంపద తనది కావడంతో వాడి కళ్లు నెత్తికెక్కుతాయి. అప్పుడు యెంత ప్రయత్నించినా వాడి కళ్లల్లో నీవు పడవు. వాడి పెళ్లాం నిన్ను కుక్కకన్నా హీనంగా చూస్తుంది ఆ వాతావరణంలో యిక నువ్వుండలేవు. కడుపు చేతబట్టుకొని బయటపడితే అప్పుడు తెలుస్తుంది కడుపుతీపి!'

'ఆఁ! యిదా ఆయన ఉద్దేశ్యం! అయితే మరో జన్మ, యమలోకంలాంటి మరో లోకం ఉన్నాయో లేవో నాకు తెలియదు. నా తప్పుకు ప్రాయశ్చిత్తం ఈ జన్మలో జరిగితీరవలసిందే!'

'ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్?' — తండ్రి హెచ్చరింపుతో అంతరాత్మ అదరిపడి ఆగిపోయింది. సమాధానం చెప్పవలసిన బాధ్యత తనమీద పడింది.

'నాన్నా! నా చేతుల్లోకంటే రంగడి చేతుల్లోనే ఆస్తిపాస్తులు భద్రంగా ఉండగలవని ఆయన అభిప్రాయమైతే అలాగే జరుగనీ! బ్రదికినకాలంలో కూడ ఆయన ఆత్మకు శాంతి కరువైపోయింది. ఇకమీదటగూడ ఆయన ఆత్మను బాధపెట్టలేను. మీతో సహకరించి ఒకవేళ రంగడి ప్రవర్తనలో మార్పులంటూ జరిగితే అది నా మేలుకొరకే!'

'బ్రదుకు ఉపన్యాస వేదికగాదు తల్లీ! నీతి నియమాలు వల్లించడానికి. బాగా ఆలోచించు. కడుపు తీపి చెడ్డదికాబట్టే యింతగా చెబుతున్నాను. వెన్నమీద గువ్వలా పెరిగిన బిడ్డవు. ఈ బాధలకు తట్టుకోలేక......'

'నాన్నా! అంత సులభంగా చస్తే, ఈ జన్మకు విముక్తి లేదు. బడిలేని మారుమూలపల్లెలో కన్నతండ్రి బాధ్యతలేగాక, బడిపంతులు బాధ్యతనుగూడ నెత్తిన పెట్టుకొన్నారు కాబట్టే, ఈ జన్మకు అక్షరజ్ఞానము లభించింది. అప్పుడు వేర్వేరు వాక్యమంటే అర్థం. అప్పుడు అర్థం వాక్యానికే పరిమితమనుకొన్నాను. కానీ యిప్పుడు గ్రహిస్తున్నాను. అది జీవితానికీ అర్థమని!'

తన ధోరణి అర్థంకాకుండా తండ్రి నివ్వెరపడి నిలబడిపోతే, తానే పూర్తి చేసింది. తాను 'కర్త' అయి, చేసినపని 'కర్మ' అయితే, జరుగనున్న ఫలితం 'క్రియ' అని! తన మాటలు రుచించకపోగా, తండ్రి ఆగ్రహంతో అంతా గ్రహచారంమీదకు నెట్టి వెళ్ళిపోయాడు!

అంతే! ఆ తరువాత ఆయన మాటలు నిజం కావడానికి యెంతో కాలం పట్టలేదు. నెలలు తిరుగకముందే రంగడు ఆ యింటి యజమాని! ఆయనగారి సతీమణి సర్వాధికారిణి!! ఇక తన పాత్ర యిత్తడి రాగి పాత్రల పరిచయానికి దిగేటట్లు తోచింది ఆ సాధింపులు, చాటుపోటు మాటలు వినేసరికి! అంతే! కాసంత నీడకు మకాం ఊరికి ఉత్తరాన పూరిగుడిసెకు మార్చబడితే, జానెడు పొట్టకోసం గంప నెత్తికెక్కింది!......

* * *

ఆమె నడుస్తూనే ఉంది!

ఆలోచనలలో దోవ జరిగిన సంగతి తెలియనే లేదు. ఎప్పుడో తన పూరిగుడిసెలో అడుగుబెట్టింది! ఉస్సూరుమంటూ నెత్తిగంప నేలకు దించింది. గత స్మృతులలో మనసు వికలమైపోతే, అక్కడే–ఆ గంప ప్రక్కన్నే నేలకు వాలిపోయింది, ఇంతవరకు నెత్తికి చుట్టు అయిన పైటచెరగు నేలమీద పరుపు కాగా. అలా యెంతో సేపు గడువలేదు. ఆ బలహీనత ఆమెలో యెంతో సేపు నిలువలేదు. కర్తవ్యం మళ్ళీ ముందుకు లాగుతూవుంటే, ఆమె పైకి లేచింది, ఎంత ప్రయత్నించినా ఆలోచనలు ముసురుకొంటూనే ఉన్నాయి, ఉట్టిమీద కూటిపిళ్ళ చట్టిని ఎఱ్ఱచీమలు ముసురుకొన్నట్లు. గంపలోని సంచినితీసి ముందర వేసుకొనింది. అది పాతగుడ్డలతో కుట్టిన వాలు

గ్గైదు పారలుగల సంచి. పల్లెటూళ్ళల్లో తిరుగుతూ ఆకువక్క అమ్ముకొనేటప్పుడు ఒకా ఏడ వడ్లు పెడితే, మరొక మనువ రాగులు పెడుతుంది. ఒక్కొక్క పారలో ఒక్కొక్క రకం గింజల్ని పోసుకొంటుంది. ఆ విధంగా పోసుకొనేటప్పుడు యెంత జాగ్రత్తపడినా ఒక పారలో గింజలు మరొక పారలో పడకమానవు. ఇంటికి వచ్చిన తరువాత నెమ్మదిగా కూర్చుని ఆ గింజలను వేర్పరచుకొని కుండల్లో భద్రపరుచుకొంటుంది. ఆ రోజు ఒక్కొక్క పారనే ఖాళీ చేస్తుంటే, రాగులు పోసిన పారలో కాసిని వడ్లు కనుపించాయి. వాటిని ఆమె క్రిందపోసింది. పైట చెరగును చుట్టగాచుట్టి పిడికెడు నిండికి పట్టుకొనింది. ఆ ధాన్యంమీద ఆ చుట్టను అలా పత్తి, పైకిలేపితే వడ్లుమాత్రం ఆ చుట్టకంటుకొంటాయి. అటుపై ఆ చుట్టను అవతలికితీసి అలా తట్టితే వడ్లగింజలన్నీ వేరుగా రాలుతాయి. ఆమె ఆ గింజలను వేరుచేస్తూ ఉంది— కాదు—కర్మ సిద్ధాంతములో పాప పుణ్యాలనే వేరు చేస్తూ ఉంది— వాటిని కన్నీళ్ల ప్రకాళనం చేస్తూ ఉంటే!

నెత్తిమీది రావిఆకుమోపు క్రుంగదీస్తుంటే మేక ముందుకు లాగుతూంటే, భుజంమీద దోటి వడకతో పోటీ పడుతూంటే, అడుగు ముందుకు వేయలేక అవస్థపడుతున్న రాముడు కంటబడ్డాడు. సాధారణంగా రోజూ అయితే, ఎక్కడివని అక్కడ వదలిపెట్టి, ఒక్కముంపులో వెళ్లి మోపు దించుకొని, మేకనుదీసి గుంజకుకట్టి గంపలో మిగిలిన కాసిని గుగ్గిళ్ళలేదా, రెండు వడలు వాడి చేతులో పెట్టి, ఎంతో ఆప్యాయంగా ఎదకు హత్తుకొని 'ఏనాటికైనా నా బిడ్డకు మంచికాలం రాకపోదులే!' అని సంతృప్తిపడేది. కానీ ఆ రోజు ఆమె మనస్సులో మనస్సులేదు. మమకారం నశించిపోయింది. కాగా మనిషి కదలలేకపోతే, 'అమ్మా! అని పిలిపించుకోవాలన్న ఆశతో తాను రాముణ్ణి కనుక్కొన్నా, రాముడు ఆయన బిడ్డగాడు. ఆయన బిడ్డయితే ఆయనలాగానే బ్రదికేవాడు. వాడు రంగడి బిడ్డ. అందుకే రంగడిలాగే బ్రతుకుతున్నాడు'అన్న మనసులోని భావం మాటల రూపాన్ని సంతరించుకోలేక మథనపడిపోయింది.



తెలుగు నిఘంటువులలో దేశ్యపదములు

1

జనవరినెల భారతిలో నేను వ్రాసిన వ్యాసాన్ని పురస్కరించుకొని పలువురు పండితులు వ్రాసిన విషయములకెంతయు సంతోషమును బొందినాను. ఈ సందర్భములో కొన్ని విషయములను పేర్కొన దలచినాను.

అన్యభాషాపదముల విషయము అవసరమే యైనను వ్యవహారములలోనున్న దేశ్యపదములపై శ్రద్ధవహించుట చాల ముఖ్యము. ఏవి సరియైన దేశ్యములో, అవి వేటికైన నపభ్రంశములో మున్నగునవి శ్రద్ధగా పరిశీలింపవలెను. ఆయా పదములు ఆయా ప్రాంతములలో నేయే యర్థములలో వ్యవహరింపబడుచున్నవో పరిశీలింపవలెను. ఒక పదము ఒక ప్రాంతమందు నొక యర్థములోనుండు వేఱొక ప్రాంతమున నింకొక విధముగనో, ఇంకొక యర్థములోనో ఉండుట జరుగవచ్చును. నేను వ్రాసిన పదములీ ప్రాంతపు జనుల వ్యవహారములో నెట్లున్నవో గ్రహించి వ్రాసినాను. దానిని కొందఱు విస్మరించినట్లున్నారు. ఈ వ్యవహారముల గ్రహించునప్పుడు గూడ సాధ్యమయినంతవఱకు పల్లెటూళ్ళలోని సామాన్య ప్రజానీకములోనున్న వ్యవహారమును గ్రహించుట యవసరము. భాషాధ్యయనము, పలువురు ఇతర ప్రాంతీయులతోటి పరిచయము మున్నగునవిగల జనులలో తత్ప్రాంతమున సహజమైన కొన్ని ప్రయోగములు కనబడుట గూడ గలదు.

నేను మొదటి వ్యాసము వ్రాసిన తరువాత మఱల కొన్ని పదముల సేకరించి యుంటిని. కాని వానిలో చాలభాగము మార్చి, ఏప్రిలు మాసములలో వ్రాసిన మిత్రుల లేఖలలో చేరినవి. కొన్ని క్రొత్తవి వచ్చినవి. మెదకు (మెతుకు) జిల్లా ప్రాంతపు వ్యవహారమునుబట్టి మార్చి ఏప్రిలునెలలో వ్రాసిన పదాలపై నా యభిప్రాయమును తెలుపుచున్నాను.

శ్రీ శాస్త్రి జి. బాహులేయ

అంబ, అంబాడు అను పదములకు వీరు చెప్పిన యర్థము క్రొత్తది. ఈ ప్రాంతములో నా యర్థము లేదు.

అడకొత్తు లేక అడుకొత్తు అనుదానినిగూర్చి వ్రాయుచు 'అంతేకాని అడుక్కొత్తు' సరిగాదు అని వ్రాసినారు. పైన నేను చెప్పినట్లుగా నేను వ్రాసిన దీప్రాంతపు వ్యవహారములోనున్న పదమనునది విస్మరించినారు.

ఇలపీటపై 'ఈలకత్తి, ఈలపీట' వ్యవహారమున నున్నట్లు వ్రాసినారు. ఇచట హ్రస్వమే గలదు.

కంచు+అండి=కాచండిగా మారినదనుటలో నంత ఔచిత్యములేదు. ఉమర్‌ఖయ్యాములోని కాచాండము దీనికి సంబంధించినదికాదు. అది గాజుపాత్రకని వ్రాసినారు. కాచండిలోని చవర్ణము దంత్యముగానే గలదు.

'కూడూలేదా కుంభంలేక, అన్నదే సరైన ప్రయోగ'మన్నారు. ఇక్కడ మఱల బాహులేయగారు సంకుచితత్వమును ప్రదర్శించినారు. కూడుకుమ్మ అనునది వారన్న కూడూ కుంభం అన్నదానికి సమానమైన నర్థములో మున్నదని చెప్పుట కష్టము.

కొయ్య అనునది 'గుంజ'యని వా రుదహరించిన యర్థములోను నిట ప్రయోగము గలదు.

పొరెవారన్నది ఇటను గలదు. దాని యర్థము వేఱు. నేను వ్రాసినది వేఱు.

శ్రీ నెమిలికొండ చంద్రమౌళి

కరీంనగరము (దీనికి, మహబూబునగరమునకు పాలమూరు అన్నట్లు, అరిపిరాల మొదటిపేరు)

మెదకుజిల్లాకు ఆనుకొనియున్నది కావున చాల పదములు కలిసివుండును.

ఇగ్గుట అన్నది నే సీజిల్లాలో వినలేదు. ఒరయు, అవుసుల, ఎంచు, ఎత్తివేయు అన్నవి ఇచట సామాన్యమే.

ఒలు అనునది ఒర్లు అను విధముగా వ్యవహారమున గల ఏ. కచ్చరము, కంచరి ఉన్నవి. కలియామా కున్నదికాని ప్రత్యేకించి విడిగా కళివేసాకు అనునది లేదు. కమ్మకు తాటాకుకమ్మ (ఆకు) మూలము. మెంట, చిమ్మట అన్నవి లేవు. మిగిలినవన్నీ వ్యవహారమున నున్నవి. కాంపా+హండి' కావండి కాగల యవకాశ మున్నదేమో భాషాశాస్త్రజ్ఞులు పరిశీలింపవలెను.

ఓడప్పలు రొట్టెలు కావన్నారు. ఇదీ సంకుచి తత్వాన్నే సూచించును. ఇక్కడ ఓడప్పలు రొట్టెలే. వారు పేర్కొన్న వంటకాన్ని ఇచట బిళ్లలని వాడుదురు.

శ్రీ సత్యనారాయణరాజుగారు వ్రాసిన వానిలో అంటు అన్న అర్థములో ఇక్కడ అంట్లు అని వ్యవహారము గలదు. తాంబూలమునకు తాంబాలమని వాడుక యుండుట విశేషము.

ఏప్రిలు నెలలో శ్రీ ఆవంచ సత్యనారాయణ గారు సర్కారు, తెలంగాణా, రాయలసీమ ప్రాంతపు మాటల నిచ్చినారు వారు ఈ ప్రాంతముల నన్నిటిని బాగా సంచరించినారనుకోవలెను సర్కారు, తెలంగాణా అనుటకంటె ఇంకా ప్రత్యేక ప్రాంతము తెలిపికొన వలెను. పైన వ్రాసినట్లు కరీంనగరములోని కొన్ని పదములు ప్రక్కదైన మెదకుజిల్లాలో వినబడలేదు. ఇగురం—మూడవ్వాలలో—వేగిరం, వివరం, పొందిక తనము-నున్నట్లు తేలినది. ఉమ్మగిల్లుట ఇటమన్నది. గూనులాడు తెలంగాణములో నన్నారు. నేను ఇచ్చట వినలేదు. 'తంతెలు' 'తంతియలు' యొక్క రూపాంతరమని శబ్దరత్నాకరమున గలదు. మణుగుబూరు లిచ్చుటను గలవు. సిడీలు, సాను మున్నగునవి యన్య దేశ్యములు. ఇందనుక అన్నది అపభ్రంశము. ఒగారింపు ఇక్కడ వ్యవహారమున కనబడదు.

పై వాటిలోజేరని మరికొన్ని పదములు:

కీస: జేబని యర్థము. శబ్దరత్నాకర, శబ్దార్థ చంద్రికలలో కొంచెమని గలదు.

తిప్పలు: ఇదివరకు బాధలను నర్థములో వ్రాసినాను. అంతేగాక తిండితో కలిపి 'తిండితిప్పలు లేక' అని 'కూడు కుమ్ములేక' అన్నయర్థములో ప్రయోగింపబడుచున్నది.

ములముల: దురదయని యర్థము, గులగుల యన్నట్లుగా.

గీఱ: రేఖయని యర్థము. చక్రమను నర్థములో వ్యవహారము. 'బండిగీఱ'.

ధారణము: వేడిచేయుట. ధారణమయినదనగా వేడిచేసినదని.

వోదెకాళ్ళు: 'ఫైలేరియా' రోగమువలన బాగా లావెక్కిన కాళ్ళు.

అగము: అల్లరి, తొందరపాటను నర్థము.

కా (కవు) చిప్ప: ఆలుచిప్పయని అర్థము.

—భాగవతము రామారావు.

2

ఆంధ్రభాషలో శబ్దరత్నాకరానికి పూర్వం ఎన్నెన్నో పద్యనిఘంటువులు వెలువడ్డాయి. అందు ఏ ఒక్కటికూడా సమగ్రమూ కాదు; అకారాది వర్ణక్రమంగా వెలువడ్డదికాదు. అందుచే ప్రయోజనము కొంచెం తక్కువగానే యుండేది.

శబ్దరత్నాకరము:—క్రీ. శ. 1885 సంవత్సరంలో శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యుల వారు కూర్చిపెట్టిన శబ్దరత్నాకరము సాహిత్య పిపాసువుల పాలిట కల్పవృక్షమేమో యనిపించింది. పూర్వకవుల గ్రంథాలనుండి ప్రయోగ వాక్యాలు చూపడంవల్ల అది ప్రమాణనిఘంటువుగా పేరెక్కినది. దాదాపు నలుబదివేల పదముల వివరణములతో కూడిన రత్నాకరము నేటికి ఆరుసార్లు ముద్రింపబడినదని చెప్పడంవల్ల దాని ప్రాశస్త్యాన్నిగూర్చి వేరే చెప్పడము చర్వితచర్వణ మనుకుంటాను.

'ఆంధ్ర పదపారిజాతము':—అనే శుద్ధాంధ్ర నిఘంటువును శ్రీ ఓగిరాల జగన్నాథకవి, శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిగారలు క్రీ. శ. 1887 సం॥న వ్రాసి ప్రకటించారు. తత్సమపదములు చేర్చకపోవడముచేత కాబోలు అది శబ్దరత్నాకరమంత ప్రచారంలోనికి రాక మఱుగుపడియున్నది.

'శబ్దార్థ చంద్రిక':—అనే నిఘంటువును క్రీ. శ. 1893 సం॥న శ్రీ మహాకాళి సుబ్బారాయుడుగారు వ్రాసి స్వయంగా ప్రచురించారు. మఱి పదివేల పదాలు చేర్చి, 1905 లో శ్రీ వేమూరి వేంకటకృష్ణమసెట్టి కంపెనీవారిచేత ముద్రణము చేయించారు. ఇంకనూ పెంచి 1913 వ సం॥లో కాపీరైటు హక్కులు వావిళ్ళవారికి ఇచ్చినారు. మూఁడవ ముద్రణము లగాయతు వావిళ్లవారే మఱి నాలుగు పర్యాయాలు అచ్చువేశారు. తుది ముద్రణంలో శ్రీ వేదము లక్ష్మీనారాయణశాస్త్రిగారి సహాయము తీసికొనఁబడినది. నాలుగైదు పర్యాయాలుగా పెంచుచూ వచ్చిన శబ్దార్థచంద్రికయందు దాదాపు 60,000 పదాలవఱకు ఉండవచ్చునని అంచనా.

'లక్ష్మీనారాయణీయము':—అను శుద్ధాంధ్ర సలిపనార్థ పర్యాయపద నిఘంటువు నొకదానిని శ్రీ కొట్ట లక్ష్మీనారాయణశాస్త్రిగారు వ్రాసి క్రీ. శ. 1907 వ సం॥రమున వెలువరించారు. అందు దాదాపు పదాలు (అయిదు వేలే) 5000 అయినా ప్రతి పదానికి పర్యాయపదాలు ఈయఁబడ్డాయి. కేవలము అచ్చతెనుఁగు నిఘంటువు కావడంచేతనే అది కూడా నేడు ప్రచారములో లేదు.

'ఆంధ్రవాచస్పత్యము'—అనే బృహన్నిఘంటువును శ్రీ కొట్ట శ్యామలకామశాస్త్రిగారు క్రీ. శ. 1934–40 సం॥ల మధ్య వ్రాసి 4 సంపుటాలలో ప్రకటించారు. వీరు లక్ష్మీనారాయణశాస్త్రిగారి పుత్రులు. లక్ష్మీనారాయణీయము వ్రాయడంలో తండ్రిగారికి సహకరించినారు. తండ్రిగారు అచ్చతెనుఁగు నిఘంటువు వ్రాయఁగా వీరు తత్సమ పదములనుగూడాచేర్చి వానికిని పర్యాయపదము లిచ్చారు. దానిని ఓరియంటల్ పబ్లిషింగ్ కంపెనీవారు 3 సంపుటాలలో ప్రకటించారు.

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువును దాదాపు మూర్నురు పండితులు కూడి రచించి పీఠికాపురాధీశ్వరులైన శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారి పేరు పెట్టినారు. ముద్రణావ్యయమును, కవి పోషణభారమును వహించిన వదాన్యులగుట వారిపేరు ఆ విధముగ చిరస్థాయియైనది. కవి ప్రయోగాదికము చూపబడినందున గ్రంథము 7 సంపుటాలుగా తయారైనది. 1936లో మొదటి సంపుటము వెలువడగా 7 వ సంపుటము నేటికైనా వెలువడినదో, లేదో? ఎన్ని సంపుటాంలో వెలువడినా మొత్తము 70,000 పదాలకు మించియుండవని అంచనా.

శబార్థదీపిక అనే తెలుఁగు నిఘంటువును శ్రీ ముసునూరి వేంకటశాస్త్రిగారు 1945 వ సం॥లో వ్రాసి స్వయంగా ప్రకటించారు. ఇది 3 ముద్రణలు పడినది. 3 వ ముద్రణమున లఘు శబ్దార్థ దీపికయందు 40,000 పదములు. గురు శబ్దార్థదీపికయందు దాదాపు 70,000 పదములు చేర్చఁబడినాయి. ఇందు నానార్థములతోఁబాటు పర్యాయపదములు, వ్యుత్పత్త్యర్థములు, వికృతి ప్రకృతులు, రూపాంతరములు ఈయఁబడినాయి. వ్యావహారికాలకు, మాండలిక పదాలకు ప్రత్యేక నిఘంటువు వెలువరిస్తామని తొలిపలుకునందు వ్రాసినారేకాని ప్రకాశకులు కలిసిరానందున అట్టిపని సాధించలేకపోయామని చెప్పినారు. ఏన్నేళ్ళో పురాతనపద్యనిఘంటువులనుండి క్రొత్తదేశ్యపదాలు, మాఁడలికాలు, వ్యావహారికాలు సేకరిస్తూ ఉండడంచూస్తూ ఉండేవాడనగుట పై విషయాలు సమగ్రంగా తెలిసినవి.

వావిళ్ల నిఘంటువును శ్రీపాదలక్ష్మీపతిశాస్త్రిగారు, శ్రీ బులుసు వేంకటేశ్వర్లుగారు, శ్రీ వేదము లక్ష్మీనారాయణశాస్త్రిగారు వ్రాసియున్నారు. 1949, 51, 53 సంవత్సరాలలో వరుసగా 3 సంపుటాలు వెలువడినవి. తక్కిన సంపుటాలు ఎందుకు వెలువడలేదో కారణము తెలియదు. అందులోనైనా వెలువడిన 3 సంపుటాలనుబట్టి చూస్తే 60,000 పదాలకు మించవని ఊహిస్తాను.

1968 జనవరి భారతి పత్రికలో శ్రీ భాగవతము రామారావుగారు 'తెలుఁగు నిఘంటువులలో దేశ్య పదములపై చిన్నమాపు' అని వ్రాసిన వ్యాసమును చదివినాను. అందు నిఘంటువులలో చేరని క్రొత్త పదములుగా ముదహరించిన 95 పదములు చూచినాను. శబ్దార్థచంద్రిక, శబ్దార్థదీపిక వగైరా మరికొన్ని నిఘంటువులలో ఈ దిగువ పదాలకు శ్రీ రామరావుగారు ఇచ్చిన అర్థములతోనహా చేర్చఁబడే యున్నవి.

1. అంట 2. అగడు 3. అగ్గవ 4 అధ్వాన్నము 5. అరయు 6. అజ్జ 7. ఉడుకు 8. ఉబ్బరము 9. ఎజ్జ 10. కడమ 11. కొలువు 12. గులగుల 13. టిప్ప 14. టోకు 15 తలిగ 16. తావు 17. తిప్ప 18. తెమడ 19 (తా)ట్ల 20. తొట్లియ 21. తొట్ల 22. నసుకు 23. నెజి 24. పులకరము 25. పెండ 26. పొక్కిలి 27 బాగాలు 28. మస్తు 29. మొల.

మార్చినెల 1968 భారతిలో శ్రీ వేమిరికొండ చంద్రవౌళిగారు నయితము మరి 50 క్రొత్త పదాలను వెలువర్చినారు. వారు ఒక్క శబ్దార్థ చంద్రికను మాత్రమే సంప్రదించినామని వ్రాసికొన్నారు. శబ్దార్థదీపిక నిఘంటువునుగాని, వావిళ్ల నిఘంటువునుగాని, సూర్యరాయాంధ్ర నిఘంటువును గాని చూడలేదన్నమాట. వారిచ్చిన 50 పదాల లోను సుమారు 25 పదములు ఇటీవలి నిఘంటువులలో చేర్చఁబడియున్నవి.

1. అంగీ 2. ఒరయు 3. ఎంచు 4. ఎత్తివేయు 5. కంచరి 6. కలఁపము 7. గవుసెన 8. గుంజ 9. గొండ్లవారు 10. గొంగడి 11. చల్ల 12. చిమ్మట 13. చుండెలు(క) 14. తమ్మలి 15. తలుగు 16 తంతెలు 17. పుణఁకుట 18. పోఁడు 19. పోతి 20 మలుగు 21. మలుచుట్టు 22. మైసాక్షి 23. రిల్లట 24. విడెము.

ఇంతకూ నేను పైన పేర్కొన్న పదములను నా మిత్రులు నిఘంటువులలో కనుగొనలేకపోయిరని ఆక్షేపించుటకు కాదు. నిఘంటు కర్తలు తమ యావచ్ఛక్తి వినియోగించి శబ్దరత్నాదులలో లేని దేశ్యపదాలను, మాండలికాలను చేర్చుచూ రావడం చేతనే పదముల సంఖ్య 40,000 నుండి సుమారు 80,000 వఱకు పెరిగినదని సవినయంగా మనవి చేస్తాను. నిఘంటు కర్తలు ఎప్పటికప్పుడు ఎన్నో తంటాలుపడి క్రొత్త పదాలు సేకరించుకొంటు వచ్చినా వానిని వెల్లడించే ప్రకాశకులు పూర్ణసహకారం ఇవ్వకపోయినచో ఏమాత్రము ప్రయోజనం కనపడదు. దేశవ్యాప్తఁగా మాండలికాలను సేకరించి నిఘంటువుగా ప్రచురించాలంటే ఆంధ్ర సాహిత్య అకాడమీలవంటి సంస్థలుగాని, ప్రభుత్వమువారుగాని పూర్తిశ్రద్ధ వహించవలసే ఉంటుంది.

శ్రీ భాగవతము రామారావు, శ్రీ వేమిరికొండ చంద్రవౌళిగారువంటి భాషాసేవకులకు తోడుగా నాకు లభించిన వ్యావహారికాలు, మాండలికాలు, నేను గూడా కొన్నింటిని ఇవ్వఁదలఁచాను. ఈ పదాలు ఇంత వఱకు పై నిఘంటువులలో చేరలేదనే నా దృఢ విశ్వాసము. వాని పుట్టుపూర్వోత్తరాల విమర్శ చేయుటకు అసమర్థుఁడనుగాన ఆ పని పెద్దలకే విడిచిపెట్టాను.

అఁజినాడ: తిరుమల కాళహస్తి ప్రాంతము.

అంటొట్లు : వాన వెలిసిన పిమ్మట చూరు నుండి పడెడు నీటిబొట్లు.

అంపాజాలము : అంభాపారము. అంబ్వాపారము అను సంస్కృత పదములనుండి పుట్టిన 'అంబాచారము' అనే పదము ఇదివఱకే నిఘంటువులలో చేర్చఁబడియున్నది. దానికి అంపాజాలమును రూపాంతరముగా గ్రహించవచ్చును.

అఁబఁము : కలకల ధ్వని. అలబలము అనే పదానికి ఇది సన్నిహితపదంగా కానవస్తున్నది.

అగ్రదాళ్లు : మంచమునకు అల్లిన నులకను బిగించి కట్టు త్రాళ్లు.

అగ్గటిక: నిప్పు పుట్టించుటకై ఒక దిమను జాతితో రాపిడిచేయు ఉక్కుముక్క—అగ్గిబాయి—చెకుముకిబాయి.

అచ్చాళు(వు) : నిఘంటువులలో అచ్చాడీ, అచ్చాణీ అనే పదాలకు స్వచ్ఛమైనది అని ఉల్లే

ఖీఁపఁబడినది. అవ్వారి అనే పదమునకు జంజాటము లేనివాఁడు అని కలదు. అదే అర్థంలో 'అవ్వారు' 'అవ్వారువు' అనే పదాలు వ్యవహారంలో కానవగును.

అభాండము : అబద్ధ ప్రచారము. అపనింద, నీలివార్త అనే అర్థాలలో ఇది ఉపయోగపడుచున్నది.

అమదు : ఈ పదానికి అమృతమని నైవేద్య మని అర్థాలు వాడుకలో కానవస్తాయి. నిఘంటువులలో ఇదివఱకే అముదు, అముదుపడి అనే పదాలు చేర్చ బడి ఉన్నాయి. వానికి ఇది సన్నిహిత రూపమేమో?

ఆరా : పుట్టు పూర్వోత్తరాలు, వివరాలు, ఆచూకీ, జాడ.

ఇంజావు : గుడిసెయొక్క రెండుగోడలమీఁద గాని కంబాలమీఁదఁగాని అడ్డముగా అమర్చిన దూలము.

ఇలపీట : కూరలు తరుగుట కుపయోగించు పనిముట్టు—కత్తిపీట.

ఇల్లామల్లి సుద్దులు : కొండెగాని మాటలు—చాడీలు—కొండెములు.

ఇసువు : ఇసుకయందు వ్యవహారము. ఇసుము, ఇమ్ము అనేవి రూపాంతరాలు.

ఈఁదు తెమ్మెర : చలిగాలి. (ఈఁద, ఈఁదర అనే పదాలకు గాలి, చలిగాలి అనే అర్థాలు ప్రసిద్ధాలు. ఈఁదరగాలి=చలిగాలి. ఈఁదు అనే పదానికి చల్లఁదనము, తడి అనే అర్థాలు కలవు. తెమ్మ+ఎర=తెమ్మెర=తేమగల గాలి. కాని ఇచ్చట తెమ్మెర అనే పదానికి గాలియందే వ్యవహారం. ఈఁదు=చల్లనైన, తెమ్మెర=గాలి.)

ఈవిరి : తేమ, చెమ్మ, చల్లఁదనము అనే అర్థాలలో వాడఁబడుచున్నది. నిఘంటువులలో 'ఈమిరి' అనే పదానికి సైతం ఇవే అర్థాలు వ్రాయఁబడ్డాయి. కనుక 'ఈమిరి'కి రూపాంతరంగా గ్రహింపవచ్చు. ఈము నుండి ఈమిరి వచ్చినట్లే, ఇవము నుండి ఈవిరి వాడుకలోనికి వచ్చియుండవచ్చు.

ఉక్కిలి : కొంకికొమ్ము, పచ్చిబియ్యము కలిపి నీళ్లతో మెత్తగా నూరి, బెల్లము చేర్చి, ఉక్కించిన (ఉడికించిన) పదార్థం—దీనిని ఉక్కెడ, ఉక్కెలి అని వ్యవహరిస్తారు.

ఉగ్గాడు : చంపు, తెగటార్చు, బలము చూపు, ఇది ఉక్కాడు (ఉక్కడచు) అనే పదాల వ్యావహారిక రూపం కావచ్చు.

ఉయిలు : వారసత్వము తెలియఁజేయు పత్రము—విల్లు, వీలు, వీలునామా.

ఊళమెకము : ఊల ధ్వనించునట్లు కూసెడు మెకము—నక్క—జంబుకము.

ఎటమటము : తాఱుమాఱగుట — అస్తవ్యస్తము. ఎడము, దూరము. ఈ అర్థాలు గల ఎడమడు(గు)వు అనే పదం నిఘంటువులలో కానవస్తుంది.

కట్లరి : కత్తులు, గరిటెలు, చంచాలు, అట్లకాడ మున్నగు వంటయింటి సామగ్రి.

కప్పాసు : (కార్పాస శబ్దభవము) విత్తులు తీయని ప్రత్తి.

కబేలా : హక్కును స్థిరపఱచు దస్తావేజు.

కమాయిషు : వ్యవహారదక్షత — వ్యాపారము. 'కమాయిసు' అనే హిందీ శబ్దానికి సన్నిహితరూపం కావచ్చు.

కఱదు : వంచన, మోసము, మాయమాట. (కఱద అనే పదానికి ఇవే అర్థాలు.)

కలుహారము : కొంచెము ఎఱుపు, తెలుపు కలిగి మిక్కిలి పరిమళించే కలువ—కల్హారమనే సంస్కృత శబ్దానికి వికృతిరూపంగా గ్రహింపవచ్చు.

కావాఖదము : గుండ్రముగా తిరుగుచు గుఱ్ఱము చిందులు త్రొక్కుట— అశ్వమండలాకారగతి.

కావేరి గుఱ్ఱాలు : కాలికొలఁది పరుగెత్తే మేలుజాతి గుఱ్ఱాలు.

కీసరబాసర : అర్థము కానట్లు గందరగోళముగా మాట్లాడుట.

కుంట్లు : పనికి హాజరుకాని దినాలు.

కుందికుట్టాడు : ఎన్నిగంతులు వైచినను అడుగైన కదలక ఒక్కచోటనే యుండు.

కుక్కవెఱ్ఱి: వెఱ్ఱికుక్క కాటువల్ల కలిగే జలద్వేషరోగము.

కుంబరము: కలగూరగంప, సంసారంమీఁద కల్గిన విసుగుదల. దీనికి కులంబ్ర మనే మఱొక రూపంకూడ వాడుకలో ఉన్నది.

కూఁగుటికాయ: కుంకుడుకాయ—ఫేనిలము.

కూనమ్మ: కూన (బిడ్డ)వలె నడువలేనిది ఆఁడుది—కుంటిది.

కోపులు : బిడ్డ. పాలుకుడుచుకొనకుండకై మేక చన్నులకు కట్టుగుడ్డలు.

గంటవాయించు: ఎగవేయు, ఫూజించు, లేదని చెప్పు, ముంచిపోవు.

గజముచ్చు : గొప్పదోఁపుడుకాఁడు—గడిదొంగ, కొల్లగాఁడు.

గడిమంచ—సామగ్రులు పెట్టుకొనుటకై కొంచె మెత్తుగా నుండునట్లు కోళ్ల అమర్చిన బల్ల—గడమంచె, గడవంచె అనే ప్రసిద్ధ పదాలకు ఇది మఱొక రూపం కావచ్చు.

గయిరమ్మ: గైరమ్మ, గౌరమ్మ, గవరమ్మ అనే పదాలన్నీ గౌరిదేవి (పార్వతి)కే వ్యవహారం.

గరాటు: వడపోతకుఁగాని సన్నని మూతిగల పాత్రలో పోయుటకుగాని ఉపయోగించు గాజుపని ముట్టు. గళ్ళా అని వాడుక.

గల్లి: ఇఱుకువీధి—సందు—కంత—క్రంత.

గవాళము: నగలపెట్టె, దేవతార్చనపుపెట్టె, తోలు సంచి.

గాంజ: మత్తు కలిగించే (వస్తువునకు) మొక్కకు గంజాయి అను వ్యవహారము కలదు. దీనికి గంజా అనే రూపం నిఘంటువులలో కానవస్తుంది. 'గాంజ' వేఱొక రూపంగా వ్యవహరింపబడుచున్నది.

గుంజీలు: పూర్వపు బడిపంతుళ్లు పిల్లలు నేరం చేసినప్పుడు విధించే ఒక శిక్ష. చేతులు కట్టుకొని, కాళ్లు చేర్చి పలుమార్లు కూర్చుండి లేచునట్లు విధించుట — గుంజిళ్లు.

గుంట చిన్ని—పిల్లల గోలీకాయల ఆట—దీనికి గుంటజోళ్ళు అనే నామాంతరం కూడా కలదు.

గుజస్తు: గడచిన, వెనుకటి పాలుకు సంబంధించిన రూపాంతరం గుజస్తా.

గుడిగీలు: లాగులు — నిక్కర్లు, ఇజారులు అనే వ్యవహారం.

గుడిపడుగు: గుడిలో దేవుని అర్చించు బ్రహ్మచారి—పూజారి.

గుమాని: అనుమానింపఁదగిన — (గుమాను = సందేహము).

గూనపులి: ఎక్కువ జఠరాగ్నిగల పులి, గూన వంటి కడుపుగల పులి.

గెండ: చేపపిల్ల (గండక శబ్ద భవము) రూ. గెండె, గెండియ.

గెంతు: క్రాంతి శబ్దభవం—గంతు. దీనికి వ్యావహారిక రూపమే గెంతు — (ఎగురు, దుముకు.)

గెణికెలు: గనుపు గనుపునకు నలకఁబడిన చొప్పదంటు కఱ్ఱలు.

గేబు: తాటి మొంక—తేగ.

గొల్లమాటలు: (గొల్ల = గోల = తెలివిమాలిన వాఁడు) నాగరికతలేని మాటలు, అసభ్యమైన మాటలు.

గోడవాడము : గొడవ—అల్లరి—తంపి—గందరగోళము.

గోణబిళ్ల
గోనెబిళ్ల } ఒకవిధము హాకీవంటి బాలక్రీడ—గోడబిళ్ల.

గోవకోడె: మనిషి మచ్చికలేని అడవి పసరము.

గోసాయి: సన్న్యాసి, బౌద్ధభిక్షువు, మత గురువు.

చక్రవడ్డి : అసలువలనవడ్డీ అసలులో చేర్చి తిరిగి చక్రాకారంగా వడ్డీ యివ్వడం మూలంగా ఈపేరు వచ్చి యుండవచ్చు—చక్రవృద్ధి.

చాకరు: హీనసేవ (చాకిరి) చేసేనౌకరు.

చిక్కట్టు: (చిక్కు+అంటు) తలచిక్కును అంటి సరిచేసే దువ్వెన=చిక్కంటు అనే ప్రసిద్ధ పదానికి మాఱురూపంగా చిక్కంటె అని చిక్కట్టు అని వ్యవహారం కానవస్తుంది.

చురుక—దోషులకు, వాతరోగులకు లోహపు కాడ కాల్చి చుఱ్ఱుమనునట్లు ఒడలిపై వేయువాత—రూ. చురక.

చోరీ : చౌర్యము—చేవాడితనము—దొంగతనము.

జీబిలి : కర్ణమలము — గుబి(బి)మి' గు(బి—మి)లి, జిలిబి, జిబిలి అనే వానికి వేఱొక వ్యవహార రూపం జీబిలి.

జంగిడి : జంగలము = అడవి, అడవియందు స్వేచ్ఛగా సంచరించెడు పశువుల మందకు 'జంగిలి' అనిపేరు. రూపాంతరం 'జంగిడి' కావచ్చు.

జరుగురు : త్వరగా జరుగునట్టి పని—త్వర. రూ. జరూరు.

జాగిలి—దండాకారముగా నేలపై వ్రాలుటకు మ్రొక్కుటకు చాగిలి, సాగిలి అనేపదాలు నిఘంటువులలో కానవచ్చును. వానికి జాగిలి అనే వేఱొక వ్యావహారికం గ్రాహ్యం,

జామువాసము : పెండ్లికిముందు జరుగునట్టి వరపూజ.

జావిడామదారు : ఒకనికై తాను అమ్ముకొను వాఁడు—పూచీదారు—హామీదారు.

తుండుగుడ్డ : తువ్వాలు—తుండు—తుండెము—కొల్లాయిగుడ్డ—గావంచా.

తూట్లకమ్మలు : తూట్లుగల ఒక విధము చెవి నగలు.

దీటి—దివటి, దీవటి, దివటీ, అనే వాని మాఱురూపం, చేతిదీపము.

దుంబాలా : పన్నులేని యీనాముభూమి.

దుబరకా : చినిఁగిన పంచులకు వేయు అస్తరు పంచి.

దేవిడీమువ్వా : కోట వాకిలికి రావలదన్న యుత్తరువు.

నిర్వాకము : నిర్వహించుట—గొప్పకు చేసిన పని—నిర్వాహకము.

నీలాటిరేవు : స్నానములుచేయు రేవు—నీరాట రేవుకు రూపాంతరం.

పుటిపిలింత : చిటికె—చిటికరింత.

పొళ్లకాయ — పొడలకాయ — పొట్లకాయ' (సం. పటోలీ.)

బరిగె : బడిపంతులు ఉపయోగించెడు బెత్తము, మెత్తని సన్నని నిడుపైన చువ్వ—చువక—జావ్వ. బరికెకు రూపాంతరము కావచ్చును.

బాడవ : (బాడె=బురద, బురదనేల, పల్లపు నేల—దీనినే బాడువ అని వ్యవహరిస్తారు. వ్యా. రూపాంతరం బాడవ.

బుటేదారీ } బూటేదారీ } రంగురంగు దారములతో లతలు పూవులు కుట్టి చిత్రములు తయారుచేయునట్టి కళ—ఎంబ్రాయిడరీ.

బెడిసికొట్టు : ఎదురుతిరుగు, వికలమగు, తడఁబడు, చెడు, కథ అడ్డముతిరుగు.

బొళ్లపాయ : కల్లు త్రాగునట్టి తాటాకు పాయ.

బోడపత్రము : హామీలేని రిజిస్టరు కాఁబడని దస్తావేజా.

మరంమత్తు : చినిఁగిన (ఊడిన)దానిని బాగు చేయుట. రూ. మరమ్మత్తు.

మసోదా : చిత్తువ్రాత—రూ. ముసాయిదా.

మహంతు : దేవస్థానమునకు ధర్మకర్తగా నుండు బైరాగి.

మిళ్లింతలు : దగా—మోసము, కికురింత.

మొదలారి : అరవలలో ఒక తెగ—రూ. మొదలియారు, ముదలియారు.

రేచిక్క : తలతిక్క—వినుగుదల.

లాలోచి : లోపాయకారి, కుట్ర.

వాజమ్మ : తెలివి తక్కువవాఁడు—దద్దమ్మ—అంబేద—ఎంబెన్న.

శనామణి : సినీమా—సుడామడ—చినామణి.

షికారీపిట్ట : పంజరములోనుంచి బయటిపిట్టలను ఆకర్షించుటకై తయారు చేసిన పిట్ట.

సలసరము : బాధ—జ్వరము—పులకరము.

సుతిలాము : బొత్తిగా రూ. సుతరాము.

హర్తాళ్—సంతాపమునకు సానుభూతికి నిరసనకు చిహ్నముగా అంగళ్ళు కార్యాలయములు మొ॥ మూసివేయుట.

—శ్రీ మునునూరి సుబ్బారావు.

3

శ్రీ భాగవతము రామారావుగారి వ్యాసము జనవరి '68 సంచికలోను, ఇతర పండితుల లేఖలను చూసి ఇంకొన్ని పదములగూర్చి వ్రాయవలెనని తలంచితిని. ఇందులో కొన్ని పదములు అపభ్రంశ రూపమున ప్రస్తుతము వాడుకలో నున్నవి. కొన్ని ఉరుదూ భాష పదములు అభేదముగా తెలుగు రూపమును సంతరించుకొన్నవి. పై నుదహరించిన వ్యాసకర్తలకు కృతజ్ఞతతో ఆయా పదములను క్రింద పొందుపరచుచున్నాను.

మొసాలము : పూర్తిగా, 'నాకు గ్రాసము మొసాలము జరగటం లేదు' తెలంగాణావాడుక.

మల్కా : కిటుకు 'దాని మల్కా నీకే తెలియాలె.' తూరి, పర్యాయము అను అర్థము గూడ ఉన్నది 'మల్కా మల్కాకు పైసలెక్కడినుంచివస్తయి.'

అగము : 'దిక్కూ మొక్కూ తోచకుండుట. 'నా పని పూర అగమయింది.' 'అగానికి అమ్మా అంటే ఎవరికి పుట్టినావు బిడ్డా అన్నరట' సామెత.

అలగు : వేరుపడుట—ఉరుదూ మూలము— 'అన్నదమ్ములు అలగయితున్నరు.'

అదాల : వేరుగా, ప్రత్యేకముగా—'నాది నాకు అదాలనె ఇయ్యి'

ఇలుచూపు : సంబంధము చేయబోయేముందు ఇంటినీ, మనుష్యులనూ, ఇంటి పద్ధతులనూ చూడటము.

పప్పన్నము : సంబంధము కుదిరితే నిశ్చితార్థముగా వియ్యంకులతో కలసి భోం చేయుట. దీనినే 'వాండ్లు పప్పొండకానికి వస్తున్నారు' అని వాడుదురు.

ఖిలాఫ్ : వ్యతిరేకము — ఉర్దూపదమూలము — 'ఓట్లకాడ వాడు నాకు ఖిలాఫ్ చేసిండు'

దునియా : ప్రపంచము } రెండునూ ఉర్దూమూలములే.
నియ్యత్ : నిజాయితీ

దుగ్యాన : ఒక్క పైసయు లేదను అర్థములో 'ఒక్కదుగ్యాన గూడలేదు.' ఇట శ్రవణానందములోని 'దుగాని' అన్న తిరుపతి వేంకటకవుల పదప్రయోగము చటుక్కున స్ఫురించును.

బహుశః : ఇదియే మూలము కావచ్చును.

మాములా : మద్య వ్యాపారం. 'వాడు కల్లు మామూలా పట్టిండు'. నిర్వ్యాపారత్వానికి 'వేనుజేసే మాములా మాత్రం ఏమున్నది.' అంత పెద్దపని ఏమి చేసినావని కోపంతో అనటానికి 'అంత మాములా ఏం జేసినవని' అందురు.

యాట : ఏట, ప్రతి సంవత్సరము అనియునూ 'బలి అనే అర్థమున్నూ వాడుకలో ఉన్నవి.

మస్తు : 'వాడు కడుపునిండ తిని మస్తుగా పడుకున్నాడు.' మస్తు మస్తు—చాలుచాలయింది అనే అర్థంలో.

అంబ్యాద : కల్లకపటములేని అమాయకత.

మొగులయి : వేషభాషలు, ఆలోచనల్లో పాత పద్ధతులు కల్గిన.

మొగులు : ఆకాశము (ఇదివరకు ప్రస్తావించబడినది.) వాన మొగులు అయితున్నది. వానముసురు : సన్నగాపడేవాన. 'ముసిరిన చీకట్ల'న్న ప్రయోగం మనకు సుపరిచితం.

గడికె : గాదెలాంటిది. ధాన్యము నిలువచేయుటకు ఉపయోగించునది.

ఇడిచిన : సిగ్గు బిడియము విడిచిన, ఇడిచివోడు, ఇడిచింది.

పలుదోముపుల్లకు పండుముపుల్ల, పలుగజ్జి, పంటిపుల్ల అనురూపాంతరములు.

ముద్దెరపలక : ధాన్యము రాశిగా పోసినప్పుడు ముద్రవేయుటకు ఉపయోగించు కఱ్ఱసాధనము.

ఉద్దెర : అరువు. 'ఉధార్' అను ఉర్దూ పదమూలము.

కూతపెట్టు : మనిషి కూత పెట్టినచో వినపడునంత (దూరము) 'ఆ ఊరు ఈ ఊరికి కూతపెట్టుదూరంలో ఉన్నది.'

జెఱ్ఱ : కొంచెము—జెఱ్ఱసేపు (సమయము) జెఱ్ఱంత (పరిమాణము.)

మడిగె : దుకాణము.

ఫకూతు : ఉర్దూపదము 'ఫఖత్'నుండిఎప్పుడు—ఎల్లప్పుడు—వాడికి ఫకూతు ఇదేపని సరిపోయింది.

సఖ్త : అత్యవసరము—Fressing need—
'నాకు పైసలు శాన సఖ్త ఉన్నయి.'

ననుకు: 'మసక' ఇట్లు మారినదేమోనని ఊహించుచున్నాను. 'ననుకుల లేచి ఊరికిపోతాను? మసకచీకట్లున్నప్పుడు అని అర్థం.

పొద్దు మూకెటాళ్ల – అంబటాళ్ల–గొబ్బం బటాళ్ల : ఈ మూడు పదములు సమయమునకు వాడబడు పదములు. మొదటిది ప్రొద్దుగ్రుంకెటి వేళకు అపభ్రంశముగావోవు. అంబలి త్రాగేవేళఃబట్టి తర్వాతి రెండుపదములు. [కూలివాలిచేసే శ్రామికజనం వాడే పదాలు.]

వారి : ఓరి అనుటకు 'ఏమిరా వారీ' అని వాడుదురు.

కమ్మున : ఉట్టిగా పులిమి ఉతుకుటకు చౌకలిని బట్టలు కమ్మున ఉతుక్కురా' అని అందురు. ఇది మహబూబునగరంజిల్లా వనపర్తి ప్రాంతమున విన్నాను.

పోలిపీటు : పోలిపీటు అనికూడ. అయితే ఇక్కడ భక్ష్యములకు పోలెలు అనికూడ అందురు. అవి చేయుటకు, రొట్టెలు, పూరీలు మొదలగునవి వత్తుటకు ఉపయోగించు పీట ఈ పేరుతో పిలవబడుచున్నది. కన్నడములో 'హోళిగె' అని కూడా ఉన్నది. మొత్తమువిూద ఈ పదము పానగని ఆలోచనలకు దారితీసినది.

మనసాల, పడసాల : ఇది ఇంటిలో ప్రధానముగా నివసించు భాగమునకు వాడుదురు. ఇంగ్లీషులో 'Living-Room' అనవచ్చునేమో! [సంప్రదాయము క్రొత్తదైనను సులభముగా అర్థమగుటకు ఇట్లు వాడితిని]

గొండ్లెమునకు కొన్ని చోట్ల 'చిలుకు' అనియు, కొన్ని చోట్ల 'బీగము' అనియు అందురు.

వాకిలి: ఇది ఇంటిముందున్న భాగములకు కొన్ని చోట్ల వాడగా, తలుపులకు అన్వయమయేటట్లు కొన్ని చోట్ల వాడుదురు. 'వాకిలి వెయ్యి' అనగా 'తలుపు ముయ్యి' అనో లేక 'దర్వాజా బందుచెయ్యి'అనో అర్థం.

వీలు చూసుకొని ఇంకనూ కొన్ని పదములను గూర్చి వ్రాయవలెనని అభిలాష.

శ్రీ డి. శ్యామసుందర్.

4

భారతి ఏప్రిల్ సంచికలో శ్రీ ఆవంచ సత్యనారాయణగారు కొన్నిదేశ్యపదాలగూర్చి వ్రాస్తూ, తత్పూర్వం ప్రచురింపబడిన కొన్నింటిగూర్చికూడా వ్రాశారు. వారు వివరించిన పదాలలో కొన్ని సరైనవి కావేమోనని అనుకుని, వాటిగూర్చి వ్రాస్తున్నాను. పరిశీలింపగలరు.

ఇగురం : ఈ పదాన్నిగూర్చి శ్రీ సత్యనారాయణగారు వివరిస్తూ—వేగిరం అనేదాని కిది బహుశా అపభ్రంశం కావచ్చునన్నారు. వారన్నట్లు 'వివరం' అనేదానికి 'ఇవరం' అపభ్రంశరూపం కావచ్చును. కాని 'ఇగురం' అనేదికూడా దానికి అపభ్రంశమే. 'వీడికి కింతమాత్రం పని ఇగురం ఎరుకలేదు' అంటారు తెలంగాణాలో. అంతేకాని, వేగిరానికి ఇగురం అపభ్రంశం కాజాలదు.

కడమ : ఈ పదానికి మిగిలినదనియేకాక, చివరిదనియు అర్థం కలదన్నారు. కాని, 'కడమ' అంటే కేవలం, తతిమాది మిగిలింది అని మాత్రమే. 'కడది' అనే పదం చివరిది అనే అర్థాన్నిస్తుంది. రెండవ పదంలో 'మ' లోపిస్తుంది.

కలియామాకు : కరివేపాకుచెట్లకు 'కరివేము' అనే పలుకుబడి తెలంగాణాలో లేదు. 'కలియామాకు' అనే అంటారు.

దూప : దాహం అనే అర్థంనిచ్చే ఈ పదం 'ధూప్' అనే హిందీ పదానికి అపభ్రంశం కాజాలదు. 'దప్పిక' అనేదానికి 'దప్పి' అనే అపభ్రంశరూపం ఉపయోగింపబడుతుంది. 'దప్పి' అనేదానికి అపభ్రంశమే 'దూప'.

అంకణాల మోటరు : విమానాన్ని 'అంకణాల మోటరు' అనడం తెలంగాణాలో నేనెక్కడా వినలేదు. సామాన్యజనం 'గాలిమోటరు' అని అంటుంది. బహుశా ఆ పదం 'రాయలసీమ'లోగానీ, ఇతర జిల్లాలలో గానీ ఉపయోగింపబడుతుందేమో అనుకుంటున్నాను.

పుట్నాలు: నెల్లూరు మండలంలో వేయించిన కందులను 'పుట్నాలు' అంటారు. తెలంగాణాలో సర్వసాధారణంగా శనగలే వేయించుతుంటారు. ఆ పప్పునే తెలంగాణాలో పుట్నాలు అంటారు. ఇతర చోట్ల 'శనగపప్పు' అంటారు. ఉర్దూలో 'ఫూట్‌నా' అంటే విరుగుట, పగులుట అనే అర్థం ఉంది. దానినుండివచ్చిన అపభ్రంశరూపమే 'పుట్నాలు.'

టంకశాల అశోక్.

అరవిందుని పురుషోత్తమ తత్వము

ఆర్యా,

జూన్‌నెల భారతిలో 'అరవిందుని పురుషోత్తమ తత్వము'అన్న బ్రహ్మశ్రీ వేలూరి శివరామశాస్త్రి గారి గ్రంథముపై బ్రహ్మశ్రీ నోరి నరసింహశాస్త్రిగారు వ్రాసిన విమర్శనమును గురించి రెండు మాటలు చెప్పవలయునను తలంపుతో ఈ లేఖను వ్రాయుచున్నాను.

శ్రీ నోరివారు వ్రాసిన వేదాంత విషయ విమర్శనము ఆ విమర్శనమున ఒక విషయము. రెండవది శ్రీ శివరామశాస్త్రిగారిపై వారి విసుర్లు. అదొక విషయము. మూడవ విషయము ఇంకొకటి కన్పిస్తూ వున్నది. అది శంకరభగవత్పాదులను శ్రీ శాస్త్రిగారు ఏమో అన్నారన్నది; ఇటువంటిదానికి సంబంధించిందే వేదాన్ని శ్రీ శివరామశాస్త్రిగారు నిందించారు—అన్నది.

మొదటి రెండు విషయములను గురించి పెద్దగా పట్టించుకొనవలసిన అవసరము నాకు అంతగా కన్పించలేదు. అచ్చట ఎవరి అభిప్రాయములు వారివి; ఎవరి అభిరుచి సభ్యతలు వారివి. అందువల్ల.

మూడవ విషయం అట్లా కాదు. అది ఒక విధంగా లోకానికి సంబంధించింది. శంకర భగవత్పాదులవారిని ఎవరైనా కాదనవచ్చు. కాదన్నవారు పూర్వము వున్నారు. ఇప్పుడూ కన్పిస్తున్నారు. శ్రీ శివరామశాస్త్రిగారు కాదన్నారని కాదు. ఒకవేళ అన్నారే అనుకుందాము: అంటే తప్పేమిటో అర్థం కాకుండా వుంది. అందుకు 'ఆస్తికులు' ఎందుకు బాధపడాలో అంతకన్నా అర్థం కావడం లేదు. శంకర భగవత్పాదుల వారే తాము చేస్తూవున్న వాదంలో పూర్వపక్షం వెలువుస్తూ వున్నప్పుడు—మధ్యే మధ్యే—'తత్తుచ్ఛం'వంటి మాటలు వాడివున్నట్లు చెబుతారు. అందువల్ల అవతలి వాదాన్ని నమ్మిన వారికి బాధ కల్గుతోందని ఆయనగాని, లేక కల్గుతుందని ఇప్పటి 'శంకర భక్తులు'గాని అనుకున్నారా? అసలు వాదసరళిలో ఒకరి మాటకు ఒకరు బాధపడవలసిన అవసరం లేదు. కాని శ్రీ నోరివారు ఈ 'తత్వము'పై విమర్శనములో వ్రాసిన పద్ధతి చూస్తే, భగవత్పాదుల వారిని ఏమన్నా అనడమే మహాపాపం క్రింద జమపడి పోతోందని అనిపిస్తుంది. అట్లా కాని పక్షంలో 'శ్రీ శివరామశాస్త్రిగారివంటి వారు శంకర భగవత్పాదుల వంటివారిని తృణీకరించి వ్రాయుట' అన్న పదంతి పదసంహతిని శ్రీ నోరివారు ప్రయోగించి వుండేవారు కారు. ఆ 'తృణీకరించడం' 'ఆస్తికులకు' బాధ కల్గిస్తుంది అనిగూడా అనివుండేవారు కాదు. ఎందుచేతనంటే ఇచ్చట భంగ్యంతరంగా శ్రీ శివరామశాస్త్రిగారిని 'నాస్తికులు' అని తిడుతూవున్న అర్థపదంతి ప్రతీయమానం అవుతున్నది. ఇది శ్రీ నోరివారు 'సహిస్తూ' అయినా, చేయవలసిన పనికాదు. ఎందుచేతనంటే శ్రీ శివరామశాస్త్రిగారి రచనలు చదవగా, వారు నాస్తికులని నాకు అన్పించలేదు. ఎవరికీ అన్పించదు. వారిని ఎరిగి వున్నవారి సంగతి నాకు తెలియదు.

శంకరభగవత్పాదులవారితోనే జ్ఞానంయొక్క ఎదుగుబొదుగులన్నీ ఆగిపోయినాయి—అని—అనుకున్నవారు మాత్రమే ఇటువంటి అసహనంతో వ్రాయగలరు. నిజంగా జ్ఞానం పెరగడం శంకరులవారితో ఆగిపోయిందా? ఆగిపోతుందని శంకరులవారు అనుకున్నారో, లేదో తెలియదుగాని, శ్రీ నోరివారివంటి 'ఆస్తికులు' అనుకుంటున్నట్లే తోస్తుంది. 'శంకర భగవత్పాదులవంటివారిని తృణీకరించి'అన్న వాక్య పద్ధతికి అర్థం ఇంతకన్నా వేరే గోచరించదు.

శంకరభగవత్పాదులవారి తర్వాత అనంతమైన విశ్వరహస్యాలు తెలిశాయి. ఇంకా తెలుస్తున్నాయి. అవి అన్నీ జనుల అందుబాటులోనికి వస్తున్నాయి.

శంకర భగవత్పాదులవారు తమకాలంనాటివరకు ఈ దేశంలో అభివృద్ధి చెందివున్న విజ్ఞాన ప్రజ్ఞాన సంపత్తినంతా వినియోగించుకొని తమ భాష్యాదికాలను వెలయించినట్లు కన్పిస్తుంది. అది జరగని పక్షంలో భగవత్పాదులవారినిగురించి ఆయన 'ప్రచ్ఛన్న బౌద్ధుడ'న్న వాదమే పుట్టివుండేదికాదు. కాని ఇప్పటి శంకరభక్తులు ఆ జ్ఞానాదికం అంతా శంకరుని తోనే ఆగిపోయిందన్న భావంలో తాము పడిపోవడమే కాకుండా, లోకాన్నిగూడా అట్లా పడమంటున్నారు. ఇది ఒకవిధంగా ఆత్మవంచనమేగాక, జిజ్ఞాసులోక వంచనంకూడా అవుతుంది.

ఒక్కమాట చెప్పాలంటే, శంకర భగవత్పాదుల వారి నాటికి ఇప్పుడు వున్నంత జ్ఞానాదికం లేదు. అందువల్ల వారి శక్తి సామర్థ్యాల విషయం ఎట్లా వున్నా, విజ్ఞానాదికాదివిషయాలలో వారి ఎరుక పరిచ్ఛిన్నమైనదనే చెప్పవలసి వుంటుంది. అదే విధంగా, కాలం గడుస్తూవున్న కొద్దీ, ఈ విజ్ఞానం ఇంకా పెరిగి, ఇప్పటి విజ్ఞానాన్నిమించి పోతుంది. జ్ఞానం అభివృద్ధి చెందుతుంది ఇది కళ్లకు, అనుభవానికిగూడా కన్పిస్తూవున్న సత్యం. అటువంటి సందర్భం వున్నప్పుడు, భాష్యకారులతోనే జ్ఞాన విజ్ఞానాదికాలు ఆగిపోతాయన్న భావనను పెంపొందించుకొనడం, ఆ భావననే లోకంమీద రుద్దచూడటం, ఏ విధంగా చూచినా సత్యకాములు చేయవలసిన పనిగా తోచదు. కాని కొందరు శంకరుడనే కట్టుకొయ్యకు తమ్ము తాము సర్వస్వంగా గట్టిపలుపుతో బిగించుకొని, లోకాన్నిగూడా బిగించాలని చూస్తారు. వారు బిగించుకుంటే, అది వారి ఖర్మ. తక్కిన లోకం వారిని కూడా బిగించ చూడటం, వారిని గురించి నిందా గర్భంగా మాట్లాడటం—అదో జబ్బు.

వేదంకూడా ఒక సందర్భంలో సాధకుడు ఒకానొక స్థితికి వచ్చినప్పుడు—అతనికి వేదం అవేదం అవుతుంది అని చెప్పినట్లు పెద్దలు చెప్పగా విన్న విషయం. అనగా వేదమే—తాను చెప్పేది కొంతవరకే నని, ఆ తర్వాత తాను అవేదం అయిపోతున్నానని చెప్పిందనే కదా! శ్రీ శివరామశాస్త్రిగారు—'వేదము చేసే సూచన ఇంతవరకే'నని అన్నప్పుడు—నా అభిప్రాయంలో—పైన నే పెద్దలు చెప్పగా విన్నట్లు చెప్పిన వేదవాక్యాన్ని – (శ్రీ శివరామశాస్త్రిగారు స్వయంగా ఆ మాటను వేదంలో చదివి వుంటారు) అనువదించి వున్నారని మాత్రమే అని పిస్తుంది. ఆ వాక్యంలోవున్న వేదనింద యేమో గోచరం కావడం లేదు. అది వేదనింద అయితే వేదమే ముందు ఆ పని చేసికొని వున్నదనాలి—నేను పెద్దలవల్ల విన్నమాట నిజమైతే.

లేదా, వేదంలో అన్నీ వున్నాయి: యాటం బాంబులు, బెల్లాస్టిక్ మిస్సైళ్లు, యాంటీ-బెల్లాస్టిక్ మిస్సైళ్లు, అన్నింటి నిర్మాణ రహస్యాలు అందులోనే వున్నాయి; స్పుత్నిక్‌ల సంగతి వేదం చెప్పింది; రస్సెల్ తర్కము, మార్క్స్ దర్శనము, హెగెల్ తత్త్వము, కాంట్ ఫిలాసఫీ, డ్యూయీ ప్రయోగప్రామాణ్యవాదము, అన్నింటికి ఆధారం వేదంలోనే వుంది; ఇప్పుడు శాస్త్రజ్ఞులేమి, ఇంకా ఇతర మేధావులేమి చెబుతున్న, ముందుతరాలవారు చెప్పబోతున్న సంగతులన్నీ వేదంలోనే వున్నాయి—అని నమ్మి, లోకాన్ని నమ్మించడానికి నడుంకట్టుకున్న వారి కోవ క్రిందకు శ్రీ నోరివారిని జమకట్టాలా? 'వేదంచేసిన సూచన ఇంతవరకే'నన్న వాక్యాన్ని వేద నిందగా వర్ణించడంలో, లేకపోతే, అర్థం ఏమిటి? వేదంలో అన్నీ వున్నాయనుకున్నప్పుడుగాని, రారాని భావన అది. మరి వేదంలో అన్నీ వున్నాయా? ఉంటే ఈ భరతఖండంలో మనం ఆ అన్నింటిని ఎందుకు తెలుసుకోలేకపోయాము? వేదాదినుండి అవి అన్నీ మనకు భాసించకపోవడానికి కారణం ఏమిటి? అది మన అసమర్థతఅంటే, వేదాన్నే అసమర్థం అని అంటున్నట్లయి, తిరిగి అదో వేదనిందగా తయారైపోతుంది.

శ్రీ నోరివారు శ్రీ శివరామశాస్త్రిగారి గ్రంథం నుంచి ప్రకరణోచితంగా, 'వేదము చేసిన సూచన ఇంతవరకే'నన్న వాక్యాన్ని ఉట్టంకించి వున్నట్లయితే, అది ఒక విధంగా వుండేది. శ్రీ నోరివారు అట్లా చేయని కారణంచేత వారి ఉట్టంకింపులో ఇంత 'రాద్ధాంతం' ఇమిడి వున్నదని నా బోటి వాడేకాదు,

ఎవరైనా అనుకోవచ్చు. అది సహజం. శ్రీ నోరివారు అట్లా అనుకొని వుండకపోవచ్చు. కాని అట్లా అందరు వేదభక్తులు లాగా అనుకొని వుంటారని అనుకోవడానికి ఆస్కారం వుంది. వేదం అంతా చెప్పేసింది; ఇంకా ఎవరు చెప్పవలసింది ఏమీ లేదు అన్నభావం అచ్చట లేనప్పుడు—'వేదముచేసే సూచన ఇంతవరకే' నన్న మాట వేదనింద కానవసరం లేదు. ఆ మాటను అట్లా అనడం వేదనిందే అంటే, వేదం ఏమీ మిగలకుండా అన్నీ చెప్పేసిందనే అర్థాన్ని శ్రీ నోరి వారు ఇచ్చట వివక్ష చేశారని అనుకొనక తప్పదు.

మరి వేదం అన్నీ చెప్పి వేసిందా! ఆ విషయం నోరి వారికి తెలియాలి; ఆ తర్వాత వేదపురుషుడికి తెలియాలి. వేదపురుషుడన్నా, ఎక్కడో అక్కడ వేదం అవేదం కాగల స్థితివున్నదని అంగీకరిస్తే అంగీకరించవచ్చుగాని, వేదవాదపురుషులను గూర్చిమాత్రం ఆ మాట చెప్పలేము. వారు ఎవరు ఏమన్నా, వేదాన్ని నిందించారంటూ, వేదంలోవున్నదేదో చెప్పక, అన్నీ అందులోనే వున్నాయంటారు. వారు తమరిది ఒక్కరిదీ—ప్రమాణ బుద్ధి—అనుకొని, తక్కిన అందరిదీ—అప్రమాణ బుద్ధి—అనేస్తారు. అంతే.

ఇంతకీ చెప్పవచ్చిందేమంటే, వేదంలో వున్నదేదో వేదంలో వుంది లేనిదేదో లేదు. ఆ లేనిదాన్ని కూడా వేదంలో వున్నదనుకోవడం ఏమి పద్ధతి? అదేవిధంగా శంకరభగవత్పాదులవారు చెప్పిందేదో చెప్పారు. చెప్పనిదేదో చెప్పలేదు. ఆ చెప్పనిదానిని చెప్పలేదు అన్నప్పుడు అందులో తృణీకరించడం ఏమి వుంది?

అసలు ఈ రకమైన పురాణభక్తితాత్పర్యం అంతా కాలానికి మనస్సుకు సమన్వయం కుదరక పోవడంవల్ల వస్తుంది. ఇందులో Inferiority Complex కూడా ఒకటి వున్నదేమో తెలియదు. అటువంటివారు కాలాన్ని, మనస్సును వెనక్కు లాక్కుపోదామని చూస్తారు. అది కుదరదు. అందుచేత 'అప్రమాణబుద్ధి' 'వేదనింద' మొదలైన శాపనార్థాలకు దిగి—చివరికి—'బోధావిర్భావనిధానముల్ చదువులయ్యా! కావు' అని అనేస్తారు. ఇంకా ఎవరన్నా ఏమన్నా అంటే 'జ్ఞానినామపి చేతాంసి, దేవీ భగవతీహిసా: బలాదాకృష్య మోహాయ, మహామాయా ప్రయచ్ఛతి' అనేసి 'ఆ మహామాయ మనలను మన చదువులచే మోహమార్గములలోనికి లాగక, జ్ఞాన మార్గములోనికి ఒక్కఅడుగైనా ముందుకు వేసేట్లు అనుగ్రహించుగాక!' అని అనుగ్రహించడానికి పూనుకుంటారు.

మరి ఆ అనుగ్రహం ఎట్లా కల్గుతుంది అంటారా?

1. శంకర భగవత్పాదులంతటి వారిని తృణీకరించి వ్రాయకుండా వుండటంవల్లను

2. 'వేదముచేసే సూచన ఇంతవరకే' నన్న పదంలో వేదనింద చేయకుండా వుండటం వల్లను

అని జవాబు చెప్పగలరు.

కాని ఎంతమంది భగవత్పాదులను 'తృణీకరించి' శంకరులు తమ భాష్యాన్ని వెలయించలేదు. శంకర భక్తులు ఆ విషయాన్ని చూడరు.

వేదం-అవేదం కాగల స్థితి సాధన క్రమంలో వున్నదని వేదం చెప్పిన మాటను కనరు.

—'కపర్ది'

ఆంధ్ర మహాభారతము - ఛందః శిల్పము

[కర్త: డాక్టరు పాటిబండ మాధవశర్మ; మూల్యము ఇరువది రూపాయలు; ప్రాప్తిస్థానము: డాక్టరు పాటిబండ మాధవశర్మ. 1-8-3T/A. చిక్కడపల్లి, హైదరాబాదు-20]

'ఆంధ్ర మహాభారతము—ఛందః శిల్పము' అను యీ మహాగ్రంథము సిద్ధాంత వ్యాసము. పాటిబండ మాధవశర్మగారు పి.హెచ్.డి. పట్టపరీక్షకు సమర్పించినది. ఉస్మానియా విశ్వవిద్యాలయము శర్మగారికి డాక్టరు బిరుదు నిచ్చినది. ఈ గ్రంథములో ప్రధాన విషయము 573 పుటలలో విశదముగా చర్చింపబడినది. గ్రంథాంతమునందు ప్రసక్త గ్రంథ సూచిక, అనుషక్త గ్రంథసూచిక, ఛందోనుక్రమణీ, ముఖ్యపదానుక్రమణిక యనునవి కలవు. మొత్తము పేజీలు 608. గ్రంథము ముచ్చటగా, ముద్దుగా అచ్చయినది. అక్కడక్కడ ఏవో యక్షర దోషములు, అనవధానములు, అచ్చునకు సంబంధించినవి కలవు.

శర్మగారు తమ నివేదికలో ఇట్లు వ్రాసిరి:

'ఆంధ్రమహాభారతము సంస్కృత మహాభారతమునకు అనువాదము. అందలి వస్తు రసాలంకార కల్పన మించుమించుగా నంతయు వ్యాసభగవానుసిదే. ఆ మహర్షి హృదయము తెలుఁగు జాతికిఁ గరతలామలకము గు తీరున ననువదించి ప్రతిరూపకల్పనా శిల్పమును వెలయించిన ప్రతిభానిధులు కవిత్రయము.

ఆంధ్ర మహాభారతమునం దద్భుతముగాఁ గవిత్రయము వారి ప్రతిభానిష్యందమని చెప్పఁదగినది ఛందము. ఛందము కేంద్రముగా వారి రసాలంకార శిల్పవిధా వ్యాసమున ననుశీలింపఁబడినది. నానాఛందములను నిర్మించుటయందు, వాని నలంకరించుటయందు, వానిని రసానుగుణముగ, సర్గానురూపముగ వినియోగించుటయందు, కవిత్రయము ప్రదర్శించిన శిల్పమును నిరూపించుటయే ప్రధాన లక్ష్యముగా పెట్టుకొని ఆ లక్ష్యసాధనయందుఁ బ్రసక్తమైనంత వరకే యర్థాలంకారములను స్పృశించితిని.

ఆంధ్ర సంస్కృతాంగ్ల భాషలయం దుపలభ్యములగు ఛందోఽలంకార రససంబంధి గ్రంథములను, శరీర జీవ మనస్తత్త్వ శాస్త్ర గ్రంథములను, శక్యమంటిని సూక్ష్మేక్షికతోఁ బరిశీలించి వాని యంతరాళముల మఱుఁగువడియున్న రహస్యములను సాధించి, శోధించి, యనుసంధించి ఛందోరస సంబంధ నిరూపణమున కొక అభినవమైన ఘంటాపథమును నిర్మించుకొంటిని. ఆ పథమునఁ బయనించి నాకు సాక్షాత్కరించిన కవిత్రయమువారి యనంతముఖమైన ఛందఃశిల్పవిశ్వరూపమును ఈ గ్రంథమునఁ జిత్రింప యత్నించితిని.'

ఈ వాక్యములలో మాధవశర్మగారి సాహితీ తపస్సు దాని యుగ్రతా వైపుల్యములు ప్రకాశించుచున్నవి. తన యిల్లాలు తన జీవితములో పండించిన యమృతఫలమే యీ గ్రంథమనియు, తా మిరువురు నీ గ్రంథముచేత మృత్యువును తరించి యమృతమయత్వసిద్ధి ననుభవించెదమనియు శర్మగారు పేర్కొనిరి. నిజముగా ఇట్టి సాహితీతపస్సువలన అమృతమయత్వసిద్ధి ననుభవింపఁదగిన వా రాంధ్రులు. 'ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ' భారతమును తెలిగించెదనని తిక్కన గడగట్టి గంట వాయించెను. ఆంధ్రమహాభారతమును క్షుణ్ణముగా పరిశీలించిన శర్మగారేమో పై విధముగా వ్రాసిరి. ఏది యేమయినప్పటికి ఈ సిద్ధాంతప్రబంధ నిర్మాణముచే, తెలుఁగువారు శర్మగారి కెంతో ఋణపడియున్నారు. ఏలయన ఈ సిద్ధాంత ప్రబంధము సాహితీ జిజ్ఞాసువులను ఆలోచనముల వైపునకు మళ్లించి, వారిని సత్యసంశోధనాసక్తులనుగా జేయుననుటలో సందేహములేదు.

ఈ గ్రంథములో మొట్టమొదట శిల్పమన నేమియో నిర్వచింపఁబడినది. తరువాతి గ్రంథములో తత్త్వానుశీలనము, అలంకరణానుశీలము, రసానుశీలనము అను మూడు ముఖ్యభాగములు కలవు. తత్త్వానుశీలనమను పరిచ్ఛేదములో ఛందస్తత్త్వము కూలంకషముగా వెల్లడిచేయబడినది. '......ఛందశ్శబ్ద నిర్వచనము, ఛందోదర్శనము, ఛందఃప్రభవ ప్రభావములు, ఛందోఽంగములు, ఛందోనిర్మాణ మర్మములు, ఛందోవృత్తిరీతులు, ఛందోరససంబంధము, ఛందోఽలంకరణము—మున్నగు పెక్కు అంశముల పరిజ్ఞానము కావ్యార్థ సమ్యగ్ గ్రహణమునకు అవసరము' అని చాటిన శర్మగారు వాని స్వరూప స్వభావములను ప్రామాణికముగా, బంధురముగా వివరించిరి.

ఈ ఘట్టమునందు, తదితర ప్రకరణములందు ఛందఃశిల్పమన నెట్టిదో వారు స్పష్టముగా నిర్వచించిరి. వారు చేసిన నిర్వచనము లిట్లున్నవి. 'అంగ ప్రత్యంగముల సముచిత సన్నివేశముచే స్వధర్మ నిర్వహణదక్షము లగునట్లు ఛందములను నిర్మించుటయే కవియొక్క ఛందః శిల్పము' '...అక్షరబంధమున శ్రవ్యత పరమార్థము. ఆ శ్రవ్యత యర్థరసానుకూలముగా నుండుట కవికర్మ నైపుణ్య నిరూపకము. అక్షరబంధమున నర్థానురూపమైన శ్రవ్యతను రూపించుటయే ఛందశ్శిల్పము.' 'వస్తు స్వభావ రసావస్థాన వ్యంజన సమర్థముగ ఛందమును నిర్మించుట శిల్పముయొక్క పరాకాష్ఠ'.' వక్తల స్వభావమునందు, తత్కాల చిత్తవృత్తియందు, లక్ష్యమునందుఁగల సామ్యము వారి ఉక్తి ప్రత్యుక్తులయందు బింబ ప్రతిబింబ భావము భజించుచుండును. సదృశము లయిన వస్తుగుణ క్రియల వర్ణనమున సదృశచ్ఛందమును వరించుట ఛందశ్శిల్ప విశేషము. ఛందస్సంవాదమువలె ఛందోనువాదము, ఛందో వివాదము ఛందశ్శిల్ప విశేషములే. ఇట్టి ఛందశ్శిల్ప నిర్వహణము సమాహితచిత్తుఁడైన కవి రచనయందే దర్శింపఁదగును.'

అంతేగాకుండ, 'కావ్యము ఛందోమయము గనుక సహృదయునియందు రసాస్వదనానుకూలమైన చిత్తవృత్తిని ఉత్పాదించు కావ్యవృత్తి ఛందోవృత్తియే. ఛందమందలి యక్షరముల వర్తనమే ఈ వ్యాసమున ఛందోవృత్తి యనఁబడినది' అని శర్మగారు వచించిరి.

అలంకరణానుశీలన మను ఘట్టమున శర్మగారు యతిప్రాసల తత్త్వమును విచారించిరి. అప్పకవి మున్నగువారు చెప్పిన యతిప్రాస భేదములను గుర్తించి, వానికి ఆంధ్ర మహాభారత లక్ష్యముల నిచ్చిరి. వడిప్రయోగ వైచిత్రిని వివరించిరి. విరామ ప్రయోగమును సమీక్షించిరి. ఈ భాగమునందు శర్మగారొక సిద్ధాంతము ప్రతిపాదించిరి. లాక్షణికులు పేర్కొన్న షడ్విధప్రాసములు శబ్దాలంకారములు గావు. శబ్దాలంకారములు గద్యపద్యోభయ సామాన్యములు. షడ్విధ ప్రాసములు పద్యమాత్ర సాధారణములు. ద్వి, త్రి, చతుః ప్రాసములు యమకభేదములను పోలినట్టివి. పోలినవేకాని యవియే యవిగావు. ద్వి, త్రి, ప్రాసములకు పాదాది వ్యపేత యమకమొక్కదానితోడనే కొంత సాదృశ్యము కలదు.

పదాంతములందు సదృశవర్ణావృత్తి యున్నచో అది అంత్యానుప్రాసమనబడు శబ్దాలంకారము. పాదాంతములందు సదృశ వర్ణావృత్తి యున్నచో అది అంత్యప్రాస మనఁబడు ఛందోఽలంకారము. అలంకార శాస్త్ర సంబధియైనది అంత్యాను ప్రాసము. ఇది అనుప్రాసభేదము. ఛందశ్శాస్త్ర సంబంధియైనది అంత్యప్రాసము. ఇది ప్రాసభేదము.

శబ్దాలంకారమైన అనుప్రాసమునకును, ఛందోఽలంకారమైన యనుప్రాసమునకు భేదము గలదు. ఆవృత్తలయిన యక్షరములలో నేదియు ప్రాసాక్షరముగా నిచో, ఆ యనుప్రాసము గద్యపద్యోభయ సామాన్యమై శబ్దాలంకార మనదగి యుండును. ఆవృత్తమైన యక్షరము ప్రాసాక్షరముగా కూడ నున్నచో, దానివలన నేర్పడు అనుప్రాసము ఛందోలంకారము.

ఈ సిద్ధాంతప్రబంధములో సగపాలు ఆక్రమించిన భాగము రసానుశీలనము. ఈ భాగములో విశేషచ్ఛందములు, సామాన్యచ్ఛందములు, గద్యము, ఛందస్సంవాదము అను నవాంతరభాగములు కలవు. శర్మగారొక్కొక్క ఛందము గ్రహించి, అది యే

ఛందమున పుట్టినదో తెలిపి, దాని లక్షణమును పేర్కొని ఆ ఛందమువల్ల కవిత్రయము శిల్పము నెట్లావిష్కరించినదో వ్యాఖ్యానము చేయుచుపోయిరి. కందము, సీసము మొదలగువాని భేదములను సమగ్రముగా వివరించిరి. ఆటవెలది, తేటగీతి లక్షణములను సంపూర్ణముగా వెల్లడించిరి. కవిత్రయము వ్రాసిన గద్యమునందలి విలక్షణతను నిరూపించిరి. 'వస్తురసభావాదు లందలి యైక్యమును వ్యత్యైక్యముచే కవిత్రయము వ్యంజించిన ఘట్టములు పెక్కుగలవు' అని మొదలుపెట్టిన శర్మగారు కవిత్రయము ఛందస్సంవాదమును ముచ్చటగా వర్ణించిరి.

అనుబంధమంతయు లెక్కలతో కూడినట్టిది. ఛందోఽనుక్రమణికలో కవిత్రయము వాడిన గద్య పద్యసంఖ్య నొసగిరి. ఆశ్వాసక్రమముగ గద్యపద్య సంఖ్య నొసగిరి. అట్లే సామాన్యచ్ఛందముల సంఖ్యా వివరములు ప్రకటించిరి. విశేషచ్ఛందములను పర్వాశ్వాస క్రమమున లెక్కగట్టిరి. చివరకు గద్య సామాన్య విశేషచ్ఛందముల సంఖ్య చూపిరి. ముఖ్యపదానుక్రమణికతో గ్రంథము ముగిసినది.

ఈ సిద్ధాంత ప్రబంధ ప్రమేయము సామాన్యమైనదిగాదు. అతినిశితమైన మేధావిభవము, గాఢమయిన సాహిత్యశాస్త్ర వైదుష్యము, హేతుయుక్తమయిన విమర్శశక్తి యుండినగాని ఛందశ్శిల్పమందలి గుట్టుమట్టులు తెలియవు. అట్టి విషయమును చేపట్టినవారు శర్మగారు. వారి కృషి ఫలమును గ్రహింపవలయునని యిచ్ఛించువారీ సిద్ధాంత ప్రబంధమును శ్రద్ధతో, వివేకముతో పఠింపవలయును. పఠించి మననము చేసికొని, ఆలోచింపవలయును. ఆలోచించినగాని, శర్మగారి సాహితీ వ్యవసాయమునందలి మంచి సెబ్బరల నెంచుట కయితిగాదు.

అసాధారణమైన విషయమును స్వీకరించి, ఆంధ్రమహాభారతమువంటి లోకోత్తర గ్రంథమున కన్వయించుటకు శక్తియుక్తులెన్నేని గావలయును. తత్త్వానుశీలనమును సర్గను పరిశీలించినచో మాధవశర్మగారి బహుముఖ పుస్తక పరిచయ పాండిత్యములు తేటతెల్లమగును. విషయమును సేకరించుటయందు వారెంతో శ్రద్ధను, నైపుణ్యమును ప్రదర్శించిరి. ఆ విషయమును ప్రసక్త ప్రమేయమున కనుగుణముగా అన్వయించుటకు బహుధా పాటుపడిరి. ఈ పుస్తక పరిచయ పాండిత్యములతోపాటు కొట్టవచ్చినట్లు కన్పించునది శర్మగారి వ్యాఖ్యానశక్తి. ఈ శక్తికి పునాది విమర్శ వ్యాఖ్యాతృమేధావిభవముపై నాధారపడియుండునను సిద్ధాంతము. ఈ సిద్ధాంతము యొక్క ముఖ్యలక్షణము స్వతంత్ర చింతనము. దీని నాధారముగా చేసికొని ప్రాచీన మహాకవుల శిల్పమునకు తెరదీయుట కొన్నియేండ్లనుండి యీ తెలుగు మాగాణములో మొదలైనది. విమర్శకుడు చేయు వ్యాఖ్యానము, వెల్లడించు శిల్పము నిజముగా ప్రకరణోచితములా? ఆ శిల్పమనునది యట యున్నదా? అని యెవరేని ప్రశ్నలువేసి రమకొందము. దానికి సమాధానమొకటే. విమర్శ వ్యాఖ్యాతృమేధావిభవముపై ఆధారపడియుండును. అందఱ మేధ లొకతీరుగా నుండవు. ఒకని బుద్ధికందని నిగూఢ పరమార్థములు మఱొకని బుద్ధికందవని యెక్కడ నున్నది? ఎవనికి దోచినది వాడు చెప్పవచ్చును. పై సిద్ధాంతము పట్టుగొమ్మగా బయలుదేరు వ్యాఖ్యానములలో చమత్కార మధికము. వ్యాఖ్యాత మేధావిభవముచూచి ఆశ్చర్యము కలుగును. శర్మగారి వ్యాఖ్యానము పలుతావులలో ఈ గాడిలో పడినది. వారు చూపిన శిల్పమట యున్నట్లు వారికి తోచినదని పాఠకుడు సరిపెట్టుకోవలయును. శర్మగారు 'ధ్వని'యను సాహిత్య శాస్త్ర సిద్ధాంతమును తడవుచున్నప్పటికి, ఆ విమర్శ విధానము కృత్రిమముగా నున్నట్లు భాసింపకమానదు.

వైదుష్యము, వ్యాఖ్యానవైపుణ్యము వీనితోపాటు మాధవశర్మగారికి మహాభారతకవులపట్లగల భక్తితాత్పర్యములు ఈ సిద్ధాంతప్రబంధమున పుష్కలముగా ప్రకటింపబడినవి. గ్రాంథికభాషావాదులకు మహాభారతము శరణాగతి శాస్త్రము. ఇప్పట్ల శబ్దశాసన మహాకవినిగూర్చి అప్పకవి చెప్పిన పలుకులను మనము గుర్తునకు తెచ్చుకొనవలయును. 'ఆంధ్ర మహాభారతము—ఛందఃశిల్పము'వంటి మహావిషయమును చర్చించునపుడు వ్యాఖ్యాతకు ప్రామాణికబుద్ధి, భక్తితాత్పర్యములు అనుపదమున ఆటంకములు కల్పించును. అదియే యీ గ్రంథరచనమున సంభవించినది. శర్మగారియందలి నిశితవిమర్శ వెనుకబడి, భక్తి ముందునకు త్రోసికొనివచ్చినది. యతిప్రాసల తత్త్వమును, స్వరూప స్వభావములను లెస్సగా విచారించిన

శర్మగారు కవిత్రయము—అందును తిక్కన—వాడిన యతుల యగాగాములను వాడిగా విమర్శించి యుండ వలసినది. వారట్లు చేయరైరి. చేసినదేమనగా, ఆ భాగమును అప్పకవీయమునకు ప్రతిబింబముగా తీర్చి దిద్దుట. ఛందశ్శిల్పమును ఆవిష్కరించు పట్టులో శర్మగారి భక్తివిశేషముగా వెల్లివొడిచినదని చెప్పక తప్పదు. దీనినిబట్టి యీ సమీక్షకునకు కవిత్రయముపట్ల ఏవగింపుకలదని యెవ్వరు భావింప కుందురుగాక!

ఆంధ్ర మహాభారతమందలి వస్తురసాలంకార కల్పనము వ్యాసునిదే యవియు, కవిత్రయమువారి ప్రతిభావిష్యందమని చెప్పదగినది ఛందమనియు మాధవశర్మగారు వ్రాయుచున్నారు. ఈ మాట యెంతవఱకు సమంజసము? కవిత్రయము వెల యించినది ప్రతిరూపకల్పనాశిల్పమునేనా? భారతము నందలి యంగిరసము శాంతమని యానందవర్ధనుని తీర్పు. అంగాంగిరస పరిపాలనమునందు, వస్తునిర్వహణమునందు ముగ్గురు కవులు ఎంత స్వేచ్ఛను, భావస్వాతంత్ర్యమును పాటింపలేదు? కొన్నికొన్ని ఘట్టములలో మాతృకయందలి పాత్రల స్వరూప స్వభావములకంటె, ఆంధ్ర మహాభారతమందలి పాత్రల స్వభావము భిన్నముగా లేదా? వానిమాటల తీరుతెన్నులు స్వతంత్రములుగావా? ఆంధ్ర మహాభారతమునందలి పాత్రల వాక్కులే సంస్కృతీకరింపబడి, మూలగ్రంథమున ప్రక్షిప్తములై రాణించినట్లు విమర్శకులు గుర్తింపలేదా? సంస్కృత భారతము ఇతిహాసము. ఆంధ్ర భారతము మహాకావ్యము. ఆ ప్రక్రియాద్వయభేదము సంస్కృతాంధ్ర భారత ఘట్టములలో సాక్షాత్కరించుట లేదా? కవిత్రయ ముపయోగించిన యలంకారము లితిహాసమునన్నవా? సహృదయులగు విమర్శకులు పర్యాలోచింతురుగాక!

ఛందఃశిల్పమన నెట్టిదో శర్మగారు నిర్వచించిరిగదా! దానినిగూర్చి కొంత విచారణచేయవలసియున్నది. కావ్యమునకు ఆత్మ రసము. కావ్యాంగము లేవైనను రసోన్ముఖములై యుండవలయును. వక్తృచిత్తవృత్తి కనుగుణముగా, భావమును అభివ్యక్తీకరించు పోకడయుండును. ఆ మార్పుల నన్నిటిని మహాకవి ఛందస్సున ప్రకాశింపజేయునని మాధవశర్మగారను చున్నారు. ఇది నిజమా? ఆదికవి కావ్యమును, కాళిదాసు కావ్యములను పరిశీలించినచో అందలి సర్గలు ఒకే ఛందముతో కూడియున్నట్లు గోచరించును. వక్తృచిత్తవృత్తి కనుగుణముగా, వస్తుగుణ క్రియా వర్ణనముల కనుగుణముగా నానావిధచ్ఛందములను వాల్మీకిగాని, కాళిదాసుగాని స్వీకరింపలేదు. దీనినిబట్టి రసమునకు ఛందమునకు పొత్తున్నట్లు ఆదిమకాలమున ఎవ్వరు అనుకొనలేదు. పోనీ! ఆలంకారికులు ఛందోరస సంబంధమునుగూర్చి చెప్పిరా? దండి, ఆనందవర్ధనుడు మున్నగువారు ఛందము రసాదివ్యంజకమని పేర్కొనరైరి. భరతుడు, క్షేమేంద్రుడు, భోజుడు ఛందోరససంబంధమునుగూర్చి విచారము చేసిరిగదా? యనువారుండవచ్చును. నిజముగావచ్చును గాక! క్షేమేంద్రాదులు చేసిన వృత్త విచారమంతయు వారి బుద్ధిబలమునకు నిదర్శనము. వారుచెప్పినట్లుగా ఏకవియు వ్రాయలేదు. వ్రాయుడుగూడ. ఆవిషయము మాధవశర్మగారికి తెలియనిదిగాదు. కవిత్రయము క్షేమేంద్రుని వృత్తవిచారమునకు భిన్నముగా ఛందముల నెట్లుపయోగించినదో వారు విపులముగనే వివరించుచుపోయిరి. ముగ్గురుకవులు బహువిధభావము లను ఏకైక ఛ్ఛందమున ప్రకటించిరను రహస్యమును వారు చక్కగా గుర్తించిరి.

దీనినిబట్టి తేలుచున్న సారాంశమేమి? పద్యము రసవ్యంజకము కాదనుచున్నారమనగా, గురులఘువులు గాని, వానివల్ల ఏర్పడు గణములుగాని రసవ్యంజకములు గావనియే యర్థము. పలురీతులుగా గురువు లేర్పడవచ్చును. ఈ యేర్పాటునుబట్టి ఒకే గణము పెక్కుపోకడలు పోవచ్చును. ఇట్టి గణములకూర్పుగల పద్యముల పద్ధతియు అనంత విధములుగా నుండును. అందుచే ఈ పద్యము ఈ రసమున కనుగుణముగా నుండునని చెప్పుటకు వీలులేదు. శర్మగారనుకొన్నట్లుగా గురులఘువులుగాని, వానికూర్పువల్ల నేర్పడు గణములుగాని రసవ్యంజకము కాజాలవు. మరి రసవ్యంజకములగునవేవి? హ్రస్వదీర్ఘములైన స్వరములు, పరుషకోమలములయిన వ్యంజనములు, వాని సంయోగములు మాత్రమే రసపర్యవసాయులగును. ఈ సందర్భమున ఆనందవర్ధనాదులు ఎంతో లోతుగా చర్చ చేసిరి.

ఇక ఛందఃశిల్పము లేనియట్లా? శబ్దాలంకారము, వృత్తి, రీతి, గుణము మున్నగు వానిని విడిచిన ఛందఃశిల్పములేదని చెప్పవచ్చును. మఱుగు పడిపోయిన యెన్నో రహస్యములను సాధించి, శోధించి అభినవఘంటాపథమును నిర్మించికొనిన శర్మగారు గుణాదులకు, ఛందఃశిల్పమునకుగల సంబంధమును గూర్చి తాత్త్వికముగా చింతనచేయవలసినది. వారా జోలికే పోలేదు. ధ్వనికారాదులు ఛందఃశిల్పమును గూర్చి చెప్పలేదుగదా! అంతమాత్రమున భరతాదుల మార్గమును చేపట్టి శర్మగారు వ్రాయగూడదని మా సిద్ధాంతము గాదు. ప్రాచీనులు చెప్పిన దానికంటె మిన్నగా నవీనులేమియు చెప్పజాలరను భక్తి గాని, విశ్వాసముగాని మాకు లేవు. కాని మాధవ శర్మగారు చెప్పుచున్న ఛందఃశిల్పము గుణాదుల కోవకు చెందినదే. ఆంధ్రభాషకు సంబంధించినంత వఱకు మఱియొక మాట చెప్పవచ్చును. తిక్కన తెనుఁగుదనము లెస్సగా తెలిసిన వాడు. తెనుఁగుదన మనగా తెలుగు మాటలు కూర్పుగాని పేర్పుగాని కాదు. మఱి తెలుగుగుండెగలవాడు తన తలపులను ప్రకటించు విధానము తెనుఁగుదనమనబడును. దీనినే అభివ్యక్తీకరణ పద్ధతియందురు. శర్మగారు వివరించిన ఛందఃశిల్పములో కొంతభాగము ఈ యభివ్యక్తీకరణ పద్ధతికంటె అనగా ఈ తెనుఁగుదనము కంటె భిన్నమయినదిగాదు.

మఱియొకరీతిగా ఈ విషయమును పరిశీలింపవచ్చును. నానావిధచ్ఛందములు లాక్షణికుల చిట్టాలలో కన్పించుచున్నవి. కాని ఆంధ్రభాషా కవితకు సంబంధించినంతవఱకు చంపకోత్పలములు మత్తేభశార్దూలములు, కందము, సీసము, తేటగీతి, ఆటవెలది బాగుగా మెదిగిపోయినవి. స్రగ్ధర, మహాస్రగ్ధర, మత్తకోకిల, ఉత్సాహము మున్నగునవికొన్ని యెడనెడ నుపయోగింపబడి యుండవచ్చునుగాక! కాని ఆంధ్ర కవితలో ముప్పాతిక మువ్వీసము ఉత్పలమాలాదులలో ఉన్నట్టిదే. దేశికవితమాట యటుండనిండు. దీనిని బట్టిగూడ రసమునకు నానావిధచ్ఛందములకు సంబంధములేదని తెలియకపోదు.

అనంతాదులు చెప్పినదానికంటె భిన్నముగా మాధవ శర్మగారు షడ్విధ ప్రాసములు శబ్దాలంకారములు గావనుచున్నారు. గద్యపద్యోభయము లందుండునవి, పద్యమునందే యుండునవి యను నొకభేదమును బయట పెట్టి షడ్విధప్రాసములకు ఛందోఽలంకారము లను నొక నూతననామమును మాధవశర్మగారు వ్యవదేశించిరి. వారుచెప్పినదానినిబట్టి ప్రాసాక్షర మావృత్తమైన ఛందోలంకారము, ప్రాసేతరాక్షర మావృత్తమైన శబ్దాలంకారము. వారిచ్చిన యుదాహరణములలో 'పినిధోత్తుంగ తరంగ ఘట్టన' అనుపద్య మొకటి. ఆ పద్యమున అవృత్తములైన అక్షరములు లకారము, బిందుపూర్వక గకారము మాత్రమేగావు. అందు ప్రాసాక్షరమగు వకారము 'పెక్కెడల' చెప్పబడినదిగదా! అందుచేత ఆ పద్యములో ఛందస్సంబంధియైన అనుప్రాసాలంకారమున్నదిగదా! మఱి శర్మగారు అందు అనుప్రాసమను శబ్దాలంకారమున్నదనుచున్నారు. కారణము తెలియదు.

వాస్తవముగా అనంతాదులు పేర్కొన్నట్లు షడ్విధప్రాసములను శబ్దాలంకారములనుట యుచితము. వానికి ఛందోఽలంకారములను క్రొత్తపేరు పెట్టనక్కఱలేదు. శబ్దాలంకారము ఛందోఽలంకారము భిన్నములు గావు. ఈ క్రింది పద్యములలో ఛందోలంకారములే యున్నవో, శబ్దాలంకారములేయున్నవో విజ్ఞులు గుర్తించెదరుగాక!

క. అకటా! నన్నిటదేలిన
నాకటా నచ్చికములేక యుండుఁగ నమ్మన్
నికటామృతధారలు మరు
ని కటారి మెఱుంగు లీతని కటాక్షంబుల్.

క. వాతెఱకు నమృతమే తుల;
మే తులకింపుల పిసాళి మిసిమికిఁ గ్రమ్మిం
చే తుల; చేతుల కబ్జము
లే తుల; లేతుల నెలందు లీవెలి తులయే.

క. కలలో వెఱుంగ మే గని
కలలో నీ చెలువమున్; సకలలోకములన్
గల లోలాక్షుల గరగరి
కల లేఁగానివారొ? చంద్ర కలలో నీరల్?

క. రాకొమరు నెఱులు నీలపు
జా కొమరు నిరాకరించు; రాకాచంద్రున్
రాకొట్టు మొగము కెంజిగు
రాకుఁగని పరాకుసేయు నౌర! పదంబుల్.

మఱియొక విధముగా ప్రాసానుప్రాసలకు భేదము లేదని నిరూపింపవచ్చును. ఈ క్రింది యుదాహరణ వాక్యములను జూడుడు. మొదటి రెండును తిక్కన గారి శల్యపర్వమునందలివి. తరువాతివి సోమన యుత్తరహరివంశములోనివి.

1...బలువు బొలుపును వెలయఁ బొలికలనికి...

2...నారాచప్రముఖనానావిశిఖంబుల,
మసమొన గనుపుగొట్టిన నదిలిగ, డొంది

3...ఉరవున నూఁకియు వెరవునం దాఁకియు...

4...కపిమసంగిన మారి పిసిక్కి పిండలివండు...

5...లావున నిక్కియుఁ బ్రేవులం జిక్కియు

6...సరసాన బిరసినం గరసాన వారసిన...

ఈ పై వాక్యములలో నున్నది, ప్రాసమా? లేక అనుప్రాసమా? పద్యమయినంతమాత్రాన ప్రాస మగునా? గద్యమయినంతమాత్రాన అనుప్రాసమగునా? ఆ విధముగా అనుకొన్నప్పటికి ప్రాసానుప్రాసములకు భేదము లేనియట్లే గదా! ఆ యుదాహృత వాక్యములు ఆయా పద్య భాగములనియు, అందుచేత వానియందు శబ్దాలంకారమైన యనుప్రాసమున్నదని మాధవశర్మ గారనవచ్చును. కాని యా వాక్యములలో ప్రాస లేదా? ఆంధ్రలాక్షణికులు దీనిని ప్రాసగా నంగీకరింపరా? షడ్విధ ప్రాసములు శబ్దాలంకారము లని యే యాలంకారికుడు చెప్పలేదనువారుండ వచ్చును. ప్రాసయనునది ఆంధ్రభాషయందలి వృత్త జాతులయందే గోచరించుచున్నది. సంస్కృత భాషలో లేదు. మన లాక్షణికులు షడ్విధ ప్రాసములను శబ్దాలంకారము లనిరి.

ఛందఃశిల్పమును ఆవిష్కరించు సందర్భములలో శర్మగారు ఒక్కొక్కచోట దానిని తెగసాగ దీయుచున్నారా? అను సందేహము సహృదయులకు కలుగకపోదు. 'మెఱుగు మెఱసినట్లు మెఱయంగ నరదంబు, కర్ణికారకేతుకాంతి వెలుఁగ' అను దానికి వ్యాఖ్యానము చేయుచు 'పూర్వార్థమున శకటరేఫ సహిత లఘ్వక్షర పదత్రయమున మెఱపులును, కకార సహితగల స్వరూపములందుఁ గేతుకాంతులును స్ఫురించుచున్నవి' అని వ్రాసిరి. 'తమక తమక తపసి మరలి తమ తమ యావాసములకు అను కూర్పు సైనికులు చిన్నచిన్న గుంపులుగట్టి శిబిరములకు మఱలిపోవు తెఱఁగును కన్నులకుఁ గట్టునట్లు రూపించుచున్నది' అని వివరించిరి. ఏమనుట కేమి యున్నది?

'నెట్టన యూవగానుతుఁడు' అనునది భీష్మ పర్వమందలి ధృతరాష్ట్ర విలాప ఘట్టములో చివరి పద్యము. దీనికి వ్యాఖ్యానము చేయుచు శర్మగారు 'ఉచ్చతరస్థానజన్యమైన టకారము ద్విరుక్తమై ధృతరాష్ట్ర విలాపమందలి యుచ్చస్వరత్వమును సూచించు చున్నది. మూర్ధతాడన రూపమైన ధృతరాష్ట్రుని శోకోద్రేకాభినయముగూడ ప్రాసాక్షరము లందనువేయమగుచున్నది.' అని వివరించిరి. ఇక్కడ శర్మగారి వివరణమును రెండు వైపులనుండి పరిశీలింప వలసియున్నది. భీష్ముని చావునకు ధృతరాష్ట్రుడు మూర్ధతాడన రూపమైన శోకోద్రేకాభినయము చేయునా? చేయుట యాపాత్రకు తగిన పనియేనా? ఉదాత్తత యూడ్చుకొని పోవదా? ధృతరాష్ట్ర డట్లు చేయుట సమంజసమని యనుకొన్న తిక్కనగారు ద్విరుక్తటకారద్వారమున వ్యంజింప జేసిరన్నమాట!

ఈ ఘట్టము కరుణరసభరితము. మఱి కరుణ రసమును ద్విరుక్తటకారము వ్యంజింప జేయగలుగునా? చేయగలుగునను శాస్త్రవచనమున్నదా? ద్విరుక్తటకారము ఓజోగుణమునకు సహకారి. ఈయోజస్సు వీర బీభత్స రౌద్రములం దుత్తరోత్తర మధికముగా నుండవలయునని శాస్త్రకారులనిరి. అంతేగాదు. కరుణము మొదలగునవి కోమలతరములని, దానికి తగినట్లు కోమల పదసంవిధాన ముండవలయునని, పరుష వర్ణములుగాని, సంయోగములు, దీర్ఘసమాసరచన పనికి రావని ఆలంకారికులు పేర్కొనిరి. తిక్కన కీమాత్రము తెలియదా?

తిక్కన ఇతర పర్వములందు ద్విరుక్తటకార ప్రాసవాడిన సందర్భములను పరిశీలించినచో, ఆయనకు ఆలంకారిక మార్గము క్షుణ్ణముగా తెలియునని యనిపించును. సంజయ రాయబారమునాఁడు క్రోధము వచ్చిన కృష్ణుని పలుకులు 'నెట్టన సభలో నేపుర' 'తిట్టులఁబోయి' యను పద్యములుగా తిక్కన వ్రాసెను. అట్లే రోషము వచ్చిన ద్రౌపది మాటలు

'నెట్టన యిట్టి యల్క మదినిల్పితి' అను పద్యముగా రూపొందినవి. దుశ్శాసన వధ చేయునపుడు భీముడాడిన వాక్యములు 'నెట్టన యల్గినం దగునె' అను పద్యముగా, కృష్ణుడు కిరీటితో ఆడినమాటలు 'అట్టిద లోక పర్యవసము' అను పద్యముగా కర్ణపర్వములో నిలిచినవి. శల్యపర్వములో భీముడు దుర్యోధనునితో పలికిన పలుకులు 'ఇట్టిది క్రూరకర్మమని' యను పద్యమైనవి. యుద్ధవర్ణనమున తిక్కన ద్విరుక్తటకార ప్రాసము వాడిన సందర్భములును గలవు.

'నెట్టన యాపగాసుతుడు' అను పద్యమునకు శర్మగారు చేసిన వ్యాఖ్యానమంతయు ప్రకరణోచితము గాని యూహా మాత్రమే. ఈ విధముగా పలుతావులలో మాధవశర్మగారు వ్రాసికొనుచుపోయిరి. కవిత్రయముపట్లనున్న భక్తితాత్పర్యములు, నూతన విషయములను వివరింపవలయునను ఆకాంక్షావిశేషము, పద్యము చదివినపుడు కలుగు ననుభవమును విస్మరించుట, భావమునుగాక దానిని ప్రకటించు సాధనమయిన ఛందస్సును ప్రధానముగా సంభావించుట యిటువంటి వ్రాతలకు హేతువులు.

మాధవశర్మగారు శార్ఙ్గధర సంహితా వచనములు తార్కాణించి అవి 'సంచారిభావముల ధాతుదోషజన్యత్వమును నిరూపించుచున్నవి' అని వ్రాసిరి. వాతపిత్తశ్లేష్మములు ధాతుదోషములుగదా! ఈ దోషములకు, రససిద్ధాంతమందలి సంచారిభావములకు సంబంధ మున్నదా? ఆలంకారికులు సంచారిభావములను నిర్వచించిరి. ఆ నిర్వచనములు, శార్ఙ్గధర సంహితావచనములు సమానములా? నామసామ్యముండిన నుండుగాక! శర్మగారీ భాగము నింకను వివరించి యుండవలసినది. ఉదాహృతవాక్యము అపార్థములకు అవకాశ మిచ్చును.

మాధవశర్మగారు ఆంధ్ర మహాభారతమందలి ఛందఃశిల్పమును తమకు తోచినట్లుగా వర్ణించుకొనుచుపోయిరి. వారు వెల్లడించినదంతయు యథార్థశిల్పమా? కాదా? యని యెవరికి వారు నిర్ణయించుకోవలయును. అంతమాత్రమున ఈ బృహద్గ్రంథము నిరుపయోగకరమని మా యభిప్రాయము గాదు. ఈనాడు అనాలోచితముగా ఛందస్సుపైన దాడి చేయువారు ఎందఱో గలరు. పలువురీ రోజులలో కావ్యశిల్ప సౌందర్యములకు, ఛందోలంకారములకు సంబంధము లేదని చాటుచున్నారు. ఛందస్తత్త్వమును తెలిసికొని, ఆంధ్ర మహాభారత ఛందఃశిల్ప సత్యసౌందర్యము దర్శింపగోరువారు ఈ గ్రంథమును అవశ్యము పఠింపవలయును. మఱుగునబడిపోవుచున్న విషయమువైపు తెలుగువారి చూపును మఱొకసారి మళ్లించినందులకు మాధవశర్మగారిని మనసార అభినందించుచున్నారము.

— 'శాక్యసింహ'.

మృదంగ తత్త్వము

[గ్రంథకర్త: శ్రీ ధర్మాల రామమూర్తి; ప్రకాశకులు: శ్రీ ధర్మాల రామమూర్తి, రాజమండ్రి. క్రౌన్ 1/4. పేజీలు: 380+31 ఫుల్ కాలికో బైండ్. జాకెట్‌తో: వెల రు 20/-.[

గ్రంథకర్త శ్రీ ధర్మాల రామమూర్తి మృదంగ వాదనము లక్షణ లక్ష్యములు ఆమూలాగ్రముగా తెలిసిన విద్వాంసులు. 30 సంవత్సరములు పరిశ్రమచేసి పండిన దీర్ఘానుభవమునకు నిదర్శనముగా వారీ మహాగ్రంథమును వెలయించిరి. ఇది మృదంగవాదకులకే కాక సంగీత విద్వాంసులకందరికికూడ ఎంతయో ఉపయోగపడు గ్రంథము. మృదంగ వాదనము అభ్యసింప దలచిన వారికి సులభముగా గ్రహించి అభ్యసించుటకు వీలుగా చక్కని అనుక్రమణికతో వివిధ పాఠములు అవసరమైన గుర్తులతో దీనిలో గ్రంథకర్త ప్రపంచించిరి. మరియు వాయించుటలో ఎక్కడ ఏ వ్రేలితో ఏ శబ్దము పలికించవలెనో వివరించుచు చాపు, మీటు, ఛేళ్ళు, వాదము మొదలగు మృదంగ వాద్యభంగిమలను ప్రదర్శించు కొన్ని ఛాయా పటములనుకూడా గ్రంథమునచేర్చి గ్రంథప్రయోజనమును ద్విగుణీకృతముచేసినారు. ఈ గ్రంథ ప్రకటనము ఎంతయు శ్రమతోడను వ్యయముతోడను కూడిన విషయము శ్రమ అంతయు గ్రంథకర్తది. దీని ప్రకటనమునకైన వ్యయమునకు ఉదారముగా భూరివిరాళము లిచ్చిన కేంద్ర సంగీతనాటక అకాడమీవారును, శ్రీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖవారును, మహారాజ పోషకులు, రాజపోషకులు, పోషకులును అభినందనీయులు. ఉత్తమ

కృషి చేసినవారికి సహృదయులైన ఉదారుల ధన సహాయము తప్పక లభింపగలదనుటకు ఈ గ్రంథ ప్రకటనమే నిదర్శనము.

ఈ గ్రంథములో 1. తాళలక్షణ ప్రకరణము' 2. దశప్రాణలక్షణ ప్రకరణము, 3. వివరణ ప్రకరణము, 4. వాద్య ప్రకరణము, 5. ముక్తాయి ప్రకరణము అను 5 ప్రకరణములు కలవు.

తాళలక్షణ ప్రకరణములో మూలభూతములైన సప్తతాళములను, వాని అంగసంజ్ఞలను పరిచయము చేసిరి. పిమ్మట తాళభేదముల వివరించుచు 'మార్గము, దేశి అని తాళము రెండు విధములు. అందు ప్రతిఒక్కటియు శుద్ధము, సాలగము, సంకీర్ణము అని మూడు విధములై యుండును.' అని 'మార్గదేశీ గతత్వేన...' ఇత్యాది శ్లోకమును ఉదాహరించిరి. కాని ఈ మార్గ, దేశితాళములుకాని, శుద్ధ సాలగ, సంకీర్ణభేదములుగాని గ్రంథములో ఎక్కడను వివరింపబడకపోవుట జిజ్ఞాసువులకు లోపముగా తోచును ఇట్టి వానిని సుబోధ మొనరించుటయు, సంగీతశాస్త్ర విషయముల క్రమపరిణామము వివరించుటయు ఆవశ్యకము.

దశప్రాణ ప్రకరణములో గాయక వాదకులందరు సర్వసాధారణముగా ఎరుంగ వలసిన కాల, మార్గ, క్రియ, అంగ...ఇత్యాది దశప్రాణములను ఎరింగించిరి. అంగ ప్రాణమును వివరించుచు తాళ షడంగములు, షోడశాంగములు, వాని సంజ్ఞలు, మాత్రలు పేర్కొని తుదకు దాని సారాంశమును చక్కగా పథకముద్వారా ప్రదర్శించినారు.

వివరణ ప్రకరణములో ముందు రాబోవు ప్రకరణములలోని విషయములను గ్రహించి అనుభవములోనికి తెచ్చుకొనుటకు అవసరమైన సంకేతముల నన్నిటిని చక్కగా వివరించిరి. ఈ ప్రకరణములోనే వివిధములగు మృదంగములను నిర్మించుటకు అవసరమైన కొలతలను, తయారుచేయు పద్ధతులను చక్కగా వివరించిరి.

గాయకులు గాత్రమునందును తంత్రీ సుషిర వాద్యములందును పలికించు పంచదశవిధగమకములు మృదంగముమీద పలికించు విధము ఇందులో వర్ణింపబడియుండుట ఎంతయు సమ్మోదావహము. ఇది గ్రంథకర్త స్వీయోపజ్ఞచే భావించినది.

ఈ గ్రంథమంతటిలో అమూల్యతరమైన భాగములు చివరివగు వాద్య, ముక్తాయి ప్రకరణములు. వీనిని జాగ్రత్తగా పఠించినచో ప్రారంభకులు నేర్చుకొనుటకును, కొంత నేర్చినవారు తమ జ్ఞానమును శతగుణముగా గురువుల సహాయము లేకుండ అభ్యసించి నైపుణ్యము అలవరుచుకొనుటకును, ప్రయోజనకారులుగా ఉండగలవు. గురుముఖైకవేద్యములుగా, రహస్యములుగా ఇంతవరకు ఉండిపోయిన ఎన్నో గొప్ప విషయములను బుద్ధిమంతులైనవారు గ్రహించుటకు ఈ ప్రకరణములలో గ్రంథకర్త అవకాశము కల్పించినారు. ఐనను గురుముఖమున తెలిసికొనవలసిన విషయములు మిగిలి పోలేదనుట సాధ్యముకాదు; కాని కేవలము గురువులు చెప్పిన కొద్ది ఆ వృత్తము లను మాత్రమే ఎదుగు బొదుగు లేకుండా మరల మరల వాదనము చేయుచు ఉండవలసిన దురవస్థను చాలవరకు ఈ గ్రంథ ప్రకటనచే తొలగించి గ్రంథకర్త మృదంగవాదకులకు మహోపకార మొనర్చినారు. కేవలము గురువుల దయమీదనే ఆధారపడక గురువుల వద్ద నేర్చిన విద్యాలేశమును స్వానుభవము చేతను, వినికిడి చేతను అభివృద్ధి చేసికొనుచు లక్షణము తప్పకుండా ప్రదర్శించుటకు అనువుగా ఈ రెండు ప్రకరణములు రచింపబడినవి. ఇందు సాలవరసలు, పెద్దసాలవరసలు, జంట వరసలు మొదలగు ప్రాథమిక వరసలతోపాటు, 35 తాళముల జతిపాఠములు చక్కగా తాళమునకు అనుగుణమగు సంకేతపద్ధతి (Notation)లో వ్రాసియుండుట ఉగ్గడింపదగినది. ఈ ప్రకరణములలో పేర్కొనబడిన నడలు, మొహరా, ముక్తాయిలు మొదలగు సూక్ష్మవిషయములు ఎల్లరకు ఉపయోగకరముగ ఉన్నవి. పదగర్భమునకు ముగింపునకు వివరణమును, శబ్దపల్లవి మున్నగు విశేష విషయములును గాయకవాదకుల కందరకును ఉపయోగకరమైన విషయములు, త్రికాలజాతిని త్రికాలముగా అనెడు పద్ధతి, ముక్తాయి మూడుసార్లు అనెడు విధానము—మొదలగువానిని గ్రంథములో స్పష్టపరచి, అవసరమైనవానిని సంగ్రహించుచు పథకరూపమునకూడ ప్రచురించుటచేత గ్రంథ

ప్రయోజనము ఇనుమడించినది. క్రొత్త విషయములను వివరించునపుడును, పఠకముల చివరలను, ఎన్నియో సందర్భములలో లక్ష్యమునందు గ్రంథకర్త ఇచ్చిన వివరణలు ఎంతయు ప్రయోజనకారులుగా ఉన్నవి.

మృదంగ తత్త్వము అని నామకరణము చేసిన ఈ గ్రంథములో విపులముగా వివరింపబడిన మృదంగ వాదనముతోపాటు మృదంగ వాదనమందు వచ్చిన పరిణామములు, విశేషములు మున్నగు విషయములుకూడ చేర్చియుండిన సమగ్రత చేకూరియుండెడిది. మృదంగ శబ్దమునకు గురుబాల ప్రబోధికలో రెండు వ్యుత్పత్తులు ఈయబడినవి. 1. మృద్యత ఇతిమృదంగః — 'మృద మర్దనే—' కొట్టబడునది. 2. 'మృత్‌అంగం అస్యఇతివా మృదంగః'—మృత్తిక అంగముగా కలది. అమరసింహుడు మృదంగమునకు పర్యాయపదముగా మురజా శబ్దము నిచ్చినాడు. మృదంగ భేదములుగా అంక్యము, ఆలింగ్యము, ఊర్ధ్వకము అను మూడింటిని పేర్కొనెను. పై మృదంగ శబ్దనిర్వచనముగాని, పై భేదములుగాని గ్రంథకర్త పేర్కొనలేదు. నాట్యశాస్త్రమునందే మృదంగ వాదనము సంగతియు దానినిగూర్చిన కొన్ని విశేషములు కనబడుచున్నవి. వానిని గ్రంథకర్త స్పృశింపనైన లేదు. ఉత్తర హిందూస్థానములో శాస్త్రీయ సంగీత గానములో మృదంగము కొద్దిమార్పులతో ప్రయోగింపబడుచున్నది. దానినికూడ గ్రంథకర్త సూచింపనైనలేదు. మరియు మృదంగవాదనము వేదకాలము నుండి నేటివరకు ఎట్లు ఉద్భవించి పరిణతి నందినదో స్థూలరూపముగానైనను ప్రదర్శించుటకు ప్రయత్నించుట ఇట్టి మృదంగ శాస్త్ర విద్వాంసుల విధి. అట్టివి చేర్చినవేకాని గ్రంథమునకు సమగ్రత చేకూరదు. రెండవ పేజీలో.

హస్తద్వయస్య సంయోగే వియోగే చాపి వర్తతే।
వ్యాప్తి మావ్యే దశ ప్రాణ ప్రకాలస్తాళ సంజ్ఞకః॥

'రెండు చేతులను కలుపుట విడదీయుటచే కలుగు వృద్ధిని గోరుచు దశప్రాణ సమేతమై యుండునదే తాళమనబడును' అని వివరణము ఉన్నది. ఈ వివరణములో మూలములో ఉన్న 'కాలః' అను ప్రాణప్రదమైన మాటను వదలివేయుట గమనింపదగినది. 'వృద్ధిని గోరుచు' అను మాటలకును మూలము కానరాదు. ఇట్టిచిన్న లోపములను జాగరూకతతో సవరించి అనుబంధములో మృదంగ చరిత్రను కొంత విపులముగా చేర్చి ముందు కూర్పులలో గ్రంథము ప్రచురించినచో అపూర్వమైన ఈ గ్రంథము పూర్ణతరమై సర్వాంగ సుందరముగా శోభించగలదని సూచించుచున్నాము. ఈ గ్రంథమునుగూర్చి ఆంధ్ర తమిళ దేశములలోని సంగీత శాస్త్ర కళాకోవిదులు హృదయ పూర్వకముగా చేసిన అభినందనలకు ఈ గ్రంథము సర్వవిధముల యోగ్యముగా ఉన్నది. గ్రంథ ముద్రణముకూడ సర్వవిధముల అందముగా స్పష్టముగా ఉన్నది. ముఖ్యముగా లక్ష్య (Practical) విభాగములో అవసరమైన తాళాంగములయు, కాలము మొదలగు వాని గుర్తులతో స్పష్టముగా ముద్రించుట కష్టసాధ్యమైనను చూడగానే వాని స్వరూపము గోచరించునట్లు ముద్రించిన ముద్రాపకులను ప్రత్యేకముగా అభినందింపవలసి ఉన్నది. అపూర్వమైన ఈ గ్రంథము భారతీయ భాషలన్నిటిలోనికి అనువదించుట సర్వవిధముల యోగ్యముగ ఉన్నది.

—ప్రమీలాదేవి 'ఆత్రేయి'

సంస్కృత ప్రతిభ

(సంవత్సరమునకు రెండు మారులు ప్రచురింపబడు సంస్కృతభాషా పత్రిక ఉ. 7 బి. 1.)

[సంపాదకులు: డా. వి. రాఘవన్, ప్రకాశకులు: సాహిత్యఅకాడెమీ, నవ్‌దేహళి. సం. చందా రు. 4-00. ప్రతి రు 2-00]

ఇది యావద్భారతభూమి విద్వాంసులను అభి

మావించుచు రచనలు పంపుచున్న పత్రిక. దీనిలో సంపాదకీయములు, 'సంస్కృతమే ఐకమత్య సామగ్రి' యను శ్రీ కాంచీకామకోటీశ్వరుల శ్రీముఖము, 14 ఖండకావ్యములు గీతికలు, 2 హాస్యవచనరచనలు, 1 రూపకము, భారతీయ భాషలలోని ప్రాచీనాధునిక కావ్యాలకు అనువాదాలు, 10 నికషోపలము పేరితో ఎన్నో గ్రంథసమీక్షలు ఉన్నవి. ఇందులోని లేఖకులు ఆసేతుహిమాచలమధ్య భూమిలో ఉన్న విద్వాంసులు.

ఈ పత్రిక కేవలము విద్వాంసులకు ఉద్దేశించికాక, సామాన్యపాఠకలోకమును సంస్కృత మాధుర్యమువంకకు ఆకర్షించుటకు ఉద్దేశించిన పత్రికగా భావింపదగును. ఇన్ని శీర్షికలున్నను ఒక్కటికూడ ఏ శాస్త్రవిషయమునుగాని స్పృశించు వ్యాసము లేకుండుట గమనింపదగినది. శాస్త్రప్రసంగముల బరువుతో నింపినచో సామాన్యపాఠకులను ఆకర్షింపదను భావముతో వట్లు చేయబడినదేమో! కాని శాస్త్రప్రసంగములు మాత్రము ఆకర్షకముగా తేలికగా ప్రదర్శించుట సాధ్యముకాదా? తేలికగా ప్రదర్శించినను, శాస్త్రీయమైన బిగువుతో ప్రదర్శించినను ఎన్నియో నూతన విషయములను చర్చింపవచ్చును. దేశదేశాంతరాలలోని ఉత్తమ కావ్యములను పరిశీలించి మన ప్రాచీనుల సాహిత్య సిద్ధాంతములను ఎంతవరకు మార్చుకొనవచ్చును? అట్లే తత్త్వశాస్త్రము, తర్కము, దర్శనములు, వార్త అనబడిన ఆర్థిక రాజకీయ సిద్ధాంతములు ఏవిధముగా సమన్వయించి ప్రవృద్ధము కావలె?—ఈలాటి విషయాలు సంస్కృత విద్వాంసులు పట్టువిడుపులు ప్రదర్శించుచు విచారణ చేయుచుఉన్నచో, సంస్కృతమింకను జీవద్భాషగా ఉన్నదని ఋజువు చేసికొనగలదు. శ్రీ మాధవ విద్యారణ్యుల సర్వదర్శన సంగ్రహమువంటి గ్రంథములు నేటి విద్వాంసుల కర్తవ్యమునకు మార్గప్రదర్శకములు కాగలవు గదా! శాస్త్రవిషయములు సంగ్రహించుట, నూతన భావములతో వానిని సమన్వయించుట, అవసరమైన క్రొత్త విషయములను గ్రహించుట—ఈ మూడు మార్గములు ముఖ్యముగా అవలంబింపదగినవి.

శ్రీ రమాచౌధురి రచించిన 'శంకరశంకర' మను నాటకమును ప్రాచీనాలంకారికుల నియమములను పాటింపక దృశ్యములుగా విభజించి రచించుట ఆమోదయోగ్యముగా నున్నది. శ్రీయుతులు స్వామినాథ ఆత్రేయులును, కలానాథశాస్త్రియు వచనములో వ్రాసిన హాస్యప్రధాన వ్యంగ్యరచనలు 'మూర్ధానం పత్యు రారోహ' 'మాచయాచిష్మ కంచన' అనునవి చక్కగా నున్నవి. సంస్కృతభాష సామాన్యగృహస్థుల నిత్యజీవిత విషయములను చమత్కారముగా చిత్రించుటకుగూడ సామర్థ్యము కలదని యీ రెండును ప్రదర్శించుచున్నవి.

సంపాదకీయములు మరీ చిన్నవైనవి. అవి సంపాదకీయము లనుటకంటె సంపాదకీయ లఘువ్యాఖ్య లనదగియున్నవి. సమీక్షలు చాలా ఉన్నవి కాని అవి కూడా మరీ చిన్నవిగా ఉన్నవి. అందుచే వానిని సమీక్ష లనుటకే వీలులేకున్నవి. శ్రీ కామకోటిపీఠాధీశ్వరుల వ్యాస శ్రీముఖము సర్వసామాన్యవిషయమునే సర్వసాధారణోపపత్తులతో ప్రదర్శించుచున్నది కాని విశిష్టత లేదు. ఇందులో సంకలితములైన కావ్యగీతాలలో కూడా విశిష్టరచన లనదగినవి లేవు.

సంచిక యంతటిలో ఉత్తమోత్తమమైనది అనువాద భాగము. అందులో ఆళ్వారుల గీతములు, శరణగీతములు, తుకారాంగాథలు, ఏకనాథుని భారుండ గీతములు, కబీరు గీతావళివంటివి కలవు. ఇటువంటి మహాభక్తుల భాషారచనల అనువాదములు సంస్కృత భాషలో ఎంత రాణించగలవో ప్రదర్శించుటేకాక, భారత సంస్కృతిలోని ఐక్యభావమును ఉద్ధరించి, నేడు వివిధరాష్ట్రాలలో ప్రబలుచున్న విచ్ఛిన్నకర దుర్వాదములను నివారించుటకు సహాయపడగలవు.

భారత భూమిలోని కావ్యకర్తలు ఇతోధికముగా దేశభాషలతోపాటు భారతీయ సంస్కృతికి మాతృకయైన సంస్కృతభాషలో కూడ తమ భావములను భావనలను రూపొందించుట అభ్యాసము చేసికొన్నప్పుడే కాని ఇటువంటి ఉత్తమ పత్రికల ఆదర్శములు సిద్ధింపవు.

—నోరి నరసింహ శాస్త్రి.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 వ కవరు పేజి ...			
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/-	రు. 125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/-	రు. 100/-
అర పేజి	...	రు. 65/-	రు. 55/-
పావు పేజి	...	రు. 40/-	రు. 35/-

ప్రత్యేక స్థానములకు 25 అదనం.

సం॥ నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12—0—0
6 మాసముల చందా	...	రు. 6—0—0
విడి ప్రతి	...	రు. 1—0—0

మేనేజరు, భారతి.

మద్రాసు—1.